
# దాడి

నవల



పెద్దింటి అశోక్ కుమార్

# దాడి

ఆటా 2004 నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల

పెద్దింటి అశోక్ కుమార్

ప్రచురణ
తెలంగాణ రచయితల వేదిక

DAADI (Navala)
by
PEDDINTI ASHOK KUMAR
Andhra Bhoomi Daily Serial

First edition : 2008
Telangana Rachayitala Vedika Prachuranalu

Cover Photo : Shyam Mohan

Cover Design : Sk. Azhar

Copies Available At :


all reputed book houses

and

Writer :
Peddinti Ashok Kumar
Post : Mallareddypeta
Mdl : Gambhiraopeta
Dist : Karimnagar, (A.P.)
Pin : 505 304.
Cell : 9441672428

Book making at :
PATHIPAKA GRAPHICS & DIGITALS,
Vimala talkies road,
Sircilla - 505 301.
Cell: 9989922056

Rs. 50/-



మట్టిని...
అంతేప్రేమతో మట్టి మనుషులను అభిమానించే
మిత్రులు డా॥ **బి. రమణారావు,** ఆర్థోపెడిక్, సిరిసిల్ల గారికి...

అబూదబీ...

కోల్డ్ సిటీ...

ఇంతెహాజ్ జిన్నోఫర్ అపార్ట్‌మెంట్స్...

రవికిరణ్ కంప్యూటర్ ముందు కూర్చున్నాడు. మెయిల్ చూసుకున్నాడు. ఉత్తరాలేం లేవు. కొద్దిసేపు చాటింగ్ తర్వాత సెర్చ్ . తెలుగు వెలుగు డాట్‌కామ్ ఇంటర్ నెట్ వీక్లీని ఓపెన్ చేశాడు.

ఆంధ్ర ప్రదేశ్‌లో పదిహేను కోట్ల ఖర్చుతో క్లౌడ్ సీడింగ్ జరుగుతుంది. గండిపేటలో అనంతపురంలో రంగారెడ్డిలో గతంలో క్లౌడ్ సీడింగ్ నిర్వహించినా అనుకున్నంత వర్షపాతం నమోదు కాలేదు. అప్పటి వైఫల్యాలను, ఇప్పుడు పాటించాల్సిన కొన్ని సూచనలు, జాగ్రత్తలను వ్యాసంలో రాసాడు రవికిరణ్. ఆవ్యాసం కొరకే మ్యాగ్జైను తిరగేస్తున్నాడు.

రవికిరణ్ ఎట్మాస్పియర్ ఇన్ నేషనల్‌కార్పోరేట్‌లో పనిచేస్తున్నాడు. అది అబుదబీలో ఉంది. ప్రపంచంలో క్లౌడ్ సీడింగ్‌కు సంబంధించిన పూర్తి పరిజ్ఞానం ఉందంటే అది రెండు చోట్లనే. ఒకటి అమెరికాలో ఇంకొకటి అబుదబీలో.

రవికిరణ్‌కు చిన్నప్పటి నుంచి డిఫరెంట్ అభిరుచులు. అందుకే ఈ సబ్జెక్ట్ ఎంచుకుని అమెరికాలో ట్రైనింగ్ పొంది మూడేండ్ల కింద అబూదబీలో స్థిరపడ్డాడు.

ఎట్మాస్పియర్ ఇన్ నేషనల్ కార్పోరేట్ సంస్థ ఇజ్రాయిల్‌లో క్లౌడ్ సీడింగ్‌ను కాంట్రాక్ట్‌కు తీసుకుంది. వరుసగా రెండేండ్ల నుంచి ఈ పనిని ఇదే సంస్థకు అప్పగిస్తున్నారు. అందుకు కారణం వాళ్ళు అంచనావేసిన దాని కంటే అధికంగా వర్షపాతాన్ని చూపించడమే!ఆ ఘనత రవికిరణ్‌దే!

మేఘాలు శీతల మేఘాలని, ఉష్ణమేఘాలని రెండు రకాలుంటాయి. డేల్‌పాయింట్‌లో వున్న మేఘాలను గుర్తించినాక వేరు వేరు రకాల మేఘాలను వేరు వేరు పద్ధతుల్లో సీడింగ్ చేయాలి.

ఉష్ణమేఘాలైతే అమోనియం నైట్రేట్, యూరియాతో, శీతల మేఘాలైతే సిల్వర్ అయోడైడ్‌తో మథనం చెయ్యాలి. రెండింటినీ ఏకకాలంలో గుర్తించి ఒకే సారి సీడింగ్ చేస్తే అనూహ్యరీతిలో వర్షపాతాన్ని నమోదు చెయ్యవచ్చు. ఏమాత్రం పొరపాటు జరిగినా అసలుకే మోసం.

మొదట రెండింటినీ ఏకకాలంలో గుర్తించి ఒకేసారి సీడింగ్ చేయగల నిపుణుడు రవికిరణ్. ఆ ప్రతిభతోనే ఇజ్రాయిల్‌లో సక్సెస్ అయ్యాడు. అదే ఫార్ములాను వ్యాసంలో రాసాడు.

చివరి పేజీలో తన వ్యాసం కనిపించింది రవికిరణ్‌కు. ఒకసారి చదువుకుని మిగిలిన పేజీలు తిరగేసాడు. ఎడిటర్ శివశంకర్ తన మిత్రుడే. హైదరాబాద్‌లో ఉంటాడు.

ఫోన్‌లో మాట్లాడినప్పుడల్లా మేగ్జిన్ చూడమంటాడు. తనకే టైం కుదరక ఎప్పుడూ చూడలేదు. అతడి సూచన మేరకే ఆ వ్యాసాన్ని రాసాడు కూడా.

పేజీలు తిరగేస్తుంటే ఒక చోట చూపులు ఆగిపోయాయి. టైటిల్ చూస్తేనే వింతగా అనిపించి చదవడం మొదలు పెట్టాడు రవికిరణ్.

**నీలిమేఘుమా...నీకు జాలిలేదు సుమా!**

ఇది కరువు కాదు. కరువైతే తిండి దొరుకది. కానీ ఇంతో అంతో తిండి దొరుకుతుంది. 40 ఏండ్ల హరిత విప్లవం పుణ్యమా అని గోడౌన్ల నిండ బియ్యం గోధుమలు మగ్గిపోతున్నాయి. అవి తిండిలేని పేదలకు అందనంత దూరంలో ఉన్నయి. అది వేరే విషయమనుకొండి. మరేంటి..?సాగుకు కాదు..తాగుడుకు నీళ్ళు లేవ్వు!

అయితే నీటి కరువా..?కానేకాదు.నీటి కరువైతే నీళ్ళు దొరుకయి. కానీ... నీళ్ళేలెవ్వు. నీళ్ళు దొరుకకపోవడం వేరు. నీళ్ళు లేకపోవడం వేరు. నీటికి మూలవనరు వర్షమైతే ప్రత్యామ్నాయ వనరు భూమి. ఇప్పుడు భూమి తల్లి గర్భం వట్టిపోయింది. నాలుగు వందల ఫీట్ల దాకా బోర్లు వేసినా నీటి చుక్క లేదు. ఉన్నా అవి విషపు నీళ్ళే!

అందుకే ఇది సంక్షోభం!

తీవ్ర సంక్షోభం॥

ఈ సంక్షోభపు తొలి అడుగే నేటి ఆత్మహత్యలు. తొలి అడుగుల ఫలితమే ఇంత దారుణంగా ఉంటే దీని తీవ్రత ఎలా వుంటుందో ఆలోచించండి. ఇప్పటికీ దీనిని కరువే అందామా...?

ప్రభుత్వ ఆర్థిక విధానాలు మార్చుకుని, మార్కెట్ వ్యవస్థను క్రమబద్దీకరిస్తే సమస్య పరిష్కారమని కొందరు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి సబ్సిడీలు ఇస్తే సమస్యే ఉండదని కొందరు.

అయ్యా! అందరు దీన్ని ఆర్థిక కోణంలోంచి చూసి ఆర్థిక పరమైన పరిష్కారాలే ఇస్తున్నరు గానీ పర్యావరణ కోణంలోంచి ఎవరూ చూస్తలేరు. ఎవరూ ఆ కోణంలోంచి పరిష్కారం చెప్పుతలేరు. తాత్కాలికమైన ఉపశమనాలు,మూతులకు నేతి బొట్లు సమస్యను పరిష్కరిస్తాయా?

సమస్య మూలకారణ మేమిటో గుర్తించకుండా ప్రకటించే ఎక్స్‌గ్రేషియాలు..ఉచిత విద్యుత్తు, విత్తనాలు, సబ్సిడీలు..నీటి పారుదల ప్రాజెక్టులు భూమిలకు ఒక్క నీటిచుక్కనైన ఇంకేలా చేస్తయా..?

ఒక బస్త వడ్ల పంటకు పంపుల వద్ద 185వేల లీటర్లను భూమి నుండి రైతు బయటకు తీస్తడు. ఆ రేటు చొప్పున ఎన్ని పంపులు...ఎన్ని బస్తాలు...లెక్కగట్టి గ్రామగ్రామాన అన్ని నీళ్ళను భూమిలకు పంపించే ఏర్పాట్లు ఏ ప్రభుత్వం చేసింది...?





ఇప్పుడు పల్లెలను చుట్టుముట్టింది దారిద్ర్యమా..? పర్యావరణ దారిద్ర్యమా..?ఈ మేఘ మథనాలు ఎండిపోయిన తల్లి గర్భాన్ని నింపుతయా..?తవ్వుకుంటే వచ్చే తాగునీళ్ళను ఇస్తయా..?నిజంగా సమస్యకు పరిష్కారం ఇదేనా..?నీటి ఊటలు ఏమైనట్టు?

ఎన్నో సమస్యల్ని ఎత్తిచూపి ఎన్నో ప్రశ్నలను రేకెత్తిస్తూ... మూలకారణాల్ని విశ్లేషిస్తూ ప్రజలనూ, పాలకులనూ ఆలోచింపజేస్తున్న వాస్తవ జీవితాల కథాకథనం...

**దాడి**

**14వ భాగం**

రవికిరణ్ ఆగిపోయాడు.ఏదో ఆలోచన వచ్చింది. అవును..'ఇది కరువేనా..?' అనుకున్నాడు.'ఇప్పుడు తీసుకుంటున్న చర్యలు పరిష్కారాలేనా' అనుకున్నాడు.'భూమిలోని నీరంతా ఏమైనట్టు..?' అనుకున్నాడు.

ఇబ్రాయిల్ నుంచి అదేరోజు వచ్చాడు. వచ్చిరాగానే కంప్యూటర్‌కు అతుక్కుపోవడం అతడి భార్య ఐశ్వర్యకు కోపాన్ని తెప్పించింది. అది ఆమెకు అలవాటే. విసుక్కోకుండా కాఫీని తెచ్చి అందించింది.

ముందున్న వ్యాఖ్యానమే ఆసక్తిగా ఉండటంతో చదవడం మొదలు పెట్టాడు రవికిరణ్.

C C C C

**దాడి**

**14వ భాగం**

వానలు గొడితే అది నిండు వానకాలం. వానలు లెవ్వు. అందుకే అది ఎండకాలమైంది. స్వాతిల వానగొడితే సవలోకం బతుకుతదట.ఒక్క స్వాతిలగాదు. ఏకార్తిల వానలేదు. కాలాలు ఎన్ని..? అని అడిగితే ఎండకాలం, సలికాలం రెండే కాలాలు అనేతట్టున్నరు జనం. అప్పుడప్పుడూ సానుపు తడుపు కొట్టిన వానలకు ఊరు చుట్టున్న బీడు భూములల్ల గడ్డి లేచింది.

ఎండ భగ్గుమంటుంది. ఉడుకపోత్తుంది. పెద్ద పెద్ద దోమలు, పురుగులు. జనమంతా భయం భయంగా ఉన్నరు. ఊర్లె నల్లాలు వచ్చినంక ఇండ్లల్ల శాదబాయిలు ఎండి పోయినయి. పొద్దు మాపు నల్లాలు రావడంతో నీళ్లకు కరువు లేకుండా పోయింది. బాయిల నుంచి నీళ్ళు చేదుడు తప్పిందనుకున్నరు జనం. బాయిలను కూడుపుకున్నరు. కొందరు సెప్టిక్‌టాంకులుగా మార్చుకున్నరు.

ఏడాది పొద్దుమాపు టాంకులకు నీళ్ళను ఎత్తిపోసిన మంచినీళ్ళ బోరు ఒకనాడు దమ్ముతీసుకుంది. ఊటలు గుంజినయి. ఊరు తల్లడ మల్లడమయింది. మరునాడే బోరు బండి దిగింది. మూడు జాగల్ల పొక్కలు పొడిచింది. రెండు పొక్కలల్ల తడిలేదు. ఒక పొక్క మాత్రం ఎత్తిపోసింది. దానికి మోటర్ పెట్టి టాంకులకు ఎక్కయని నల్లాల మేన్‌పైపుకు కలిపింద్రు.

రోజూ రెండు సార్లు వచ్చేనల్ల ఒక్కటేసారి, గంటసేపు వచ్చేది అరగంట సేపు వత్తుంది.

అట్లనో ఇట్లనో ఆరు నెలలు గడిచింది. ఊటలు మరింత గుంజినయి. నల్లాల బోరు ముందటి లెక్క ఎత్తిపోత్తలేదు. రోజూ వచ్చే నల్ల రెండు రోజులకొకసారి వత్తుంది. అరగంట వచ్చేది పావుగంట వత్తుంది.

ఎండకాలం కోడిపిల్లలు తిరిగినట్టు జనం గావర గావర బిందెలు పట్టుకొని తిరుగుతున్నరు. ఎక్కడ నీటిచుక్క కనవడ్డా పెదువులతో అద్దుకుంటమని చూస్తున్నరు.

ప్రపంచ దేశాల నడుమ యుద్దాలంటూ జరిగితే మంచినీళ్ళ కొరకే జరుగుతయట. దేశాల నడుమ ఏమోగాని ఇక్కడ ఇండ్ల నడుమనే... ఇంట్లోని వ్యక్తుల నడుమనే యుద్దాలు జరుగుతున్నయి.

రెండేండ్ల కిందనే కరెంటు బోర్లు బోర్లవడ్డయి. ఎవుసాయం మూలకు వడ్డది. భూములు బీడువడ్డయి. శాతనైన కొడుకులు మస్కట్ వోయింద్రు, కొందరు బొంబాయి, సూరత్, పట్నం బోయింద్రు. శాతగాని కొడుకులు ఇంట్లనో, పొయ్యిదగ్గరనో, అదోటి ఇదోటి సదురుతుంటే ఆడోళ్ళు శేరు శేరు బీడీలు జేసి పొట్టగడుపుతున్నరు. పాలిచ్చే బర్లు తప్ప ఊర్లె నాగలి నడిచే ఎద్దు లేదు.

తిండికి కంట్రోలు బియ్యమో...కరువు బియ్యమో ఉన్నయి. వంటకు గ్యాసు నూనె పొయ్యినో, కట్టెల పొయ్యినో, సిలెండర్ పొయ్యినో ఉంది. ఖర్చుల మందం బీడీలు చేస్తేనో, రోడ్డు పనికి పోతెనో, మస్కట్ పైసనో ఉన్నది. కానీ తాగుడుకు నీళ్ళు లెవ్వు.

రెండు రోజులకొకసారి పావుగంట వచ్చే నీళ్ళతోనే రోజులు గడుస్తున్నాయి. ఈ బోరు అందియ్యకపోతే ఎట్లా..? అని రెండు మూడు జాగలల్ల బోర్లువేసి చూసింద్రు. పొగ లేచింది గానీ నీళ్ళు రాలేదు.

అట్లనో ఇట్లనో ఇంకో రెండు నెలలు గడిచింది. నల్లాల బోరు పూర్తిగా బోర్ల వడ్డది. నల్ల బందయింది. నాలుగైదు జాగల్ల ఏత్తే పొగ లేచింది. నీళ్లసుక్కలేదు. రెండు బోర్లు నడివాగులో ఏసింద్రు అక్కడ పేలయినయి. చెరువులో ఏసింద్రు. ఒకటి పేలయిందిగానీ ఒకటి కొద్దిగా తడివచ్చింది.

ఆ మాత్రం నీళ్ళు టాంకులకు ఎక్కయి. తెల్లారే టాంకరు వచ్చింది. వాడవాడ తిరుగుతూ ఇంటికి ఐదు బిందెలు పోసింది. ఎక్కడ దొరికితే అక్కడ మంచినీళ్ళ కొరకు బోర్లు ఏత్తున్నరు. మూడు వందల యాభై ఫీట్లు దంగుతుంది. చుక్కలేదు. ఇట్లా ఇంకో రెండు నెలలు గడిచింది. ఊటలు ఇంకా గుంజినయి.

రోజూ తిరిగే టాంకరు తిరుగుత లేదు. రోజుకో వాడ చొప్పున ఊరంతా మూడు రోజులు పడుతుంది. మూడురోజుల కొకనాడు టాంకరు పోసే ఐదు బిందెలు తాగుడుకే సరిపోతలెవ్వు.





ఆ నీళ్ళు కూడా సుద్దకట్టు నీళ్ళు. స్టీలు బిందెలో పోస్తే పక్కుగడుతుంది. పైన సున్నం తేటతేలుతుంది. కొద్దిగా కష్టమనక కాగబెడితే చారెడు సున్నం బయటపడుతుంది. ఆ నీళ్ళు తాగితే కాళ్ళు చేతులు గుంజుతున్నయి. అందరికీ భయం భయంగా ఉంది. కొందరు పదిరూపాయలిచ్చి మంచినీళ్ళు కొనుక్కుంటున్నరు. కొనుక్కోలేని వాళ్ళు అవేనీళ్లను కండ్లు మూసుకొని తాగుతున్నరు.

అనుకోకుంట ఒకనాడు ఆ చిన్నబోరు గూడా ఆగింది.

"ఎంకన్నా..చూసినావురా...నేను చెప్పలేదా..నువ్వేదో అంటివి గదరా.. అవసరాలు పెరిగితే ఏదో ఒక తొవ్వ దొరుకుతుందని. ఇప్పుడు ఏతొవ్వ దొరుకు తుందంటవు..?తఒక్కటే వాగుతొవ్వ"తండ్రి బాధగా అన్నడు.

కొడుకు దగ్గర సమాధానం లేదు. తండ్రి వైపు మౌనంగా చూసిండు. కండ్లల్ల నీళ్ళు తిరిగినయి.

తండ్రికొడుకులిద్దరూ ఆకాశం వైపు ఆశగా చూసింద్రు. నల్లటి మేఘాలు తేలిపోతున్నయి. మేఘాల్లో చుక్క లెక్క కదులుతున్న విమానం.

"అదేనంటావా..?"తండ్రి.

"ఏమో" కొడుకు.

"ఇయ్యాల్ల రేపట్ల వానగిట్లలేకుంటే బర్లు కతమైతయి."తండ్రి.

"ఏ..ఇయ్యాల్లనన్న రేపన్నా..పెద్ద వాన గొడుతదట. మేఘమథనం చేస్తండ్రట"కొడుకు.

ఇద్దరికి తెలియని విషయం ఒకటుంది.

రాడార్ నో సిగ్నల్ ఇస్తుంది. వాతావరణశాఖ వారం రోజుల వరకు అనువైన వాతావరణం ఉండదని సూచిస్తుంది.

(మిగితాభాగం వచ్చేవారం)

C C C C

రవికిరణ్ మరొక్కసారి చదివాడు. ఎందుకో ఆ కథనం గుండెను తడిమి నట్టయింది. సెల్ అందుకొని ఎడిటర్‌కు ఫోన్ చేశాడు.

"అవును. అది వాస్తవం. నువ్వు ఇప్పుడు చదివిన కథంతా జరిగి రెండు నెలలు దాటింది"ఎడిటర్ అన్నాడు.

"మైగాడ్ ఇప్పటి పరిస్థితి ఏంటి..? వర్షాలు పడ్డాయా..? తాగేనీళ్ళు దొరుకుతున్నాయా!"

"తెలియదురా..ప్రకాశ్ అని ఒక ఫ్రెండ్, 'గూడ' నుంచి యాతానికి, యాతం నుంచి మోటకు, మోట నుంచి రాటుకు, రాటు నుంచి ఇంజన్‌కు..చివరగా కరెంటుమోటర్ వరకు, శ్రమ దూరమై పర్యావరణం మీద ఎలా దాడి జరిగిందో..చుట్టూ నీళ్లతో ఉన్న ఆ పల్లె, తరం

నుంచి తరం మారగానే ఎలా ఎండుకుపోయిందో వాస్తవ కథ రాస్తానన్నాడు."

"ఆ..అయితే ఏం జరిగింది." రెట్టించి అడిగాడు రవికిరణ్.

"నేను సరే అన్నాను..చదివితే చాలా ఇంట్రస్టింగ్ గా అనిపించింది. వారం వారం వేస్తున్నాను. అతడు పంపిన వరకూ ఈ సంచికతో పూర్తయింది. అతడు రెండు నెలల నుంచీ టచ్‌లో లేడు. ఏం జరిగిందో తెలియదు గానీ ఇదంతా వాస్తవంగా జరిగింది..."క్షణం ఆగి మళ్ళీ చెప్పాడు ఎడిటర్ శివశంకర్.

"....ఆ ఏరియాను డార్క్ ఏరియాగా ప్రకటించారని విన్నాను. చుట్టూ ఎవరూ బోర్లు వేయద్దని ఏనౌన్స్ చేసారట. ఊరును ఖాళీ చేయిస్తున్నారని గూడా విన్నాను..."

"శివా..ఆ ఊరి పేరు తెలుసా..?" అడిగాడు రవికిరణ్ కంగారుగా.

ఊరి పేరు చెబుతూ, "అక్కడ క్లౌడ్‌సీడింగ్ జరుగుతుంది" అన్నాడు.

ఊరి పేరు వినగానే ఇంకేమీ వినిపించలేదు రవికిరణ్‌కు 'మైగాడ్'...అన్నాడు బాధగా.

అంతవరకూ భర్త మాటల్ని వింటున్న ఐశ్వర్య దగ్గరకు వచ్చి వెనుకనుంచి భుజాలపై చేయివేసి 'ఏమైయింది డియర్'అన్నది గారాబంగా.

మరోటైంలో అయితే ఎంత ముఖ్యమైన పనిలో ఉన్నా పక్కన పెట్టి ముచ్చటించేవాడే! ఇప్పుడు ఆ మూడ్‌లో లేడు. 'అలా జరగడానికి వీల్లేదు..అలా జరగడానికి వీల్లేదు.' కలవరింతగా అంటూ సెల్‌తో తండ్రికి డయల్ చేశాడు.

"డాడ్ ఈ మధ్య ఊరెళ్ళారా..?" ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా అడిగాడు రవికిరణ్.

"లేదు. ఎందుకు..?"ఆశ్చర్యంగా అడిగాడు తండ్రి.

రవికిరణ్ కట్‌చేసి మళ్ళీ ఎడిటర్‌కి ఫోన్ చేసాడు.

"ఎంట్రా చెప్పకుండా కట్ చేసావు.?"అడిగాడు ఎడిటర్.

బదులు చెప్పకుండా "ఎన్నివారాలు ప్రింట్ చేసావు?" అడిగాడు రవికిరణ్.

అతడి గొంతులో ఆతృతకు విస్మయం చెందినా అడగకుండా, ఎన్నివారాలు ప్రింట్ చేసాడో చెప్పాడు ఎడిటర్.

"వాటి ప్రింట్స్ పంపించగలవా?" అభ్యర్థనగా అడిగాడు రవికిరణ్. ఐశ్వర్య ప్రక్కనే నిలబడి భర్తను విస్మయంగా చూస్తుంది.

"నువ్వు అడిగాక పంపించనా! అయితే నువ్వు చదవడమేమిట్రా..ఈ మధ్య సీరియల్స్ చదువుతున్నావా...?" నవ్వుతూ అడిగాడు ఎడిటర్.

రవికిరణ్ నవ్వలేదు. సీరియస్‌గానే" అది మా ఊరురా..." అన్నాడు సెల్ కట్ చేస్తూ.

"వాట్ హాపెండ్...డియర్.."మళ్లీ దగ్గరికి వచ్చి ఆర్తిగా అడిగింది ఐశ్వర్య







"ఆ నీళ్లన్ని ఏమైనవి..? నీళ్ల మీద ఎవరు దాడి చేసారు..?" అదే మూడ్‌లో అడిగాడు రవికిరణ్.

"ఏ నీళ్ళు..ఏ దాడి..?" విస్మయంగా అడిగింది ఐశ్వర్య

"ఊరు కిందనే మానేరు నది. ఊరు మీదనే నర్మాల ప్రాజెక్టు. నాలుగు గేట్లు ఇరువై ఆరు కాలువలు.. ఐదు అలుగులు. నదిమీద ఎవడు దాడి చేశాడు..?ప్రాజెక్టు మీద ఎవడు దాడి చేశాడు." అదే మూడ్‌లో అన్నాడు.

ఐశ్వర్యకు భయమేసింది. భుజాలను పట్టి కుదుపుతూ"...కిరణ్..కిరణ్ ఆర్యూ మ్యాడ్..విచ్ ప్రాజెక్ట్? విచ్ రివర్?..."అన్నది కోపంగా.

ట్రాన్స్‌లోంచి మేలుకున్నట్టు జాలిగా చూస్తూ 'సారీ' అన్నాడు రవికిరణ్.

C C C C

ఊర్లె గండగరువు.

"నాయినా ఎటన్నా యాడాది ఎల్లిపోదామే" ఎంకన్న అన్నడు.

"ఎటు పోదాం...ఎట్ల బతుకుదాం..." ఆవేదనగా అన్నడు తండ్రి. డెబ్బయి ఏళ్ళు దాటినయి. కట్టెతో నడుస్తున్నా ఆరోగ్యంగనే ఉన్నడు.

"ఎటన్నవొదాం. మన పాణానికి మనం బతుకలేమా! యాడ కైకిలి చేసుకున్నా పిడికెడు మెతుకులు దొరుకుతయి." ఎంకన్న అన్నడు ధీమాగా.

"మనం మన పాణానికి ఎక్కడనో బతుకుతం. ఊరెట్లరా..? ఊరంతా ఎటు పోవాలె..? జీవం లేని కండ్లను మిట మిట గొడుతూ కొడుకువైపు చూసి అన్నడు.

అప్పుడే అక్కడికి వచ్చిండు మనుమడు మల్లేశం. తాత మాటలు విన్నడు.

"నీ ముసలి పీసునె గొడుదు. యాడ ఇట్లనే జేత్తడు. ఏలుకు వెడితే కాలుకు వెడుతడు. కాలుకు వెడితే ఏలుకు వెడుతడు...ఆ రెండు బర్లను ఎప్పుడో అమ్మితే రెండు వెయిలు ఎక్కువచ్చు. ఉండనీ..ఉండనీ అంటివి. నీళ్లు అగ్గిదలిగి లెవ్వని ఇప్పుడు అడ్డగోలు అమ్ముడాయె. మన వసతుకు అమ్మితే ఎవడు కొంటడు. వాడు అడిగిన ధరకు ఇచ్చుడాయె.." మనుమడు తిడుతున్నడు.

"ఆ..ఆగురా..పెద్దలేదు చిన్నలేదా..నోటికి ఎంతత్తే అంతేనా"..అంటూ కొడుకును మందలిచ్చి "ఊరు ఎక్కడుంది నాయినా...పావుల వంతు మస్కట్‌లుంది. పావుల వంతు దుబాయిలుంది. పావుల వంతు బొంబాయి బీవండిలుంది. ఇక్కడున్నోళ్ళు ఎట్లనో పొద్దు పుచ్చుకుంటుండ్రు.." అన్నడు ఎంకన్న.

"ఎంకన్నా! నా భయం అదిగాదురా..ఎట్లనో పంట భూములు ఎండిపోయినయి. ఇప్పుడు తాగే నీళ్ళే దొరుకుతలెవ్వు. ఇట్లనే ఉంటే రేపటి తరం ఎట్లా?"..అంటూ మల్లేశం కొడుకును దగ్గెరికి తీసుకుని "వీనికి తాగే నీళ్లు దొరుకకపోతే ఎట్ల బతుకుతడు చెప్పు..?" అన్నడు.

"ఆ.. ఎట్లనో బతుకుతడు తియ్యి. ఏంది తాతా నీకు ఏదైనా బాధనే..ఎప్పుడు ఏడుత్తనే వుంటవు."కోపంగా ఇంట్లోంచి వచ్చి కొడుకును దగ్గరికి తీసుకుని అన్నది దేవవ్వ.

లచ్చిమి అందరి మాటలు వింటూ కూసుంది.

అప్పుడే వచ్చిండు ప్రకాశ్. భుజాన బ్యాగు కాళ్లకు అరిగిన చెప్పులు,చూపులు మాత్రం చురుగ్గా ఉన్నయి.

"తాతా..మేము గవర్నమెంటుకు రెకమెండ్ చేసినం..ఇంకో రాడార్‌ను అబుదాబీ నుంచి తెప్పిస్తున్నరు. ఇక్కడ తప్పక ప్రయోగాలు పలిస్తయి"అన్నడు.

" చూసినవా..ఏదో ఓదారి దొరుకుతనే ఉంటది..కండ్లు పొడగొట్టిన దేవుడు ఇండ్లు జూపిస్తడు నాయినా..."అన్నడు ఎంకన్న.

మల్లేశం కోపంగా "తాతనడిగితే..ఇట్ల గూడా దొరకనప్పుడు ఎట్ల...? అంటడు"అన్నడు.

"అవునురా..అంట. అననా? కప్పలు గుడ్లు వెట్టేకాలాన్ని నాశినం చేసుకుని మొగులుకు మొఖం బెట్టి చూసుడయితుంది. దోసెడు మన్ను తీత్తే దోసెడు నీళ్లూరే భూతల్లిని ఎండబెట్టుకున్నం...వీళ్లు వానగొట్టిత్తే మాత్రం భూతల్లి కడుపునిండుతదా...ఊటలు మర్లుతయా...?"అన్నడు.

"నీ యవ్వ..వదురకన్నా...పాడిందే పాడెరా..పాసువండ్ల దాసరి అన్నట్టు వదిరిందే వదురుతడు. అది నువ్వు జెయ్యలేదు. నేను జెయ్యలేదు. మెదక్ జిల్లోల్లు జేసింద్రు. వాగుకు అడ్డం చెక్‌డ్యాంలు గట్టింద్రు. నీళ్లను ఎక్కడియక్కడ ఆపుకున్నరు. ప్రాజెక్టులకు సుక్క నీళ్ళు రాలేదు. ఇప్పుడు డ్యాంలనే మంచినీళ్లబాయి వట్టింద్రు. అది ఇన్నిరోజులు చుట్టుపదూర్లకు మంచి నీళ్లు అందిస్తుండె. ఇయ్యల్లనో రేపో అదికూడా బోర్ల వదుతదట.." మల్లేశం అన్నడు కోపంగా.

మనుమడి కోపాన్ని పట్టించుకోకుండానే"..ఇట్లా ఇట్లా..ఇదిగాక ఇంకోటని ఎంత దూరం పోతరు..వానలు ఎన్నిరోజులు గొట్టిత్తరు." అని కొడుకువైపు తిరిగి అన్నడు భూమయ్య.

"ఎంకన్నా..ఈ జనమంతా తాగుడుకు నీళ్ళులేక ఎర్ర చీమలు మాడినట్టు మాడిసత్తరు. తిండి మందం ఎట్లనో సంపాయిస్తరుగనీ..తాగుడుకు నీళ్ళు ఎట్ల సంపాయిస్తరురా..?"

"అరే...ముసలోనితోని నాకు పరిషానుందిరో...ఎవని తిప్పలు వాడువడుతడు. నీకెందుకోయ్" అన్నడు మల్లేశం కోపంగా.

ప్రకాశ్ కల్పించుకొని "అది నిజమే మల్లేశం. తాత అన్నదాంట్లో తప్పేముంది. ఈ ప్రయోగాలతో మేఘాలను సృష్టించరు. ఉన్న మేఘాలతోనే వానగొట్టిస్తరు. కానీ





మేఘాలే లేకపోతే ఎట్లా.....? ఈ ప్రయోగాలను కేంద్ర ప్రభుత్వం నిషేదించింది కూడా. కొండె నాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడినట్టు, ఇట్ల జేత్తే అసలు వానలే గొట్టకపోతే ఎట్లా?"అన్నడు.

"అప్పుడు నాలుగు చేతుల తింటడు. ఎనుకది ముందటేసుకుని" తాత కోపంగా అన్నడు మనుమనితో.

"ఏ..ప్రకాశ్‌సారూ...నువ్వు అట్లనే మాట్లాడుతవు. మేఘాలతో కొట్టిచ్చినోళ్ళు మేఘాలను పుట్టియ్యరా..ఏదో ఐతది. ఎట్లనో బతుకుతరు. ఆగుతదా..మస్కట్ దుబాయిలల్ల మనుసులు బతుకుత లేరా" అన్నడు మల్లేశం.

అతడిలోని ఆశాభావాన్ని...భవిష్యత్తుపై కొండంత ఆశను ధైర్యాన్ని చూసినంక ప్రకాశ్‌కు ఆనందం..అంతకు మించి ఆశ్చర్యం కలిగింది. తరానికి తరానికి మధ్య జీవితాలపై విశ్లేషణను అంచనావేసుకుంటున్నడు. అప్పుడే సెల్ మోగింది. చూస్తే ఎడిటర్ శివశంకర్. కార్డు మార్చక చాలా రోజులు సెల్‌పని చెయ్యలేదు. కావాలనే కార్డు మార్చలేదు.

'హలో...సార్.....గుడ్‌మార్నింగ్' అన్నడు ప్రకాశ్.

"ఏమిటండీ...ఎక్కడికెళ్లారు..సీరియల్ పంపలేదు. తర్వాత ఏమయింది? భూమయ్య, ఎంకన్న, మల్లేశం...ఎటుపోయింద్రు. మేఘమథనం ఏమైంది?" ఆతృతగా అడిగిండు ఎడిటర్.

"సార్ ఇప్పుడు వాళ్ల దగ్గరనే ఉన్న. ఊరుకు ఊరు ఖాళీ అయితుంది. వాన సుక్కలేదు. ఊర్లె బోర్లన్ని ఎత్తిపోయినయి."

"అరే..ఆ వివరాలన్నీ రాయండి. సీరియల్ కంటిన్యూ చేద్దాం"

"సారీసర్...ఇంకా రాయలేను" బరువుగా సెల్ కట్ చేసిండు ప్రకాశ్.

C C C C

ఇబ్రాహీంల్ నుంచి వచ్చిరాగానే మళ్లీ ఫోన్. ఐశ్వర్య బ్రీఫ్‌కేస్ సర్దింది. తిరిగి రావడానికి వారం పట్టింది.

ఫ్యాక్స్‌లోనో...నెట్‌లోనో వస్తుందనుకున్న సీరియల్ భాగాలు కొరియర్‌లో అందాయి రవికిరణ్‌కు. ఆసక్తిగా పాకెట్ తెరిచాడు. మ్యాగ్జిన్ తాలూకు ప్రింటవుట్లు. ముందేసుకుని కూర్చున్నాడు రవికిరణ్. అప్పుడు రాత్రి ఎనిమిది గంటలు.

అతడి కళ్లు ఆతృతగా..ఆర్తిగా...అక్షరాలను అద్దుకుంటున్నాయి.

C C C C

## దాడి

### ప్రారంభం

### 1

బలబల తెల్లారుతుంది. మనిషికి మనిషి మసుక మసుకగా కనపడుతున్నడు. చీకటి విడిపోతున్నది. వరద నీళ్లకు కయ్యలు గొట్టి రాళ్లు దేలిన తొవ్వ, తొవ్వ నిండా బురుద. అటుపక్కన ఇటుపక్కన వాయిలి చెట్ల పొదలు,రాళ్ల తెట్టె. గల గల పారే నీళ్ల చప్పుడు. మనిషి నడిత్తే కనిపించనంత లోతున్న పానాది.

పానాదిలనుంచి రెండు ఆకారాలు కదులుతున్నయి. పారే నీళ్ల చప్పుడు....నీళ్లల్లో అడుగుల చప్పుడు కలగలిపి కొత్త చప్పుడు వినిపిస్తుంది. కండ్లు చీకటికి అలవాటు పడినయి. కాళ్ళు మాత్రం అలసటగా ఉన్నట్టు అడుగుల చప్పుడే చెప్పుతుంది.

చీకటి ఇంకా కొద్దిగ తెలగోలయింది. ఇద్దరూ పానాదిలనుంచి పైకెక్కింద్రు. ముందట నడుత్తున్న ఎంకయ్య ఎనక నడుత్తున్న భూమయ్యకు చేతి ఆసరా ఇచ్చిండు. అవసరం లేకపోయినా అందుకుని పైకెక్కిండు భూమయ్య.

ఈదర గాలి ఒక్కసారిగా సల్లగా తలిగింది. అంతదాకా గోడలోలె అడ్డుకున్న వాయిలి పొదలు లేవు ఇప్పుడు. బీడువడి గడ్డి మొలిచిన కంచె గుడ్డాల నుంచి తొవ్వ. సల్లగాలికి శరీరమంతా జిలజిలమంది. ఎంకయ్య మామూలుగనే ఉన్నడు. భూమయ్యకు మాత్రం దవుడలు వణుకుతున్నయి. పండ్లు టప టప గొట్టుకుంటున్నయి. సల్లటి నీళ్లల్ల తిమ్మిరెక్కిన కాళ్ళు. భూమి మీద అడుగు సరిగ్గా పడుతలేదు. అడుగు కింద రాళ్ళు రప్పలు కుచ్చుకుంటున్నయి.

'పొల్లగానికి సలివెడుతున్నట్టుంది'. ఆలోచన వచ్చింది ఎంకయ్యకు.

వెంటనే నెత్తిమీది గొంగడి కొప్పెరను తీసి భూమయ్యకు అందించిండు. ఇస్తూ ఇస్తూ కొప్పెరను ఇప్పి గొంగడి దులిపి ఇచ్చిండు. గొంగడిని దులిపి మోచేతులను మడిచి గొంగడి అంచులను పట్లుకుని కొప్పెరగా ముడిచి నెత్తిన పెట్టుకున్నడు భూమయ్య.

అతడు కొప్పెర మడిచిన తీరును చూసినంక 'పొల్లగాడు పనివాటపోడే' అనుకున్నడు ఎంకయ్య. గొంగడి కొప్పెర పెట్టుకున్నంక వెచ్చగా వుంది భూమయ్యకు. కొత్త తొవ్వ, కొత్త మనుసులు. భయం భయంగా బిడియంగా నడుస్తున్నడు. ఇప్పుడు చలిబాధ తప్పింది కాని కాళ్ళు రిల్లలు వట్టినయి. అక్కడక్కడా పల్లేరు ముండ్లు, రాళ్ళు కాళ్లకు గుచ్చుకుంటున్నయి. బాధను మింగుకుంటూ ముడుచుకుని నడుత్తున్నడు. జాగ్రత్తగా అడుగులో అడుగులేత్తున్నడు. అట్లా నడకలో కొద్దిగా వెనక పడ్డడు భూమయ్య.

తొవ్వసంగతి ఎంకయ్యకు తెలుసు. 'పొల్లగానిది సునొశిరపు పాణమే ఉన్నట్టుంది. తొవ్వనే నడువత్తలేదు' అనుకున్నడు. కొంతదూరం నడిచినంక మామిడితోట. పిల్లతొవ్వ





పెద్దదై బండ్ల బాటయింది. పెద్ద పెద్ద మామిండ్లు. చిమ్మటల రొద, గుడ్ల గూబల అరుపులు. చెట్లకింద చీకటి ఎక్కువయింది. భూమయ్యకు కొద్దిగా భయమయింది. నడక వేగం పెంచిండు. మామిండ్ల అడుగంతా ఊటలు ఊరి తడిగా బురదగా వుంది.

తోటను దాటి ఊరి తొవ్వ పట్టే సరికి పూర్తిగా తెల్లారింది. ముందుగా నడుత్తున్న ఎంకయ్య తొవ్వ పక్కనే ఉన్న యాప చెట్టుకింద ఆగి కొమ్మను అందుకున్నడు. రెండు పుల్లలు ఇరిసి ఒకటి భూమయ్యకు అందించి ఒకటి తను వేసుకున్నడు. నములుతూ నడుత్తున్నరు.

నాలుగు అడుగులు నడువంగనే చెరువు. చెరువును ఆనుకునే పెద్ద పరుపు బండ. బండ మీద కుప్పలు వోసిన ధాన్యాలు. ఉలువలు, శెనిగలు, ఆందాలు. ఊరి కల్లాలన్నీ బండమీదనే. ఊరి ధాన్యమంతా బండ మీదనే రాలుతుంది. బండ మీదనే ఎండి ఎండి ఇంటికి పోతుంది. అందుకే దాన్ని కల్లం బండ అంటరు.

ఎంకయ్య చెరువులకు దిగిండు. నాలిక మీద వేళ్ళు వేసి కక్కి మొఖం మీద నీళ్ళు చల్లుకున్నడు. వెంకయ్యను చూసి భూమయ్య గూడా నీళ్లల్లకు దిగిండు. పారే నీళ్లయితే వెచ్చగా ఉంటుండె. చెరువుల నీళ్ళు చల్లగా ఉన్నయి. యాసంగి నాట్లు పూర్తయి శివరాత్రి దాటినా చెరువు నిండుగనే వుంది. నిండుగా అలలతో తడలు గొడుతుంది.

"ఇది పెద్ద చెరువు. ఇంత వరకు ఎప్పుడూ ఎండిపోలేదు. ఒక్కసారి నిండితే రెండు పంటలు ఖాయం. వానకాలం నిండి అలుగు బొర్రుతది". చెప్పి గడ్డకు ఎక్కిండు ఎంకయ్య.

భూమయ్యకు చెరువు కొత్త. తన ఊర్లో ఒకటి రెండు కుంటలు తప్ప అంత పెద్ద చెరువును ఎప్పుడూ చూడలేదు. ఎంత పంట పండినా పునాసపంటనే. వడ్ల పంట లేనేలేదు. మక్కలు, జొన్నలు, రాగులు, సజ్జలు. మొఖం కడుక్కుని పైకి ఎక్కిండు. ఇద్దరూ కల్లం బండ మీదికి చేరుకున్నరు.

పొద్దు కరకర పొడుత్తుంది. గొంగడి బొంతను పరుచుకుని ఇద్దరు కూసున్నరు. పక్కనే పందుము ఉలువల రాశి. రాశి మీద చేతికట్టే. పాతిన చేతి కట్టే మీద గొంగడి కొప్పెర. అప్పటికే రాశుల దగ్గర కావలి పండుకున్నోళ్ళు ఎడ్ల పెండ తియ్యడానికి దొడ్లగడ్డకు చేరుకున్నరు. ఊర్లె నుంచి ఆవులు, ల్యాగల అరుపులు వినబడుతున్నయి. గుట్ట మీద నెమళ్ళు, నక్కలు కూతలు వెడుతున్నయి. చెట్ల మీద పిట్టల రొద ఎక్కువయింది.

" అయ్యా...నీకు తిన్నంత తిండి, చేసుకున్నంత పని, భూమి నీదే జాగనీదే. మన తావులన్నీ చూపిత్త. వంగి కష్టం జేసుకోవాలె. వంగు దొంగుల పని చెయ్యద్దు. చెప్పుడు మాటలు వినద్దు. చెడిపోతే నవ్వుతరు. ఫలానా పొల్లగాడు ఎంత మంచి పనోడు అన్న పేరు తెచ్చుకోవాలె. మా వంశాన్ని ఉద్దరియ్యాలె" ఎంకయ్య చెప్పిండు. గొంగడి చివర మోకాళ్ల చుట్టూ చేతులు మలుచుకుని బిడియంగా వింటూ కూసున్నడు భూమయ్య.

ఉలువల రాశి దిక్కు ఒకసారి తేరిపార జూసి రుమాలులో చెక్కిన చుట్టను తీసిందు ఎంకయ్య. సగం కాలిన కరుకు చుట్ట, బొటన వేలి గోటితో అంచులను పొడిచి జకమొక సంచితో చుట్టను అంటువెట్టిందు. గప్పగప్పమని రెండు దమ్ములు గుంజి పొద్దు పొడుపుకు చేతిని అడ్డం బెట్టి ఊరివైపు చూసిందు ఎంకయ్య.

'యాల్లపొద్దున్నే వత్తనన్నది. ఇంకారాకపాయె...నడిజాము రాత్రి లేచి నడిచి వత్తిమి. పొల్లగాడు ఏం తిన్నడో లేదో...ఇంత సల్లగటుక తాగితే కడుపుల సల్లవడుతుండె' అనుకున్నడు ఎంకయ్య.

ఊర్లెనుంచి ఆవుల మంద వస్తుంది. ముందట వచ్చిన ఆవులు ల్యాగలు చెరువులకు దిగి నీళ్ళు తాగుతున్నయి. గిత్తలు కొన్ని నీళ్లల్లో ఈతవడుతున్నయి.

మందను చూసిన ఎంకయ్య " ఆ మంద చూసినావు బిడ్డా...అది మనదే. దొడ్డి నిండ ఆవులున్నయి మనకు. యాట రెండుమూడు గిత్తలు నాగటికి అందుతయి. మందకాడ తెనుగు లింగడు జీతముంటడు. దొడ్డి దోర్నం వాడే సదురుకుంటడు. ఇద్దుము మక్కలు ఇత్త. పొద్దుగల్లమన ఇంట్లనే గటుక తాగుతడు. వాని పెండ్లాం మనకే కైకిలత్తది..." అని రెండు దమ్ముల పొగను పీల్చి"...అయ్యవ్వలేని పోరడు. నేనే చేతవట్టి లగ్గం జేసిన. గుడిసె ఏసిచ్చిన..."అన్నడు.

అతడి మాటల్లో 'నిన్నుగూడా చేతవడుత. నీకు గూడా బతుకు నిత్త' అన్న అర్థం ఉంది. అది గ్రహించిందు భూమయ్య.

భూమయ్య ఇంటికి చిన్న కొడుకు. పెద్దోళ్లకు పెండ్లీలయినయి. ఎవలంతల వాళ్ళు ఏరువడ్డరు. చేత వట్టేయాళ్లకు అయ్యవ్వ కన్ను మూసింద్రు. అల్లరి చిల్లరిగా తిరుగుతున్నప్పుడు జరిగిన మలుపు ఇది. తిండికే తిప్పలు వడుతుంటే ఎంకయ్య వచ్చిండు. తనను ఇలిటం తోలుకుని వచ్చిండు.

"పటేలా...ఎవలీ పొల్లగాడు...నూనె ముంతకాయ లెక్కనే ఉన్నడు." మంద వెంట వచ్చిన లింగం అడిగిండు బండమీదికి వచ్చి.

అతడి మాటలకు ఎంకయ్య నవ్వుతూ చూసిందు. చుట్టను బొటనవేలితో చిదబొడిచి ఆర్పి రుమాలులో చెక్కుకుంటూ "మన పొల్లగాడేరా...కొత్త పల్లినుంచి తోలుకచ్చిన. మన ఎల్లవ్వకు ఇలిటం తెచ్చిన. ఈడుజోడు కలుత్తదంటవా" అన్నడు.

లింగం భూమయ్యను పారజూసి "మంచిగున్నడు పటేలా...మంచిగ చేసుక బతికితె సాలు. ఉమ్మరు ఎంతుంటది పటేలా!"...అన్నడు.

భూమయ్యకు సిగ్గుగా అనిపించి తలను దించుకున్నడు.

"ఎంతుంటదిరా...కీలకనామ సమ్మచ్చరంల బుట్టిండట. మన ఎల్లవ్వ కంటే యాడాది రెండెడ్లు పెద్ద. అది ఇప్పుడు తొమ్మిదేండ్లపిల్ల"అన్నడు.





లింగం మందను మలుపుకుని ఇసుక తెప్ప దిక్కుపొయిండు. అంబటాల్లదాక ఇసుక తెప్పమీద మందను మర్రేసి సల్ల గటుక తాగి బోడగుట్టకు మందను మలిపిండంటే పొద్దుగూకే దాక గుట్టమీదనే. పోతూపోతూ ఎంకయ్యను రెండు పొగాకు రెమ్మలను అడుక్కుని పోయిండు లింగం. ఆవులకు తిరిగినంత మైదానం.

పొగాకును ఇస్తూ "పటేలవ్వ ఏదిరా...రోజూ నీకంటే ముందుగనే వత్తుండెగదరా". అడిగిండు ఎంకయ్య.

"అగో..వత్తుంది. చెరువు కట్ట ఎక్కింది" అంటూ వెళ్లిపోయిండు లింగం. ఎంకయ్య పొద్దు పొడుపుకు చెయ్యి అడ్డం పెట్టి ఎంకవ్వ వైపు చూసిందు.

భూమయ్యకు కొంత ఆసక్తి, కొంత భయం, కొంత దిగులుగా ఉంది. నిజానికి రాత్రి ఏమీ తినలేదు. పగటిపూటనే గుట్టమీద ఈత చెట్టును కొట్టుకుని గుజ్జును తిన్నడు. ఇంత దూరం నడిచినంక ఆకలి ఎక్కువయింది. ఎప్పుడు పెడుతరో ఏం పెడుతరో అని ఎదురు చూస్తూ కూచున్నడు.

ఎంకవ్వ బండ మీదికి వచ్చింది. కాళ్లకు వెండికడాలు. వేళ్లకు కంచు మట్టెలు. మెడల బంగారు గుండ్లు. చెవులకు గంటీలు కత్తెరవైనీలు. ముక్కుకు ముక్కుపోగు, బుల్లాకి, నెత్తిమీద ఈత బరిగెల గంప, చెయ్యెత్తు మనిషి . నడుత్తుంటే ఎల్లమ్మ దేవతనే నడిచినట్టుగా ఉన్నది.

"ఏమాయె..ఇంతసేపయింది. పొద్దుబారెడెక్కింది" భార్యను చూసి అడిగిండు ఎంకయ్య.

నిండుగా నవ్వింది ఎంకవ్వ. నవ్వుతూ భూమయ్య వైపు ఆసక్తిగా చూసింది. ఆమె కండ్లల్ల ఏదో మెరుపు. ఏదో తృప్తి. అతడు అడిగిన మాటకు సమాధానం చెప్పకుండా "ఈ పిల్లగాడేనా...?" అన్నట్టు కండ్లతోనే సైగ చేసింది ఎంకవ్వ.

సమాధానంగా మీసాలు దిద్దుకుంటూ నవ్విందు ఎంకయ్య. భూమయ్యను తనతో రమ్మని సైగచేస్తూ చెట్టుదిక్కు నడిచిందు. ముగ్గురూ మామిడి చెట్టుకిందికి చేరుకున్నరు. చుట్టూ చెట్లే. ఎక్కడ చూచినా ఎటుచూసినా పెద్ద పెద్ద చెట్లు. చలికాలం పోయినా చలి మాత్రం పోలేదు. పొద్దు బారెడెక్కినా వేడిగాలేదు.

గంపను కింద దించింది ఎంకవ్వ. గొంగడిని పరిచిందు ఎంకయ్య. కొద్దిగా నలుపు రంగులో ఉండి ఎంకవ్వ మీద జానెడుంటడు ఎంకయ్య, గుత్తిమీసాలు వెడల్పు మొఖం ఎత్తుకు ఎత్తు భీముని లెక్క ఉంటడు.

గంప కింద దించగానే వట్టి చాపల కూర కమ్మటి వాసన. భూమయ్యకైతే నోట్లె నీళ్లూరినయి. ఎప్పుడూ మట్టి దూపకు బుడ్డినిండా సల్లగటుక, నాలుగైదు కాల్చిన పచ్చిమిరుపకాయలు, కంకెడంత తొక్కు తెచ్చేది. ఈ రోజు మాత్రం రెండు మట్టి ఎసులలు తెచ్చింది. ఒక ఎసులనింద బువ్వ. ఇంకో ఎసుల నిండ కూర. ఎసులల మీద రెండు

కంచాలు బోర్లేసుకచ్చింది ఎంకవ్వ. ఇద్దరినీ వరుసగా కూసోబెట్టి చెరో కంచం ఇచ్చింది. కంచాల నిండా అన్నం బెట్టి గంటెతో కూర ఏసింది.

బువ్వను చూడగానే ఎంకయ్యకు గూడా ఆకలేసింది. ఎప్పుడూ పండుగలకు, సుట్టమత్తే తప్ప కనిపించని మెతుకులు. బువ్వ వండితె పండుగే. కంచం ఎత్తి కలిపిండు ఎంకయ్య.

భూమయ్యనైతే అన్నీ మరిచి బువ్వ వైపే చూస్తున్నడు. ప్రతియేడు పంట పండిన తర్వాత కొత్త బియ్యం తినే రోజు కొత్తపండుగ. అది మంచి రోజు ఎన్నడో చూసి ఆరోజే చేసుకునే పండుగ. కొత్తనాడు పిడికెడు మెతుకులు తప్ప వరి బువ్వ ఎట్లుంటదో తెలువదు భూమయ్యకు. ఎట్ల కలుపాలో ఎట్ల తినాలో కూడా తెలువదు.

"కొత్తంత పండుగులేదట. అత్తంత ఆత్మలేదట. కొత్తనాడే కడుపునిండాలె. అత్త వెడితెనే కడుపు నిండాలె." భూమయ్య వైపు చూసి నవ్వుకుంట అన్నడు ఎంకయ్య. ఎంకవ్వ గూడా నవ్వింది.

బువ్వను చూసినంక భూమయ్యకు మరొకటి గుర్తుకురాలేదు. ఆబగా తినుడు మొదలువెట్టిండు. కొద్దిగా పసితనం, కొద్దిగా పేదరికం, కొద్దిగా గొగోడితనం మొత్తం కలిసి భూమయ్యలెక్క కనిపిస్తున్నడు. జుట్టు భుజాల దాక పెరిగింది. వంగి తింటుంటే మొఖాన్ని కప్పేస్తున్నయి. కంకెడు కంకెడు ముద్దల్ని నోట్లె కుక్కుకుంటున్నడు.

ఎంకవ్వ అతడివైపు జాలిగా చూసింది. ఇత్తడి సర్వతో చెరువులనుంచి నీళ్లు తెచ్చి ముందట పెట్టింది. ఎసుల నుంచి మారు అన్నాన్ని తోడి పెట్టింది. 'పిల్లగానికి సరిపోతదో లేదో' అనుకుని ఎంకయ్య మారు అన్నం వద్దన్నడు. భూమయ్య మెతుకు మెతుకు ఏరుక తిన్నడు.

ఇద్దరూ చెయ్యి కడుక్కుని కూసున్నరు. ఎంకవ్వ గంపల నుంచి కొత్తబట్టల ముల్లెను తీసి ఇచ్చింది. వాటిని విప్పి చూసి తానం చేసి రమ్మని చెరువులకు భూమయ్యను పంపించిండు ఎంకయ్య.

"కొత్త పొల్లగాన్ని ఒక్కన్ని పంపుతవా...నువ్వు గూడపో..."కంచాలను కడుగుతూ అన్నది ఎంకవ్వ.

"ఏం కొత్త...పొల్లగాడు ఊరికి కొత్తగనీ...నీళ్లకు కొత్తనా.... పెద్ద పెద్ద వాగులల్ల ఈతవడ్డడట."అన్నడు ఎంకయ్య.

భూమయ్య పెయ్యి మీద ఉన్నది సోడెలాగు, చింపుల బనీను. బనీనును ఇడిసి చేతులవట్టుకుని చెరువు దిక్కు నడిచిండు.

అతడు వెళ్లిపోగానే వివరాలన్నీ అడిగింది ఎంకవ్వ. తల్లిదండ్రి, అన్నదమ్ముల పుట్టుపూర్వోత్తరాలన్నీ చెప్పిండు ఎంకయ్య. చెప్పి "పిల్లగాడు మాత్రం మ్యాదకుడు.







దిక్కుమొక్కులేనోడు. లందుబొందోడుగాదు. దొరల శాతల రెండేండ్లు జీతమున్నడట. పనివాటలన్ని వచ్చునట. ముందటి నాగలి దున్నుతడట. గొర్రు రొప్పిండట. మొలుకగూడా అలుకుతడట"అన్నడు. అంటూ "దూరం నుంచి మనకు వరుసనే ఐతడు. అన్నీ చూసే నాగయ్యమామ జాడ చెప్పిండట" అన్నడు.

"నశివ నారాయణ...ఏంజెద్దాం. తినేటోడు మంచోడైతే గుమ్మడికాయలు చేదుండయి. చేసుక బతికితే మంచిదేనాయె. నువ్వు మాత్రం గావురం జెయ్యకు. వండకవడివెడితే ఉంటడా పోతడా తెలుత్తది. ఇయ్యల్ల జుట్టు చేతికిత్తే రేపు మనలను గంతులెయ్యిమంటడు." ఎసులలు కంచాలు సదురుతూ అన్నది ఎంకవ్వ.

మోతుకాకు సుట్ట జేసి పొగాకు నింపుకుంటూ "కొట్టి సూత్తెనే గదా...రాయేదో రత్నమేదో తెలుత్తది. నాలుగు రోజులు మనిపడ్డంక అసలు కత బయట వడుతది. గుంటగన్నేరాకు బిడ్డో గురుగుల్ల బువ్వ బిడ్డో...అంటే నాకు నడుత్తదా...తిన్నంత తిండి ఉంది. చేసుకున్నంత పని ఉంది. పనిముద్దా భాగ్యం ముద్దా అన్నరట. అదేం నడువది ఉంటే ఉన్నోడాయె. పీకితే పీకినోడాయె. వైపోడుగావాలె అంతే" అన్నడు ఎంకయ్య.

ఇద్దరూ మాట్లాడుకుంటున్నరు. తొవ్వపొంట ఆవుల మందలు సాగిపోతున్నయి. కోడెలు లెంకలు గొడుతున్నయి. ఎదునకచ్చిన ఆవుల వెంటపడి తరుముతున్నయి. ఆవుల మందల తర్వాత బర్లమంద సాగిపోయింది. ఆవుల మంద శాతకు ఒక్కటయితే బర్లమంద ఊరంతటికి ఒక్కటే. బర్లు చెర్ల పంటయి. ఆవులు చెలుక తిరుగుతయి.

భూమయ్య తానం చేసి బట్టలు పిండుకుని తొడుక్కొని వచ్చిండు. కొత్త పంచె బొందెల అంగీని చేతుల పెట్టిండు ఎంకయ్య. చెట్టుసాటుకు వెళ్లి అంగి తొడుక్కుని పంచెకట్టుకుని వచ్చిండు భూమయ్య. అంగి తొడుక్కున్నడుగనీ అది తిర్రమర్ర. అది జూసి ఎంకవ్వ నవ్వుడే నవ్వుడు.

"ఏమాయె పిల్లగా...గా అంగి తొడుక్కోరాదా..." అన్నది కిసకిస నవ్వుతు.

భూమయ్య బిత్తిరి చూపులు చూసిండు. ఎంకయ్యనే సరిచేసి తొడిగిచ్చి బొందెలను కట్టిండు. నడుము కట్టు ముడేసి పంచెను గట్టిగా కట్టిండు. కొత్త బట్టలతో కొట్టచ్చినట్టున్నడు భూమయ్య.

అప్పటికి కల్లం బండ మీద రాసులున్నోళ్లందరూ చేరుకున్నరు. కొత్తవ్యక్తిని చూసి ఎవలని అడిగిండ్రు. అందరికీ వివరంగా చెప్పిండు ఎంకయ్య. ఆమాటా ఈమాటా మాట్లాడి "చేనుకు గూడ ఏసే యాల్లదాటింది. మేము పోతున్నం. నువ్వు ఉలువ కట్టెను గొట్టి రాశి చెయ్యి" అని చెప్పిండు ఎంకయ్య.

ఎంకవ్వ తలూపుతూ "పగటియాల్లకు ఇక్కడికే రాండ్రి. దూపకు తాగుదురు" అన్నది.

కల్లం బండను ఆనుకునే బోడగుట్ట. బోడ గుట్ట కిందనే ఐదెకురాల చేను. చెరువు మీద ఉంది కాబట్టి నీటిపారుకం లేదు. చేను మొత్తం ఉలువ అలికి కింద రెండు దొయ్యలు మాత్రం వరి అలికిండు ఎంకయ్య. ఒడ్డు కిందనే నాలుగు అడుగుల పొక్క తవ్వితే నీళ్ళు ఊరినయి. పొద్దున మావున రెండు దొయ్యలకు 'గూడ' ఏసి నీళ్లను పారిత్తండు. అవి దోతి ఎలుము దొయ్యలు.

భూమయ్యను ఎంటబెట్టుకుని నడుత్తున్నడు ఎంకయ్య. ఏదో యాదికచ్చి 'ఇగో' అని పిలిచింది ఎంకవ్వ. ఇద్దరూ ఆగిపోయిండ్రు.

"పొల్లగాని పేరేందో చెప్పకనేపోతివి"అడిగింది ఎంకవ్వ.

ఎంకయ్య నోరు తెరిచేలోపే 'భూమయ్య...నా పేరు భూమయ్య' అన్నడు భూమయ్య బొంగురుగా.

'అగో...పోరడు గడుసోడే ఉన్నట్టుంది' అనుకుంది ఎంకవ్వ.

"వాళ్ల తాతపేరు భూమయ్యనట. తండ్రి అదే పేరు పెట్టుకున్నడు. మనం గూడా అదే పేరు పిలుద్దాం" ఎంకయ్య అన్నడు.

'బొందెల అంగి దొడ్డుపంచె కట్టుకుంటే పొల్లగాడు బోజెగాగోలె ఉన్నడు. నెగులుతడో లేదోగనీ మొఖం మీద కడ ఉంది'. అనుకుంది ఎంకవ్వ.

గుట్ట దిగి ఇద్దరూ పొలం దగ్గెరికి చేరుకున్నరు. ఉలువ అలికిన పొలం. ఉలువ కోసిన కొయ్యకాలు మొదట్ల గడ్డిలేచింది. రెండు వరిమడ్లు మాత్రం పచ్చగా ఉన్నయి. అక్కడక్కడా ఇట్లనే ఒకటి రెండు వరిమడ్లు ఉన్నయి. మిగిలినదంతా వానకు పండే పునాస పంటనే! ఉలువలు ....మక్కలు...జొన్నలు.

"ఇది గుట్టకింది పొలం...ఉలువలు, మక్కలు,నువ్వులు పండుతుండె. వడ్ల పంట అన్నదే లేకుండె. నేనే ఇగురం జేసిన. ఒడ్డుకింద పొక్క తవ్విన. 'గూడ' వెట్టి రెండు దొయ్యలు నాటేసిన. నన్ను చూసి అందరు పొక్కలు తవ్వి 'గూడ' వెట్టిండ్రు." చెప్పిండు ఎంకయ్య.

భూమయ్య వింటూ నడుత్తున్నడు. ఇద్దరూ గూడపొక్క దగ్గెరికి నడిచిండ్రు. పొక్కనిండా తెల్లగా నీళ్ళు. అక్కడేమ్యాదరి తడుక. తడుకకు రెండు దిక్కులతాళ్లు. ఒక దిక్కు తాడును అందుకొమ్మని సైగ జేసి ఇంకోదిక్కుతాడును అందుకున్నడు ఎంకయ్య. భూమయ్య అంగిని విడిచి ఒడ్డుమీద పెట్టి గోసి బిగిచ్చి దిగిండు.

చెరోదిక్కుతాడును పట్టుకుని తడుకబుట్టిని నింపి విసురుతున్నరు. విసిరిన నీళ్లు బోదెల నుంచి మడ్లెకు పారుతున్నయి. దమ్ము వచ్చినా ఆపుతలేడు ఎంకయ్య. భూమయ్య ఎంతసేపు ఏత్తడో చూద్దామని 'గూడ' ఏత్తనే వున్నడు. పొక్కల నీళ్లు ఊరుతనే ఉన్నయి.





పొద్దు నడినెత్తిమీదికి వచ్చింది. ఎండ సుర్రుమంటుంది. పెయ్యినిండా చెమట పట్టింది భూమయ్యకు. చేతులు నొప్పివెట్టినయి. ఎప్పుడు ఆపుతడోనని ఎంకయ్యనే చూసున్నడు. రోజూ పొద్దునా మాపునా పారే పొలం అది. ఎండలు ముదిరి ఆరిపోతనే వుంది. రెండు మడ్లల్ల నీళ్లు తిరుగాలంటే రెండు పొంటెలు జరుగాలె. కనీసం రెండు జాముల పొద్దయినా పడుతుంది. రోజూ ఎంకయ్య, ఎంకవ్వనే 'గూడ' ఏద్దురు.

ఎంకయ్య ఆపుతలేడు. భూమయ్య ఆపుమంటలేడు. ఏత్తనే ఉన్నరు. జాము పొద్దుగడిచింది. ఎంకయ్యకే యాష్టకచ్చింది. గూడను ఆపి చుట్ట అందుకున్నడు.

"నీళ్ల మీద నీళ్లు వారితెనే మడి తడుత్తది. ఆగితే నీళ్లు ఎక్కడియక్కడ ఆగిపోతయి. మల్ల తడువాలంటే పొంటెజాము గావాలె" అన్నడు భూమయ్య.

ఎంకయ్యకు చిత్రమనిపించింది. అతడు అంత రికాం లేకుంట పని చేస్తడనుకోలేదు. "కొద్దిగ దమ్ముతీసుకో...ఉరికి ఉరికి మోట గొట్టితే తోటవారది. కొత్తమురిపానికి ఇత్తడిపోగు సంబూరమట. ఇయ్యల్ల ఒక్క రోజు పోసింది లెక్కగాదు. రథాల పున్నం దాటేదాక పొయ్యాలె. ఒంటిగాడినని రెండే మడ్లు వరిపెట్టిన. రేపు వానకాలం మూడు మడ్లు పెడుదాం" అన్నాడు ఎంకయ్య సుట్టతాగుతూ.

భూమయ్య నీళ్లల్ల కాళ్లు ఆడిస్తూ పొక్క అంచుకే కూసున్నడు. పొక్కలోతు మోకాల్లమంటే ఉంది. నీళ్లు మాత్రం ఊరుతనే ఉన్నయి. అది చిత్రంగా అనిపించింది భూమయ్యకు. అదే విషయాన్ని ఎంకయ్యతో అన్నడు.

ఎంకయ్య నవ్వుతూ "నీళ్లు కరువున్నాయి? దోసెడు ముంచితే దోసెడు ఊరుతయి. ఇప్పుడు ఇట్ల 'గూడ' ఏత్తున్నంగనీ ఈ చేను అచ్చుకట్టినప్పుడు ఎండకాలం తప్ప ఎప్పుడు నీళ్లు ఊరుతుండె. కప్పలు గుడ్లు వెడుతుండె. ఇప్పుడు నీళ్లు లోతుల పడ్డయి" అన్నడు.

చుట్టతాగి రెండు మడ్లను ఒక్కసారి తిరిగి, నీళ్లు ఎంత దూరం పారిందో చూసివచ్చి 'గూడ' ను అందుకున్నడు ఎంకయ్య. పొలం ఒడ్ల మీద కానుగు చెట్లు యాప చెట్లువున్నయి. చెట్టుకింద వరి గండుదేలి పచ్చగా ఉంది. పొద్దు వంగుతుంటే నీడలు సాగుతున్నయి.

ఆ రోజు రెండు పొంటెల గూడ వరుసగా నడిచింది.

పక్కనే మంచినీళ్ల చెలిమ తవ్విండు ఎంకయ్య. చెలిమె చెట్టుకింద ఉన్నది. నీళ్లు చల్లగా ఉన్నయి. పక్కనే కడుముంత. దూప అయినప్పుడు నీళ్లు తాగుకుంట 'గూడ' ఏత్తున్నరు.

భూమయ్యకు ఆకలయితుంది. ఎంకయ్యకు గూడా ఆకలయితుంది. అయినా ఆపలేదు. నాలుగు జాముల వరకు 'గూడ' సాగింది. మడ్లల్లో నీళ్లు గలగల దుంకుతున్నయి. మీది మడ్లెనుంచి కింది మడ్లెకు, అందులనుంచి బీడు గుడ్డంలకు పారుతున్నయి.

పగ్గాలు విప్పి తడుకబుట్టిని, పగ్గాలను చెట్టు మొదట్ల దాచిండు ఎంకయ్య. ఇద్దరూ ఆవులకొట్టం దగ్గెరికి చేరుకున్నరు. అప్పటికి తల్లి కడుపులకు దిగుతుంది పొద్దు.

కొట్టమంటే అది మామూలు కొట్టంగాదు. నాలుగు పారుకాల కొట్టం. మంచి మంచి దూలాలు వాసాలు. అంతా టేకు కట్టెనే. అద్దెకురం పైనే ఉంటది కొట్టం. వెనుక పెరడు. పెరట్ల పెద్దయి మూడు సొప్ప గడ్డివాములు. గడ్డివాముల సుట్టూ తుమ్మముండ్ల కంపతో ఎనుగు నాటింద్రు. కొట్టంకు రెండు దిక్కుల రెండు పెద్ద పాటాకు తలుపులు. లోపల రెండు దిక్కుల రెండు రూములు. వాటికి తలుపులు, తాళాలు.

"ఈ కొట్టం నేనే కట్టిన. నా ఏరు వడ్డంకనే కట్టుకున్న. ఈ దూలాలన్ని గట్టునుంచి ఒక్కన్నే మోసిన. మొద్దులకు మొద్దులు కొట్టితెచ్చి ఇక్కడ పలుగ్గొట్టిన. ఒక్కొక్క మొద్దుల రెండు మూడు దూలాలు ఎల్లినయి. ఈ రాళ్ళు మొత్తం ఒక్కన్నే బండి మీద జారగొట్టిన..." చెప్పిండు ఎంకయ్య.

కొట్టమే ఇంత పెద్దగుంది. ఇల్లు ఇంకెంత పెద్దగుందో అనుకున్నడు భూమయ్య. అడుగుదామనుకున్నడు గానీ అడుగలేదు. ఎంకయ్య గడ్డివాము నుంచి గడ్డిని గుంజితే, తెచ్చి బోదెలల్ల అక్కడింత అక్కడింత వేసిండు భూమయ్య. దోమలు ఎక్కువైనయని నాలుగు పక్కలకు మంట పెడితే తొక్కుడు గడ్డిని తెచ్చి ఇచ్చిండు.

అక్కడక్కడా ఉన్న పెండకడీలను తీసి పెంటల వేసిండు. రొచ్చు ఆగిన జాగల ఎంకయ్య మట్టిని పోస్తుంటే తట్టను అందుకున్నడు భూమయ్య.

"ఏవన్నా సామాన్లు ముల్లు కట్టెనో, జోడో,బండికొయ్యలో, గొలుసో ఉంటే ఈ అర్రలల్ల ఏసుకోవాలె. తాడు తలుగులున్నా ఇక్కడనే దాసుకోవాలె". చెప్పిండు ఎంకయ్య.

అప్పుడే గోజలు దొడ్లెకచ్చినయి. సంటి ల్యాగలను ఒక దిక్కు, ఎడ్లను ఒక దిక్కు, సుడిమీదున్న ఆవులను ఒక దిక్కు వేరు చేసే సరికి సుక్కలు పొడిచినయి. ఆవులను, కొట్టంను, పనిని చూసినంక భూమయ్యకు ఆకలి యాదికి రానేలేదు. లింగంతో కలుపుగోలుగా తిరుగుతూ రెండు పాటాకులను మూసిండు.

దొడ్లగడ్డ సందడి సందడిగా ఉంది. ఆవులు ల్యాగలు ఎడ్లు అటూఇటూ తిరుగుతున్నయి. దొడ్డిని సదిరినోళ్లు గొంగడి బొంతను ఏసుకుని కూసుండి సుట్టలు తాగుతూ మాట్లాడుకుంటున్నరు.

ఎంకయ్య వెంట కొత్తపిల్లగాడిని చూసి ఎవలని అడుగుతున్నరు. ఎంకయ్యకంటే ముందే అందుకుని ''ఇలిటపల్లుడు. ఇయ్యల్లనే అచ్చిండు. మా ఎల్లవ్వకు తెచ్చినం"అంటున్నడు లింగం. ఎంకయ్య నవ్వుతున్నడు.

కొందరు భూమయ్యను వరుసలు పెట్టి పిలుత్తున్నరు. కొందరు ఏదేదో అడుగుతున్నరు. తాత వరుసయ్యేటోళ్లు గోసిని గుంజి పరాచికాలాడుతూ "పిల్లల





పురుగుందావోయ్"...అని, "గోసి బట్టకొత్తదేనానోయ్" అని, "పటేలు తన ముందావోయ్" అని అడుగుతున్నరు.

భూమయ్య బిడియంగా నవ్వుతున్నడు. అన్నింటికి లింగమే సమాధానం చెప్పుతూ "నాలుగురోజులు ఆగవోయ్ తాతా...నిన్ను పిల్లతల్లిని జేస్తడు" అంటున్నడు.

దొడ్ల గడ్డనుంచి కదిలేసరికి కూరుకు రాత్రి దాటింది. "ఆయిన చిన్నమామ, ఈయిన పెద్దమామ" అని తన అన్నదమ్ములిద్దరినీ చూపించిండు ఎంకయ్య. వాళ్లు సల్లగ బతుకని అన్నరు. ఇద్దరూ ఇంటికి చేరుకున్నరు.

"ఆ ఇప్పుడు తీరిందా...కూసుంటే గొంగడి కాకకు రావాలె. కూరుకు రాత్రయితేగాని ఇల్లు చేరవు. ఇయాల్లనన్నా యాల్లపొద్దున రావచ్చుగదా. పగటియాల్లకు దూపకు తాగరమ్మంటే రాకనేపోతివి. ఎంట కొత్తపిల్లగాడుండె. నీకు ఆకలిగాకపోతే అయిపాయెనా..." యాష్టపడుతూ అన్నది ఎంకవ్వ.

"అయితే ఏందట...ముడితె బతుకని పిల్ల ముద్దాడితె బతుకుతడా...ఒక్కనాడు పగటి పూట దూపకులేకుంటే ఏమయితుంది. ఎన్ని తాకులకు తన్నులకు ఓర్వాలె....? ఎన్ని కష్టాలను తట్టుకోవాలె...?" గొంగడి బొంతను దులిపి దండెం మీద ఏస్తూ అన్నడు ఎంకయ్య.

వాళ్లిద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నరు. భూమయ్యమాత్రం ఇల్లునే చూస్తున్నడు. ఇల్లు పెద్దగనే ఉంది. అనుకున్నంత పెద్దగలేదు. రెండు సంకల ఇల్లు. గూట్లె దీపం వెలుగుతుంది. ఇల్లు నిండా మొగురాల నీడలే. సుట్టూ కాగులు గుమ్ములె. ఆరోజే అలికి జాజు పట్టి పెట్టి సున్నం పెట్టినట్టున్నరు. చీకట్లో గూడా మసక మసకగా కనిపిస్తుంది. ఎనుక వంటిల్లు. వంటింట్ల శాదబాయి. అన్నీ చూస్తూ మొగురాల కైనీడకు వెళ్లి నిలబడ్డడు భూమయ్య.

ఎంకవ్వ ఆందెం పావును అందుకున్నది. దీపం కంచుట్లో ఆందెం పోసి వేళితో వత్తిని పెద్దది చేసింది. ఒక్కసారిగా వెళుతురు ఎక్కువయింది. చెంబుతో నీళ్లు ఇచ్చి కాళ్లు కడుక్కొమ్మంది. భూమయ్య గచ్చులకు దిగి కాళ్లు కడుక్కుని పైకి ఎక్కిండు.

కూర్చొమ్మని పెద్ద పీటను చూపించింది ఎంకవ్వ. పెద్దపీట మీద రెండుమూడు బొంతలు, పాత దుప్పట్లున్నయి. వాటిని పక్కకు జరిపి కూసున్నడు భూమయ్య.

"సాకలి దాన్నవ్వా..."అంటూ వచ్చింది సాకలి లచ్చవ్వ.

పీటదిక్కు పారజూసి "ఎవలవ్వా ఎంకవ్వా...సుట్టమచ్చిందా...?" అని అడిగింది లచ్చవ్వ.

భూమయ్య సంగతి చెప్పింది ఎంకవ్వ.

"అయ్యో ఎంకవ్వా...అట్ట నయాలనాడు తోలుకత్తావు...? పొల్లగానికి అట్ట కట్టాలత్తయి. నిన్ననన్నా తోలుకరాలేదు. రేపన్నా తోలుకరాలేదు. ఇయ్యల్లనే ఎందుకు

తోలుకచ్చిండు. ఎంకయ్య పటేలుకు అన్నీ ఎరికేనాయె?” అన్నది లచ్చవ్వ.

ఎంకవ్వ గుండె దడదడమంది.

“అవుసుల ఎంకటేషంను అడిగిండే లచ్చీ...అడిగే పోయిండు” అన్నది గానీ నోట్లె తడారిపోయింది ఎంకవ్వకు. ఒక్కసారిగా భయమయింది.

అప్పుడే బఱ్ఱెపాలు పిండుదామని ఇత్తడి సర్వతో బయటకు వచ్చిన ఎంకయ్య మాటలన్నీ విన్నడు.

“తెలువనోనికి తెడ్డే లింగము. అంతా పరమాత్ముని దయ. వాని సూపు సక్కగుండాలె. నొసటి మీద ఎట్లరాత్తే అట్లయితది. బమ్మదేవుని బిడ్డకే కట్టాలు తప్పలేదు. మనమెంత!” అనుకుంట బఱ్ఱె పాకలకు నడిచిండు.

మట్టి కంచుట్ల రెండు గటుక పెల్లల్ని తెచ్చి లచ్చవ్వ ఒడిలో వేసింది ఎంకవ్వ. లచ్చవ్వ కడప దాటుతుంటే పక్కన ఉన్న ఇంట్లోంచి మాటలు వినిపించినయి.

“సాకలి లచ్చవ్వా....బువ్వ తినకుంట జేత్తివి గదనే...”అన్నడు మల్లయ్య బయటకు వస్తూ.

లచ్చవ్వకు భయమయింది. ఇంట్లోకాలు ఇవతలోకాలు పెట్టిందల్లా అట్లనే ఆగిపోయి “నేనేం జేసిన పటేలా...”అన్నది.

“ నీయవ్వ...బువ్వ తినకుంట జేత్తివి....”ఇంకోసారి అంటూ ఇంట్లకు వెళ్లిపోయిండు మల్లయ్య. లచ్చవ్వ అక్కడనే బీరిపోయింది.

ఎంకవ్వనే గుసగుసగా “ మా బావ కొత్తగ పాము మంత్రం నేర్సుకున్నడు. అన్నం తినేటప్పుడు దీపం మలిగిపోయినా, సాకలిది వచ్చినా అన్నం ముట్టడట” అన్నది.

లచ్చవ్వ దిగులుగా చూస్తూ “పాపం పాడుగాను నాకేం తెలుసునవ్వా....ఈ సంగతి ఎరుకుంటే రాత్రిపూట రాకనే పోదుంటిని. అయినా మీ ఇంట్లకత్తే వాళ్ల ఇంట్లకేందట”అన్నది  గుసగుసగానె.

“ఏ ఇంట్లకచ్చినా తినేటప్పుడు ‘సాకలిదాన్నవ్వ’అనే మాట వినపడద్దట. రేపటి నుంచి  ఎనుకనన్నా ముందటనన్నారా. వచ్చినా‘సాకల్దాన్నవ్వా’అనకు. ‘లచ్చవ్వనచ్చినా’ అను” చెప్పింది ఎంకవ్వ.

“అట్లనే నవ్వా...ఎంతపనైపాయె. పాము మంత్ర మంటే పుణ్యం పనేనాయె. తిండి ఎత్తగొట్టి నేను పాపం గట్టుకున్నట్టాయె” అంటూ వెళ్లిపోయింది లచ్చవ్వ బాధగా.

ఎంకవ్వ ఇంటి ముందటికి వచ్చి చూసింది. వరుసగా ఒకటి తరువాయి ఒకటి మూడు ఇండ్లు. అటువైపు మరిది ఇటువైపు బావ. మూడు ఇండ్లముందట మూడు బఱ్ఱె పాకలు. ఇద్దరికీ బదులుకుని పుట్టినట్టు ఇద్దరిద్దరు కొడుకులు. నాలుగైదు కాన్పులు పోయినయి. తనకే సూడంగ సూడంగ ఒక్క బిడ్డ.





వాకిళ్లు ఊడ్చేకాడ, బర్లను ఇడిసేకాడ రోజూ ఆడోళ్లకు కొట్లాటనే. ఒకలతో ఒకలు మాట్లాడుకోరు. మొగోళ్లు బయట బయట మీద మీద మాట్లాడుకుంటరు. ఎవల కడుపులుండేది వాళ్ల కడుపుల ఉంటది.

ఎంకవ్వకు బావ మాటలే గుర్తుకత్తున్నయి. ఆ మాటలు సాకలి లచ్చవ్వనుగాక తమతోనే అన్నట్టుగా అనిపించినయి. మనసుల ఏదో భయం చోటు చేసుకుంది. తను ఇలిటం తెచ్చుకొనుడు అటు బావకు, ఇటు మరిదికి ఇష్టం లేదని ఆమె అనుమానం. ఇద్దరి వాకిళ్లను పారజూసింది. మొగ పిల్లలు చేతికి అందింగ్రు. ఒకడు బఱ్ఱెకు కుడిదిపోత్తే ఒకడు గడ్డిని అందుకుంటున్నడు. తనకే ఇటున్న ముంత అటుపెట్టేటోళ్లులేరు.

ఇంట్లకు వచ్చింది ఎంకవ్వ. మంచిరోజు కాదని లచ్చవ్వ చెప్పిన మాట యాదికచ్చింది. ‘నీ పనిల మన్నువడ. ఏపని చేసినా ఇట్లనే జేత్తడు. తాకేది తెలువది తప్పేది తెలువది.’ మనుసులనే తిట్టుకుంది.

భూమయ్య పీట మీద కూసుండి ఇల్లంతా చూస్తున్నడు. హఠాత్తుగ పిల్ల గుర్తుకచ్చింది. ఇంట్ల పిల్ల అలికిడి లేదు. కొత్త జాగ. కొత్తమనుషులు. కడుపుల పేగులు గుఱ్ఱుమన్నయి. చేతులు నొప్పి వెట్టినయి. మరింతగా ముడుసుకొని కూర్చున్నడు.

ఎంకయ్య బఱ్ఱెను దుడ్డెను సదిరి చేతులు కడుక్కుని వచ్చిండు. ఈత కమ్మల సదిరెను పరిచి ఇద్దరినీ కూర్చోబెట్టి అన్నం బెట్టింది ఎంకవ్వ.

“ఏంటిదే...నిత్తె పండుగైతె నిన్నెవడుగొట్టె అన్నట్టుంది కత. పొద్దుమాపు బువ్వనేనా... మనం దొరల మనుకుంటున్నవా...బాపుల మనుకుంటున్నవా. కూరకాపోల్లం. కాపాయముండాలె”. అన్నడు ఎంకయ్య.

ఎంకవ్వ మాట్లాడలేదు. ఆమె మనుసుల వేరే ఆలోచనలున్నయి. భర్తమాటలు వినీ విననట్టే ఉన్నది. తింటుంటే కై నీడ కొడుతుందని దీపాన్ని ఇటు దిక్కు తింపింది.

భూమయ్య మాటలేదు ముచ్చటలేదు. తింటనే ఉన్నడు. తింట తింటుండంగ ఏదో ఆలోచన వచ్చింది. వెంటనే ఎంకయ్య దిక్కు చూసి ‘ఔ...అట్టనయాలు అంటే ఏంటిది’ అన్నడు.

అతడు అట్లా ఎందుకు ఆడిగిండో ఇద్దరికీ అర్థంగాలేదు. వెంటనే ఎంకవ్వ అడిగింది గూడా. అడిగేటప్పుడు అడిగిండు గనీ ఏం చెప్పాలెనో తెలువలేదు భూమయ్యకు. మౌనంగా  ఉండిపోయిండు.

కొద్దిసేపు ఆగి వెంకయ్యనే“ఔ..అనద్దు. నన్నుమామా అనాలె. దాన్ని అత్తా అనాలె. పిల్ల ముద్దు లేకున్నా పిలుపన్నా ముద్దుండాలెనంటరు. అందరిని మంచిగ పిలువాలె. అందరితో మంచిగుండాలె.”అన్నడు చెయ్యికడక్కుని లేస్తూ.

అప్పుడే గొంగడి భుజాన వేసుకుని వచ్చిండు లింగం. దొడ్డికాడ పండు కుందామని  భూమయ్యను పిలిచిండు. కొత్త కొత్తగ ఇప్పుడే వద్దు అన్నది ఎంకవ్వ.

ఎంకయ్య గొంగడేసుకుని కల్లంబండమీదికి పోయిండు. లింగం దొడ్డి కాడికి వెళ్లి పోయిండు. పెద్ద పీటమీద భూమయ్యకు బట్టలేసింది.

ఎంకవ్వ ఉనుక పిడుకతో పొయ్యి కప్పింది. కుంపటి కప్పి మీద రెండుమూడు అగ్గినిపుకలేసింది. కలికుండల నీళ్ళు నింపింది. దాలి గుంటల పిడుకలు కొట్టేసింది. అలుకుడు కుండల ఎర్రమన్ను పోసి నానబెట్టింది.

తెల్లారితే ఆదివారం. పాలకు వారం చెయ్యాలె. వాకిలి సానుపు. పనితీరది. సానుపు కుండలల్ల నీళ్లు నింపింది. బర్రెకు ఉప్పు తౌడుపోసి కుడిది కలిపింది. సలిగటుక ఉంటే కలుపుకొని తాగింది. బిడ్డ ఎప్పడో పండుకుంది. దీపాన్ని నింపి మల్లెసల్ల బిడ్డ పక్కన సాప పరుసుకుని పండుకుంది ఎంకవ్వ.

కన్నుమలిగే ముందు కూడా యాదికచ్చింది సాకలి లచ్చవ్వ మాట. నిజంగా ఈ రోజు అట్టనయాలేనా..? ఎవరిని అడుగాలన్నా ఎవరికి తెలువది. అట్టమినాడు పుట్టిన కృష్ణుడు అట్టకట్టాల పడ్డడుగదా! అనుకుంది. బిడ్డమీద చేతులేసి దగ్గరికి జరుపుకుంది. ఎప్పుడో నిద్రపట్టింది. నిద్రలనే రెండు మూడు సార్లు ఉల్కిపడ్డది ఎంకవ్వ.

## 2

కల్లం బండ మీద సుక్కపొద్దుకే మేలుకయింది ఎంకయ్యకు. నక్కలు కూతలు వెడుతున్నయి. చుట్టూ ఉన్న చెట్ల మీద చిమ్మటలు రోద పెడుతున్నయి. కోడికూతలు వినిపిస్తున్నయి. లేచి కూర్చున్నడు ఎంకయ్య. ఏ కాలంలైనా ఏయాల్ల నైనా ఊరికో పల్లెకో పోతెతప్ప పెయ్యిమీద బనీను ఉండది. బుడ్డ గోశి. నెత్తికి రుమాలు అంతే! నడుముకు పిడుసుట్టుకట్టి పొగాకు రెమ్మలు పిడుసుట్లో దాచుకుంటడు. జకమొక సంచి, సుట్ట నెత్తి రుమాలులో దాచుకుంటడు.

లేచికూర్చుని తడుముకుంటూ నెత్తి రుమాలును అందుకున్నడు ఎంకయ్య. కరుకు సుట్టను జకమొక సంచిని అందుకుని ముట్టిచ్చిండు. గప్పగప్పన నాలుగు దమ్ములు పీల్చి ఉలువకట్టె దగ్గరికి పోయిండు. కట్టె సగం పొతమయింది. ఇంక సగం అట్లనే ఉంది. పొతమైన సగం, రాశి అయింది. నాలుగు తట్టల ఉలువ కాయను కుప్పవోసి కట్టె అందుకుని కొట్టిండు. తెల్లారేసరికి రెండు కుప్పలు పొతమైనయి.

ఈ ఐదెకురాలు చెరువు కింద ఉంటే ఎంత మంచిగుండు. మూడుపూటల బువ్వ తిందుంటిమి. ఇదేగాదు. పెరుమాండ్ల కాడ, వాగవుతల అన్నీ గెరె గుడ్డాలేనాయె. ఆబితాబి భూములే లేకపాయె. ఒక్క భూమి వైనం మీద లేకపాయె. ఎట్లనన్న చెరువు కింద ఎకురం భూమి కొనుక్కోవాలె' అనుకున్నడు ఎంకయ్య.

యాపపుల్ల ఒకటి ఇరిసినోట్లేసుకుని ఇంటికి వచ్చిండు ఎంకయ్య. ఊరు సుక్క పొద్దుకే లేచింది. సుయ్యి సుయ్యి మన్నపాలుపిండే చప్పడు, సానువు చల్లే చప్పుడు, ఆవులు ల్యాగల ఆరుపులు వినిపిస్తున్నయి. ఊరును గీతలు గీచి విడదీస్తున్నట్టు నడుమల





నుంచె మూడు పారే కాలువలు. ఊరు కిందనే ఎప్పుడూ పారే వాగు. ఎండకాలం ఎప్పడో ఒక నెల తప్ప ఎప్పడూ ఊరినిండా నీల్లే.

ఊర్లెకు ఎవలన్నా కొత్త వాళ్లు వస్తే 'మీ ఊర్లె నీళ్లు తాగి బతుకచ్చు' అంటరు.

'ఇంత నీళ్లున్నా నీళ్లు పారే భూమి లేకపాయె. ఏంలాభం.' అనుకున్నడు ఎంకయ్య. అతడి ఆలోచనవేరు. తాను గంజో గటుకనోతాగి బతికిండు. తన బిడ్డనైనా మూడు పూటల బువ్వ తినాలనే కోరిక. పునాస పంటలకు ఎంత కష్టం చేసినా పలితం ఉండది. నీరావ పంటనైతే ఎంత కష్టం చేత్తే అంత పలితం ఉంటది. ఆలోచిస్తూనే ఇంటికి చేరుకున్నడు ఎంకయ్య.

ఎంకయ్యను చూడంగనే తరపి దుడ్డె గుంజుకోనుడు మొదలు వెట్టింది. పండుకొని నెమరేత్తున్న బర్రె లేచి నిర్రదొక్కుకుని నిలవడ్డది. ఎంకవ్వ పొయ్యి దగ్గర పని చేసుకుంటుంది. ఇంకా మసుక మసుకనే ఉంది. చేతులు కడుక్కుని ఇత్తడి సర్వ అందుకుని వస్తూ పీట మీద చూసిండు ఎంకయ్య.

పీట ఖాళీగా ఉంది. బట్టలు మాత్రం పరిచే ఉన్నయి. 'అగో...పొల్లగాడు. లేడు ఎటువోయిండే...'అన్నడు ఎంకయ్య పీట దగ్గెర ఆగి.

'అవుతలికో ఇవుతలికో ఎటువోయిండోతియ్యి' అన్నది ఎంకవ్వ లోపలినుంచే.

'పొల్ల ఇంక లెవ్వలేదా...' మల్లెసల్ల దిక్కు చూసి అడిగిండు.

"లెవ్వలే" చెప్పింది ఎంకవ్వ.

"ఏం గావురం..పొద్దుపొడిచేదాక పంటరా...ముద్దు ముద్దు అవ్వగారు ముద్దంట పిలిత్తే గావురాల అత్తగారు గాడిదంట పిలిచింద్రట. లేపు. లేపి ఏదన్నా పని నేర్పు" అంటూ బర్రెపాకలకు పోయిండు ఎంకయ్య.

పాలు పిండి, బర్రెను సదిరి, కుడిది పోసి, దుడ్డెను కట్టేసి బర్రెను జంగిట్లకు ఇడిసిపెట్టిండు. తల్లి లేపంగ లేపంగ లేచిన ఎల్లవ్వ పెండ తట్ట అందుకొని జంగిడి బర్ల వెంట పరుగు తీసింది.

భూమయ్య ఇగ రాడు అగ రాడు. 'ఎటువాయె ఇంటిమొఖాన పాయెనా ఏంటిది.' అనుకున్నడు ఎంకయ్య. అదే విషయం ఎంకవ్వను అడిగిండు. ఎంకవ్వ గూడా అనుమాన పడ్డది. పనిలోపడి ఎప్పుడు లేచిండో ఎప్పడుపోయిండో చూడలేదన్నది. ఇద్దరూ ఇంటి చుట్టుపక్కల చూసింద్రు. భూమయ్య కనవడలేదు.

పొద్దుపొడిచి మూరెడెక్కింది. జంగిడి ఎంటపోయిన ఎల్లవ్వ తట్టనిండా పెండ నింపుకుని ఏడ్సుకుంట తిరిగి వచ్చింది. తట్టను పెంటలో ఇసిరి కొట్టి కాళ్లు కొట్టుకుంటూ ఇంట్లకు వచ్చి తల్లి మీద వడి ఏడ్చింది.

ఏం జరిగిందో ఎంకవ్వకు అర్థం గాలేదు "ఏందిబిడ్డా...ఏమైందే" అని బుదరకిచ్చి అడిగితే ఎక్కెక్కిపడి ఏడుస్తూ "అందరు నీకు మొగడచ్చిండు...నీకు కర్రె మొగడచ్చిండు

అని ఎక్కిరిత్తంఁడ్రు” అని మల్ల బావురుమంది.

ఎంకయ్యకు నవ్వు ఆగలేదు. ఎంకవ్వనే విసుక్కుంటూ “నీ మొగనింట్ల పీనిగెల్ల. మొగడులేదు మొద్దులేదు ఏడ్వకు” అన్నది. కొంత సేపు ఎగతట్టి ఎల్లవ్వ ఏడుపు మానింది.

“నిన్న పొద్దందాక రెండు పొంటెల ‘గూడ’ వరుసగా పట్టిచ్చిన. పోరనికి దెబ్బకే తరుకు వెట్టినట్టుంది. పత్తకు లేకుంట దెంకపోయిండు” ఎంకయ్య అన్నడు.

“నిజంగా దెంకపోయిండంటవా...”అనుమానంగా అడిగింది ఎంకవ్వ. ఎల్లవ్వ ఇద్దరి మాటలను ఆసక్తిగా వింటుంది.

“పోక యాడున్నడు. ఎటువొయినా ఇదివరకు వత్తుండె. ఇంకా రాలేదంటే యాడుంటడు” అన్నడు.

“భయపడ్డట్టే అయింది” అనుకుంట ఎంకవ్వ, “థూ...యాడనో లండుముండ కొడుకును తెత్తి” అనుకుంట ఎంకయ్య అక్కడి నుంచి వెళ్లిపోయింఁడ్రు. ఎల్లవ్వ చీపురు అందుకుని ఇల్లు ఊడ్సుడు మొదలు వెట్టింది.

ఊడుస్తూ ఊడుస్తూ పీట దగ్గెరికి వచ్చింది. పీటకింద కఁర్రు జోళ్లు పాతసామాన్లున్నయి. ఊడ్సేటప్పుడు అలికేటప్పుడు వీలుగా ఉంటదని గోడకూ పీటకూ నడుమల చీపురు, అలుకుపిడస ఆడే సందు ఉంచింఁడ్రు.

పీటకింద ఊడుత్తున్న ఎల్లవ్వ చీపురుగట్టను ఇసిరికొట్టి తల్లి దగ్గెరికి పరుగెత్తింది. నిన్నటి పెరుగు, పాలను అగ్గి సూరుని ముందు పెట్టి పసుపు కుంకుమ బొట్లు పెట్టి ఆరగింపు చేస్తున్న ఎంకవ్వ కూతురు దిక్కు విసుగ్గా చూసింది.

“అవ్వా...అవ్వా...పీటకింద ఎవలో పన్నరే...”అన్నది ఎల్లవ్వ గుసగుసగా.

ఎంకవ్వకు చిఁత్రమనిపించింది. “ఎవలే...ఎవలుపన్నరే”...అంటూ పీట దగ్గెరికచ్చింది.

పెద్ద పెద్ద కాళ్లు, కాళ్లకు గజ్జులు చందమామలు చెక్కిన టేకు చెక్కల పీట అది. బందవస్తుగుంది. గోడ సందులోంచి ఎప్పడో నిఁద్రల కిందికి జారిండు భూమయ్య. పీటకాలు సందులో ఇరికిండు. కదులరాకుంటా మెదులరాకుంటా ఉంది.

ఎప్పుడో తెల్లారకముందే మేలుకయింది భూమయ్యకు. లెవ్వబోతే లెవ్వరాదు. ఎల్లెనుకల పండుకున్నడు. ఎటు చెయ్యి సాపబోయినా సామాన్లే. అట్లనే కండ్లు తెరిచి చూస్తున్నడు. మాటలన్నీ వినిపిస్తున్నయి. ఏం చెయ్యాలెనో తోచలేదు.

“అయ్యో...పొల్లగాడు పీట సందుల ఇరికిండు....” ఆదుర్థగా అన్నది ఎంకవ్వ. ఎక్కడ దెబ్బ తలిగిందో అని భయంగా ఉంది ఆమెకు. అవ్వ బిడ్డలు ఇద్దరూ చెరోదిక్కు పీటను ఎత్తాలని చూసింఁడ్రు. పీటకింద సామాన్లు బలబలమన్నయి. ఎంకవ్వ దిక్కు లేచిందిగనీ ఎల్లవ్వ దిక్కు లెవ్వలేదు పీట. పీటను దించి బజార్లకు పోయింది ఎంకవ్వ. అప్పటికప్పుడు నలుగురైదుగురు జమయింఁడ్రు. పీటను ఎత్తి పక్కన పెట్టింఁడ్రు.







పీట కింది నుంచి భూమయ్య దులుపుకుంట లేచిండు. బట్టలకు బూజు బల్లిపాతర అంటింది. నెత్తినిండా దుమ్ము, బూజు. ఒకలు బట్టలు దులిపితే ఇంకొకలు నెత్తిదులిపింఁడ్రు.

“అరే... ఇలిటపోడు పీటకింద ఇరికిండురా” ఎవలో అన్నరు నవ్వుతూ.

“అరే..బాగోతులోడు పెంచుకున్నట్టు జుట్టు వెంచుకున్న వేందిరా” ఇంకెవలో అన్నరు. “పోరీ...నీ మొగడు పీటకింద పన్నడే” ఎవలో పరాచికమాడింఁడ్రు. అందరూ నవ్వుడే నవ్వుడు. అప్పుడే వెంకయ్య వచ్చిండు. విషయం తెలుసుకున్నడు. ఎక్కడన్నా దెబ్బ తాకిందేమోనని తడిమి చూసిండు.

“ఇసీ.... పీటకింద వండి సప్పుడు జేత్తలేడే అవ్వా...” ఎల్లవ్వ అన్నది ఎక్కిరిస్తూ.

“అట్లనద్దు బిడ్డా... ఎక్కిరియద్దు” బిడ్డకు చెప్పింది ఎంకవ్వ. మొదలు బయపడింది గని తనకు గూడా నవ్వు ఆగుతలేదు. భూమయ్య నాలెకేసిన మొకం ఎత్తలేదు.

భూమయ్యను ఎంట వెట్టుకుని మంగలివాడకు పోయిండు ఎంకయ్య. శాతమంగలి బాజయ్య. ఈదుల్ల కల్లు తాగిరానిదే కత్తి ముట్టడు బాజయ్య. అందరూ లండు గాడిది కొడుకంటరు.

ఆ రోజు ఇంటి పట్టునే ఉన్నడు బాజయ్య. మంది బాగానే ఉన్నరు. “ఈదుల్లకుపోతే ఇప్పుడు రావు నా ఒక్కని గుండు గొరిగిపో” అన్నరట ఎవలో. ఆగి కలుప అందుకుని గుండుగొరిగిండట బాజయ్య. ఒకలెనుక ఒకలు మంది జమయింఁడ్రు. ఎటూకదులరాలేదు. కల్లు లేక కస్సుబుస్సుమంటుండు.

ఎవలో కత్తి కోసం వత్తే కత్తి మీద కట్నం పెట్టే దాక ఇయ్యనన్నడు. ఇంకెవలో వచ్చి అడిగితే మొండికత్తి ఇచ్చిండు. ఒకలకు మూతి మీద కాటు వెట్టిండు. ఇంకొకలకు గుండు మీద కాటు వెట్టిండు. ఒకలకు జుట్టు లేకుండా గుండు గీసిండు. కల్లుతాగిన కోతిలెక్కనే గంతులేత్తండు.

భూమయ్య వంతు వచ్చింది. ఎప్పుడు జేబుల ఏసుకున్నడో జెల్లపురుగును బాజయ్య. ఆ మాట ఈ మాట మాట్లాడుకుంట మెల్లెగా తెలువకుంట భూమయ్య గోసిలో ఏసిండు.

భూమయ్యకు లోపల జరజరపాకుతుంది. గులగుల మొదలయింది. మెసులుతుంటే “ఏయ్...పిల్లగా...సక్కగకూసో. కత్తి మెత్తగుంది. తెగితే గుండుకు కాట్లువడుతయి” నవ్వును ఆపుకుంటూ బెదిరిత్తుండు బాజయ్య.

భూమయ్య లెవ్వాలని చూస్తున్నడు. అదిమి పట్టి గుండు గీకుతనే ఉన్నడు బాజయ్య. “మెల్లగగీకి....పొలగాడు భయపడేటట్టు గీకవడితివి” ఎవలో అన్నరు.

“పొల్లగానిది నొత్తుంది నీది నొత్తుంది. అపురూపాల పిల్లవుడితే ఆందెంతో ముడ్డి కడిగింఁడ్రట.గుండు గీకితెనే నొత్తే రేపు సంసారమెట్ల జేత్తడు” బాజయ్య అన్నడు.

భూమయ్యకు గోసిల జరజరపాకుతుంది జెల్లపురుగు. గులగులమొదలయింది. ఆపుకోలేకపోయిండు. బాజయ్య చేతుల నుంచి తప్పించుకుని దూరంగా పరుగు తీసి గోసి దులుపుకున్నడు. జెల్లపురుగు రాలిపోలేదు. గోసి మొత్తం ఇడిసి ఎగురుడు దుంకుడు వెట్టిండు. అందరు నవ్వుడేనవ్వుడు. అప్పటికి భూమయ్యకు సగం గుండు గీకుడే అయిపోయింది.

"అరే...ఏమయిందయ్యా... ఎగురుతున్నవు" దగ్గరికి పోయి అడిగిండు ఎంకయ్య. బాజయ్య సంగతి ఎంకయ్యకు తెలుసు. ఏదో ఒకటి చేసి ఉంటాడనుకున్నడు.

ఏడుపు మొహంతో జెల్లపురుగును పట్టి చూపించిండు భూమయ్య. ఎంకయ్యకు కోపమచ్చింది. "ఒరే బాజీగా...కలుపకాడ నువ్వు జూత్తె కల్లంకాడ పొల్లగాడు జూత్తడు. ఇయ్యల్ల ఏకు అనుకుంటున్నవు. రేపు ఏకు వోయి మేకు అయితడు. నీకు నూకుడు నూకుతడు గూటం" అన్నడు.

"ఆ....నేనేమన్న పటేలా.... గోసిల జెల్లపురుగు ఏసుకచ్చిండు. నన్నంటే ఏం లాభం"అన్నడు బాజయ్య నవ్వుతూ.

ఎలితగంప పట్టుకుని గటుక అడుక్కరావడానికి బయటకు వచ్చింది బాలవ్వ. ఎవలైతే సవురం పనికి వత్తరో వాళ్లింటికి గటుకకు పోతుంది. ఎవలు ఏత్తరు ఎవలు ఎయ్యరు చూసుకొని పోతుంది. పోతూ పోతూ "ఇలిటపు అల్లునికి నొయ్యకుంట గీకయో!..ఎంకవ్వ బొబ్బ వెడుతదో..."అన్నది.

ఇంకో సగం గుండుకు రానే రానన్నడు భూమయ్య. బాజయ్యనే గుంజుకచ్చి కూసొ బెట్టి పనికానిచ్చిండు. బోడజుట్టు ముడేసి పంపిండు.

భూమయ్యను వెంట బెట్టుకుని ఇంటికి వచ్చిండు ఎంకయ్య. వస్తూ ఉంటే 'కాందారి' రాజయ్య ఎదురయ్యిండు. కాందారి ఇంటిపేరు గాదు. దొరవారి శాతల పనులన్నీ చూసుకుంటడు. ఎవరెవరికి కౌలుకు ఇచ్చింది, ఎవరెవరు ఎంతెంత కొలిచిందీ లెక్క చూసుకుంటడు. దొర ఎవరో ఎట్లుంటడో ఎవలకూ తెలువది. కాందారి రాజయ్య, శేర్దారి ఎల్లయ్య, పెద్దపాలేరు....వీళ్లదే దొరలంత జులుము.

రాజయ్యను చూడంగనే పక్కకు తప్పుకొని నిలవడ్డడు ఎంకయ్య. ఎదురుగా వెళ్తుంటే భూమయ్యను పక్కకు గుంజి నిలబెట్టిండు.

"ఎవడురా ఎంకా...పోరడు మట్టగజమోలె మంచిగున్నడు" ఆగి అడిగిండు రాజయ్య.

"అయ్యా...ఇలిటపు అల్లుడు. కొత్తగచ్చిండు" అన్నడు ఎంకయ్య.

"ఆహా...ఏ ఊరురా పోరనిది" అడిగిండు రాజయ్య. భూమయ్యను కిందికీ మీదికీ చూస్తూ.





ఊరుపేరు, పేరు చెప్పిండు ఎంకయ్య. రాజయ్య కదుల బోతుంటే ఎంకయ్యనే "చెరువు కింద దొరవారి భూమి కొద్దిగా కౌలుకు చెప్పకపోతివయ్యా" అన్నడు.

మామూలుగా అయితే రాజయ్య అంత తొందరగా వినని మనిషి. అందరూ 'అబ్బో...వట్టి పాపాత్ముడు. పాణం పోంగ తలువద్దు. అంత నానినా నీ అరికాలికింద నానలేదంటడు' అంటరు. ఎంకయ్యకు గూడా అంతనమ్మకమేం లేదు. అడుగాలని అడిగిండు.

రాజయ్యనే ఏ ఆలోచన మీదున్నడో గాని "నేరళ్లపట్టె ఐదెకురాలుంది. అంతా ఆబితాబి పంట. ఒక్కటే కాలువ పారుకం. ఆయిటిమూనినంక పడుతావురా" అన్నడు.

ఎంకయ్యకు పాణం వచ్చినట్టయింది. "ఆ.. పడుతనయ్యా!...అందరికంటే తూమెడు కౌలు ఎక్కువనే పొత్త" అన్నడు.

"నాకు తెలువదారా ఎంకా...నువ్వు ఇమాన్ దారువు. కట్టంపోతువు. నీకు ఇచ్చినంక పంటగాకపోతే పంట దీత్తవు. కోతలమీద కలువు. కాయిదం రాసుకుందాం" అంటూ వెళ్లిపోయిండు.

ఎంకయ్యకు పట్టరాని సంతోషం వచ్చింది. నాలుగు అడుగుల్లో ఇంటికి చేరుకున్నడు. మురిపెంగా భార్యతో "అల్లుడచ్చినయాల్ల పిల్లనిచ్చినయాల్ల అంటరు. పొల్లగాడచ్చిన గడియ మంచిదేనే...కాందారి రాజయ్య అడుగంగనే మాట ఇచ్చిండు". అంటూ విషయమంతా చెప్పి ఇంట్లోకి నడువబోయిండు.

"ఆ...ఆగాగు మంగలోన్ని ముట్టుకొని వచ్చి ఇంట్లకత్తవా...అరుగంచునే ఉండు. ఇక్కడికే నీళ్లుదెత్త. ఇద్దరు తానం జేత్తురు." అన్నది ఎంకవ్వ.

అప్పుడు గుర్తుకచ్చింది ఎంకయ్యకు. తను, భూమయ్య సవురం పని చేయించు కున్నామని. ఇద్దరూ అరుగు అంచున్నేకూసున్నరు. నేరళ్లపట్టే గురించి భార్యకు ఇంకోసారి చెప్పిండు ఎంకయ్య మురిపెంగా.

''మా సాలు తియ్యి. మా చెప్పచ్చినవు. చేటెరుగని బొడ్డి మొగని పెండ్లివోయిందట. అది ఇంతకు ముందు ఎవలు చేత్తున్నరనుకున్నవు? తెనుగు మల్లి మొగడు. వాని చేతుల నుంచి మనం గుంజుకుంటే మల్లి ఊకుంటదా...? ఆడి దాని మంత్రం అగ్గిలవడ్డాపోదట. అది మంచిదిగాదు. నోటివాయి మనిషి.పెడితె తిరుగదట. చెట్లకిరియలత్తయట. చేనద్దుమన్నద్దు." మట్టి కుండల నీళ్లు తెచ్చిపెడుతూ అన్నది విసుగ్గా ఎంకవ్వ.

ఎంకయ్య పాణం జల్లుమంది. తెనుగుమల్లి రూపం కండ్ల ముందు కదిలింది. నుదుటి మీద ఎర్రటికుంకుమ బొట్టు, శిబ్బెడంత శిఖె, చెయ్యెత్తు మనిషి. మారు మానమచ్చింది. మొదటి మొగన్నే మంత్రం చేసి చంపిందంటరు. పాలోల్లందరు గజగజ వణుకుతరు. ఇప్పటికీ ఇంట్ల బొక్కల రాట్నం ఉందంటరు.

"అట్లనా...అందుకే నాకు చెప్పిండు. అబ్బో...కాందారి మామూలు మనిషిగాదు". అన్నడు ఎంకయ్య.

"ఇగో...ముందుగాల్ల నువ్వు చెయ్యి. ఎనుక పొల్లగాడుజేత్తడు. ఒత్తుల నీళ్లు కొద్దినే ఉన్నయి. ఉడుకునీళ్లుపొల్లగానికి వోత్త" అన్నది ఎంకవ్వ. మట్టి ముంత అందుకుని గచ్చులకు దిగిండు ఎంకయ్య.

భూమయ్య అరుగు అంచునే గొగ్గాల్ల మీద కూసున్నడు. పొల్లను ఇంతవరకు చూడలేదు. పొద్దున కనిపించిందిగనీ సరిగ్గా చూడలేదు. ఆగమాగమే అయింది. వాడుగుంజుడు, వీడువట్టుడు, పెద్దలొల్లి. ఇప్పుడైనా చూద్దామని ఇంట్లకు పార జూసిండు. ఎక్కడాలేదు.

'పోరి కొజ్జదే ఉన్నట్టుంది పీటసందుల వడి నేనేడిత్తే ఊరంత ఎరుకజేసింది. జరాగు దీని సంగతి చెప్పుత' అనుకున్నడు.

తలిస్తే మొలిచినట్టు అప్పడే దిడ్డి దర్వాదల కనిపించింది ఎల్లవ్వ. చూస్తచూస్తుండంగనే లేడిపిల్ల లెక్కమాయమయింది. ఎనుక ఊగుతున్న ఎలుకతోక జడనే కనిపించింది. కాళ్లకు  ఎండి కడియాలు మాత్రం కనిపించినయి. మళ్లీ వస్తుందేమోనని చూసిండు భూమయ్య.

"గట్ల గొగ్గాళ్ల మీద కూసోకు. తాశిలితనం. మంచిగ సకుల ముకులం బెట్టుకుని కూసో" గదరాయిస్తున్నట్టు అన్నది ఎంకవ్వ. ఉలిక్కిపడి సదురుకుని కూచున్నడు భూమయ్య.

మట్టిముంతతో బుడ బుడ నాలుగు ముంతలను నెత్తిమీద పోసుకుని పంచె ఇడిసి కొత్త పంచె కట్టుకుని పైకి వచ్చిండు ఎంకయ్య. తర్వాత ఉడుకు నీళ్లను పోసింది ఎంకవ్వ. భూమయ్య తానం చెయ్యంగనే సాప పరిచి ఇద్దరిని కూసోబెట్టింది.

"పొద్దువాయె ఇప్పటికి సగం దొయ్యవారుతుండె. ఎండపొద్దు నీళ్లు కదులయి" అంటూ కంచాన్ని అందుకున్నడు ఎంకయ్య. భూమయ్యకు ఒక కంచాన్ని ఇచ్చింది ఎంకవ్వ. చెరో రెండు పెద్ద పెద్దయి గటుక పెల్లలు ఏసింది. సల్ల బుడ్డి ఉప్పు చిప్ప ముందట పెట్టింది. ఈరోజు గూడా అన్నమే పెడుతుందనుకున్న భూమయ్యకు నిరాశనే ఎదురయింది. గటుక కలుపుకుని జుర్రుడు జుర్రిండు.

అప్పుడే ఎల్లవ్వ ఇంట్లకు వచ్చింది. ఎంకవ్వ ఏదోపని చెప్పింది."నాకేంది...నేను తేనుపో..."అంటూ బయటకు పరుగెత్తింది. ఇద్దరూ లేచి చెయ్యి కడుక్కున్నరు.

భూమయ్యను ఎంటవెట్టుకుని గూడపొక్క దగ్గరికి నడిచిండు ఎంకయ్య. వాకిలి దాటిండోలేదో, ఇంట్లనుంచి వదినె "ముందుగ మురిసినమ్మ పండుగు గుర్తెరుగదట. ఏమో లావు మురుత్తున్న వేందిరా.."అంటుంది కొడుకును తిడుతూ. ఆమాటలు తననే అన్నట్టుగా అనిపించింది ఎంకయ్యకు.





కోట కాలువ దాటిండో లేదో తెనుగు మల్లి మొగడు ఎదురయిండు. వాడు మిర్రి మిర్రి చూసినట్టనిపించింది 'ఎటువొతున్నవురా బాలుగా..' అని తనే మాట్లాడిచ్చిండు.

"ఎటూలేదు. ఏట్లెకు పోవాలె" అన్నడు ఈస్కంగా.

ఇద్దరూ 'గూడ' దగ్గెరికి చేరుకున్నరు. ఒక పొంటె పోసినంక చుట్ట అంటువెట్టుకున్నడు ఎంకయ్య. "పొల్లగానికి చుట్టతాగనేర్పాలె. పనిమీద అలసట ఉంటది" అనుకున్నడు.

భూమయ్య 'గూడ' పొక్కనే చూస్తున్నడు. భూమి పొరకిందనే నీళ్లు. అడుగులోతు కిందనే సముద్రం. ఒక్క అడుగు పైకి ఎక్కాలంటే ఎంతో కష్టం. భూమయ్యకు ఒక ఐడియా వచ్చింది.

"మామా..."అన్నడు. ఆ పిలుపు కొత్తగా అనిపించింది. గొంతు సరిగ్గా పెకలలేదు. ఎంకయ్య మామూలుగా ఏంటిదని అడిగిండు.

"ఇద్దరం కలిసి ఒక్కగూడ ఏత్తున్నంగదా...నీళ్లకేం కరువులేదు. ఇంకోపొక్క తోడుకుని చేరోయాతం పెట్టుకుందాం. చెరోదొయ్య పారియ్యచ్చు" అన్నడు.

'పొల్లగాడు మంచి బుద్ధిమంతుడే' అనుకున్నడు ఎంకయ్య. ఆ మాటలు విన్నంక భూమయ్య మీద ఎంతో నమ్మకం కుదిరింది ఎంకయ్యకు. ఏదో ధైర్యం వచ్చింది.

"ఎందుకయ్యా...ఈ రెండు దొయ్యలు పారక పోతయా...నీళ్లు లోపల ఉండి 'గూడ' కు అందకపోతే నువ్వన్నట్టు యాతం పెట్టుకోవాలె. దోశెడు మన్ను దీత్తే దోశెడు నీళ్లు. యాతమెందుకు? అలుకగ గూడేసుకుందాం. ఇంకో సంగతి తెలుసునా...? మేం ముగ్గురం అన్నదమ్ములం. మాకు మూడు జాగల్ల ఐదేసి ఎకురాల భూమి ఉంది. యాడాదికి ఒక జాగల చేసుకోవాలె. నిరుడు పూల దొయ్యలు చేసిన. ఇప్పడు ఇది. రేపు ఆయిటి ముంగట పెరుమండ్ల కాడ దున్నుకోవాలె. మనం ఇక్కడ ఏం మరమత్తులు చేసినా మనకు ఉండది. మల్లా ఈ చేను రావాలంటే మూడేండ్లు కావాలె" అన్నడు.

"చెరువు పారుకం ఏది లేదా...?"అడిగిండు భూమయ్య.

"లేదు. అదే తండ్లాటున్నది. యాడనన్న ఎకురం దొరికితే తీసుకుంటె మంచిగుండు. యాడ దొరుకుతలేదు" అన్నడు.

ఆ సాలుకు వరుసగ 'గూడ' పొక్కలె. ఆయాల్లకు అందరు 'గూడ' ల మీదనే ఉన్నరు. ఎంకయ్య దగ్గెర పొగాకు కమ్మంగా ఉంటదని అందరికీ తెలుసు. ఇత్తునం ఒక్కటే. అందరు వేసేదే. దాన్ని మాగవెట్టుడే ఒకరకంగా మాగవెడుతడు ఎంకయ్య. అది ఎవలకూ కుదురది. అప్పడప్పడూ వాళ్లు వీళ్లు వచ్చి పొగాకు అడుక్కుంటరు. సుట్ట తాగిపోతరు.

అప్పుడే పొగాకు కొసం మొగురం ఎల్లయ్య వచ్చిండు. మొగురం అంటే ఇంటిపేరు గాదు. ఇంటిపేరు తాడెం. వాళ్ల కులంల నలుగురు ఎల్లయ్యలుంటరు. ఒకలు

పెద్ద ఎల్లయ్య. ఒకలు చిన్న ఎల్లయ్య. ఒకలు కర్రె ఎల్లయ్య. ఈ ఎల్లయ్యకు మాత్రం మొగురం ఎల్లయ్య అని పేరు.

ఒకసారి వీళ్ల నాయిన ఎడ్లకొట్టం కడుతుండట. ఎల్లయ్య కట్టేల్ని పైకి అందిస్తున్నడట. మూలసరం కిందున్న మొగురం వంగి పందిరిమొత్తం ఒకటే దిక్కు జరిగిందట. ఎల్లయ్య మొగురం కిందికి పోయి మూల సరాన్ని ఎత్తి పందిరికి పందిరి ఎత్తుకొని నిలవడ్డడట. అంత బరువు ఎత్తినందుకు అందరూ నోరు తెరిచింఢ్రట. అప్పటికప్పడు కొత్త మొగురాన్ని పెట్టినంక ఎల్లయ్య కప్పును కిందికి దించిండట. అప్పటి నుండి అతని పేరు మొగురం ఎల్లయ్య అయింది.

“ఏంటిదే బావా...మామ అల్లుండ్లు బాగముచ్చట వెడుతున్నరు”? ఎల్లయ్య అడిగిండు.

“చెరువుకింద మనకు భూమి లేదా అని అడుగుతున్నడోయ్” ఎంకయ్య అన్నడు.

“నిన్న వచ్చిండో లేదో ఇయ్యల్ల భూములు అడుగుతున్నడా...జుట్టు చేతికిచ్చి గంతు లేసినట్టు జెయ్యకు. ఇప్పుడే నెత్తిమీదికి ఎక్కించుకుంటే నీ మీద గుర్రమెక్కినట్టు ఎక్కుతడు. ఇంటి దొంగను నమ్మద్దు. ఇలిటపు అల్లున్ని నమ్మద్దు.” అన్నడు ఎల్లయ్య పక్కనే వచ్చి కూర్చుంటు.

“నేనే చెప్తుతున్ననోయ్...ఎక్కడన్నా నీటిపారుకం ఒక ఎకురం తీసుకుందామని. కాని ఆబితాబి పండే భూమి యాడ దొరుకుతది” ఎల్లయ్యకు పొగాకు అందిస్తూ అడిగిండు ఎంకయ్య.

“బావా...పైసలుంటే భూమి కరువయిందా....ఊరుపక్కనే పోశమ్మకాడ ఎకురం భూమి ఉన్నదికొంటవా...?” చుట్టను మలచి నోట్లె పెట్టుకుంట అన్నడు ఎల్లయ్య.

జకమొక కొట్టి దూదిని చుట్టలో పెడుతూ“ యాడిదోయ్ పోశమ్మకాడ. నాకు తెలువని చేను యాడుందోయ్” అన్నడు.

“యాడుంటె నీకేంది...పైసలు పట్టుకొనిరా. చేను దొరుకుతది” అంటూ వెళ్లిపోయిండు ఎల్లయ్య.

“మనిషి మంచోడు కానట్టుంది. పట్టి ఓర్పు మల్లోడు. ఇసోంటోళ్లను నమ్మద్దు” అన్నడు భూమయ్య.

‘గూడ’ వెయ్యడానికి లేస్తూ ‘పొల్లగాడు మనిషిలోతు గూడా సూత్తడు. పిట్ట చిన్నదే గనీ, పీకితే అంతా బూరే అన్నట్టుంది’ అనుకున్నడు ఎంకయ్య.

‘గూడ’ ఏత్తున్నా మనుసంతా ఎల్లయ్య చెప్పిన మాటల మీదనే ఉంది ఎంకయ్యకు. ‘గోజలకు తింటేసత్తువ. మనిషికి ఉంటే సత్తువ. ఆబితాబి పారేపొలం. ఎకురం ఉంటే ఎంత ధైర్యం’ అనుకున్నడు.

ఒక పొంటె యాతం పోసి పగటియాల్ల వరకూ ఇద్దరూ కల్లం బండ మీదికి చేరుకున్నరు. దూపకు బుడ్డెడు సల్లగటుక కలిపి పెట్టింది ఎంకవ్వ. అంచుకు మామిడికాయ తొక్కు.





కడుముంతలల్ల పోసుకుని ఇద్దరు జుర్రుకున్నరు. పగటి పూట ఇద్దరూ ఉలువలను పొతంజేసి రాశిపోసింఢ్రు. మాపటియాల్ల మల్ల ‘గూడ’ ఎయ్యడానికి పోయింఢ్రు.

ఎంకవ్వ లింగంకు ఒకటి, భూమయ్యకు ఒకటి రెండు చెప్పులజోళ్లను ముదువుమని శాత మాదిగోనికి చెప్పింది. ఒక జతమామూలుగా, ఇంకొకటి ఇనుప గుండీలు కుట్టి పనవారు అల్లి సరిపడేంత చెయ్యిమని చెప్పింది.

వారం పదిరోజుల్లో ఊరంతా భూమయ్య పేరు తెలిసిపోయింది. ‘పొల్లతొటకూర ఆకోలె పెరుగుతుంది. పొల్లగాడు నరిగె లెక్కున్నడు. యాడ ఈడయితది’ అంటున్నరు ఊరంతా.

ఈ మాటలు ఎంకయ్య విన్నడు గనీ అట్లనే అనుకుంటరులే అనుకున్నడు. ఎంకవ్వ మాత్రం అంత తేలికగా తీసుకోలేదు. ఎట్లా...ఎట్లా అని బాధపడుతనే ఉంది.

ఒకనాడు ఎడ్లను కొట్టుకుని ఉలువ అడుగు దున్నుదామని పోతుండు ఎంకయ్య. ఎంబడి భూమయ్య పోతున్నడు. రెండు నాగండ్ల కోడెగిత్తలు. భూమయ్య నాగలి ఎట్ల దున్నుతడో తెలువది ఎంకయ్యకు. అందుకే ఈ పని మొదలువెట్టిండు. దొరవారి గడి ముందు నుంచే తొవ్వ. ఏడూర్ల పెత్తనం దొరది.

దొరకు గూడా ఒక్కతే బిడ్డ. అక్కకొడుకును ఇలిటం తెచ్చుకున్నడట. అనుకొనుడే గానీ ఎప్పుడూ ఎవలూ చూసి ఎరుగరు. కాందారి రాజయ్య లాంటివాళ్లు ఏ కొద్ది మందో చూసినా జరిగే సంగతు లేవి తెలువయి. గడిముందు నుంచి వెళ్తుంటే కాందారి రాజయ్య ఆగమాగాన అటూ ఇటూ తిరుగుతూ కనిపించిండు ఎంకయ్యకు.

“ఎందుకు...? ఏమైందని ఆగమాగం తిరుగుతున్నవు” కాందారిని అడిగిండు. దొరగారువస్తున్నరని చెప్పిండు. కాందారి. దొరకు కబడ్డీ అంటే ఇష్టం. వచ్చినప్పడల్లా కబడ్డీ(తొక్క) ఆడిస్తడు. ఆ విషయం ఎంకయ్యకు తెలుసు.

“ఎన్ని రోజులుంటడయ్యా...తొక్క గిట్ల ఆడిత్తడా..?” అడిగిండు ఎంకయ్య. ‘ఆ..ఆడిత్తడు’ అంటూ తనపనిలో మునిగిపోయిండు కాందారి రాజయ్య.

భూమయ్యకు దొరనే తెలువది. ఇంకా తొక్క సంగతి అంతకంటే తెలువది. తను ఊర్లె ఉన్నప్పుడు మాత్రం దొంతి దొరగురించి విన్నడు. అంతే! తొక్క ఆట ఏంటిదో దొర ఎవలో చూడాలనిపించింది.

భూమయ్యది ఎనుక నాగలి. నాగలి దున్నతున్నా మనసు తొక్క మీదనే ఉంది. కొంతసేపు దున్నిండు. ఎంకయ్య సుట్ట కోసం నాగలి ఆపంగనే బయటపడ్డడు. చెప్పలేదు చెయ్యలేదు. గుట్ట దిక్కుపోతుంటే ఆవుతలికి పోతుండనుకున్నడు ఎంకయ్య. గుట్టసుట్టు తిరిగి చెరువు కట్ట తొవ్వ ఎక్కి ఊర్లె వడ్డడు భూమయ్య.

అప్పటికి జనం గడి నిండింఢ్రు. అంతా దొరను చూడవచ్చినోల్లే. అంత జనం ఉన్నా పల్లెత్తు మాట వినబడుతలేదు. నెత్తి రుమాలు తీసి నడుముకు కట్టుకున్నరు.

దూరం నుంచే వంగి వంగి చూస్తున్నరు. పెరట్లోతొక్క ఆడుతున్నరు. పెద్ద చింతచెట్టు కింద దొర కూసున్నడు. భూమయ్య సక్కగ తొక్క ఆడే దగ్గెరికి పోయిండు.

ఆట పెద్ద పెద్దోల్లే ఆడుతున్నరు. నడుమల ఒక బాత గీచింద్రు అటోక బాత ఇటోక బాత. తొక్క...తొక్క తొక్క...అనుకుంట దమ్ము తీయకుంట ఎవలకు దొరుకకుంట బాత తొక్కిరావాలె. ఎవలకు దొరుకకుంటా ఎవలనన్నాకొట్టివత్తే వాడు సచ్చినట్టె. అటే దొరుకవడితే వీడు సచ్చినట్టే.

పొడువుకాళ్ల రాజయ్య ఆట తేజుగా ఆడుతున్నడు. వచ్చినోన్ని వచ్చినట్టు పడుతున్నడు. అడుగు జరుగనిత్తలేడు. అటుదిక్కు పోయిండంటే ఎవలకూ దొరుకుతలేడు. ఎందరు వట్టినా అందక బాతను అందుకుంటుండు.

"అరే...రాజిగాన్ని పట్టే మొగోడే లేడారా ఊర్లే" అంటుండు దొర.

దొర మాటలు విన్నంక అందరికి రేషమచ్చింది. రాజయ్య మరీ రెచ్చి పోయిండు. తొక్క తొక్క తొక్క అనుకుంట ఒక్కొక్కన్ని ఇసురుడు ఇసురుతున్నడు. మనిషి పొడువుగా బలంగా ఉన్నడు. ఎక్కడోల్లక్కడ ఉరుకుడు ఉరుకుతంద్రు.కొద్ది సేపు చూసే వరకే ఆట పట్టు దొరికిపోయింది భూమయ్యకు.

"ఏ..అడిగుట్లోల్ల లెక్క ఉరుకుతున్నరు...పట్టత్తలేదా...పట్టుంద్రి. కాళ్లల్ల సొర్రుంద్రి." గట్టిగా అన్నడు భూమయ్య.

ఆ మాటలు దొర చెవుల వడ్డయి. "ఎవడురావాడు?" అన్నడు దొర.

"ఎంకని అల్లుడు దొర" అన్నరు దగ్గెర ఉన్నోల్లు.

"వాన్ని ఆటలకు దించుంద్రిరా" అన్నడుదొర.

ఎవలో ఉరికచ్చి "నువ్వు ఆడుతావోయ్ పిల్లగా" అని అడిగింద్రు భూమయ్యను.

"ఏ..గిది ఆడరాదా" అన్నడు భూమయ్య.

ఆటలకు దిగుమన్నరు. భూమయ్య దిగిండు.

తొక్క తొక్క తొక్క అని సంటర్ బాత నుంచి మొదలు వెట్టిండు. 'ఏ...గీ పోరడెంత?' అనుకున్నడు రాజయ్య. కొద్దిగా లోపలికి రానిచ్చి అడ్డం తిరిగిండు. భూమయ్య ఒకని ఈపుల సరుపు సరిచి రాజయ్య కాళ్ల సందుల నుంచి అవుతల వడ్డడు.

"అరే...పోరడు బలే తప్పుకున్నడురా" అన్నరు అందరు. ఇంతవరకు రాజయ్య చేతుల నుంచి ఎవడూ తప్పించుకోలేదు. రాజయ్యకు కోపమచ్చింది. పైలు మీద పైలుగొట్టిండు. తొక్క తొక్క అనుకుంట భూమయ్య ఎంటనే ఉరికచ్చిండు. ఈపుల ఒక్కటి ఉతికి ఎనుకకు మర్రిండు.

"అబ్బ! దెబ్బకు దెబ్బ తీసిందురా. రాజిగాడు మామూలోడా? వాడు ఊకుంటాడురా" అన్నరు చూసేటోల్లు. కండ్లు మూసి తెరిత్తే తప్పించుకుని పోయేటోడే రాజయ్య. భూమయ్య ఎంటనే ఎనుకకు తిరిగిండు రాజయ్య రెండు కాళ్లు అందుకున్నడు.





రాజయ్యకు కదులరాలేదు. బొక్కబోర్లపడ్డడు. రెండు కాళ్లు అందుకుని గొర్రగొర్ర గుంజిందు భూమయ్య. ఇంతలనే మిగిలిన వాళ్లు వచ్చి రాజయ్యను కదులకుంట అందుకున్నరు.

"అరే..రాజిగానికి మిండెడు పుట్టిండురా" అన్నరు అందరు.

మల్లా భూమయ్యనే తోలింద్రు. ఈ సారి భూమయ్య శక్తిని అంచనా వేసి పద్ధతి మార్చింద్రు. కొద్దిగా లోపలికి తీసుకుని కాళ్లను అందుకోనుపోయింద్రు. ఒకని ఈపు మీద చెయ్యి వెట్టి నిలువెత్తు ఎగిరి బాతమీద దుంకిండు భూమయ్య.

"అరే..పోరడు ఉషారున్నడు. వాన్ని పట్టుకరాంద్రిరా..." అన్నడు దొర.

దొరజవాన్లు ఉరికి భూమయ్యను అందుకుని పట్టుకత్తుంద్రు. భూమయ్యకు భయమయింది. ఇద్దరు జవాన్లను దులుపరిచ్చి ఒక్కటే ఉరుకందుకున్నడు. ఎవలు అడ్డం తిరిగినా ఆగలేదు. ఎవలో పాటాకులను మూసింద్రు. అమాంతం పాటకు మీది నుంచి దుంకి అవుతల వడ్డడు భూమయ్య. అప్పటికి పొద్దు గూకుతుంది. సక్కగ చెరువు కొమ్ము ఎక్కి కట్టమధ్యల ఉన్న మర్రి చెట్టు ఎక్కి జాక్కున్నడు.

ఇక్కడ ఎంకయ్యకు చూసి చూసి యాట్టకచ్చింది. 'పోరనిపీసునెగొడుదు. నడీమల్లె నాగలిడిసిపాయె. వంగుదొంగుల పనోడే ఉన్నడు. ఒత్తుపాటి పనైతే ఓర్వనట్టుంది. వీడు నెగిలి కొనముదుతాడు?'అనుకున్నడు. పొద్దు గూకేదాక ఒక్కడే దున్ని దొడ్ల గడ్డకు చేరుకున్నంక అసలు సంగతి తెలిసింది.

'ఎటువాయె...ఎటువాయె' నని చెట్టుగుట్ట అంత వెతికిండు.భూమయ్య యాడ దొరుకలేదు. కల్లంబండ మీదికి పోయి పండుకున్నంక నడిజామురాత్రి భయపడుకుంట బండ దగ్గరికి పోయిండు భూమయ్య. అప్పటికి ఎంకయ్య ఇంక నిద్ర పోనేలేదు. భూమయ్యను భయపడద్దని చెప్పిండు. అదే రాత్రి ఇంటికి తోలుకుని వచ్చిండు. సల్ల గటుక కలిపిపెడితే దూపకు బుద్దెడు సల్లతాగిండు భూమయ్య.

ఎంకయ్య నోరు ఎత్తలేదుగనీ ఎంకవ్వనే లొల్లికెత్తుకుంది. 'నడి మల్లె నాగలి ఇడిచిపోతే దున్నుడు ఏం గావాలె' అని తిట్టింది. 'నా ఇంట్ల ఇట్లనడువది. సక్కగ కట్టం జేసుకుంటేనే ఉండాలె. లేకుంటే లేదు' అన్నది.

భూమయ్య నోరు తెరువలేదు. గొంగడి బొంత పరుచుకుని నిద్రదొక్కి పండుకున్నడు.

## 3

వరికోత వట్టింద్రు. పొద్దుగల్లనే తట్టెడు బొగ్గుల్ని మూడు కొడండ్లను ఎత్తుకొని కమ్మరి కొలిమి దగ్గరికి పోయిండు ఎంకయ్య. "కొడలి పిడులు మంచిగ లేవని చేయించుక రమ్మన్నది" ఎంకవ్వ.

కమ్మరి కిట్టయ్య ఇంకా లెవ్వనేలేదు. ఎంకయ్యనే లేపిండు. లేచిన కిట్టయ్య కాలువ దిక్కు పరుగందుకున్నడు. వచ్చి తానం జేసి కొలిమికి బొట్టు వెట్టి ఇంట్లనుంచి

అగ్గి తెచ్చేసరికి పొద్దు పొడిచింది.

"నీ బరుకతి దక్క పీసునేగొడుదు...కొలిమి అంటువెట్టే వరకే పొద్దువొడిచె. నేను ఎప్పుడు పోవాలె, ఎప్పుడు కోతవట్టాలె" అన్నడు ఎంకయ్య యాష్టపడుతూ.

"నాకు బరుకతి ఎక్కడిది బిడ్డా...పొద్దుగల్ల లెవ్వంగనే బూడిది మొఖం చూసుడేనాయె, నా పెయ్యి నిండా బూడిదేనాయె. నా బట్టలు దులిపితే బూడిది రాలుతది. నీబట్టలు దులిపితే గింజలు రాలుతయి." అన్నడు కిట్టయ్య.

కొడండ్లను సరిపిచ్చి పిడులు దిగేసినంక"ఈయేడు వడ్లకట్టలకు వత్త బిడ్డా" అన్నడు కిట్టయ్య.

"రా నాయినా...నీకు లేదంటానే" అన్నడు ఎంకయ్య.

"పొల్లగాడు ఏమంటుండు బిడ్డా. పని మంచిగ జేత్తండా.." అడిగిండు కిట్టయ్య. "ఏదోనాయినా..అవ్వ ఏడ్వంగ బిడ్డ ఏడ్సినట్టు జేత్తడు. తర్రనో బుర్రనో తన చేనుపండాలె. ఎడ్డోడో గుడ్డోడో తన కడుపు పండాలెగనీ ఒకల ఇంటి కొడుకు మనకు అయితడా..' అన్నడు బాధగా ఎంకయ్య.

కిట్టయ్య సంగతి ఇదే. ఒక్కతే బిడ్డ. ఇలిటం తెచ్చుకున్నడు. ఒక కొడుకు పుట్టినంక అల్లుడు అలిగిపొయిండు. యాడాది దాటింది. ఇంటికి రానేలేదు.

కిట్టయ్య గూడా బాధపడుతు "అంతే బిడ్డా...పరాయి పిల్లకు గాజులు వెడితే పైసలు చేటు బమలు చేటు" అన్నడు.

అక్కడి నుంచి బరువుగా కదిలి వడ్లదాతి దగ్గరికి పోయిండు ఎంకయ్య. వడ్ల బాలయ్య దాతిమోపుమీద కూసుండి గొడ్డలి కామలను చెక్కుతున్నడు. దాతి దగ్గర ఇద్దరు ముగ్గురున్నరు.

ఎంకయ్య దాతి దగ్గరికి పోంగనే చేతులపని పక్కకు వెట్టి ఎంకయ్య కొడండ్లను అందుకున్నడు. మిగిలిన వాళ్లు గుర్రుగా జూసింద్రు. తమ పని పక్కకు పెట్టి ఎంకయ్య కొండండ్లు ఎందుకు అందుకున్నవని అడిగింద్రు.

"పెట్టిన తల్లిని పెట్టని తల్లిని ఒక రకంగనే చూత్తరా...మీరు వడ్లు పండిచ్చే దొరలు. కానీ మీ కల్లము కాడికి వత్తే ఇసిరిసిరికొడుతరు. ఎంకయ్య కల్లం దగ్గరికి పోతే మక్కలు జొన్నలు ఏది పండితే అది అంచెనిండ పెడుతడు. సుట్టల పొగాకు పెట్టి తాగుమని ఇత్తడు" అన్నడు కోపంగా వడ్ల బాలయ్య.

కొడలి పిడులు చెక్కంగనే పట్టుకుని ఇంటికి వచ్చింద్రు ఎంకయ్య. అప్పటికి ఎరుకలి గంపలో దూపకు బుడ్లను సదురుకుని ఎదురు చూస్తుంది ఎంకవ్వ. చూసి చూసి భూమయ్యను అంతకు ముందే పొలం దగ్గరికి పంపింది.

"నీ పని పాడుగాను ఏమాయె...అటే పోతివి దున్నంగవొయి దులుపంగ వత్తివి.





ఈడనే అంబటాల్ల దాటే. ఎప్పుడు పోతవు ఎప్పుడు కోత్తవు" అన్నది యాష్టపడుతూ ఎంకవ్వ.

"నేనేంజెయ్యాలె. రానే వడితి. కొలిమి దగ్గరనే లేటయింది" అన్నడు ఎంకయ్య. నిలవడి నిలవడి కంచు తలెడు గటుక తాగి మూతి తుడుసుకుంట బయటకచ్చిండు ఎంకయ్య.

ఎంకవ్వ గులుక్కుంట గులుక్కుంటనే 'నిన్ననే సరిపిచ్చుకరమ్మన్న. నిన్ననే కోతపిడికిల్లు పట్టియ్యిమన్న. నేను చెప్పితే నీకు చెవ్వు మీద పేను వారది." అంటూ "ఎల్లా" అని బిడ్డెను పిలిచింది.

ఎల్లవ్వ "అవ్వా" అని వచ్చింది. ఒక కొడలిని బిడ్డ చేతుకుఇచ్చి "ముందట నడుపు బిడ్డా కోతపిడికిళ్లు వట్టాలె" అన్నది. ఎల్లవ్వ కొడలి అందుకుని ముందట నడిచింది.

"ఎవ్వలు మాట్లాడిచ్చినా మాట్లాడకు. నాలెకు మొఖమేసుకుని పోవాలె" అన్నది ఎంకవ్వ ఇంటికి తాళం ఏస్తూ. ఎంకయ్య గూడా ఎనుకకు చిక్కి బిడ్డను ముందట నడువుమన్నడు.

ఏ కొత్త పనైనా బిడ్డతోనే చేయించడం అలవాటు. అలుకుడు, కోత అన్నీ ఎల్లవ్వతోనే మొదలు వెడుతరు. ఎల్లవ్వ ఐదుపిడికిళ్లు కోత కోసి పైకి ఎక్కినంకనే వీళ్లు పొలంలకు దిగుతరు.

ముగ్గురూ పొలం దగ్గరికి చేరుకున్నరు. అప్పటికే పొలంలకు దిగిండు భూమయ్య. ఇంటి నుండి వస్తూ పీటకింది నుంచి మొండి కొడలిని పట్టుకచ్చిండు. దిగుడు దిగుడే మొదటి మడిలకు దిగి మునుము వట్టి కోత మొదలు వెట్టిండు. వీళ్లు పోయేసరికి సగం మునుము కోసి మెదలు వేసిండు.

అది జూసి ఎంకవ్వ తోకతొక్కిన పాము లెక్కనే లేచింది. "బరుకతి దక్కోడా..నిన్ను ఎవలు దిగుమన్నరు. ఎవలు కొయ్యిమన్నరు...'' అంటూ తిట్లు మొదలువెట్టింది. ఎంకయ్యకు ఏంచెయ్యాలో తోచక ఒడ్డుమీదనే నిలవడ్డడు.

భూమయ్య కొడలిని కింద వెట్టి లేచి నిలవడ్డడు. ఎందుకు తిడుతున్నరో...ఏం చెయ్యాలెనో అర్థంకాలేదు. ఎంకవ్వ మాటలు విని తొవ్వ పొంటపోతున్న ఇద్దరు ముగ్గురు జమగూడింద్రు. విషయం తెలియక ఏం జరిగిందని అడిగింద్రు. భూమయ్య ఏం చేసిండో చెప్పినంక "అయ్యో!.. గట్ల చెయ్యగూడది. బరుకతుండది. కోత పిడికిళ్లు పట్టకుండా కోతలకు దిగుతరా" అన్నరు.

అటుతిట్టి ఇటుతిట్టి కోతకు వంగింది ఎంకవ్వ. తన పని తప్పినందుకు చెప్పకుంటనే ఇంటికి పరుగు తీసింది ఎల్లవ్వ. కొత్త కొడలి అందుకుని కోతకు వంగిండు ఎంకయ్య. భూమయ్య అదే మొండి కొడలిని అందుకుని కోస్తున్నడు. ఎర్రటి ఎండ.

'గూడ' పొక్కల నీటిమట్టం తగ్గినా ఊరుతనే ఉన్నయి. పెద్ద ఒడ్డు మీద కానుగు చెట్టు. చెట్టు కింద నీటి చెలిమె. సల్లటి నీళ్లు. దూపార తాగుతూ మయ్యర మయ్యర కోత కోస్తున్నడు భూమయ్య. కొడలి పదును లేక కర్రలు తెగడంలేదు. గట్టిగా గుంజితే ఏర్లకు ఏర్లు మట్టితో పీక్కుని వస్తున్నయి.

వడ్లు తక్కువ పండుతయని ఎంకవ్వ భయం. తాప తాపకు కట్టమైసమ్మకు మొక్కుకుంటుంది. అనుమండ్లకు మొక్కుకుంటుంది. ఎంకయ్య భయం గూడా అదే! ఎవలకూ పగటిపూట తిండే యాదికి రాలేదు. పాలాకుల వడ్లవరి నడుమెత్తు పెరిగింది. జానెడు జానెడు గొలుక.

పొద్దుగూకే సరికే కోత అయిపోయింది. చేను నిండా మెదలు. పొద్దంతా రెండు మూడు సార్లు సుట్టకు లేచే ఎంకయ్య ఒక్కసారి సుట్టకు లెవ్వలేదు. ఒకలతో ఒకలు మాట్లాడుకోలేదు. కనీసం ఇంకో కొడలి తీసుకొమ్మని కూడా చెప్పలేదు భూమయ్యకు. భూమయ్య మొండి కొడలితోనే కోతకోసిండు.

మరునాడు వరిమెద వక్కింది. మూడవనాడు మెద గట్టి కుప్ప వెట్టిండ్రు. మెద మోసేటప్పుడు వచ్చిన వడ్లకమ్మరోళ్లకు రెండు రెండు కట్టలు ఇచ్చిండు ఎంకయ్య. చిన్న చిన్న కట్టలు ఇయ్యిమని సైగ చేసింది ఎంకవ్వ. ఎంకయ్య పట్టించుకోలేదు.

ఎల్లవ్వ పరిగె ఏరుకోడానికి వచ్చింది. లంగను గోసిపోసుకుని వడ్ల గొలుకల్ని ఏరుకుని గోసి నింపుకుంది. రెండుమడ్లను నాలుగుసార్లు కలేతిరిగి వడ్లు నలుసుకుని ఇంటికి పోయింది.

భూమయ్యకు భయం భయంగా ఉంది. వడ్లు తక్కువైతే మాత్రం తిట్లు తప్పయి అనుకున్నడు. నాలుగవ నాడు సుక్క పొద్దుకే కుప్ప కొట్టుడు మొదలయింది. ఎంకయ్య కుప్పగొట్టుడు, ఎంకవ్వ కట్టలు తీసి కట్టలు ఏసుడు. భూమయ్య కొట్టిన కట్టలను కుప్ప పెట్టుడు.

కుప్ప మీదనే నిద్రవస్తుంది భూమయ్యకు. కూరుపట్లు గుక్కుతున్నడు. కుప్ప ఎత్తుపెరిగి నంక కొట్టిన కట్టలను పైకి ఇసిరికొడుతున్నడు ఎంకయ్య. ఒక్కొక్కసారి కట్టలు భూమయ్య మొఖానికి తాకుతున్నయి. వరికర్రలు కోసుకపోతున్నయి. వీటన్నింటి కంటే భయపెట్టే విషయం వడ్లు తక్కువ అయితయని.

తెల్లారేసరికి కొట్టుడు పూర్తయింది. చాటలతో ఎగవోసుడు మొదలు వెట్టిండ్రు. ఎంకయ్య ఎగవోస్తుంటే భూమయ్య అందిస్తున్నడు. ఎంకవ్వ జోరబొంతను నెత్తిమీద కప్పుకుని రాశికింది పొల్లు పొలకట్టును దూరం గొడుతుంది. రెండు జాముల వరకు రాశి జేసిండ్రు.

ఎంకయ్య చేతి సైగతోనే భూమయ్యను కల్లం అవుతల నిలవడుమని చివరి చాటను అందుకుని "రామన్న లచ్చన్నా ....మాదన్న గోపన్నా..పంచ పాండువలిచ్చిన





చాలా బరుకతి. పులిగోరిగా.." అంటూ చాటతో వడ్లను ఎగబోసి, వడ్ల పొత్తి చుట్టి రాశి చుట్టూ తిరిగి రాశి మీద నామాలు గీసిండు. బోదరాశి ఉండద్దని రాశిమీద కొట్టిన వడ్లకట్ట ఏసిండు.

మొక్కే దేవుండ్లదరికి మొక్కింది ఎంకవ్వ. వడ్లను గొంగడి ముల్లెలుగట్టిండు ఎంకయ్య. చిన్న ముల్లే భూమయ్యకు, పెద్ద ముల్లే ఎంకయ్యకు, మూడు సార్లు మోసిండ్రు. కల్లంల సగం ముల్లెడు వడ్లు మిగిలినయి. ఎంకయ్య తృప్తిగా చుట్ట ముట్టిచ్చిండు. అప్పుడుగాని గుండె దడ తగ్గలేదు భూమయ్యకు.

"ఇంత పంట ఎప్పుడు పండలేదు.." మురిపాన్ని ఆపుకోలేక అన్నడు ఎంకయ్య. ఎంకవ్వ మాత్రం నోరు తెరువలేదు. చీపురును మర్రేసి కల్లంలకు గింజగింజనూ గుల్లలకు ఎత్తుకుంది.

ఆ రోజు రాత్రి అన్నం వండింది ఎంకవ్వ. వట్టి అన్నంగాదు జేజ బువ్వ. అన్నంల పసుపు ఏసింది. పప్పు, పచ్చిపులుసు చేసింది.

కడుపునిండా తిన్నడు భూమయ్య. ఈ మధ్య లింగంతో సోపతి ఎక్కువయింది. అప్పుడప్పుడూ మామసాటుకు పొగాకు రెమ్మల్ని లింగంకు ఇత్తున్నడు భూమయ్య. పొగాకు కోసమే భూమయ్యతో ఉంటున్నడు లింగం. తనకు పొగాకు కరువుండదని భూమయ్యకు సుట్టతాగుడు నేర్పిండు లింగం.

గుండురాయి కింద అనుగవెట్టిన రెండు మోతుకాకులను రెండు పొగాకు రెమ్మలను జేబుల వెట్టుకుని గొంగడి బొంత భుజాన ఏసుకుని చెప్పులేసుకుని ఎడ్ల కొట్టం దగ్గెరికి పోయిండు భూమయ్య. ఈ మధ్య పడక, ఎడ్ల కొట్టంకు మారింది. లాగు తొడిగిన ఏ పోరడైనా రాత్రిపూట ఎడ్ల కొట్టం దగ్గరనే కనిపిత్తడు.

"లింగా..ఈయేడు వడ్లు బాగ పండినయటరా...మా మామ అన్నడు. మొన్న కోత వట్టిన్నాడు ఎరికేగదా! నన్ను తిట్టుడేగాదు" గొంగడి పరుచుకుని అన్నడు భూమయ్య.

"పటేలా..మోచేతుల బలముంటే మొండి గొడ్డలైనా తెగుతది. భూమిల బలముంటే ఏ పంటనైనా పండుతది." లింగం అన్నడు.

"మా మామ మంచోడురా లింగా...తిడితె రెండు తిడుతడు. పెడితె కడుపునిండ వెడుతడు. మా అత్తనే రౌతుల మక్కిత్తును నలిపినట్టు నలుత్తది" బాధగా అన్నడు భూమయ్య.

"అట్లేం గాదు పటేలా...ఎంకవ్వది బారీగుణం. తల్లి నాకు ఎప్పుడూ కడుపు జూత్తది. నాకు ఇరుసబుద్ది వడ్లు వెడుతనన్నది" అన్నడు సంబూరంగా లింగం.

భూమయ్య చుట్ట తాగుతూ గొంగడి మీద కూసున్నడు.

"ఎప్పుడు ఇట్లనే పంట పండితే ఎంత మంచిగుండు" అన్నడు లింగం.

"ఎందుకు పండదిరా...పంటగాకపోతే పంట దీస్తచూడు" భూమయ్య అన్నడు. మామ చెరువు కింద పారుకం కొంటననడంతో ఈ భూమిని గూడా చెరువుకింది పారుకం

లెక్కనే రెండు పంటల భూమిని చెయ్యాలని పట్టుదల పెరిగింది.

ఆ రాత్రి భూమయ్యకు నిద్ర పట్టలేదు. 'ఊరు చుట్టూ నీళ్లున్నయి. అడుగు లోతుల ఊటలున్నయి. వడ్ల పంట ఎందుకు తియ్యరాదు? వరి బువ్వ ఎంత కమ్మగుంటది. కూరకలుపుకుని తింటే ఎంత మంచిగుంటది. మక్కగటుక రొట్టెకు ఈ రుచిరాదు. తిన్నట్టే ఉండది. మక్కలు ఎక్కువ పండుతున్నయి గాబట్టి గటుక తింటున్నం. వడ్లు ఎక్కువ పండితే గటుక ఎందుకు తింటం? బువ్వనే తింటం.' అనుకున్నడు భూమయ్య.

"ఏదో ఒకటి చెయ్యాలె. వడ్ల పంట మాత్రం తియ్యాలె" అనుకున్నడు. నిద్రపట్టి మేల్కొయింది. నిద్రలో అన్ని వడ్ల రాశులే కనిపించినయి. మల్ల నిద్రరాలేదు. తెల్లారిందను కున్నడు. గొంగడి ముడిచి కొప్పెర పెట్టుకుని కల్లం బండ మీదికి నడిచిండు. ఎన్నీలసాలు. పిండి చల్లినట్లు ఎన్నీల.

అప్పటికి ఎంకయ్య గుర్రు కొడుతున్నడు. "మామా...మామా" అనిపిలిచి లేపిండు భూమయ్య. ఎంకయ్య లేచి చుక్కలు చూసి "నడిజామురాత్రి ఎందుకచ్చినవు పందు" అన్నడు.

"ఈసారి మనపాలుకు పెరుమండ్లకాడ వత్తదా...వాగవుతలవత్తదా" అన్నడు. పక్కనే గొంగడి పరుచుకొని భూమయ్య.

"ఈసారి వాగవుతలనే వత్తది" అన్నడు ఎంకయ్య.

"అయితే వాగవుతల చింతపువ్వు కార్తి వట్టివరి అలుకుదాం. రెండుయాతాలు పెట్టుకుందాం. నాలుగు దొయ్యలు అలుకుదాం. అయిటిమూని ఒకటిరెండు కార్తులు దాటే వరకు కోతకత్తది. కోసి దున్ని మక్కలు అలుకచ్చు. లేకుంటే మల్లా వరి ఎయ్యచ్చు" అన్నడు.

ఈ మాటలు వినంగనే ఎంకయ్యకు నిద్ర ఎక్కడికో పోయింది. చుట్ట అంటు వెట్టుకున్నడు. కొద్ది సేపు ఆలోచించి "వరి అలుకాలంటే భూమి బురుదగావాలె. ఇది ఎండకాలం. ఎంత యాతం పోసినా నీళ్లు నిలువయి. కట్టెతొక్కాలె, పెండవొయ్యాలె, మొలుకగట్టి అలుకుడు జెయ్యాలె. పొద్దుమాపు నీళ్లు నిలువ ఉండాలె. వరి పంట అంటే వట్టిగగాదు" అన్నడు.

భూమయ్య సల్లవడ్డడు. అయినా తన ప్రయత్నంగా "ఎందుకు మామా...ఒక్కసారి భూమిని తడిపి పొట్టుపొట్టుదున్ని వట్టివరి అలుకుదాం. మొలుకకు బదులు వడ్లనే సల్లుదాం. భూమి పదనకు అట్లనే లేత్తది. తరువాత కలుపు తీసి మొలువని జాగల మొలుకలు వెట్టి నాటేద్దాం" అన్నడు.

కొంత సేపు మౌనంగా ఉండి చుట్టను ఆర్పి రుమాలులో చెక్కుకొని " అట్లజేత్తే ఒక్కగింజ కూడా పండది. దేనికైనా ఓ పద్ధతి ఉంటది." అన్నడు ఎంకయ్య.

'చెయ్యనే చెయ్యాలె. పంటను తియ్యాలె' అనుకున్నడు భూమయ్య. గొంగడి





ముడుసుకుని పన్నడు గానీ నిద్రపడుతలేదు. తెల్లారక ముందే వాగవుతలి పొలం దగ్గరికి పోయిండు భూమయ్య.

ఎర్రటి ఎండకాలంల వాగుల మోకాలుమంటి నీళ్లు పారుతున్నయి. 'నీయవ్వ... వాగుకుయాతం బెడితే అద్దెకురం పారియ్యచ్చు' అనుకున్నడు భూమయ్య. వాగవుతలి పొలం చేరుకుని చూసిండు.

అక్కడ 'గూడ' పొక్కనే ఉంది. పొక్కల నీళ్లున్నయిగని లోతుల ఉన్నయి. ఒక వానపడితే అందుతయిగని, ఇప్పుడు మాత్రం గూడకు అందయి. రెండు మడ్లల్ల వరి కొయ్యకాలు. మిగిలిన మడ్లల్ల మక్క జొన్న, నువ్వు కొయ్యకాలుంది.

దొడ్డి దగ్గరికి వచ్చి పాతది గుమ్మి బొత్తను ఏరుకుని పక్కన వెట్టుకున్నడు భూమయ్య. ఈపని రాత్రిపూటనే జరుగాలనుకున్నడు. ఒకనాడు రాత్రంతా గుమ్మితో ఎరువును మోసి రెండు మడ్లునింపిండు. ఇంకోనాడు రాత్రి తట్టతో పంచిపోసిండు. ఇంకొనాడు యాతం కోసం గుంజను, దోనిని, మేకును, షిడిని, బొక్కెన శీలలు, పబ్బతులను తయారు జేసుకున్నడు.

అసలు సంగతి యాతం బొక్కెన దగ్గెర వచ్చింది. బొక్కెన తన దగ్గెరలేదు. ఊర్లెయాతాలే లెవ్వు. తమ ఊర్లైనైతే ఇంటికొక్క యాతం బొక్కెన ఉంది. ఒకనాడు బాగా ఆలోచించిండు భూమయ్య. ఇంకోనాడు రాత్రికి రాత్రే తన ఊరికి పోయిండు. తెల్లారే సరికి యాతం బొక్కెనతో తిరిగి వచ్చిండు. ఎవలకూ తెలువకుంట యాతం బొక్కెనను గడ్డి వాముల దాచిపెట్టిండు. ఇంత చేసినా ఎవలకూ తెలువనిస్తలేడు.

ఎండాకాలం పనేంలేదు. ఆవులను ఎడ్లను సదురుడు, పొయ్యిలకు కట్టెలు కొట్టుకచ్చుడు. పెండల ఉనుక కలిపి పిడుకలుజేసుడు, సున్నంరాళ్లు ఏరుకచ్చి కొట్టి సున్నంజేసుడు, ఎర్రమన్ను మోసుకచ్చుడు.

ఎంకవ్వకు ఇంట్లపని. పొయ్యి మెత్తుడు, కొత్తది కలికుండ జేసుడు. కొత్తగా దాలిగుంట మెత్తుడు. ఎత్తు వంపులున్న జాగల తవ్వి నేలను మట్టంజేసుడు, ఎర్రమన్నుకు బోదెగట్టుడు, గుమ్ములను గుల్లలను పెండతో పూసుడు.

ఎల్లవ్వకు ఎగురుడు, దుంకుడు, దాల్లడి ఆడుడు. యాడన్నా బాగోతాలాడితే రాత్రంతా చూసుడు. పొద్దున బర్లమంద ఆవులమందలెంట తట్టపట్టుకుని తిరుగుడు.

ఎప్పుడు పొద్దుగూకుతదా అని చూసిండు భూమయ్య. పొద్దుగూకంగనే యాతం బొక్కెన బయటకు తీసి వాగవుతలికి నడిచిండు. ఎన్నీలసాలు అచ్చివచ్చింది. యాతాన్ని అమిరిచ్చి పోసుడు మొదలు వెట్టిండు.

ఎన్నీల గూకింది. చీకటి పడింది. సుక్కలు తేలివచ్చినయి. పందిరి మంచం నెత్తిమీది కచ్చింది. మూలసుక్క పొడిచింది. మొగులు తెల్లసాలువడ్డది. ఊరినుంచి కోడి కూత వినిపించింది. అప్పుడు ఆపిండు భూమయ్య యాతంను.

పెయ్యినిండా చెమటలు పుట్టినయి. బుడ్డగోచి మెత్తం నానింది. కండ్లు ఎర్రవడ్డయి. యాతం బొక్కెనను ఇడిసి కానుగు చెట్టుమీద దాచిండు. సుట్టను అంటువెట్టుకుని మెల్లగా మడిలకు నడిచిండు. అతడి అంచనా ప్రకారం రెండు మడ్లుతడువాలె.

చుట్ట తాక్కుంట కాలువను చూసిండు భూమయ్య. మసక చీకట్ల నీళ్లు కనిపించలేదు. కాళ్లకు నీటి పదన కూడా అంటలేదు. కనుబొమ్మలు ముడివడ్డయి. భయం భయంగా భూమిని తడిమి చూసిండు. యాతం పొక్క నుంచి నాలుగైదు గజాల దూరం కాలువ వుంది. కాలువ నుంచే నీళ్లు మడిలకు పారుతయి.

కాలువ రెండు మూడు గజాల దూరం కూడా తడువలేదు. కాలువ ఒడ్డుకు పెద్ద బుంగ వడ్డది. నీళ్లన్నీ బుంగనుంచి ఒడ్డు కింద వడ్డయి. ఒడ్డుకింద పెద్దకాలువ. ఊట నీళ్లు మక్కచేన్లకు రాకుంటా తీసిన కాలువ అది. కాలువ నుంచి పారుకుంట పారుకుంట సక్కగ దొరవారి నువ్వుకట్టె కల్లంలకు పోయినయినీల్లు. కల్లం మడి మొత్తం తడిసింది. అక్కడ నువ్వు కట్టె కుప్ప ఉంది.

భూమయ్య గుండె దడదడమంది. 'ఎట్ల..? ఏం జెయ్యాలె'? అనుకున్నడు. 'దొరవారి కల్లం పారింది. ఎట్లయినా తన్నులు తప్పయి' అనుకున్నడు.

'సక్కగ ఇంటికిపోత. కుడుపునింద గటుకతాగుత. వచ్చి గడ్డివాముల జొక్కుంట' అనుకున్నడు భూమయ్య. రాంగ రాంగ వాగుల మొఖం కడుక్కున్నడు. ఇంటికి వచ్చి పంచె బనీను ఇడిసి కొత్తయి కట్టుకుని కంచం అందుకుని కూసున్నడు.

పొయ్యిమీద గటుక తుక్కపెక్క ఉడుకుతనే ఉంది. ఎంకవ్వ సల్ల జేత్తుంది. ఎల్లవ్వ పాలకుండను కషికతో పాలగోకు గీకుతుంది.

భూమయ్యను ఇరుగ జూసింది ఎంకవ్వ. 'ఏం మావుల జేసినవని లెవ్వంగనే ఆకలైతంది' అన్నది కోపంగా.

'పని లేకపోతే ఆకలిగాదా ఏంది..?' తిక్క తిక్కగా అన్నడు భూమయ్య.

ఏమనుకున్నదో ఎంకవ్వ. గటుక కుండను దించి తెడ్డుతో కొద్దిగా గటుకను పొయ్యిల యేసి కుండకు కుండ తెచ్చి భూమయ్య ముందు వెట్టింది. తెడ్డుతో సగం కుండెడు గటుకను కంచంల కుమ్మరిచ్చింది. ఆమె కోపంగా పెట్టిందని తెలిసిపోయింది భూమయ్యకు. సల్ల బుడ్డి తెచ్చే దాక కూడా ఆగలేదు. చెంబేడు నీళ్లు, ఉప్పురాళ్లు ఏసుకుని లొడలొడ కలుపుకుని జుర్రుతున్నడు.

"ఆ...ఏం ఆగము. అంత బెదురుతున్నవేంది...? అంత కొట్టుకుపోతుందా... ఆకలి" అన్నది ఎంకవ్వ.

ఎల్లవ్వ ఎక్కిరిస్తూ "ఇసీ..సల్ల ఉండంగ నీళ్లువోసుకుంటుండు. మొఖం







కడుక్కోకనే తింటుండు" అన్నది. భూమయ్య ఎవల మాట వింట లేదు. జుర్రుతనే ఉన్నడు. అప్పుడే బయటనుంచి పిలుపు వినిపించింది.

"ఆ..ఎవలుండ్లా.."అంటూ బయటకు పోయింది ఎంకవ్వ.

"వాడు భూమడున్నడా...భూమడు" కాందారి రాజయ్య మాట వినిపించింది.

మాటను గుర్తుపట్టంగనే భూమయ్య గుండె జల్లుమంది. 'ఇగ నన్ను ఉంచదురా' అనుకున్నడు. గుట్టగుట్ట గటుక నాలుగు బుక్కలు జుర్రి కంచం కింద వెట్టిండు. మూతి తుడుచుకుంట తుడుచుకుంట ఇంటి వెనుక తలుపు తీసుకుని రాళ్ల తెట్టెను దుంకి ఉరుకందుకున్నడు.

ఎల్లవ్వకు విచిత్రమనిపించింది. బయటకు వచ్చి చూసింది. "భూమయ్యా...ఓ భూమయ్యా...ఏమయింది?" అని అడిగింది. అప్పటికే భూమయ్య నాలుగు తెట్టెలు దుంకి మడికట్లల్ల వడ్డడు.

"అవ్వా భూమయ్య పిచ్చోని లెక్క ఉరుకుతున్నడే" అనుకుంట తల్లి దగ్గెరికి పొయింది ఎల్లవ్వ.

"అట్లనా...?" కాందారితో అంటుంది ఎంకవ్వ.

"అవునే..కల్లం మడి మొత్తం ఎండిపోయి నోరు తెరిచింది. నువ్వు కట్టేను కొడితే రాలిన నువ్వులన్నీ పర్రెలల్లకు పోతయని కట్టెను కొట్టక అట్లనే కుప్ప ఏసినం. నేను మా జీతగాళ్లతోని రోజు చెప్పుతనే ఉన్న. మడిని తడుపుండ్రిరా...ఎడ్లతోని కొర్రబంతి కొట్టిస్త. పర్రెలన్నీ మూసుకుపోతయని. గాడిది కొడుకులు నీళ్లు మోసుడుకే భయపడ్డరు. భూమని కడుపు సల్లగుండ. నలుగురు చేసే పని ఒక్కడే చేసిండు. మడి మొత్తం తడిపిండు. ఇయ్యల్ల నువ్వుల కల్లం లేపాలే" కాందారి అన్నడు.

ఎంకవ్వకు సంతోషమనిపించింది. "పనికి వంగితే నలుగురి పని ఒక్కడే చేత్తడయ్యా" అన్నది నవ్వుతూ.

"నీ యవ్వ...ఏమన్నగాని. నాకైతే పని తప్పిచ్చిండు. పోరడు మంచి పనోడే" అనుకుంటూ వెళ్లిపోయిండు రాజయ్య.

ఎంకవ్వకు విషయమేదీ అర్థం కాలేదు. అప్పటి మందం తలూపింది అంతే! 'కల్లం మడి ఏంటిది...?తడుపుడు ఏంటిది?' అనుకున్నది.భూమయ్యనే అడుగుదామనుకునే లోపలనే అతడు మాయమయ్యిండు.

"ఇంకేం జేత్తడు...మన గడ్డితిని మంది దొడ్డిల పెండ వెట్టె అన్నట్టు జేత్తండు. పురుగు బుషి తిని పుట్టలుండక ఏదేదో చేత్తండు. ఏం తిన్నమో, యాడున్నమో....ఎవలకు తెలువకుంట ఉన్నం. ఆకుసాటు పిందెలెక్క ఉంటడంటే యాడోకటి తేవట్టె" తిట్లు ఎత్తుకుంది ఎంకవ్వ.

భూమయ్య దొడ్డిదాకా పరుగు ఆపలేదు. దొడ్ల గడ్డకు వరుసగ దొడ్లు. దొడ్డికి

రెండు మూడు గడ్డివాములు, మక్కజూడులున్నయి. ఒక గడ్డివాములో జాక్కున్నడు భూమయ్య. రెండురోజుల కింద ఈత పండ్లను ఏరుకచ్చి గడ్డివాముల పోసిండు. గోశి నిండా నింపుకుని బుక్కుకుంట కూసున్నడు.

పొద్దు గూకింది. ఆ వాము నుంచి ఈ వాముకు ఈ వాము నుంచి ఆ వాముకు తిరుగుతనే ఉన్నడు భూమయ్య. అప్పుడప్పుడూ వాము లెక్కి ఊరు దిక్కు చూస్తున్నడు. ఆవులు తిరిగి వచ్చేయాల్లకు ఏదో వాముల నక్కి కూర్చున్నడు.

ఎంకయ్య పొద్దటినుంచి భూమయ్యకోసం తిరుగుతనే ఉన్నడు. అతని భయం అతనికుంది. 'భయపడి ఎటువోతడో లేక సెంచరిల్లుతడో' అనుకుంటున్నడు. పొద్దు గూకినంక గడ్డివాముల ఉన్నడని ఎవలో జాడ చెప్పింద్రు. మనసు కొద్దిగా నిమ్మలమైంది. కాని 'దొరుకుడు ఎట్లా' అని ఆలోచిస్తున్నడు. 'పిలిస్తే బయటకు రాడు. భయపడుతడు. నమ్మించి దొరుకవట్టాలె' అనుకున్నడు.

తిని పండే రాత్రి లింగంను ఎంటబెట్టుకుని గడ్డివాముల దిక్కు నడిచిండు ఎంకయ్య. దొడ్లగడ్డకు చేరుకున్నంక ఎడ్ల మెడలకు కట్టే గంటను లింగం చేతికి ఇచ్చిండు ఎంకయ్య.

లింగం గంటను మెల్లెగా ఊపుకుంట గడ్డివాముల చుట్టూ తిరుగుతున్నడు. వెంట ఎంకయ్య మెల్లెగా నడుస్తున్నడు. గంట గణగణ మోగుతుంది. గడ్డివాముల చుట్టూ దొంగ ఎద్దు తిరుగుతున్నట్టేవుంది.

ఒక గడ్డివాము దగ్గర మోపుల కింద కొద్దిగా కదలిక కనిపించింది. లింగం అక్కడనే ఆగి గడ్డిని మేస్తున్నట్టు చప్పుడు చేస్తూ గంటను ఊపిండు.

"జా...నీగత్తరాను ఇక్కడనే దొరికిందా గడ్డి. నడువు అటుమెయ్యిపో" లోపలనుంచి మాటల అదిలింపు వినిపించింది.

ఇంకొంచెం ముందుకు జరిగి సరిగ్గా దాక్కున్న చోటనే గంటను కదిలించిండు లింగం.

"నిన్ను మాదుగులుతిన. అటుపొమ్మంటే ఇటే అత్తన్నవు. గడ్డే దొరుకలేదా..నీ ఎద్దుపీసునెగొడుదు" అంటూ గడ్డివాముల నుంచి బయటకు వచ్చిండు కోపంగా భూమయ్య.

వెంటనే ఎంకయ్య దండరెట్టను అందుకున్నడు. భూమయ్య ఉరుకుదామని గుంజుకున్నడు. "ఏయ్...ఆగు ఏం ఉరుకుతవు" అంటూ విషయమంతా చెప్పిండు ఎంకయ్య.

అప్పటికిగాని భూమయ్య భయం పోలేదు. లింగం నవ్వుతనే ఉన్నడు. ముగ్గురూ ఇంటిదిక్కు నడిచింద్రు.

ఎంకయ్యకు ఎన్నో అనుమానాలున్నయి. 'యాతం ఎందుకు పెట్టిండు..?

బొక్కెన ఎక్కడిది? నీళ్లను ఎందుకు ఎత్తిపోసిండు..?' అని.ఇప్పుడు అవన్నీ అడిగితే బెదిరిపోతడని ఏమీ అడుగలేదు. 'తెల్లారినంక అన్నీ అడుగచ్చులే' అనుకున్నడు.





ఇంట్ల ఎంకవ్వగూడా ఏమీ అడుగలేదు. తిన్నంత గటుక మాల్లు పెట్టింది. అంచుకు కొత్తది మామిడికాయ తొక్కు పెట్టింది. లింగం కూడా భూమయ్యతోనే కూకుండి తిన్నడు.

ఇద్దరూ కలిసి దొడ్లగడ్డకు వచ్చింద్రు. తొవ్వల జరిగినదంతా లింగంతో చెప్పిండు భూమయ్య.

"కాదు పటేలా...అట్లెందుకు భయపడ్డవు. ఉరికేది కాకుండే. ఏమంటడో వినేదుండే" అన్నడు లింగం.

"కాదురా లింగా..కాందారి మంచోడు కాదటగదరా. లాత్‌ఖానికి కట్టేసి కొడుతడటకదా! అందుకే భయపడ్డ" అన్నడు భూమయ్య.

ఇద్దరూ దొడ్ల బండమీద నడుము వాల్చింద్రు. లింగంకు నిద్రపట్టింది. భూమయ్యకు నిద్రపట్టలేదు. 'ఎట్లాగు రేపు మామ విషయమంతా అడుగుతడు. యాతము వద్దు పంట వద్దు అంటడు. ఆ లోపునే రెండు మడ్లు తడువాలె' అనుకున్నడు. లింగంను ఊపి చూసిండు. వాడు మొద్దు నిద్రపోతున్నడు.

భూమయ్యలేచి చుట్ట నోట్లె ఏసుకుని గొంగడి దులిపి భుజం మీద ఏసుకుని వాగవుతల తొవ్వపట్టిండు. యాతం బొక్కెనను తీసి కట్టి ఒడ్డుకున్న బుంగను మెత్తి యాతం పోసుడు మొదలు వెట్టిండు. ఈసారి గంటకొకసారి మడిని తొక్కిచూస్తున్నడు. నీళ్లుపారుతున్నయా లేదా అని కాలువను చూస్తున్నడు.

నడిజాము రాత్రి దాటినంక మీది మడి కటుపుకుని కింది మడిలకు నీళ్లు దిగినయి. బలబల తెల్లారుతుండంగ రెండు మడ్లల్ల నీల్లు నిలిచినయి. బుంగ సంగలు కట్టిండు. ఏమడి నీళ్లను ఆమడిలోనే ఆపిండు.

ఎప్పుడైతే మడ్లల్ల నీళ్లు ఆగినయో అప్పుడే ఎంద్రికాయ పొక్కలన్నీ నిండినయి. సౌట ఎంద్రికాయలు, కాలెంద్రికాయలు అన్నీ కొండ్లు తెరుచుకుని బయటకచ్చినయి. కాలెంద్రికాయలన్నింటిని దొరుకవట్టిండు భూమయ్య. కాళ్లు, కొండ్లు ఇరిసి గొంగట్ల ఏసుకున్నడు. రెండు ఒడ్లు తిరిగేసరికి జోలెనిండినయి.

బొక్కెనను దాచి ఇంటి మొఖం పట్టిండు. ఎంద్రికాయలను పట్టంగ పట్టిండుగని ఇంటికి తీసుకుపోవాలంటే భయమయితుంది. మెల్లగా దొడ్డి దగ్గెరికి వచ్చిండు. లింగం ఎడ్లను సదురుతూ అక్కడనే ఉన్నడు.

"ఏం పటేలా...ఎటుపోయినవు...లేచిచూసేవరకు లెవ్వు" అడిగిండు లింగం.

"నేనెటువోయినరా...?వాగుపొంట ఎంద్రికాయలు దొరుకుతయని పోయిన". అన్నడు భూమయ్య.

"దొరికినయా.." ఆశగా అడిగిండు లింగం.

"మత్తుదొరికినయి" అని గొంగడి చూపించిండు భూమయ్య.

"అరే పెద్ద పెద్దగున్నయి. మంచిగనే దొరుకవట్టినవు. ఇంటికి తీసుకుపో"
అన్నడు లింగం.

"ఇంటికి తీసుకుపోవాలంటే భయమయితుందిరా...ఏమంటరో ఏమో.." భయంగా అన్నడు భూమయ్య.

"అబ్బో...నువ్వు దండోనివి పటేలా...చేసేది చేత్తవు. భయమంటవు. ఇప్పుడు వీటిని ఏంజేత్తవు" అడిగిండు లింగం.

"కాల్చుకతిందాంరా...మంచిగుంటయి" ఊరిస్తూ అన్నడు భూమయ్య.

'సరే'..అని లింగం కట్టెల మంట పెట్టిండు. గొంగడిని మంటల దులిపిండు భూమయ్య. చిటపటసప్పుడు మొదలయింది.

"నేను మొఖమే కడుగలే. కడుక్కొని వత్తా..." లింగం అన్నడు.

"వద్దురా...కూసో. తిన్నంక కడుగుదాం. ఇప్పటికే తెల్లారుతుంది" అన్నడు భూమయ్య.

కాలీ కాలని ఎంౘ్రికాయలను కొన్ని ఒలుసుకొని తిన్నరు. మిగిలినయి ఇంటికి తీసుకుపొమ్మని లింగంకు చెప్పి నోట్లె పండ్ల పుల్ల ఏసుకుని ఇంటికి వచ్చిండు భూమయ్య. గొంగడిని దండెం మీద ఏసి అరుగంచుకు కూసుండి పండ్ల పులుకను నములుతున్నడు.

ఎంకవ్వ గటుక ఇసురుతుంది. ఎంకయ్య బౘ్రెను సదురుతున్నడు. భూమయ్య ఎంౘ్రికాయ కొండ్లను అగ్గిల దులిపినప్పుడు అన్నీ అగ్గిల పడలేదు. కొన్ని కొండ్లు కొన్ని గడ్డలు గొంగడికి చిక్కుకున్నయి. గొంగడి దండెం మీదవేసినప్పుడు కొన్ని కిందరాలినయి. కొన్ని గొంగడికే యాలాడుతున్నయి. ఒకటి రెండు వాకిట్ల రాలినయి. కోమట్ల ఇంటి ముంగట మాత్రం రెండు పెద్ద గడ్డలు రాలినయి.

గొంగడిని ముందుగా ఎల్లవ్వ చూసింది. ఇసుౘ్రాయి దగ్గెరికి వచ్చి తల్లి చెవుల చెప్పింది. ఏరి కుప్పపొయ్యిమన్నది ఎంకవ్వ. గొంగడిని తిౘ్రెసి మౘ్రెసి దులిపి కొండ్లను కాళ్లను ఏరింది ఎల్లవ్వ.

ఎప్పుడైతే ఎల్లవ్వ గొంగడిని పట్టిందో అప్పుడే భయమయింది భూమయ్యకు. వచ్చి బజార్ల నిలవడ్డడు. బజారు నిండా గోజలే. మనుసులు ఎప్పుడో ఎక్కడో కనిపిస్తున్నరు. ఊర్లె మనుసులకంటే గోజలే ఎక్కువున్నయి.

కోమట్ల వాకిలి బజారు పక్కనె. ఆ వాకిలి దాటినంకనే ఎంకయ్య ఇల్లుంది. వాకిట్ల రెండు ఎంౘ్రికాయగడ్డలు కనవడుతున్నయి. భూమయ్య పాణం జల్లుమంది. 'తియ్యాలెనా ఉండనా' అనుకుంటున్నడు. అక్కడి దాకా వెళ్లి చూసిండు. రంగయ్య సేటు దుకాణంల కూసున్నడు. సేటమ్మ లోపల ఉంది. వాకిట్ల దాకా వచ్చి రెండు గడ్డలను తీసి గోసిల ఏసుకున్నడు.

అప్పుడే వచ్చింది సేటమ్మ. "భూమా...నీతలపండువలుగ. సానుపు సల్లిన వాకిట్ల





ఎంౘ్రికాయలేత్తావుర...నీ నాంనరుక ..." అంటూ తిట్లకెత్తుకుంది.

"నేనెందుకేసిన. గొంగట్ల ఏసుకుంటె రాలినయి. నేను చూసిన్నా". అనుకుంట ఇంట్లకు నడిచిండు భూమయ్య. ఇసుౘ్రాయి సప్పుడుకు ఎంకవ్వకు మాటలు వినిపించలేదు. ఎంకయ్య విన్నా విననట్టే వున్నడు. రెండు గడ్డలను ఎవలూ చూడకుండా పెంటలకు విసిరిండు భూమయ్య.

"ఎటుగాకుంట తెచ్చినవు. ఇంకో నాలుగు పట్టుక రావద్దా" అన్నది ఎంకవ్వ. భూమయ్య అటు మసిలి ఇటుమసిలి గటుక తాగి బయటపడ్డడు. ఏం చెస్తడో చూద్దమని ఎంకయ్య మౌనంగానే ఉన్నడు. ఎవలూ ఏమీ అడుగకపోవడంతో భూమయ్యకు దైర్యం వచ్చింది. మందల నుండి ఎడ్లను మలుపుకుని నాగలి కట్టిండు.

పొద్దంతా రెండు మడ్లను పొట్టుపొట్టు దున్నిండు. నీళ్ళు ఇంకి పదన తేలిన మడ్లు అల్లం కొమ్ములలెక్క ఉన్నయి. సాలు ఇరువాలు దున్ని గడ్డిని ఏరేసిండు. ఒడ్డుచెక్కి బుంగసంగ మెత్తిండు భూమయ్య.

తెల్లారి పట్టపగలు ఇంట్లో ఎవ్వలూ లేరు. ఎంకవ్వ మోతుకు ఆకులకు పోయింది. ఇంకా తిరిగిరాలేదు. ఎంకయ్య ఎక్కడికోపోయిండు. ఎండకాలమైనా ఇండ్లల్ల ఎవ్వలు లేరు. ఏదో పనిమీద అందరూ అడివిలనే ఉన్నరు. ఎల్లవ్వ ఇంటికి గొల్లెం బెట్టి ఎక్కడనో ఆడుకుంటుంది.

భూమయ్య తలుపు తెరిచిండు. గుమ్మిదగ్గరికి పోయిండు. గుమ్మిమీద కప్పిన ద్యాగర తీసిండు. గొంగడి పరిచిండు. రెండు ఇరుసల వడ్లను ముల్లెగట్టుకున్నడు. నెత్తిమీద పెట్టుకుంటుండగా వచ్చింది ఎల్లవ్వ.

"ఏ...భూమయ్య వడ్లు ఎత్తుకపోతున్నవేంది...?" అన్నది అడ్డం నిలబడి

భూమయ్యకు కోపం వచ్చింది. "పోరిని దవుడమీదకెల్లి సంపురా...నడువూ..." అని పక్కకు నూకి బయటపడ్డడు.

ఎల్లవ్వ ఎనక్కి ఇరుసుకపడ్డది. నెత్తికి మొగురం తాకింది. ఏడుపు అందుకుంటూ "మా అవ్వ వచ్చినంక చెప్పత...తాత కొడుక జరాగు...నూ....నూ....నూ...నేనూను...మా అవ్వ...మా అవ్వ ...వచ్చినంక ....వచ్చినంక...చెప్పుత..." అంటు రాగం అందుకుంది ఎల్లవ్వ. కండ్లపొంట నీళ్లుకారుతున్నయి.

ముల్లె ఎత్తుకుని భూమయ్య సక్కగా వాగవుతల పొలం దగ్గెరికి పోయిండు. ముల్లెను ఒడ్డుమీద దించిండు. రెండు మడ్లల్ల వడ్లను చల్లిండు. చేతులతో మట్టిని నేర్పి అక్కడక్కడా మిగిలిన గడ్డిపరుకల్ని ఏరేసిండు. ఒడ్డుమీదికి ఎక్కిండో లేదో ఎగపోసుకుంట ఎంకయ్య ఎంకవ్వ ఇద్దరూ వచ్చింౘ్రు.

ఎంకవ్వ దూరం నుంచే తిట్లను అందుకుంది. "నీ కొంపలగుత్త తల పండువలుగ. చెప్పింది చెయ్యడు. చేసింది చెప్పడు. వడ్లన్నీ భూమిల వోసి నాశినం చేసిండు.."

"అరే..ఎర్రటి ఎండాకాలం నోరు తెరిత్తె నోరెడు ఎండ. వారంలేదు. దినంలేదు. యాల్లలేదు.పాల్లలేదు. మొలుక సల్లుతరుగనీ ఎవలన్న వడ్లను సల్లుతరా...వట్టిగ వడ్లను నాశినం జేత్తివి" అన్నడు ఎంకయ్య కోపంగా.

భూమయ్య అక్కడ నిలవడలేదు. దొడ్డి దిక్కు వెళ్లిపోయిండు.

ఎంకవ్వకు ఏడుపువచ్చింది. ఒడ్డుమీది చెట్టుకింద కూసుండి సోకం పెట్టుకుని ఏడ్చింది. ఎంకయ్య నెత్తికి చేతులు వెట్టుకుని కూసున్నడు. కండ్లపొంట నీళ్లుగారుతున్నయి. అవి నాగులకు తెచ్చిన వడ్లు. పాణం పతుకమోలె కాపాడుతున్నడు. ఆయిటి మూనంగనే మొలుకగట్టి చల్లుదామనుకున్నడు.

## 4

మూడు రోజులు గడిచింది. ఈ మూడు రోజులల్ల భూమయ్య చేసిన పని అందరికీ తెలిసిపోయింది. కనవడ్డోల్లందరు తిట్టుడేగాదు. ఒకలు వట్టివడ్లు అలుకుతరా అంటే ఇంకొకలు పట్టపగలు అలుకుతరా అన్నరు. కొందరు ఎండకాలం అలుకుతరా అంటున్నరు. కొందరు వడ్లను నాశినం జేత్తివిగదరా అంటున్నరు.

కొందరైతే 'వాడు భూమదు చేసినట్టు' అని సామెతలే చెప్పుతున్నరు.

వరి రెండు రోజులల్ల మొలుకలు లెవ్వాలె. తప్పితే మూడు రోజులు. వారంల పచ్చవడాలె. రెండు వారాలల్ల కలుపు తియ్యాలె. ఒత్తుగా కర్రలున్న జాగల వరిని పీకి లేని చోట నాటు పెట్టాలె. రెండు వారాలల్ల దట్టి గట్టాలె.

కాని పొలంల మొలుక మొలువలేదు. ఇట్ల జరుగుతుందనుకోలేదు భూమయ్య. మడ్లు రెండు ఎండిపోయినయి. మొలుకలు లేస్తే నీరు పారిద్దామని చూస్తున్నడు. కల్లం అడుక్కు ఎక్కడో ఒక మొలుక మొలిచినట్టు మొలిచింది అంతే. భూమయ్య ఆశ వదులుకున్నడు. పొద్దుమాపు ఇంట్ల కాల్చుక తింటున్నరు. సాపెన పెడుతున్నరు.

భూమయ్య 'ఏదైతే అది అయిందిలే' అనుకొని ఒకనాడు రాత్రి యాతం అమిరిచ్చిండు. నీళ్ల ఊట తక్కువయింది. బాయిని లోతుగా తవ్వి రెండు మడ్లను తడిపిండు. ఎప్పుడైతే నీటి పదన తలిగిందో అప్పుడే ఎండిపోయిన పైపోర నానింది. వడ్లగింజలన్నీ మెలుకలు లేచినయి. గట్టిపొరకు లోలోపల రుంగచుట్టుకున్న మొలుకలు పైకి లేచినయి. రెండు రోజుల్లో మొలుకలు పచ్చవడ్డయి.

భూమయ్యకు సంతోషం ఆగలేదు. పొద్దున మాపున యాతం పెడుతున్నడు. వరి గప్పుమని లేచింది. పొలాన్ని ఎప్పుడూ ఓకంట కనిపెడుతున్న ఎంకయ్య కలుపు మొదలుపెట్టిండు. భూమి మీద వేళ్లు ఆడిస్తూ గడ్డిని పీకేస్తూ లేనిచోట వరిని నాటుపెట్టిండు. అయినా భూమయ్యను తిడుతనే ఉన్నరు.

ఇట్లా వరిలేస్తుందని ఊహించలేదు ఎంకవ్వ. పైకి కోపంగా ఉన్నా లోలోపల సంబూరంగానే వుంది. మొలుకమండెగట్టి బురదపొలం దున్ని చేనంతా మొలుక





అలికినప్పుడుగూడా వరి ఇట్లా లెవ్వదనిపించింది ఆమెకు. ఇంకోయాతం పొక్క తవ్వుమని ఎంకయ్యకు చెప్పింది.

పొక్క పక్కన పొక్కపడితే ఊటలు రావని ఇంకో మూలకు పొక్కను పట్టి యాతం పెట్టిండు ఎంకయ్య. అతనికి యాతం కొత్త. వేరే ఊర్లె చూసిండుగనీ ఎప్పుడూ పెట్టలేదు. పొయ్యలేదు. పని యాతం బొక్కెన దాకా వచ్చింది. చేతుల బొక్కెనలేదు. అప్పుడువచ్చింది ఆలోచన ఎంకయ్యకు.

భూమయ్యను పిలిచి 'యాతం దేంతోటి పోత్తున్నవు' అని అడిగిండు.

'బొక్కెనతోటి' అన్నడు భూమయ్య.

"ఎక్కడిది"? అడిగిండు.

"నాది".

"అంటే".

"మా నాయిన మూడు బొక్కెన్లను కొన్నడు. నాది మా పెద్దన్న దగ్గెరున్నది. మొన్నరాత్రి మా పెద్దన్న యాతం మీది బొక్కెన ఇడుసుకచ్చిన" అన్నడు భూమయ్య. ఎంకయ్య నోరు తెరిచిండు.

"చెప్పక చెయ్యక దొంగలెక్క ఇడుసుకత్తరా" కోపంగా అన్నడు.

"నాది నేను తెచ్చుకునేతందుకు చెప్పుడేంది...? అడుగుతే ఇత్తరా..లేనేలేదంటరు" అన్నడు భూమయ్య. ఎంకయ్య సోమారం అంగడి పోయి యాతం బొక్కెన తెచ్చిండు. పొద్దుమాపు యాతం. వరి పచ్చగ లేచింది.

అప్పుడు కదిలింది ఊరు. భూమయ్యను తిట్టిన వాళ్లంతా అరే ఏం వరి అంటున్నరు. యెవుసాయంలో కొత్తపద్ధతి వచ్చింది. మనిషికొక యాతం పొక్క తవ్వుకున్నరు. మనిషికొమడి తడుపుకుని వడ్లుచల్లుకున్నరు. కొందరైతే వడ్లుచల్లడానికి భూమయ్యను బతిమిలాడి తీసుకుపోతున్నరు.

ఊర్లె మొలుక అలికె మొగోళ్లు పదో ఇరువైమందో ఉన్నరు అంతే! ఎకురాలకు ఎకురాలు మొలుక చల్లుడైతే వాళ్లను మంచం మీద ఎత్తుకుని పొలమంతా తిప్పుతరు. ఇప్పుడు వడ్లు అలికే మొనగాడైతే భూమయ్య ఒక్కడే!.

ఈ విషయం ఈనోట ఆనోట దొరవారికి తెలిసింది.

"అరే..భూమదంటేఎవడురా..కామ్‌దారీ" రాజయ్యను అడిగిండు దొర.

"అదేదొరా..మన నువ్వు కల్లం తడిపినోడు. గడీల ఒకసారి తొక్క ఆడిండు సూడూ ఆ పోరడే" రాజయ్య అన్నడు.

'అరే..తొక్కభూమడా..ఇన్నేండ్లు ఎద్దు ఎవుసం జేత్తండ్రు. ఆ పోరనికి వచ్చిన ఆలోచన మీకెందుకు రాలేదు. చల్..మన జీత గాళ్లందరికీ యాతం పొక్కలు తవ్వుమను. మనిషికొక మడి అప్పజెప్పు" అన్నడు దొర.

కాందారి రాజయ్య అదే పని చేసిండు. మొత్తం మీద ఎండకాలం ఊరందరికి పని తలిగింది. పొక్క తరువాయి పొక్క పొద్దుమాపు ఎత్తిపోత్తుంటే ఊటలు తగ్గినయి. పొక్కలు వెడల్పు, లోతు పెరిగి బాయిలుగా మారినయి. బాయిమీద బడుత కట్టెలేసి కట్టెలమీద నిలబడి యాతం బోత్తున్నరు. చెరువుపారుకం లేక బీడువడ్డ భూములు ఇప్పుడు పచ్చగ మొలుకెత్తుతున్నయి. ఆయిటిమూని కాలం కలుపుకుని రెండు వానలు పడేసరికి ఈ మడ్లుకోతకచ్చినయి. చింతపువ్వుకార్తి పంట అని యాసంగి వానకాలంగాక ఒక కొత్త పంట మొదలయింది.

రెండు పసల్లు గడిచింది. ఇప్పుడు ఊర్లె ఎటు చూసినా యాతం పొక్కలె. చెరువు రెండు పసల్లకే నీళ్లను అందిస్తది. చింతపువ్వు కార్తివరకు నీళ్లు తూములకు అందయి. అందుకని చెరువు కింది పొలాలల్ల కూడా యాతం పొక్కలయినయి.

మూడవ పసలు కరువు వచ్చింది. యాల్లకు వానలు పడలేదు. ఇంట్ల ఎందరు మొగోళ్లున్నరో అందరు మొగోళ్లకు మనిషి కొక్కబాయి, మనిషికొక్కయాతం బొక్కెన. ఒక పసలు పండింది.

వానలు లేకపోవడంతో యాసంగి పసలుకు ఊటలు తగ్గినయి. ఒకమడి పారేది సగంమడికివచ్చింది. వాగు మాత్రం పారుతనే ఉన్నది. వాన కొడితేనే పండే పునాసపంటలు పండలేదు. మక్కగటుక గూడా కరువయింది. చెరువు ఎండుకపోయింది.

ఊరినిండా గోజలు. తిండికి ఏకాయనో గడ్డనో దొరుకుతుంది గానీ గోజలకు మాత్రం గడ్డి కరువయింది. ఊరు ఊరంతా వాగు వెంటనే ఉన్నరు. గడ్డి వేర్లను తవ్వి గోజలకు ఏస్తున్నరు. ఈతకమ్మ తుంగను కోసి బర్లకు వేస్తున్నరు. ఆకలైతే చెలిమెతోడుకుని కడుపునిండా నీళ్లు తాగుతున్నరు.

కరువంటే తిండికే కరువు. తాగే నీళ్లకు కాదు. ఊర్లె చేదబాయిలల్ల నీళ్లున్నయి. కాకపోతే ఒకటి రెండు గజాలు కిందికి దిగినయి. ఊరికిందవాగుల నీళ్లున్నయి. కాకుంటే దార కొద్దిగా తగ్గింది. యాతం పొక్కలల్ల నీళ్లున్నయి. కాకపోతే యాతం బొక్కెనకు అందుతలెవ్వు.

జనంకు తమ తిండి బాధకంటే గడ్డి బాధనే ఎక్కువయింది. కండలు పట్టిన ఎడ్లు దొక్కలు తేలినయి. సుడిమీదున్న ఆవులు ఈడ్సుకపోయినయి. కొన్ని ల్యాగలైతే సచ్చిపోయినయి. శాతమాదిగోళ్లకు పని తలిగింది. ఊరిలో చిన్న పిల్లగానికిన్కూడా మాదిగి చెప్పులు తయారయినయి.

అటో ఇటో ఎండకాలం ఎల్లింది. కితికె కార్తిల వానగొడితే కుతికెల దాకా బువ్వ దొరుకుతది. కితికె కార్తి ఎల్లింది. వాన చుక్కలేదు. రోణి కార్తిల వానగొడితే రోకలిబండల లెక్క కంకులు పెడుతయి. రోణి కార్తి ఎల్లింది. ఎండలకు రోకండ్లు పగిలినయి గాని వాన చుక్క లేదు. మృగశిరల వానగొడితె మూడులోకాలు బతుకుతయట. ఆ కార్తి





కూడా పోయింది. అసలేరుదాకా వచ్చింది. వాన సుక్కలేదు. చెరువులకు సుక్క నీళ్లు రాలేదు.

అసలేట్లె వానగొడితే ముసలెడ్లు రంకెలెత్తయి. ఏరులన్నీ దారులు తప్పి పారుతయి. ఆ కార్తి గూడా పోయింది. ఉత్తెరల ఉరుముకుంట వాన గొడతె పాములు తరుముకుంట కరుత్తయి. తరంగాని నీళ్లుపారుతయి. ఉత్తెరకార్తి ఉత్తదయింది. వాన చుక్కలేదు. ఈ పసలు పోతే మూడేండ్ల కాలం పోయినట్టు.

ఎనుకట ఎప్పుడో! తల్లి మంచం మీద కొన ఊపిరితో ఉండి కొడుకును పిలుసుకున్నదట. "అవ్వా...ఏదన్నా చెప్పిపోయే" అన్నడట కొడుకు.

"మాగి కాలంల కైకిలి మరువక చెయ్యిబిడ్డా. ఇటు జూసి అటు చూసే వరకు పొద్దుగూకుతది." తల్లి చెప్పిందట.

"ఇంకేమన్నా బతుకు దెరువు ముచ్చట చెప్పే అవ్వా" అని అడిగిండట కొడుకు.

"ఏం జెప్పాలె బిడ్డా...ఏరు దీమున్న ఊరు ఇడువకు" చెప్పిందట తల్లి.

"ఇంకేమన్నా చెప్పే..."

"ఇంకేముంది బిడ్డా. ఉత్తెర జూసి ఎత్తురగంప. ఉత్తెరలోపే వానలు పడాలె. ఉత్తెర దాటిందంటే వానలు కురువయి" అన్నదట.

ఉత్తెర దాటంగనే ఊర్లె భయం మొదలయింది. హరికథలు, భజనలు, కప్పతల్లి ఆటలు, జడకొప్పులు అన్నీ అయినయి. వాన మాత్రం రాలేదు. దొరవారి కొటీర్లు, గరిశెలు గూడా ఖాళీ అయినయట. దొర తాటిపండ్లు చీకి మంది ముందుకు వచ్చి మాత్రం బేవ్‌మని బేకోటు తీస్తుండట. మీసాలకంటిన తాటిపండు రసం మాత్రం దొంగను దొరుకవట్టి ఇచ్చిందట. దొరకే కష్టాలు తప్పలెవ్వని ఊరు ఊరంతా కథలు చెప్పుకుంటుండ్రు.

ఒకనాడు దొర అందరినీ గడీలకు పిలుచుకున్నడు. వానలు ఎట్ల పడాలని ఆలోచన మొదలు వెట్టిండు.

కంచరి హన్మయ్య లేచిండు. "దొరా...బమ్మంగారు ఎప్పుడో రాసుకున్నరు. తాగుడుకు నీళ్లు దొరుకయి. భూమి మీద బగ్గు బగ్గున మంటలు లేత్తయి. అది దైవ చిత్తం. ఎవలం ఏమీ చెయ్యలేం" అన్నడు.

దొర నవ్విండు. అందరూ నవ్విండ్రు. "ఇది చిత్రం. తాగుడుకు నీళ్ళు దొరుకయట. నీళ్లు కరువయినాయిరా....ఇంతకరువయినా పానాదులల్ల ఊటలున్నయి. నాలుగు అడుగులు దాటి వాగులకు పోతే యాడ దోశెడు ఉసిక తవ్వినా చల్లటి నీళ్లు. ఇప్పటికి వాగు వారుతుంది. నీల్లకరువేందిరా" దొర అన్నడు.

హన్మయ్య మారు చెప్పలేదు. దొర మాటలు అందరికి నిజమే అనిపించినయి. తాగుడుకు నీళ్లు దొరుకయంటేనే నవ్వు వస్తుంది. "భూమిల పుట్టెడు నీళ్లు. తాగుడుకు

ఎందుకు దొరుకయి....?" అనుకుంటున్నరు.

ఒకరు పూజలు చెయ్యాలన్నరు. ఒకలు అనుమండ్లకు సంతర్పన చెయ్యాలన్నరు. ఒకలు ముడుపు గట్టాలన్నరు. ఒకలు ఊర్లె జెయ్యాలన్నరు. అంతా నలభై, యాభైమంది ఉన్నరు. మనిషికొక్క సలహా ఇచ్చింద్రు. ఎంకయ్య గూడా లేచి ఏదో తోచింది చెప్పిండు. దొరకు ఎవల మాటలూ నచ్చలేదు.

ఆకరున మొగురం అంచున గొగ్గాల్ల మీద కూసున్నడు భూమయ్య. మౌనంగా అందరిమాటలు వింటున్నడు.

దొరనే చుట్టూ చూసి "వాడు తొక్క భూమడు రాలేదారా..కనవడుతలేడు." అని అడిగిండు. అంత మందిలో తొక్క భూమన్ని పేరు పెట్టి అడుగుతుంటే పక్కనే ఉన్న కాందారి రాజయ్యకు పెయ్యిపొంట ముండ్లు మొలిచినయి.

"వచ్చిండు దొరా...ఇక్కడ కూసున్నడు..." ఎవలో అన్నరు. భూమయ్య లేచి నిలవడ్డడు.

"వీనికి ఈడు చిన్నదే గని ఆలోచన పెద్దదిరా...ఎంకడు మంచి పోరన్నే వట్టిండు. ఏమాయెరా ఎంకా...పోరనికి లగ్గంజెయ్యవా..." అడిగిండు దొర.

"చేత్తబాంచెన్...కాలమైతదేమో చేత్తామనుకుంటే కరువు వడె" నిలవడి చేతులు నలుసుకుంటూ అన్నడు ఎంకయ్య.

"ఏంరా భూమా..సప్పుడు జెయ్యవు. కాలం గావాలంటే ఏంజెయ్యాలెరా..." అన్నడు దొర. భూమయ్య చేతులు గట్టుకుని దొరముందు నిలబడ్డడు. అంత దగ్గరగా దొరను ఎప్పుడూ చూడలేదు. కొద్దిగా భయమయితుంది. దొర దగ్గర తుపాకులు భుజానికి ఏసుకుని జవాన్లు నిలవడ్డరు. నాలికతో పెదువులు తడుపుకున్నడు భూమయ్య.

"దొరా...వానలు ఎట్ల కొడుతయో తెలువదిగనీ చెరువు నిండె ఉపాయం మాత్రం చెప్పుత" భూమయ్య అన్నడు.

"అరే...చెరువు నిండినంక దోఖా ఉన్నదారా...తీరొక్కపంట వండుతది. మా తన్లాంటనే అది. ఎట్లనిండుతదో చెప్పు". అన్నడు దొర.

"ఎట్లేందిదొరా...వాగులమోకాలు లోతు నీళ్లు వట్టిగపోతున్నయి. వాటిని చెరువులకు మర్రగట్టాలె." అన్నడు భూమయ్య.

"పిల్లగాని మాటలు గట్లుంటయి. ఎక్కడి వాగు ఎక్కడి చెరువు. వాగు ఎంత కిందికి ఉంది చెరువు ఎంత మీదికి ఉంది. కింది నీళ్లు మీదికి ఎక్కుతయట" ఎవలో అన్నరు. అందరు నవ్వింద్రు. దొరమాత్రం నవ్వలేదు. ఏదో ఆలోచనలో పడ్డడు.

"ఎట్లరా..ఎట్ల మర్రగట్టాలె" అడిగిండుదొర.

"దొరా...మన చెరువు వరుదనీళ్లకు గట్టింద్రు. వానలు పడితెనే నిండుతది. వానలు పడకపోతే ఎండుతది. వాగును మర్రగడితే వానకాలం ఎండకాలం నీళ్లు పడుతనే







ఉంటయి. ఇప్పటికంటే ఎక్కువ భూములను సాగు చెయ్యొచ్చు" అన్నడు.

దొర మౌనంగా వినడంతో అందరూ మౌనంగా వింటున్నరు.

"అది నిజమేరా ఎట్ల మర్రగడుతవు...?"దొర అడిగిండు.

"ఏముంది దొరా.. పేనెం మడుగు మీద వాగుకు అడ్డం కట్టగట్టాలె. మడుగుల నీళ్లు కమ్మి మీదికి ఎక్కుతయి. అక్కడి నుంచి చెరువులకు కాలువ తవ్వాలె" భూమయ్య అన్నడు.

"అది అయ్యే పనిగాదు దొరా...అయ్యేదుంటే మన తాతలు తండ్రులే చేత్తురు" కాందారి రాజయ్య అన్నడు.

"ఒరే..కాందారీ". దొరపిలిచిండు. గొంతులో ఏదో కోపం ఉంది.

"ఆ..దొరా..." కాందారి.

"నువ్వు ఎన్నేండ్లుంటవురా..."

"ఏమోదొరా...తెలువది".

"నీ బుద్ది తెలిసిన్నుండి ఎప్పుడన్నా కరువువడి చెరువు ఎండిందారా..."

కాందారి రాజయ్యకు దడుగు పుచ్చుకుంది. మాటలు తడవడుతున్నయి. దొర ఏదో తిడుతడని అనుకుంటనే 'లేదు దొరా...ఎప్పుడూ ఎండిపోలేదు.'అన్నడు.

"మరి కాలువ ఎప్పుడు తవ్వమన్నవురా...ఎప్పుడూ కాలమయింది. వరుదకే చెరవునిండింది. వాగును మర్ర గట్టాలనే ఆలోచనే రాలేదు. ఇప్పడు ఎండిందిగా బట్టి ఆ అవసరమచ్చింది" అన్నడు దొర.

అందరూ తలుకాయ ఊపింద్రు. అర్థం అయినా కాకపోయినా 'అవును దొరా' అన్నరు.

'ఓరే కాందారీ...భూమడి ఆలోచన మంచిది. రేపటి నుంచి పేనెం మడుగుల వాగుకు అడ్డంగా కట్టగట్టాలె. ఊర్లె ఎందరుంటె అందరు...ఆడోళ్లు మొగోళ్లు నడువాలె. కాలువ తవ్వి నీళ్లను చెరువులకు తేవాలె'. దొర చెప్పిండు.

"ఒక దిక్కు కాలువ పని, ఇంకో దిక్కు కట్టపని, రెండూ నడువాలె. లేకుంటే నీళ్లు ఆగినంక కాలువ పని నడువది. నీళ్లు ఆగమైతయి." ఒక పెద్ద మనిషి చెప్పిండు.

దొర కులానికో పెద్ద మనిషిని చేసి పని అప్పజెప్పిండు. అందరి మీద కాందారిని పెద్ద చేసిండు.

తెల్లారే పని మొదలయింది. పేనెం మడుగు ఊరికి తలాపున ఎత్తు మీదుంటది. అక్కడ నుంచి చెరువులకు కాలువ గనుక తవ్వితే బొల బొల నీళ్లు వస్తయి.

కాందారి ఇప్పుడు ఊరుకు పెద్దయిండు. అందరినీ భయపెడుతుండు. బెస్తోళ్లు మంచి చాప దొరికితే కాందారి ఇంటికి పంపుతుంద్రు. తెనుగోళ్లు మంచి పండు దొరికితే కాందారి ఇంటికి పంపుతుంద్రు. వడ్లోళ్లు, కుమ్మరోళ్లు, కమ్మరోళ్లు, సాకలోళ్లు, మాలోళ్లు,

మాదిగోళ్లు, కాందారికి ఏపనైనా వట్టిగనే మాట మీద చేస్తంద్రు.

చెరువుకట్ట పనితో కాందారికి ఊర్లె కదరు పెరిగింది. దొర ఎనుక దొరయ్యిండు. పంచాదులు కొట్లాటలు అన్నీ చెబుతున్నడు. దొర ఎవలనైతే కులాని కొక్కలను పెద్దమనుసులను చేసిండో వాళ్లు కాందారికి అనుచరులైపోయింద్రు. పొద్దుగూకితే కల్లు బుంగలు ఇండ్ల ముందుంటున్నయి. కాందారికి వాళ్లు, వాళ్లకు కాందారి తోడై ఊరును అరిచేతుల ఆడిత్తున్నరు.

ఎవడు చెప్పినట్టు ఇనకపోయినా కచీరు దగ్గరున్న లాత్‌ఖనికి కట్టికొడుతున్నడు. ఎంకయ్య శాతకు ఎంకయ్య అన్న పెద్దమల్లయ్య పెద్దమనిషి, కాందారి ఎంట తిరుగుతూ పెత్తనం నేర్చిండు మల్లయ్య.

రాళ్లు మన్ను తుంగతో కట్టపెరుగుతుంది. నీళ్ల పారుకం తక్కువగా ఉన్నా, కమ్మిన నీళ్లల్ల కట్టకట్టుడు కష్టంగానే ఉంది. వారం పదిరోజులైతే వట్టిగనే నీళ్లల్ల రాళ్లు మన్నువోసింద్రు. లేని పని పెట్టిండని భూమయ్యను తిట్టనివాళ్లు లేరు. ఒకవైపు కాలువ కూడా తవ్వుతున్నరు.

రెండు పున్నాలు దాటినయి. కట్టగట్టుడు కాలువ తవ్వుడు పూర్తయింది. అన్ని రోజులూ చాపలు తినని ఇల్లులేదు. దొరగారికి కూడా పంపింద్రు. చివరికి చెరువులకు నీటిదార మల్లింది. వారం రోజులు కాలువలోని పొక్కలు బొందలు నింపుకుని నీళ్లు చెరువుల వడ్డయి.

ఆ నాడు ఊరు ఊరంతా చెరువుకట్ట మీదనే ఉన్నరు. "దొర కడుపు సల్లగుండ మంచి పనికి పూనుకున్నడు. ఊరికి బిచ్చం బెట్టిండు" అన్నరు. అందరూ ఆరోజు దొర పేరు జెప్పుకుని దీపం ముట్టిచ్చి దండం బెట్టుకున్నరు. భూమయ్యను యాదిజేసిన పురుగు లేదు. సట్టి సంకురాత్రి వరకు చెరువు మొత్తం నిండింది. చెరువు కింద దున్నుకాలు వట్టింద్రు.

ముసి ముసి మబ్బుతో లేచి నెత్తికి చేతులు వెట్టుకుని కూసున్నడు ఎంకయ్య.

"ఏమాయె..లెవ్వంగనే బర్రెనో దుడ్డెనో సదురక 'నమోనారాయణ' అని నెత్తికి చేతులు పెడితివి" అన్నది కోపంగా ఎంకవ్వ.

"ఏం జెయ్యాలె...చెరువు కింద నాలుగు దొయ్యలుంటే ఎంత మంచిగుండు. అందరిలెక్క నేను గూడా యాసంగికి పని సాగుతుంటిని." అన్నడు ఎంకయ్య బాధగా.

"ఆ...ఉప్పుల పోడగొట్టుకుని పప్పుల దేవులాడితే వత్తదా...ఆనాడు చెరువు కింద దొయ్యల్ని అయ్య గౌండ్ల దానికిత్తుంటే మిట్ట మిట్ట జూసింద్రు. ఇయ్యల్ల అది లేకపాయె ఇది లేకపాయె అంటే వత్తదా..." అన్నది ఎంకవ్వ దెప్పిపొడుస్తూ.

ఎంకయ్యకు నిజమే అనిపించింది. చెరువు కింద కాలు అడ్డం బెడితే పారే పొలం. ముగ్గురికీ మనిషికొక ఎకురం వత్తుండె. కనీసం పొట్ట మందమైనా తిండిగింజలు





వత్తుండె అనుకున్నడు.

"ఇగో...నెత్తికి చేతులు పెట్టుకుని కూసుంటె నడువది. కాందారి రాజయ్యను పట్టుకుని యాడనన్నా పొలంల పొత్తుగూడు. ఇంట్ల ఇద్దరు మొగోళ్లున్నరు. రెండు నాగండ్ల పొత్తుకూడచ్చు"అన్నది. మళ్లీ తనే "మీ అన్నగాడు సూడు. కుంట చేన్ల నాగటి పొత్తుకూడిండట" అన్నది.

పొత్తు అంటే ఎంకయ్యకు గిట్టది. పొత్తు ఎప్పటికీ 'థూ..నె' అంటడు. తను ఏరువడిన కొత్తలో ఇదే దొరవారి శాతలో పొత్తు కూడిండు. పదినాగండ్ల పొత్తు. అందరికీ ఇండ్లల్ల కొడుకులున్నరు. చెయ్యి తిరిగిన సంసారాలు. తనుకొత్త. ఏ పని వాటమూ తెలువది. ఎంత పొద్దున లేచినా బర్రె దొడ్డి సదురుకునే సరికి లేటయితుండె. తను పోయేసరికి నాగండ్లు కట్టి రెండు కోంద్రలు దున్నుదురు.

ఆ పొత్తుకు పెద్ద మనిషి మొగురం ఎల్లయ్య తండ్రి కాశయ్య. కాశయ్య ముందటి నాగలి వట్టాలె. పంట విషయాలన్నీ కాందారితోని అతనే మాట్లాడాలె. ఆయన ఏమాటంటే అదేమాట. దున్నుమని అన్ననాడే దున్నాలె. నాటేద్దామన్ననాడే నాటెయ్యాలె. పని తరువాయంతా ఆయన చేతుల మీదనే నడువాలె. అప్పుడు కాందారి పక్కీరు పెద్ద మైబెల్లి ఉండె. మనిషి మంచోడు. మాటను నమ్ముతుండె.

పొత్తు పెద్ద మనిషి కాశయ్యనే బట్టేబాజి లంగుండె. నాలుగు సుట్లు తిరిగి కాందారి రమ్మన్నడని పోతుండె. పొద్దు గూకేటప్పుడు కడుపు నింద కల్లుతాగి వత్తుండె. వచ్చి సక్కగ దున్నలేదని తిడుతుండె. అందులో అందరికంటే చిన్నోడు తనే. అప్పుడు పది మంది పని చెప్పుదురు. ఎవలపని చెయ్యకపోయిన కోపమే.

అన్నింటికి మించిన పెద్ద బాధ ఏందంటే, కాశయ్య వంగునాగలి అని ఒక పొట్టినాగలి చేయించి పొత్తులకు తెచ్చిండు. ఆఖరున వచ్చినోడు వంగు నాగలి తీసుకొని కట్టుకొవాలె. పొద్దంతా వంగి దున్నుడే. నడుము గుంజుతుండె. వంగునాగలి భయానికి అందరూ ముందుగనే వచ్చి మంచి నాగండ్లు ఏరుకుందురు. తను ఎంత ముందుగ వద్దామనుకున్నా లేటయితుండె. వంగునాగలి తనకే వత్తుండె. నడుము టింగు మంటుండె.

ఒగ యాళ్ల తను ముందుగ వచ్చినా, అందరూ బదులుకుని మంచి నాగండ్లు దొరుకకుంట చేసి, వంగు పాలెనాగలినే ఇద్దురు. పొళ్లు పదివాళ్లు గుద్దులు చెరిసగం అందురు. వడ్లువచ్చినంక తనుచిన్నవాడినని తక్కువనే ఇస్తురు. ఇదేంటిదంటే మళ్ల పొత్తు ఇయ్యమని భయపెడుదురు.

అట్లాపొత్తు మీద మనుసు ఇరిగింది ఎంకయ్యకు. చేసుకుంటే స్వంతమే చేసుకోవాలె. పొత్తులేదు గిత్తులేదు అనుకున్నడు. స్వంతం చేసుకుందామంటే భూమిలేదు.

మొగురం ఎల్లయ్య భూమి అమ్ముతరని వాళ్ల పేరు చెప్పుతనని నెలా రెండు నెలలు ఇంటి చుట్టూ తిప్పుకున్నడు. యాష్టకచ్చి ఎంకయ్యనే మానుకున్నడు. పొగాకు

మాత్రం బాగనే పట్టించిండు. ఎల్లయ్య పొగాకు ఆసకే అట్ల ఆశ చెప్పిండనిపించింది ఎంకయ్యకు.

"ఏమాయె..లెవ్వు. అట్లనే కూసుంటివి. అట్లవొయ్యి కౌలుకో పాలుకో ఎదన్నా పట్టుక రాపో. బుడ్డెడో కుంచెడో నాగులకు వడ్లుతెచ్చి అలుకుదాం" అన్నది ఎంకవ్వ.

"తూడ్ తెరి మయ్యకు చోద్. ఇంకపొత్తు జేత్తాను. అది పోయిపోయి మా అన్నగాని తోనిజేత్తాను. యాడనన్న గరుకపర్లు తిని బతుకుతగనీ పొత్తు చెయ్య" అన్నడు కచ్చితంగా ఎంకయ్య. ఎంకవ్వకు మంట పుట్టింది. "ఇంకేంజేత్తవు మరి. మసీదులది ఇంత మన్ను బుక్కుతవా" అన్నది.

"మన్నెందుకు బుక్కుతనే...భూమిలేదా జాగలేదా. నాది నేను ఖాయం జేసుకుంట మోట బాయి తవ్వుత" అన్నడు.

"ఆ నీకు పట్టభూములున్నయి బాయి తవ్వుతవు. యాడ తవ్వుతవు. ఒకయాడాదుంటె ఒకయాడాది పీకుతది. బాయి తవ్వుతడట బాయి". అన్నది ఎంకవ్వ ఎక్కుసంగ.

ఎంకయ్య బదులు చెప్పలేదు. మౌనంగా బయటకు వచ్చిండు. అన్ననూ తమ్మున్ని ఇద్దరినీ కలిసిండు.

"అన్నా...మనం ఎవలది వాళ్లం చూసుకుందాం. పసలుకు ఒక్కజాగల తిరుగుడు వద్దు. ఎవలది వాళ్లకుంటే ఎవలంతల వాళ్లం పని చేసుకుంటం. పొక్కనో బాయినో తవ్వుకుంటం. కరువుగదా..." అన్నడు.

అన్న మల్లయ్య ఏమి మాట్లాడలేదు. మీసాలు తింపుకుంట కూసున్నడు. తమ్ముడు ఎల్లయ్యనే వద్దె వద్దన్నడు. "ఒక భూమిల పంట పండుతది. ఇంకో భూమిల పంట పండది. ఒక దిక్కే చూసుకుంటే నష్టపోమా" అన్నడు.

"కరువైనా కాలమైనా మనయి నీళ్లు రాని భూములే. ఒక జాగల పంట ఎక్కువ, ఇంకో జాగల తక్కువ పండుతదనుకుంటున్నవు గదా. తక్కువ పండిందే నాకు ఇయ్యుండ్రి. ఎక్కువ పండేది మీరు తీసుకొండ్రి". అన్నడు ఎంకయ్య.

అయినా తమ్ముడు నానలేదు. అన్నమాత్రం సరేనన్నడు. "వాగవుతలిది నువ్వు తీసుకోరా..ఊరిమీదయివేము చెరొకటి తీసుకుంటం. తమ్ముడు అటు ఇటు తిరుగుతనంటున్నడు గదా...మేమిద్దరం ఊర్లెనే తిరుగుతం." అన్నడు మల్లయ్య.

ఎంకయ్య ఒప్పుకున్నడు. ఎల్లయ్య అయిష్టంగానే ఉన్నడు. మల్లయ్యనే ఎల్లయ్యకు సర్దిచెప్పుతున్నడు.

"మా అన్న ఎంత మంచోడు. అడుగంగనే ఒప్పుకున్నడు" అనుకున్నడు ఎంకయ్య. ఎందుకు ఒప్పుకున్నడో మాత్రం తెలువది. ఎల్లయ్యకు కూడా తెలువది. బయటకు వచ్చిన





తర్వాత అసలు విషయం తెలిసింది ఎల్లయ్యకు.

"వాడు మోట బాయి తవ్వుతననుకుంటున్నడురా...తవ్వని తవ్వని. తవ్వినంక సంగతి చూద్దాం!" మల్లయ్య అన్నడు. ఈమాట మనసులోనే ఉంచుకొమ్మని ఒట్టు వేసి చెప్పిండు తమ్మునికి.

అసలు విషయం తెలువని ఎంకయ్య ఇంటికి చేరుకున్నడు. ఒప్పుకోరనుకున్న అన్నదమ్ములు ఒప్పుకోవడంతో అతడికి సంతోషంగా ఉంది. తెల్లారే బిడ్డతోని బాయి మూర్తం చేయించిండు. అంచెలు తట్టలు తాళ్లు, అల్లుకరమ్మని ఎరుకలోల్లకు చెప్పిపంపిండు. ఎంకవ్వ నెత్తికి తట్టగట్టుకుంది. పొద్దు గూకితె తెల్లారితే బాయిదగ్గెరే ఉంటున్నరు.

గడ్డ పార మొనలు, షీకులకు మొనలు పెట్టడానికి కమ్మరి కిట్టయ్యను, నీళ్లు ఎత్తడానికి కుండల కొరకు కుమ్మరి రాజయ్యను మాట్లాడిండు ఎంకయ్య. బాయిల నీళ్లు పడితే ఎంతో కొంత ఇత్తన్నడు.

గోజలకాడి లింగం భార్య పోశవ్వ బాయి పనికే వస్తంది. వీళ్ల సోపతికి ఒక మొగ మనిషిని పెట్టుకున్నరు. ఆరు బిల్లల బాయి. మీద రెండు గజాలు మంచిగనే తెగినయి. రెండు గజాల తర్వాత శాపమొరం పడ్డది. గడ్డపారకు సందు ఇయ్యలేదు. రెండు పంతెకొక్కులను పాతి ఒకదిక్కు మన్ను గుంజుడు ఇంకోదిక్కు గిరుక వెట్టి నీళ్లు గుంజుడు.

నీళ్లు గుంజే పని భూమయ్యది. ఊరిన నీళ్లను ఊరినట్టు గుంజాలె. లోతు పెరిగిన కొద్ది పని ఎక్కువయింది భూమయ్యకు. అంతకు ముందు నాలుగైదు కుండలు గుంజి ఆడుత పాడుత తిరిగితె అయిపోయేది. ఇప్పుడు నీళ్లు ఎక్కువయినయి. బాయిల నీళ్లు మలెవడితే గుంజు గుంజు అంటున్నరు. ఎట్ల తప్పించుకపోవాలని భూమయ్య ఒకసారి తాడును తెంపిండు. తాడు కొరకు ఊర్లెకుపోయి పొద్దు గూకే దాకా రాలేదు.

ఒకసారి కుండను దరికి గొట్టి పలుగ్గొట్టిండు భూమయ్య. కుండ కొరకు ఇంటికి పోయిండు. ఇంట్ల ఎల్లవ్వ ఒక్కతే ఉంది. కచ్చకాయలు ఆడుతుంది. కుండను తీసుకుని వస్తూ గూట్లెపైస కనిపిస్తే ఆగిండు. ఎల్లవ్వ తనను చూడకుంట ఆడుతనే ఉంది.

నయా పైసను జేబులో ఏసుకున్నడు భూమయ్య. వస్తూ వస్తూ రంగయ్య సేటు దుకాణం దగ్గర ఆగిండు. పైస ఇచ్చి కజ్జం కొనుక్కున్నడు. రెండు కంకిల్ల కజ్జం పెట్టిండు రంగయ్యసేటు. కజ్జాన్ని కుండలఏసుకుని తినుకుంట తినుకుంట బాయి దగ్గెరికి వచ్చిండు. వాగుల నాలుగు దోసిళ్ల నీళ్లు తాగిండు. బాయి కాడికి వచ్చినంక కూడా మిగిలింది కజ్జం. తీసి అంగిజేబులో ఏసుకున్నడు.

బెల్లం నువ్వులతో చేసింది అది. అంగిజేబుల ఏసుకుంటే అంగికే అంటింది. నీళ్లను చేదుకుంటూ గడికి కొంత నోట్లె వేసుకుంటున్నడు భూమయ్య. దవుడలు ఆడితే

గుర్తువడుతరని లోపల లోపలనే చప్పరిస్తుండు. ఆడికి లింగం భార్య పోశవ్వ అడుగనే ఆడిగింది. ఏదో సమాధానం చెప్పి తప్పించుకున్నడు భూమయ్య.

అది అంతటితో అయిపోతుందనుకున్నడు భూమయ్య. కానీ ఆయిపోలేదు. దాచుకున్న పైస కనిపించకపోవడంతో ఎల్లవ్వ ఏడ్చుకుంట బాయి దగ్గెరికి వచ్చింది. కూతురు ఏడ్పువిని గావరగా చెట్టు కిందికి వచ్చింది ఎంకవ్వ.

"అవ్వా...నేను పైసను గూట్లెదాసుకున్న. దొరుకుతలేదు" ఏడుస్తూ చెప్పింది ఎల్లవ్వ.

"అయ్యో...యాడపోడగొట్టుకున్నవు బిడ్డా...మంచిగ చూడనుంటివి" దగ్గెరికి తీసుకుని బుదురకిస్తూ అన్నది ఎంకవ్వ.

"చూసిన. యాడలేదు. ఎదురుంగ గూట్టెపెట్టుకున్న" ఏడ్పుగొంతుతోనే అన్నది ఎల్లవ్వ.

"అయితే అది భూమయ్య మాయనే..అప్పటి నుంచి ఏదో సప్పరిత్తండు. పైస ఎత్తుకపోయి ఏదో కొనుక్కున్నట్టున్నడు" పోశవ్వ అన్నది.

భూమయ్య గుండె దడదడమంది. "ఓట్..నేనెందుకు కొనుక్కున్న. రాంగ రంగయ్య సేట్టు కొద్దిగ కజ్జం బెట్టిండు. అదే సప్పరిచ్చిన" అన్నడు.

అతడి గొంతు వణుకుతున్న తీరే అతడిని పట్టి ఇచ్చింది.

"ఆ..నీకు రంగయ్య సేటు ఉత్తగనే పెడుతాడు. నేను అడుగత జరాగు. ఇంటి దొంగ పాణగండమన్నట్టుంది. పోరికి మొన్న వాళ్ల తాత ఇచ్చిండు. పాణం పాణంమోలె దాసుకుంటే అయింత మాయం జేత్తావు" తిట్టింది ఎంకవ్వ.

"అప్పటి నుంచి కీసలకు నోట్లెకు చెయ్యివెడితే ఇసోంటి పని ఏదో చేసిండనే అనుకున్న" పోషవ్వ అన్నది.

ఎంకయ్య ఇంకో కైకిలి మనిషి షీకులు అందుకుని గన్నులతో కొట్టేది కొడుతున్నరు. మన్ను తొలిచేది తొలుత్తున్నరు. తొలిచిన మట్టిని తట్టలకు ఎత్తుతున్నరు. మీద జరిగిన సంగతులు వాళ్లకు తెలువయి. "ఏమాయె మట్టి తట్ట" అని ఎంకవ్వను, నీళ్లు తోడు మని భూమయ్యను అదిలిస్తున్నరు.

బాయి రోజుకు ఒకటి రెండు బిళ్లలు తెగుతుంది. ఊరిన నీళ్లు బిళ్లలల్లకు మలిపి పక్కన బిళ్ల పడుతున్నరు. బీళ్లలల్ల నీళ్లు భూమయ్య తోడిపోత్తున్నడు. తట్టెడు మన్నునింపికేక వేస్తే తట్టను ఇద్దరు ఆడోళ్లు గుంజుతున్నరు.

'ముందుగల్లపోయి రంగయ్య సేటుకు చెప్పాలె.వట్టిగనే పెట్టిన అనుమనాలె.' అనుకున్నడు భూమయ్య. అనుకున్నట్టే తవ్వుడు సాలిచ్చి, తట్టలు పారలు సదురుతుండంగనే ఇవుతలపడ్డడు. అక్కడ పరుగందుకున్నడంటే దుకాణం ముందే ఆగిండు.





దుకాణంల గుడ్డి దీపం ఎలుగుతుంది. సేటు ఒక్కడే కూచున్నడు. ముందే గల్ల పెట్టె. "సేటు సేటు..నేను అప్పుడు పైస కజ్జం కొనుక్కున్నగదా...మా అత్త అడుగుతె వట్టిగనే చేతులేసిన్నని చెప్పు" అన్నడు.

సేటుకోపానికి వచ్చి ''దోత్ లంగముండకొడుకా...సందేల్ల అవద్దమాడుతారురా...అయినా ఇయ్యల్ల పైస ఎత్తు కచ్చినవు. రేపు ఇంకోటి ఎత్తుకత్తవు. కాపుదనపోనికి ఇది కూడుతాదిరా..." అన్నడు సేటు.

భూమయ్యకు కోపమచ్చింది. నీసంగతి సూత్తబిడ్డా అనుకున్నడు.

ఆ రోజు ఇంట్ల దుమ్ము దుమ్ములొల్లి. ఎంకయ్య ఓదిక్కు, ఎంకవ్వ ఓదిక్కూ తిట్లు అందుకున్నరు. పైస వట్టి గత్తదా అని కొట్టందే పాపం.

"ఎంజేత్తె పైసరావాలె...ఎంత కట్టం జేత్తే పైసరావాలె...కరువుల పైస కజ్జం తింటావు" అని ఇయ్యర మయ్యర తిట్లందుకున్నరు. భూమయ్య మాత్రం ఊలేదు, ఉల్లిగడ్డలేదు. రెండు మోకాళ్ల సందున తలుకాయపెట్టుకుని కూసున్నడు.

ఆ రాత్రి తిండి తినలేదు భూమయ్య. గొంగడి బొంత భుజాన ఏసుకుని దొడ్ల బండ మీదికి వచ్చిండు. చలికాలం కాబట్టి దొడ్లె అర్రల పడక. లింగం ఇంకా రాలేదు. రెండు గూన పెంకుల్ని అందుకుని పైస ఆకారంలో అరగదీసిండు భూమయ్య. లింగం రాంగనే అసలు సంగతి చెప్పి పైస బెల్లం తెమ్మన్నడు. లింగం అనుమానపడుకుంట రంగయ్య దుకాండ్లకు పోయి బెల్లం పెట్టుమన్నడు.

రంగయ్యకు శెత్వారం. కండ్లు సరిగ్గా కనపడయి. పైస బిల్లను దీపం దగ్గరగా పెట్టి కంట్లే కన్నువెట్టి చూసుకుని, అటు మర్రేసి ఇటు మర్రేసి గల్ల పెట్టెల ఏసుకున్నడు. రెండు బెల్లం పిడుకల్ని ఇచ్చిండు.

లింగంకు ధైర్యమచ్చింది. మల్లో పైస తెచ్చి పల్లికాయ కొన్నడు. ఇంకొకటి తనే తయారు జేసుకుని పైసది పొగాకు కొనుక్కున్నడు. ఎవలురా మీరు అని అడిగితే ఏదో పేరు చెప్పిండు లింగం.

పల్లికాయ బెల్లం కూరుకురాత్రి దాకా కూసుండి బుక్కిండ్రు. 'కోమటోడు వద్దురావద్దు అంటే చెప్పతాడు. ఇప్పుడు మంచిగుందా ఆట'. అనుకున్నడు భూమయ్య.

తెల్లారి గల్ల పెట్టె తెరిచి చూసినంక రంగయ్య సేటు మొత్తుకునుడేగాదు. "లాభం గువ్వలకు తెత్తివి. నీ గుడ్డి తలపండు వలుగ. నన్ను పిలువద్దా. వట్టి బోకాసులు తీసుకుంటావు. పైస తెలువది బోకంచె తెలువదా." అని సేటు భార్య ఒక్కటే తిట్టుడు.

"ఎవడు జేసె...లంబిడి కొడుకు...ఎంత పనిచేసే" అని సేటు తిట్టుడే తిట్టుడు. ఈ విషయం ఊరంతా తెలిసింది. ఊర్లె నాలుగు దుకాణాలుంటే ఇద్దరు గుడ్డోళ్లు. గుడ్డోళ్ల గల్ల పెట్టెలల్ల రోజుకొక్క పెంకాసు బయటపడుతుంది. ఇట్లగాదు అట్లగాదని పైస బిళ్లరాంగనే 'ఏమాయెనే ఉన్నవా' అని భార్యలకు కేకలేత్తండ్రు. మంచి పైస తెచ్చినోడు

అక్కడనే ఉంటండు. బోకంచె తెచ్చినోడు ఉరుకవడుతండు.

వాగుకు అడ్డకట్ట కట్టడంతో పేనెం మడుగుల నీళ్లు పెరిగినయి. మడుగుకు గూడలు మొదలయినయి. కొత్త కాలువ నుంచి చెరువులకు నీళ్లు పడుతుంటే దినదినం నీటి మట్టం పెరిగి కట్టకు అలలు తడలు గొట్టినయి. నీరటికాళ్లు, సుంకరోళ్లు, మస్కూరోళ్లు కట్టమీదనే పొద్దు గడుపుతున్నరు. చెరువు నిండింది.

అప్పుడే ఎంకయ్య ఎద్దు కూలవడ్డది. ఎద్దంటే మామూలు ఎద్దుకాదు. మనిషికి బుద్ధి చెప్పినట్టే! బండి గట్టి కూసుంటే ఇంటికి తెచ్చేది. నాగలి కట్టుకుంటే పనున్నప్పుడు పనున్నట్టు....లేనప్పుడు లేనట్టు మాటను బట్టి నడుచుకునేది. ఎప్పుడన్నా పని బాగా ఉండి నాగలి దున్నంగనే విడిచిపెట్టి ఒడ్లపనిమీద పడితే, పొద్దంతా ఎక్కడ తిరుగునోగానీ పోద్దుగూకేసరికి తోటి ఎద్దుతో దొడ్లెకు వచ్చేది.

ఫలానా నాడు నడువలేదన్నది లేదు. ఫలానా నాడు దొంగతనంగా దెంక పోయిందన్నది లేదు. పదేండ్ల పొద్దు కష్టం చేసింది. అసలు అది ల్యాగప్పుడే సచ్చిపోయేది. కష్టం చేసే బాకి ఉంది. కష్టం చేసింది.

అది ల్యాగగా ఉండి మందల తిరుగుతున్ననాడు మోటపొలంల మంద వెట్టిండు. దొడ్లె ఎరువును పొలందాకా ఎందుకు మోసుడని ఎండకాలం రాత్రిపూట గోజలన్నింటిని పొలంలనే మంద వెడుతున్నడు ఎంకయ్య.

చేను చుట్టూ అడివే. అడవిలో గుడ్డేలుగులున్నయి. జిట్టపులులున్నయి. పొద్దంతా కనిపించయిగనీ రాత్రిపూట మందలమీద దాడి చేస్తయి. అందుకని మందచుట్టూ వాయిలి బరిగెలతోటి నిలివెడు నిలివెడు తడుకలు అల్లి కట్టిండు. మంద నడుమ నిలివెడు పందిరి వేసి పందిరి మీద కావలి పంటున్నడు ఎంకయ్య.

రాత్రిపూట నాలుగైదు సార్లు వచ్చి షికారు చేసింది జిట్టపులి. తడుకలు ఉండుట్ల సందు దొరకలేదు. వచ్చినప్పుడల్లా ఆవులు బెదురుతుంటే లేచి అదిలించేవాడు ఎంకయ్య.

ఒకసారి ఆవులు వచ్చిపోయే పనుగడి దగ్గర పన్నట్టుంది ల్యాగ. పనుగడి సందుల నుంచి ల్యాగయి ఎనుక రెండు కాళ్లందుకుంది జిట్టపులి. ల్యాగ భా....భా....అని మొత్తుకుంది. ఎంకయ్యకు మెలకువయింది. మంచెమీది నుంచి దుంకి 'జో...జో...' అంటూ పనుగడి దగ్గెరికి ఉరికిండు.

జిట్టపులి ల్యాగను మరింత బలంగా గుంజింది. ల్యాగ పనుగడిసందుల నుంచి సగం బయటకు వచ్చింది. ఎంకయ్య పరుగు పరుగున వెళ్లి ముందటి కాళ్లను అందుకున్నడు. ల్యాగ బ్యా....బ్యా....అంటుంది. తడుక అవుతలపులి ఇవుతల ఎంకయ్య. నడుమల్యాగ. జిట్టపులి కండ్లు మెరుత్తున్నయి. చీకట్ల మచ్చలు మసక మసకగా కనవడుతున్నయి.

'జో...జో...'అంటూ మెల్లెగా అదిలిస్తూ కట్టెతో తడుకను గొడుతూ ల్యాగను







గుంజుతున్నడు ఎంకయ్య. జిట్టపులికి కోపమస్తే అమాంతం తడుకమీది నుంచి ఇవుతలికి దుంకుతది. అందుకని రెచ్చగొట్టకుండా 'జో...నీగత్తర్రాను...యానంగ జూస్తివి..'అంటూ అలికిడి చేస్తున్నడు. కాళ్లను మాత్రం వదులుత లేదు.

ల్యాగ అరుస్తనే ఉంది. ఆవులు బెదురుతున్నయి. కొంతసేపటికి ల్యాగను విడిచిపోయిందిపులి. ల్యాగకు ఈపునిండా గాయాలె. రక్తాలుగారుతున్నయి. బతుకనే బతుకుదనుకున్నడు ఎంకయ్య. పుండ్లమీద బండి కందెన రాసిండు. మందు చెక్కలు దంచి పెట్టిండు. కడుపులకు మందువోసిండు. వారింపదిరోజులకు తోలు అట్టలుగట్టి ల్యాగ తెలివిల వడ్డది. నెలరోజులు దొడ్లెనే ఉంచి పచ్చి గడ్డి ఏస్తే కొద్దిగా ఈడేరి ఈక తీడింది.

అటువంటి ల్యాగ సూత్త సూత్తుండంగనే పెకిలింది. కోడెదూడయింది. కొమ్ము అందుకుంటే బస్సుమని బుసగొట్టి లావట్టి ఎత్తేత్తుంది. కొమ్ములకు పగ్గం పెట్ట తరంగాలేదు ఎంకయ్యకు. దొడ్లె దులాల మీద నుంచే మెడకు మొద్దును తలిగించిండు ఎంకయ్య. మొద్దుతో వారం పదిరోజులు తిరిగినంకగానీ ఎద్దు మెత్తవడలేదు. కొద్దిగా ఉరుకులాట తగ్గింది.

తర్వాత కొన్ని రోజులు నాగలి వెంట నడిపించి బురదలో నడిచే అలవాటు చేసిండు. ఒక పసలంతా అలాగే మెదిపి నాగలికి అలవాటు చేసిండు. తర్వాత యాడాదికి శేరుగొట్టిండు. ఎత్తుకు ఎత్తు...ఎత్తుకుదగ్గ చిత్తు. గిత్తను చూస్తేనే భయమయ్యేది ఎంకయ్యకు. దానికితోడు కోపం. గిత్త బుస్సు బుస్సుమనేది.

శేరుగొట్టినంక గిత్త ఎద్దయింది. పెయ్యంతా బర్రలున్నయని ఎద్దుకు బర్రలుగాడని పేరుపెట్టిండు ఎంకయ్య. మూడుపూటల గడ్డి, శెలుకపిండి...ఎద్దు పలిగింది. ఎంత కోపముండెనో అంత తాతిపరంల వడ్డది. బుద్ధి చెప్పినట్టు...కండ్ల సైగతో, నోటిమాటతోనే నడుచుకునేది.

అటువంటి ఎద్దు పదేండ్ల కట్టంజేసి కూలవడ్డది.

బాయి తవ్వడు ఆపి సందెడంత పచ్చిగడ్డి కోసుకుని కొట్టం దగ్గరికి వచ్చిండు ఎంకయ్య. ఎప్పుడు బస్సుమందో...దూలాల కింద నాలుగు కాళ్లు ఆరజాపింది ఎద్దు. మీద కాకులాలుతున్నయి.

ఎంకయ్యకు కండ్ల పొంటి నీళ్లు రాలినయి.

'నీ ఉమ్మర్ మీద ఎట్లుండెనే అవ్వా...ఇదే దూలాలు ఎక్కిపగ్గమేసిన. ముందటికి రావాలంటే భయపడుదుంటిని. ఎసొంటి దానివి ఎట్లయితివి' అనుకున్నడు.

మాదిగోళ్లకు చెప్పితే వచ్చి కాళ్లకు తాళ్లుగట్టి ఎత్తుకపోయింర్రు. ఆ రోజు ఏపని ముట్టలేదు ఎంకయ్య. మనసంతా జాలిమాలి అయింది. 'ఎన్నడోసచ్చేది నాకు కట్టం జేసే బాకి ఉంది' అనుకున్నడు.

ఎద్దు తలుకాయ బొక్కను తెచ్చి మోటపొలంకాడ కట్టెకు నాటుకున్నడు ఎంకయ్య.

C C C C

సమయం రాత్రి ఒకటి దాటింది.

ముందున్న కాగితాలు పూర్తయినయి. నవల చదువుతుంటె ఆసక్తి పెరుగుతుంది రవికిరణ్‌కు. మొత్తం భాగాలను పంపనందుకు కోపం కూడా వచ్చింది. వెంటనే సెల్ అందుకున్నాడు రవికిరణ్. అర్థరాత్రి పూట అని చూడకుండా ఫోన్ చేసాడు.

"హల్లో...రవీ...సీరియల్ చదివావా?" శివశంకర్ ఆవులిస్తూ.

"చదివాను"

"ఎలావుంది".

"ఎలా ఉండడమేమిట్రా బాబూ...ఇది జీవితం కదా...సస్పెన్సు థ్రిల్లింగ్ ఉండదు గదా. ఉండేదంతా కష్టాలు కన్నీళ్లే....తొందరగా మిగతా నవల పంపించు" రవికిరణ్ అన్నాడు.

"మొత్తం లేదు. కొన్ని భాగాలే ఉన్నాయి."

"అదేం..."

"చెప్పానుగా...దాని రచయిత ప్రకాశ్ మా ఫ్రెండ్. అదే ఊర్లో ఉంటాడు. కొన్ని భాగాలు మాత్రమే రాసాడు. మొన్నటి వరకూ కాంటాక్టులో లేడు. మొన్న కలిసినప్పుడు ఇక రాయలేనన్నాడు." చెప్పాడు శివశంకర్

"సరే..ఉన్నది పంపించు..." అంటూ లేచాడు రవి.

ఎదురుగా ఐశ్వర్య. అంతవరకూ నిద్రపోలేదు. ఆమె కళ్లనిండా నీళ్లు.

C C C C

సెల్ మోగింది. పేజి మేకప్ చేస్తున్న ఎడిటర్ శివశంకర్ ఆగి సెల్ అందుకున్నాడు. నెంబర్ చూసి 'హలో....ప్రకాశ్.....' అన్నాడు ఆతృతగా.

'హలో.......'అన్నాడు ప్రకాశ్.

"ఊర్లో పరిస్థితి ఎలా ఉంది....?" అడిగాడు శివశంకర్.

"దారుణంగా ఉంది సర్....ట్యాంకర్లతో ఇంటింటికి పది బిందెల నీళ్లు సరఫరా చేస్తున్నారు. మక్క పంటవేస్తే ఎండిపోయింది. ఊరు చుట్టూ పచ్చటి మొక్క లేదు. జనాలకు పంటల ఆలోచన గాదు....తాగడానికి బిందెడు నీళ్లు దొరికితే చాలనుకుంటున్నారు. అదృష్టం బాగుండి రెండు బోర్లు సక్సెస్‌ఫుల్‌గా పోస్తున్నాయి. ఒకటి ట్యాంకులకు ఒకటి ట్యాంకర్లకు వాడుతున్నారు. ట్యాంకర్అందని వాడలకు నల్లాలతో సరఫరా చేస్తున్నారు." ప్రకాశ్ గొంతులో భయం.

" ఇప్పుడే ఇలాఉంటే ఎండాకాలం ఎట్ల" అడిగాడు శివ దీర్ఘంగా నిట్టూర్చి

" ఊహించలేం సార్" అన్నాడు ప్రకాశ్.







'సీరియల్ తరువాయి భాగం అందలేదు...?" అడిగాడు శివ.

"రాయలేను సార్".

"ఎందుకు...?"

ప్రకాశ్ గొంతు పెగల్చుకుని "నిన్ననే ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు సార్. అతడి కుటుంబాన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది. మనసు మొద్దు బారిపోయింది..." అన్నాడు నెమ్మదిగా.

శివశంకర్‌కి ఆతృత ఎక్కువయింది. 'ప్లీజ్...ప్రకాశ్....ఈ పరిస్థితిని మనం చర్చకు పెడదాం...కారణాలను అన్వేషిద్దాం. ఇది కరువుకాదు. నీటిపైదాడి. దీని ఫలితం ఆత్మహత్యలు...ఆకలిచావులు మాత్రమే కాదు. అది తొలిప్రస్థానమే! దీని ఫలితాన్ని ఊహించలేం. త్వరలోనే పెను సంక్షోభం రాబోతుందనడానికి ఇది నాంది మాత్రమే! అందుకే నువ్వు ఈ కథను పూర్తి చెయ్యాలి. గతాన్ని ఎక్కువగా చూపి, వర్తమానాన్ని కొంత టచ్ చేసి, భవిష్యత్తును పాఠకులకు వదిలేద్దాం" అభ్యర్థనగా అన్నాడు.

ప్రకాశ్ కొంత మెత్తబడ్డట్టుగా "సర్....దీనికి నీటి ప్రాజెక్టులు నిర్మించుకోకపోవడమో భూమి నుంచి నీళ్లను తీసుకోవడమో ప్రధాన కారణం కాదు. వర్షపు నీటిపై అంతులేని నిర్లక్ష్యమే ఈ సంక్షోభానికి కారణం. ఉచిత విద్యుత్తు ఇచ్చుడో, ప్రాజెక్టులు నిర్మించుడో ...మారిటోరి యాలు, ఎక్స్‌గ్రేషియాలు ఈ సమస్యకు పరిష్కారాలే కాదు. సమస్యను పైపైన చూసి సంక్షోభాన్ని గుర్తించకుండా చేసే కంటి తుడుపు చర్యలు ఇవి" అంటూ ఆగిపోయాడు.

"ప్రకాశ్. నువ్వన్నది నిజం. ఎంత సేపు ఆర్థిక కోణం నుంచే చూస్తున్నారుగానీ పర్యావరణ కోణంలోంచి చూడడంలేదు. దీన్ని నేను కరువంటే ఒప్పుకోను. పంటలు పండకపోతే అది కరువు. పంటలు కాదు చూడాల్సింది. మూడు నాలుగు వందల ఫీట్లు లోతుకుపోయినా చుక్క నీరు లేదు. ఇది కరువుకాదు. సంక్షోభం. ముందు ఆ సంక్షోభానికి పరిష్కారం కనుక్కోవాలి. లక్షల ఎక్స్‌గ్రేషియాలు పంచితే మాత్రం ఒక నీటి చుక్క భూమిలోకి చేరుతుందా? కోట్ల ఖర్చుతో ఎక్కడో ఒక ప్రాజెక్టు కడితే మాత్రం అంతటా భూగర్భజలం పెరుగుతుందా....? అందుకే అడుగుతున్నాను. ఈ కథను కంటిన్యూ చేయండి. దీన్ని చర్చకు పెడదాం....ఈ సంక్షోభ సంధి కాలాన్ని అందరి దృష్టికి తెద్దాం" అన్నాడు శివశంకర్.

ప్రకాశ్ బరువుగా "ట్రైచేస్తాన్ సార్...కానీ మీకు హామీ మాత్రం ఇవ్వలేను" అన్నాడు.

"ఓ.కే. థ్యాంక్స్ మీరు రాయగలరు అంతే! నాకోసం కాదు. ముందు తరాలకోసం. ఇంటర్‌నెట్‌లో సీరియల్‌కు మంచి ఫాలోయింగ్ ఉంది. కరువు, ఆత్మహత్యలు వీటి మీదనే సాగుతుంది కదా అంటున్నారు. అవేవి కాకుండా నీటి సంక్షోభంలో ఒక కొత్త కోణం నుంచి మన కథ ముందుకు సాగాలి." అన్నాడు.

"చెప్పాను గదా...వీలైనంత వరకూ రాయాలని ప్రయత్నిస్తాను." సెల్‌కట్ చేసాడు ప్రకాశ్.

శివశంకర్ పనిలో పడ్డాడు. మనసు పనిలో నిమగ్నం కావడంలేదు. ఏవో ఆలోచనలు. అస్పష్టమైన ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

రైతులు, పంటలు, వానలు, కరువు, పురుగుమందులు, చావులు వీటన్నింటిని పక్కకు పెట్టి అన్నింటికి మూల కారణమైన నీటి గురించి ఆలోచిస్తే....నీటికి మూలాధారమైన భూగర్భం గురించి ఆలోచిస్తే పెను సంక్షోభం ముందుగా ఉన్నట్లు అనిపించింది.

ఏ మేఘమథనాలు తల్లికడుపును నింపగలవు...?

ఏ పరిష్కారాలు సంక్షోభాన్ని పూడ్చగలవు...?

ఇది ఏ ఒక్కరితోనో ఒక్కరోజులోనో ఏర్పడ్డ సంక్షోభం కాదుగదా...?

ఈ సంక్షోభానికి పునాదులు ఎక్కడపడ్డాయి....? గుర్తించడంలో వైఫల్యం చెందారా...? గుర్తించినా పరిష్కారం కనుగొనడంలో వైఫల్యం చెందారా...? వైఫల్యం ఎక్కడ జరిగింది...? ఆలోచనలో పడ్డాడు శివశంకర్. తమ ఇద్దరి మధ్య జరిగిన సంభాషనే సీరియల్‌కు ఇంట్రడక్షన్‌గా రాసాడు. తర్వాత రవికిరణ్‌కు మిగిలిన సీరియల్ భాగాలను పంపించాడు.

C C C C

క్లౌడ్ సీడింగ్‌లో ఏదో ప్రాబ్లెమ్ ఉండి ఇబ్రియిల్ వెళ్లివచ్చాడు రవికిరణ్.

వస్తూనే సీరియల్ భాగాలను ముందేసుకుని కూర్చున్నాడు. చిన్ననాడు చూసిన ఊరు కండ్లముందు కదులుతుంది. వాగులు,నీళ్లు కండ్లముందు పారుతున్నట్టుగానే ఉన్నాయి.

## 5

మోట ఇప్పటిదిగాదు. మోటబాయి ఇప్పటిదికాదు. కానీ ఆ ఊరిలో మోటబాయి మొదటిది ఎంకయ్యదే! ఊర్లె మోటగొట్టే మొగోడు లేడు. మోట నడిచే ఎడ్లు లెవ్వు. మోటబారి తవ్వే సుతారి లేడు. ఉన్నకాడికి చెరువు పారుకమే.

ఎంకయ్య మోటబాయి తెగుతుంది. ఊరంతా బాయిని చూస్తున్నరు. తోచిన సలహా చెప్తుతున్నరు. పొద్దుపొడువక ముందే బాయిలకు దిగుతుండు ఎంకయ్య. కూరుకురాత్రే గటుక ఎసరువెట్టి కుండెడు గటుక పోత్తుంది ఎంకవ్వ. గటుక తాగి బాయిలకు దిగిండంటే చీకటి పడ్డంకనే పైకి ఎక్కుతుండు. బాయి ఒడ్డుకు కట్టెను పాతి బాయిలకు దిగడానికి తాడును కట్టుకున్నడు ఎంకయ్య. బాయి దరికి తంతెలు తవ్వుకున్నడు.

ఒకనాడు తాడు తెగింది. ఎల్లెనుకలబాయిల వడ్డడు. నడుము ఇరిగినంత పనయింది. బాయిల రెండు గజాల నీళ్లున్నయి. అందుకని పాణాలు దక్కినయి. ఈ ముచ్చట ఎవలతో చెప్పలేదు ఎంకయ్య.

ఒకనాడు పైకి ఎత్తుతున్న తట్టనుంచి కిందికి రాయి రాలింది. సరిగ్గా అది ఎంకయ్య నెత్తిమీద పడ్డది. పుర్రెపలిగి రక్తం కారింది. కండ్లు తిరిగి పడిపోయిండు





ఎంకయ్య. గంటసేపటిదాకా లెవ్వలేదు. గాయానికి కాసు సున్నం బెట్టి కట్టుగట్టింది ఎంకవ్వ. కండ్లు తెరిచేదాక ఏడ్సుడేగాదు.

బాయి ఆరుగజాలు తెగింది. నీళ్లు కుండతో గుంజితే దంగుతలెవ్వు. ఇంక తవ్వుడు ఆపుదామనుకున్నాడు. అప్పుడే భూమయ్య అన్న నర్సయ్య భూమయ్యను చూద్దామని వచ్చిండు. నర్సయ్యకు మోట గురించి తెలుసు. బాయిపని వరుసచూసి మెచ్చుకున్నడు.

“మామా...తవ్వుతే ఇప్పుడే తవ్వాలె...ఊలుమీద ఊలు దంగుతది. ఇప్పుడు కాదంటే పనిడీలాలవడుతది. నీళ్ళుదంగ కుంటే మోటవెట్టు. మోటతోనే నీళ్లు దంగగోట్టు” అన్నడు.

మూడు రోజులు నిలబడి మోటను అమిరిచ్చిండు. రెండు తాటి చెట్లు కొట్టి అడ్డం ఏసిండు. సొరెలు తవ్వి రెండు చింత మొద్దులు పాతిండు. టేకు బదుతలు ఏసిండు. నాలుగు అడుగులు కిందికి దిగితే పెద్ద జంగల్. తీరొక్క కట్టె. అడ్డతొక్కులకు టేకు మొద్దువెట్టి తొళ్లు గొట్టి కొమిరెలు గట్టిండు. పంతెకొక్కులు చేసి పిల్లతొక్కులు వెట్టిండు నర్సయ్య.

తాటి మొద్దుతోని దోని, బోదర్‌దోని కొట్టిండు నర్సయ్య. ఇద్దరు వడ్లోళ్లు, వీళ్లు ఇంటింటిరాజులు కలిసి నాలుగోరోజునాడు పిల్ల దూలాలు పాతి చెక్క గిరుక చేసింద్రు.

నర్సయ్యనే మామను సిరిసిల్ల అంగట్లకు తోలుకపోయి మోట బొక్కెన కొనుక్కచ్చిండు. శాతమాదిగోనికి పని దొరికింది. రెండు రోజులు పొద్దుమాపు తండ్లాడి పగ్గాలు అల్లిండు. దందెడకు వారం పట్టింది. ఆ వారంలనే తొండం ముడిచి వార్లు కుట్టిండు.

మాదిగోడు, వడ్లోడు, కమ్మరోడు, ముగ్గురు రెండు రోజులు బాయి దగ్గరనే ఉన్నరు. మూడవనాడు మోట కుదిరింది. మోట మంచిగ కుదురాలని పోషమ్మకు, మైసమ్మకు మొక్కింది ఎంకవ్వ. బోదర్ ముందట కోడిపిల్లను కోసింద్రు. మోటబారిని తవ్వింద్రు. నర్సయ్యను చూసి మోట పని వరుస మొత్తం నేర్చిండు ఎంకయ్య.

ఎంకయ్య మందల నుంచి రెండు కోడెలను మలిపి షేరు గొట్టిండు. రెండు రోజులు మోటకు మెదిపిండు. మోటపని మొదలు వెట్టిననుండి ఎడ్లు మెదిగి మోట నడిచేవరకు ఉన్నడు నర్సయ్య. ఎప్పుడన్నా ఇంటికిపోతే పొద్దుగూకపోయి తెల్లారే సరికి ఇక్కడ ఉంటుండే.

నర్సయ్య ఉన్నన్ని రోజులు భూమయ్య నోరు మెదుపలేదు. చెప్పిన పని చేసిండు. ఉన్నడా లేడా అన్నట్టే ఉన్నడు. ఎంట తిరిగి మోటపనినంతా నేర్చుకున్నడు. మోటగొట్టి నీళ్లన్నీ దంగదీసిండు. తొండంతాడును గుంజి బొక్కెన నింపుడు, తీపి పగ్గం విడిచి బోదర్‌లో నీళ్లుపోసుడు, నాలుగు చుట్లకే నేర్చిండు భూమయ్య.

పని అయిపోయినంక నర్సయ్య పోతుంటే వట్టిగ పంపుడు ఎందుకని మందలనుంచి ఆవును ల్యాగను కొట్టిచ్చిండు ఎంకయ్య. నర్సయ్యకు గోజలు ఎక్కువలెవ్వు. ఆవును మురుసుకుంట కొట్టుకపోయిండు.

బాయిపని మళ్లీ మొదలయింది. మోటగట్టినంక నీళ్లు ఎంటయెంట ఖాళీ అయితున్నయి. తవ్వుడు తొందరగా అయితుంది. అప్పుడో బొక్కెన ఇప్పుడో బొక్కెన కొరకు పొద్దంతా ఎడ్లను బార్లెనే నిలబెట్టుడయితుంది. ఎడ్లను గోసపెట్టుడెందుకు అనుకున్నడు ఎంకయ్య.

'గోజ కలకలానద్దు. గోజ కలకలాంటే పంటపండది. ఇంటికి ఎచ్చుఉండది.' అనుకున్నడు. ఇద్దరు కైకిలోల్లను పెట్టిండు. ఎడ్లకు బదులు వీళ్లే మోటను గుంజుతున్నరు.

ఒకనాడు మోటను బలంగా గుంజుతడని మొగురం ఎల్లయ్యను బదలు రమ్మన్నడు ఎంకయ్య. బదలు అంటే అతనికి పని ఉన్ననాడు ఎంకయ్య పోవాలె.

'మోట పని బలువుగుంటది. ఆడిమొగ బదలైతెనే వత్త' అన్నడు ఎల్లయ్య. అంటే ఎల్లయ్య ఒక్కడత్తే వీళ్లు ఇద్దరు పోవాలె.

"అయితాయెరా" అన్నడు ఎంకయ్య.

సగం పొంటె బాయి తవ్వినంక మోట మొదలయింది. ఎంకయ్య, ఎల్లయ్య కాని వట్టుకుని ముందట గుంజుతున్నరు. భూమయ్య, పోశవ్వ, ఎంకవ్వ, దందెడతాడు వట్టుకుని గుంజుతున్నరు. నాలుగు బొక్కెన్లు గుంజింద్రు. ఐదవ బొక్కెనకు సగం దూరం వచ్చినంక కుంచంతాడు తెగింది. దన్‌మని నిండు బొక్కెన బాయిల వడ్డది. బలంగా గుంజుతున్నోళ్లు ఒక్కసారి బొక్కెన తెగిపోయేసరికి ముందుకు సొలిగిపడ్డరు.

మొగురం ఎల్లయ్య దొడ్డు పొడువూ ఉన్న మనిషి. బొచ్చెకు కానిని ఆనించుకుని బలంగా గుంజుతున్నడు. అట్లనే ముందుకు సొలిగిపడ్డడు. ఎంకయ్య మాత్రం నిలదొక్కుకున్నడు. భూమయ్య, ఎంకవ్వ, పోషవ్వలు ఒకలమీద ఒకలు పడ్డరు.

ఎంకయ్యకు కాళ్లు చేతులు వోయి కడుపుల జొచ్చినయి. ఎల్లయ్యను చెట్టుకింద పండుకోబెట్టిండు. మొఖం మీద నీళ్లు చల్లిండు. ఇంకా క్యాల్లికి రాలేదు. ఈ ముచ్చట ఎల్లయ్య భార్యకు తెలిసింది. ఊర్లె నుంచి సోకం బెట్టుకుని వచ్చింది. ఊరు ఊరంతా ఎంకయ్య బాయి దగ్గెరికి కదిలింది.

భూమయ్య చెట్ల వైద్యున్ని పట్టుకచ్చిండు. ఆకుపసర్లు, వాసన, కాపుడు, అన్నీ అయినయి. ఎంకవ్వకు ఎంకయ్యకు భయం పట్టుకుంది. పొంటె జామయినంక మెల్లగ "అవ్వా" అని కండ్లు తెరిచిండు ఎల్లయ్య. అంతవరకూ పాణాలు అరిచేతుల పట్టుకున్న ఎంకయ్యకు మనుసు కుదుటవడ్డది.

రెండు బుక్కల నీళ్లు తాగి కూసున్నడు ఎల్లయ్య. పొద్దుగూకే దాకా మనిషి కాలేదు. వరిబువ్వ పెట్టుమని బుద్దెడు వడ్లు నాగులకు తెచ్చి ఎల్లయ్య భార్యకు ఇచ్చింది





ఎంకవ్వ. రెండు కోడిపుంజులను ఇచ్చింది. కంకెడు మామిడికాయ తొక్కు పెట్టింది. తాగుమని కోడిగుడ్లు ఇచ్చింది.

బాయి ఎనిమిది గజాలు దగింది. నీళ్లు ఎంతసేపు మోట గొట్టినా దంగుతలెవ్వు. బాయి తవ్వుడు ఆపెయ్యాలకున్నడు ఎంకయ్య. పార, సమ్మెట, ఉలి, గడ్డపార, లోపలనే ఉన్నయి. తీద్దామని తాడు గట్టి దిగిండు. సగం దిగే వరకు మెత్తగున్న దరి పెల్లకు పెల్ల మీద కూలింది. ముక్కూ మొఖం పలిగింది. నొసలు పలిగింది.

పట్టుతప్పి ఎల్లెనుకల బాయిల వడ్డడు. పెయ్యంతా రక్తమె. బాయిలనీళ్లు ఎర్రగా మారినయి. నాలుగురోజులు భూమి మీదనుంచి లెవ్వలేదు ఎంకయ్య.

బాయిపని పూర్తయ్యేవరకు మాగమాస సందు దాటింది. నాలుగు మడ్లు తడిపి వట్టి వడ్లను చల్లిండు ఎంకయ్య. ఒక మడి కూరగాయలు పెట్టిండు. కింద కొద్దిగ ఆందెము, మంచుకు పండుతదని ఉలువ అలికిండు. మోటబాయి ఎంకయ్య ఆశలన్నింటికి ప్రతిరూపమయింది. బాయినిండా ఊటలు.

నాలుగు రకాల పంటలు ఏసేసరికి ఊరికన్ను ఎంకయ్య మోటబాయిమీద పడ్డది. "అరే...ఎంకయ్య మోటబాయి దగ్గర లచ్చిమి తారంగమాడుతుందిరా" అని ఊరంతా ఒక్కటే పాట. ఎంకయ్య పేరు మోటబాయి ఎంకయ్య అని పడిపోయింది. ఆయేడు బాయి దగ్గెర తీరొక్కపంట.

ఎంకయ్య బాయి దగ్గెరనే గుడిసె వేసుకున్నడు. భూమయ్య గూడా బాయి దగ్గెరనే ఉంటుండు. ఎన్నడూ లేనిది బాయి దగ్గెర ఏదుమువడ్లు పండినయి. మూడు గంపల ఆందాలు పండినయి. ఆందెం వండితె రెండు బుడ్ల ఆందెం వచ్చింది. బాయి దగ్గెరికి పోతే కడుపునిండుతుంది.

ఊర్లె అందరికీ చెరువు పారుకం లేదు. ఎంకయ్య పంటను , పనిని, బాయిని, చూసినంక ఊర్లె మోటబాయిలు తవ్వుడు మొదలు వెట్టింద్రు. అన్నింటికీ పంపుకాలు చూసుడు, మోటను అమిరిచ్చుడు, అన్నీ ఎంకయ్యనే చూస్తున్నడు. అప్పుడప్పుడూ భూమయ్య వెళ్తున్నడు. చెరువు పారుకం తప్ప మిగిలిన పొలాలల్లో మోటబాయిలు పుట్టుకచ్చినయి. రెండేండ్లల్లో ఊరిలో మోటల సప్పుడు మొదలయింది.

పొద్దుమాపు రెండు పొంటెల మోట, మోట మీద పాటలు, ఊరికి కొత్తకల వచ్చింది. ఆ యేడే భూమయ్యకు పెండ్లి అయింది. పెండ్లికి ముందు ఎంకయ్య దొరవారిని కలువాలనుకున్నడు. దొర కలువలేదు గాని పెండ్లికి గుర్రాన్ని పంపిండు. దొరవారు గుర్రాన్ని ఇంతదాకా ఎవలకూ ఇయ్యలేదు. గుర్రమెక్కి భూమయ్య ఊరేగింపు వెళ్లిండు. ఊరంతా భూమయ్యను గుర్రాన్ని విచిత్రంగా చూసింద్రు.

మంగలోడు ముందట దీటి వట్టుకున్నడు. నాలుగు మాదిగి దప్పులు. పోచమ్మకాడికి పోయేటప్పుడు "కాళ్లు కాలుతయి నేను రాను" అని ఏడ్చింది ఎల్లవ్వ.

బుదురకిచ్చి ఎవలో సుట్టాలు ఎత్తుకున్నరు.

తూమెడు వడ్లను దంచింది ఎంకవ్వ. నాలుగు పెద్దయి కుండలు తెచ్చి దప్పుడం మరుగవెట్టింది. పెండ్లికనే సాంబారు బియ్యం దంచింది. సాంబారు బువ్వ దప్పుడం జుర్రుడు జుర్రింద్రు చుట్టాలు.

భూమయ్య బలుగమంతా వచ్చింది. చెరువు నిండా నీళ్లు ఊరుసుట్టూ నీళ్లు చూసినంక "ఇంతకరువుల గూడా నీళ్లున్నయంటే ఊరు తేమగల్ల ఊరురా...ఎన్నేండ్లయినా ఊరికి శర్నం లేదు. భూమడు అన్నంల వడ్డడురా" అని మురిసింద్రు.

సాంబారు బువ్వ తినుకుంట "సాంబారు మెతుకులు సంతోషమేగని సంసారం జెయ్యంగ ఎంతేషమో" అని నవ్వుకుంట అన్నరు. వారం పదిరోజుల తర్వాత వచ్చిన చుట్టాలు ఒక్కొక్కలు వెళ్లిపోయింద్రు.

ఆయిటిమూనింది. పెద్దవానగొట్టింది. ఎండకాలం పెండ్లి పనిఉందని నాటు పెట్టలేదు ఎంకయ్య. పెద్దవాన పడంగనే అంతాసాలు పెట్టిండు. ఈసారి వడ్లను కాకుండా మొలుక పొయ్యాలనుకున్నడు. ఇత్తునం వడ్లు లెవ్వు. ఇత్తునానికి కాపాడినయన్నీ పెండ్లికే అయిపోయినయి.

తూమెడు వడ్లు నాగులకు తెచ్చిండు ఎంకయ్య. కొత్తగా మోటబొక్కెనకు తొండం ముడి పిచ్చిండు. కొత్తది దందెడ అల్లిపిచ్చిండు. మోట నడిచే ఎడ్లకు శెలుకపిండి చేసిండు. ఇంటి దగ్గెర వడ్లను నానబోసింది ఎంకవ్వ. తెల్లారి వాయిలి ఆకులు వరిగడ్డితో నానబోసిన వడ్లను మండె కట్టింది ఎంకవ్వ. పొద్దుమాపు మూడు రోజులు కుండతో నీళ్లు పొయ్యిమని ఎల్లవ్వతో చెప్పింది.

"నీ యవ్వ...అన్ని పనులు నాకే చెప్పుతవు. భూమయ్యకు ఒక్కపని చెప్పవు"... కాళ్లు తప్పతప్ప నాలెకు కొడుతూ అన్నది ఎల్లవ్వ.

కూతురు దిక్కు కోపంగా చూసింది ఎంకవ్వ. "ఆ...ఇంక చిన్న మొల్లి ననుకుంటున్నవా...? ఆడిపిల్లవు. తప్ప తప్ప కాళ్లు గొట్టకు ...." అంటూనె గొంతు తగ్గించి."భూమయ్య అని పేరు పెట్టి పిలువద్దు బిడ్డా...ఆయుసు తక్కువైతదట. ఎవలన్నా ఇంటే ఎక్కిరిత్తరు" అన్నది.

"మరి ఏమని పిలువన్నే" గావురంగా అడిగింది ఎల్లవ్వ.

కొంతసేపు ఆలోచించి "ఏంలేదు...ఏమని పిలువద్దు. పిలుసుడెందుకు".అన్నది ఎంకవ్వ.

"అవ్వబిడ్డల ముచ్చట్లు ఎనుకశీరిగనీ...నేను నాగటికివోతున్న. యాల్లపొద్దున దూపకుతేంఢ్రి. పొల్లగాడు ఆకలికి ఆగడు. ఈయేడు కాలం మంచిగనే అయేతట్టుంది. ముసురువెడుతుంది". అంటూ గొంగడి కొప్పెర వెట్టుకుని బయటకు నడిచిండు ఎంకయ్య.

"దూపకు తెల్లారనియ్యరుపో...నువ్వేనంటే నీ జుట్లకెళ్లి ఎల్లిండు పొల్లగాడు.





నువ్వు ముసి ముసి మబ్బుల తిందామంటే పొల్లగాడు కూరుకురాత్రే తిని మల్లాపందామంటడు. గంతకు తగ్గబొంత దొరికిండుపో" అన్నది ఎంకవ్వ.

ఎప్పుడూ వినే మాటలేలే అనుకుని నాగలిని ఎత్తుకున్నడు ఎంకయ్య. దొడ్డికాడ భూమయ్యను కలుపుకుని ఎడ్లను కొట్టుకొని మోటకాడికి పోయిండు.

అప్పటికే తన పొలంల నాగలి నడుత్తుంది. ఎంకయ్యకు విచిత్రమనిపించింది. "అరే మన చేన్ల ఎవలయ్యా...నాగలి దున్నుతున్నరు" దూరం నుంచే గుర్తుపట్టి అడిగిండు ఎంకయ్య.

"మనిషి ఎవలో తెలువదిగనీ ఎడ్లుమాత్రం చిన్నమామయే" భూమయ్య పరీక్షగా చూసి చెప్పిండు.

"వాడెందుకత్తడయ్యా మన చేనుకు. ఎందుకు నాగలికట్టి దున్నుతడు" అర్థం కాక అన్నడు ఎంకయ్య. అడుగులు వడివడిగా ఏస్తూ ఎడ్లను గెదిమిండు.

ఇంకొద్దిగ ముందుకు వచ్చినంక "వాడెందుకుగాదు! దున్నేది మామనే..ఎందుకు దున్నుతుండంటే మనం కొద్దిగా తెల్లగ బతుకుతున్నంగదా"...అన్నడు భూమయ్య.

ఎంకయ్య ఏమీ మాట్లాడలేదు. వడివడిగా నడిచిండు. అతనికి ఎన్నో ఆలోచనలు సుడి దిరుగుతున్నయి. కొద్దిగా భయం పుట్టుకచ్చింది. తమ్ముడేనా కాదా అని మరోసారి పరీక్షగా చూసిండు. అతనేనని స్పష్టంగా తెలిసిపోయింది.

భూమయ్య మామకంటే రెండడుగులు ముందు నడిచిండు. ఎంకయ్య నాగలినిదించి ఎడ్లను బార్లె కొట్టి వచ్చేలోపలనే నాగలి దగ్గరికి చేరుకున్నడు.

"ఏం మామా...మా చేన్ల దున్నుతున్నవేంది...?" ఒడ్డుమీద నిలబడి అడిగిండు భూమయ్య.

ఎల్లయ్య ఆ మాటలకు నాగలి ఆపిండు. భూమయ్య దిక్కు కోపంగా చూసి... "ఎవ్వనివిరా నువ్వు. యాడుందిరా నీ చేను. మా అయ్యకు పుట్టినావురా నువ్వు" అన్నడు.

ఆ మాటలు వినంగనే భూమయ్యకు కోపమచ్చింది. "ఓయ్..ఏంది ఏమో లావు మాట్లాడుతున్నవు. నాకు తిక్కనేలేచెనే...బాయిల ఎత్తేత్త అనుకున్నవేమోగని తాతకొడుకా..." అన్నడు భూమయ్య.

ఎల్లయ్య నాగలి ఆపిండు. ముల్లుగట్టె అందుకుని భూమయ్య మీదికి వచ్చి "అరేయ్ ఏ ఊరునీది...నీకేందమ్ముందిరా నన్ను అడుగనీకి" అన్నడు.

భూమయ్య కోపంగా 'బోశిడికే ఎందిరా' అని ముందుకురికిండు.

ఎల్లయ్య భూమయ్యకంటే బలంగా ఎత్తుగా ఉన్నడు. ఈడ్చి కొడితే ఒక్క చేతికిందికి రాడు భూమయ్య. అయినా భూమయ్య అదేమీ ఆలోచించకుండా చెయ్యిని లేపిండు. అది చూసినంక ఎల్లయ్యకు కోపం ఆగలేదు. ఒక్కక్షణం ఆగితే భూమయ్యను అనుగవట్టి గుద్దేటోడే. అప్పుడే వచ్చిండు ఎంకయ్య.

"ఏందిరా...పొల్లగాన్ని జూసి మీదిమీదికి ఉరుకుతున్నవు. ఏంది సంగతి. నా చేన్ల ఎందుకు నాగలి గట్టినవు" అడిగిండు గట్టిగా ఎంకయ్య.

ఎల్లయ్య కొద్దిగా యెనక్కి తగ్గినా అదేకోపంతో "యాడుంది నీది. నీదేగని నాదిగాదా. అయ్యకు నువ్వు ఒక్కనివేపుట్టినవుగనీ నేను పుట్టలేదా...బరాబరిదున్నుత" అన్నడు.

ఎంకయ్య అయోమయంలో పడిపోయిండు. "అరే నీది నీకే ఉండె. నీదాంట్లకు నేను గిట్లవచ్చిన్నా..." అన్నడు.

"ఔ...పంటపండేది నువ్వుంచుకున్నవు. పండని భూమి నాకిచ్చినవు. అండ్ల నాకు పంట ఎల్లుతలేదు. చిన్నోన్నిగాజూసి నాకు ఏదో ఒకటి పారేసింద్రు. అవేం నడువయి." అన్నడు అంతే కోపంగా ఎల్లయ్య.

"ఆ నాడు నీకు చెప్పినగదా...చెప్పే చేత్తిని" కోపంగా అన్నడు ఎంకయ్య.

"చెప్పినవు. చెడిపోతె చెంగలిత్తనని చెప్పినవు. నీమాటలు నేను నమ్మిన. దాంట్ల ఒక్కగింజ పండుతలేదు. మీరు గరిసెలు గుమ్ములు కట్టుకుంటరు. నేను ఎండవెట్టు కోవాలెనా.." అన్నడు ఎల్లయ్య.

ఎంకయ్యకు పరిస్థితి అర్థమైపోయింది. కావాలనే ఓర్వలేక అడ్డం తిరిగిండని తెలిసిపోయింది. తను ఏ మాత్రం తొందర పడకూడదనుకున్నడు. ఏ మాత్రం ఆవేశపడ్డా తను నాలుగు కొట్టినా వాడు రెండయినా కొడుతడనుకున్నడు.

ఏమీ మాట్లాడకుంటనె ఎనుకకు తిరిగి ఊర్లెకు వచ్చిండు. భూమయ్య అక్కడనే వుంటే కొట్లాట ముదురుతదని వెంటబెట్టుకుని వచ్చిండు. వచ్చిరాంగనే అన్న దగ్గెరికి పోయిండు ఎంకయ్య.

మల్లయ్య ఇంట్ల లేడు. గుట్టకింద ఉన్నడంటే అక్కడికిపోయిండు. ఎంకయ్యను చూసి ముసిముసిగా నవ్విండు మల్లయ్య. అప్పటికే ఇద్దరు కొడుకులు చేతికి అందింద్రు. పెద్దకొడుక్కి పెండ్లి గూడా అయింది. అందరూ చేన్లనే ఉన్నరు.

"ఏందిరా తమ్మీ ఎందుకో వచ్చినవు..." ఏమీ తెలువనట్టే అడిగిండు.

"వాడు...తమ్ముడు, నా చేన్ల నాగలి గట్టిండు..."బాధగా చెప్పిండు ఎంకయ్య.

"వానికేం పిచ్చిరా....నీ చేన్ల గట్టిండు...నువ్వు వాగవుతల తీసుకున్నంక వాని ఇష్టం కొద్దే పెరుమండ్ల కాడ తీసుకున్నడు. పోయినేడు నాకు పంట పండుతలేదు. నీది దున్నుకుంటనన్నడు. సరేరా...దున్నుకో అన్న. రెండు పసల్లు నాది దున్నుకున్నడు. మళ్లా నీదాంట్లకు వచ్చిండా..." అన్నడు తెలువనట్టే మల్లయ్య.

"అరే ఇదేందిరా అంటే మీది మీదికత్తండు...నేను ఏమన్నా లాభం లేదని ఓపికవట్టిన" చెప్పిండు ఎంకయ్య.





"అరే...అనుకుంటె లాభముందా....నలుగురు మెచ్చునడువాలె. ఒక్కడు నడిత్తే తొవ్వయితదా...నలుగురు నడిత్తే తొవ్వ అయితదిగనీ.." అంటూ యాతం బోదర్ల కాళ్లు కడుక్కొని పైకి ఎక్కిండు. ఇద్దరూ ఊర్లెకు వచ్చి కాందారి రాజయ్యను కలుసుకున్నరు. కాందారీ కచీర్లో ఉన్నడు. ఎంట ఇద్దరు ముగ్గురు పెద్ద మనుషులున్నరు.

కాందారి రాజయ్యకు మల్లయ్యకు సోపతి. మల్లయ్య శాత పెద్దమనిషి.శాతపెద్ద మనుసులందరినీ చేతుల వట్టుకుని ఊరిని గుప్పిట్ల వెట్టుకున్నడు కాందారి. కాందారికి విషయమంతాముందే తెలుసు. ఇద్దరూ చూపులతోనే బదులుకున్నరు. ఎంకయ్య తెల్లగా బతుకుతున్నడని కాందారికి కోపం.

పైకి మాత్రం మల్లయ్యను మాట్లాడియ్యకుంట "ఏంరా ఎంకా...ఇట్లచ్చినవు. నువ్వు గూడా ఊర్లెతిరుగ నేరుత్తున్నవా.." అన్నడు బుద్ధిమాట చెప్పుతున్నట్టు.

"లేదయ్యా...మాకు తిరిగితె ఎల్లుతదా....ఎద్దుగు... పొదుసుకుని బదికేటోళ్లం..." అనుకుంట అన్నదిక్కు తిరిగిండు ఎంకయ్య.

మల్లయ్య విషయమంతా కొత్తగా చెప్పుతున్నట్టు రాజయ్యకు చెప్పిండు. అంతా విన్నంక 'అరే...అట్లనా...ఆడు ఎల్లుగాడైతే మంచి మనిషి. ఇట్లేట్ల తొవ్వ తప్పుతడు. పిలిపిద్దాముండు.' అంటూ మస్కూరోన్ని పిలిచిండు రాజయ్య.

"ఆరేయ్...మోట పొలంల మల్లయ్య పటేల్ తమ్ముడుంటడు. నేను రమ్మన్ననని తోలుకరాపో...రాకుంటే నాగలి ఇడువు. ఒరినీయవ్వ నాయం లేదు ధర్మం లేదు. ఇదేం కతరో" అన్నడు రాజయ్య.

మస్కూరోడు వంగి వంగి నిలవడి 'ఆ...అట్లనే బాంచెన్' అని పరుగందుకున్నడు. పొంటె జాముకు వచ్చిండు ఎల్లయ్య. కాందారిని చూడంగనే రెండు చేతులు పబ్బతివట్టి నిలవడ్డడు.

"అరే...ఎల్లుగా...తిన్నదరుగుతలేదారా...నీతల్లి...కొంపలగుత్త గాడిదికే...మీ నడిపన్న చేన్ల నాగలి గట్టినవట ఏందిరా..." బెదిరిస్తున్నట్టుగా అన్నడు రాజయ్య.

ఎల్లయ్య ఏడుపు మొఖం పెట్టి "అయ్యా బాంచెను కాళ్లు మొక్కుత. నేను చిన్నోన్ని. నాకేం తెలువది. పంట పండని చేను నాకు ఇచ్చింద్రు. పంట పండేది వాళ్లు తీసుకున్నరు. నాకిచ్చిన చేన్ల ఒక్కగింజ పండుతలేదు బాంచెను. ఇదేముచ్చట మాపెద్దన్న తోని అన్న. అంటే నీకు పండకుంటే నాది రెండు పసల్లు దున్నుకోరా అన్నడు. అట్లనే దున్నుకున్న బాంచెను. పొట్టమందం ఎల్లినయి. ఈ అన్నది గూడా రెండు పసల్లు దున్నుతనని నాగలిగట్టిన..." చెప్పిండు ఎల్లయ్య. మాటకు ముందు ఏడుత్తున్నడు.

"అవురా మల్లయ్యా...నిజమేనారా...వానికిచ్చింది పంటపండని భూమేనారా...?" అడిగిండు కాందారి.

"పంట పండనిదే నేను తీసుకున్ననయ్య. పండే భూములే వాళ్లకిచ్చిన..."

చెప్పబోయిండు ఎంకయ్య. అంతకంటే ముందే చెప్పిండు మల్లయ్య.

“అయ్యా ముందుగల్ల మా నడిపి తమ్ముడు ఏరుకున్నడు. తర్వాత చిన్నోడు. అందరు ఏరుకోంగ మిగిలింది నేను తీసుకున్న. ఇంటికి పెద్దోన్ని. పుట్టెడు కట్టంజేసిన. ఏమన్న జెట్ట బాగమడిగిన్నా...ఇదేముచ్చట అంటే మా నడిపి మరుదలు తిన్నరు చేసింద్రు. కడుపుంది కాళ్లురెక్కలున్నయి అన్నది. అప్పుడే నామనుసు ఇరిగింది. అప్పటినుంచి నోరు తెరుత్తలేను. నాతమ్ములకే చేసినగదా అనుకుని కడుపు నింపుకున్న” అన్నడు మల్లయ్య బాధగా.

కాందారి బాధగా...“అరెరే...ఇంటికి పెద్దోడు కలకల అనద్దురా... ఒరేఎంకా... మొదాలు మొదాలు ఎవలు ఏరుకున్నరురా..” అడిగిండు.

‘అయ్యా...నేనే’ ఒప్పుకున్నడు ఎంకయ్య. పంచాది ఎటో తిరుగుతుందని తెలిసిపోయింది.

“అరెరే...నువ్వు చిన్నోనివి గాదు పెద్దోనివి గాదు. నడిపోడునైద్యం పెడితే దయ్యంగూడా ముట్టదట. ఆయ్యవ్వకు అగ్గివట్టి ముందు నడిచేది వాళ్లు. ముందు నువ్వెట్ల ఏరుకున్నవురా..” అడిగిండు రాజయ్య.

ఎంకయ్య గుడ్లల్ల నీళ్లు తిరిగినయి “అయ్యా...మంచిది ఊరిమీద పొలమే వాళ్లకు ఇచ్చిన. ఎందుకు పనికిరానిదే నేను తీసుకున్న...” అన్నడు.

“అట్లగాదయ్యా..అదే మంచిది. కాలెత్తు కర్రలేత్తది. కాలంగాకున్నా బేజిల్లిపోదు. గెరెభూమి. వానలుగొట్టినా జౌకుఎయ్యది.” అన్నడు ఎల్లయ్య. మిగిలిన పెద్ద మనుషులు చూస్తూ నిలవడ్డరు.

“ఏంరా మల్లయ్య..ఏం సంగతి? నిజమేనా” అడిగిండు కాందారి.

అన్న ఉన్నది ఉన్నట్టు చెప్తతడని చూసిండు ఎంకయ్య. అతడు ఊహించి నట్టుగాలేదు సమాధానం. ‘రెండు కండ్లు నాయె...’ అన్నడు ఎంకయ్య. ఇద్దరు ముగ్గురు శాతపెద్ద మనుషులు గూడా వచ్చింద్రు. అటు చూస్తే అన్న. ఇటుచూస్తే తమ్ముడు. వీళ్లు ఏదో నాటకం ఆడుతున్నరని పించింది ఎంకయ్యకు.

వెంటనే“అయ్యా...అన్నజెప్పినా తమ్ముడు చెప్పినా ఒక్కటే. నాకు బాయి ఉంది. బాయినిండ నీళ్లున్నయి. ఆ నీళ్ల మీదపడ్డది కన్ను. ఇయ్యాల్ల తమ్ముడు వచ్చిండు. రేపు అన్నవత్తడు. నాకు న్యాయం మీరే చెప్పాలె.” అన్నడు ఎంకయ్య.

కాందారి శాతపెద్ద మనుసులను చూసిండు. కాందారి ఏది చెప్పితే అదే నిజమని గట్టిగా చెప్పాలని చూస్తున్నరు పెద్దమనుషులు. ఎల్లయ్య మల్లయ్యలు ఎలాంటి భయం లేకుండా స్థిరంగా ఉన్నరు. భయంగా ఉంది ఎంకయ్య ఒక్కడే. అందరిని చూస్తుంటే మరింతగా భయమయింది ఎంకయ్యకు.





తీర్పుచెప్పడానికి సిద్దమవుతూ కాందారిరాజయ్య అటూ ఇటూ చూసి, “ఎంకయ్యా! వాడు మీలెక్క మీ అయ్యకు పుట్టినోడే. కడగొట్టుకు పుట్టిండని కడగొట్టు పాలు ఇస్తే కుదురది. రెండు ఫసల్లు వాగవుతల చేనుదున్నుకోని. ఆతర్వాత నీది నీకిస్తడు” అన్నడు. ఎంకయ్య గుండెలో రాయిపడ్డట్టయింది.

కాందారి నోట్లె నుంచి మాట వచ్చిందో లేదో...శాత పెద్దమనుషులు అందుకున్నరు. ఎంకయ్యది తప్పని, మోసమని అన్నరు. అప్పుడే రాజగౌడు కల్లులొట్టితో సందిల నుంచి పోతున్నడు.కాందారి రాజయ్య అటుకాయించి తన ఇంటిలో పెట్టిరమ్మన్నడు. మొట్ట చాపను పట్టుకపోతున్న బాల బోయికి కూడా అదేమాట చెప్పిండు. అందరూ వెళ్లిపోయింద్రు. ఎంకయ్య ఏదీ చూడలేదు. మొద్దు బారిపోయిండు.

కండ్ల ముంగట మోటబాయి కనిపిస్తుంది. బాయితవ్వుడుకు పడిన కష్టం కనిపిస్తుంది. రక్తంతో ఎరుపెక్కిన బాయినీళ్లే కనిపిస్తున్నయి. ఎవలో తొవ్వపొంటిపోతూ అటకాయించే దాకా తేరుకోలేదు ఎంకయ్య. వెళ్లి పీట మీద పడిపోయిండు. ఎంకవ్వ కంటికి ఏడుదారలు సోకం బెట్టింది. తెలిసీ తెలువకపోయినా చిన్నాయిన ఏదో మోసం చేసిండని అర్థమయింది ఎల్లవ్వకు. తల్లితో పాటు ఏడుస్తూ కూర్చుంది.

కాందారి మాటనే మాట. కర్నం పంతులు, మాలీ పటేల్, పోలీసుపటేల్ కాందారి మనుసులే...గీచినగీత దాటితే పెద్దభయం. ఏదో తప్పులో ఇరికిచ్చి లాత్ఖనికి కట్టేసి కొడుతడు. ఎంకయ్యకు అదే భయం. ఎట్లయినా కాందారిని బతిమిలాడి కాళ్లు మొక్కి చేనును మలుపుకోవాలనుకున్నడు.

ఆ రాత్రి ఒకలిద్దరు శాతపెద్దమనుషులను కలిసిండు ఎంకయ్య. బజార్ల ఎంకయ్యది పద్దతి కాదన్నవాళ్లే “పాపం నీదేం తప్పులేదురా...ఇంటికి పోయినంక రాజయ్యకు చెప్పినం గూడా...నీ మీద ఎందుకోరా కాందారికి మస్తుకోపముంది” అన్నరు. కాందారికి ఎందుకంత కోపమో అర్థంగాలేదు ఎంకయ్యకు. సక్కగ ఆయన్నే కలవాలనుకున్నడు. బలబల తెల్లారుతుండంగ కాందారి ఇంటికి పోయిండు.

ఎంకయ్య కాందారి రాజయ్య ఇంటి వాకిలి తొక్కంగనే తమ్ముడి మాటలు వినిపించినయి. పాణం దడుగ్గుమంది. కొంతసేపు అక్కడనే నిలబడ్డడు. అన్నమాటలు కూడా వినిపించినయి.

ఏమంటున్నరో తెలువక పోయినా కాందారి నవ్వును బట్టి చేనును మలుపు కున్నందుకు సంతోషంగా ఉన్నట్టు తెలుస్తుంది.

ముందుకు పోవాల్నా...ఎనుకకు పోవాల్నా అన్న ఆలోచనలో పడ్డడు ఎంకయ్య. ఏదైతే అయిందిలే అనుకుని గొంతును సరాయించుకుంట ఇంట్లకు పోయిండు ఎంకయ్య.

లోపల ఆందెపుదీపం వెలుగుతుంది. కాందారి గొంగడిని కప్పుకుని పీట మీద కూసున్నడు. గొంగడి వేసుకుని అన్నదమ్ములిద్దరు అరుగు అంచున కూసున్నరు.

సుట్టలేసుకుని తీరికగా కూసున్నరు.

ఎంకయ్యను సూడంగనే ముగ్గురూ ఉల్కిపడ్డరు. గొంగడి దులుపుకుంట ఇద్దరూ వెళ్లిపోయింౘ్రు. ఎంకయ్య రాజయ్యకు దండం బెట్టి అరుగు అంచున గొంగడి ఏసుకుని కూసున్నడు.

కాందారి రాజయ్య కుడిదిల పడ్డ ఎలుకయిండు.అటు ఇటూ తిరిగి మళ్ల వచ్చికూసున్నడు. ఏం మాట్లడాలెనో కొంతసేపు తెలువలేదు. చివరగా "ఏంరా ఎంకయ్యా.. ఎటోవచ్చినవు? నిన్నటి ముచ్చటనే మాట్లాడుదామని మీ అన్నను తమ్మున్ని పిలిపిచ్చిన. వాళ్లు వచ్చి ఇట్ల కూసున్నరు. నువ్వువచ్చినవు అంతే" అన్నడు.

ఎంకయ్యకు తెలుసు. తను ఏం చెప్పుకున్నా లాభం లేదనుకున్నడు. అయినా ఏదో ఆశతో "అయ్యా...నేను కంటిమీద నిద్ర లేకుంట తవ్వుకున్న బాయి. కనీసమైనా ఎకురం పొలం పారిత్తది. అప్పనాయంగా బాయిని మలుపుకుంటే నా కలకల తలుగుతది..." గొంతుకు దుఃఖం అడ్డం వచ్చింది. ఆగిపోయిండు ఎంకయ్య.

"ఔరా...ఎంకయ్యా..మంది వచ్చి దున్నుతున్నారురా? మీ తమ్ముడేనాయె. అయ్యవ్వ ఆస్తిమీద అందరికి అక్కు ఉంటదిరా...నువ్వు ఒక్కనివే బతుకాలె గానీ వాళ్లు బతుకద్దారా..." అన్నడు తన నిర్ణయం అదేఅన్నట్టు. చాలా సేపు కూసున్నడు ఎంకయ్య. ఏదో ఆలోచించుకున్నడు. కాందారి ఇంట్లకు పోయిండు.

ఎంకయ్య గొంగడి దులుపుకుని భుజాన వేసుకుని బయటకు వచ్చిండు. సక్కగ వడ్లదాతి దగ్గరికి నడిచిండు. రెండు బొంగురాలను చేయించిండు. టేకు కట్టెతో చేసిన సంగడి బొంగురాలు. ములుకులు వేయించిండు. రెండు బొంగురాలను ఇంటికి తెచ్చిండు. పాతదోతి అంచులను చింపి రెండు జాలలు అల్లిండు.

ఎంకయ్య చేస్తున్న పనేంటిదో అర్థం కాలేదు ఎంకవ్వకు. "ఏంటిది..చిన్నపోరనిలెక్క జాలి తాళ్లు అల్లుతున్నవు. బొంగురాలు ఆడుతవా...?" అన్నది. ఎంకవ్వకు ఏదో భయంగా ఉంది.

ఎంకయ్య సమాధానం లేదు. తన పనిలో తానున్నడు.

"కాలంనెత్తి మీదికచ్చింది. రెండు మూడేండ్లు కరువేనాయె. ఇప్పుడు కాలం కుదురుకునే తట్టుంది. ఇత్తో ఈదునమో సదురుకుందాం. పోతే పోయింది చేతిమైల ఏంజెద్దాం" మనుసు నింపుతూ అన్నది ఎంకవ్వ.

"మనకు ఆ చేనద్దు...ఈ చేనద్దు ఏది వద్దు. యాడనన్న ఎకురం కౌలుకు పట్టుకుందాం. అంతా వాల్లేదున్నుకోని. ఎన్నిరోజులు దున్నుకుంటరో సూద్దాం." అన్నడు భూమయ్య.

ఎవరిమాట ఇనడం లేదు ఎంకయ్య. అల్లున్ని తోలుకొని బొంగురాలు వట్టుకుని ఊరి చివరకు చేరుకున్నడు. అక్కడ గీతగీసుకుని ఇద్దరూ బొంగురాలు ఆడుడు మొదలు వెట్టింౘ్రు.





ఆ నాడు యాకాశి పండుగు. ఎవలో కలిగినోళ్లు మట్టి మూకుడు పెట్టి ఆందెం బోసి అప్పాలు చేసుకుంటరు. ఇండ్లల్ల కోళ్లుంటే కోళ్లను కోసుకుని అన్నం వండుకుంటరు. నలుగురైదుగురి పొత్తుల యాట పిల్లను కోసుకుని పైసకొకపాలు ఏసుకుంటరు. సుయ్యిమని అప్పాలు గోలిత్తుంటే వాడకట్టంతా కమ్మటి వాసన వత్తది.

వరుసగా కరువు వడి పండుగువాసనే లేదు ఊర్లె. వానలు పడుట్ల ఎవల పనిమీద వాళ్లున్నరు. ప్రతీ యాకాశి నాడు దొర లింగన్నపేట పెద్దగడీల నుంచి ఈ ఊర్లెకు వత్తడు. ఊర్లె అనుమండ్ల గుడి ఉంది. గుడిలో పూజలు చేసిపోతడు. ముంగట ముగ్గురు జవాన్లు, ఎనుక ఏడుగురు జవాన్లు దొరతో వస్తరని విన్నడు ఎంకయ్య. ఎట్ల వస్తరో ఎప్పుడు వస్తరో చూడలేదు. దొరనుకలుసుకోవాలంటే కష్టం. అందుకని ఆలోచించి ఈ పని చేసిండు ఎంకయ్య.

మొగులు మబ్బువడ్డది. పొద్దు ఎంత ఎక్కిందో తెలుత్తలేదు భూమయ్యకు. విషయమేమిటో చెప్పడంతో ఉషారుగా బొంగురం ఆడుతున్నడు. లేటి..లేటి...అంటూ జాలి చుట్టి బొంగురాన్ని తింపుతున్నడు.

తొవ్వ పక్కనే ఆట.ఆట ఆడుకుంటనే దారిపొంట చూస్తున్నడు ఎంకయ్య. ఎప్పుడో ఒకలిద్దరు తప్ప మనుషులే కనిపిస్తలేరు. వాళ్లు గూడా తమ ఊరి వాళ్లు కాదు. తమను చూడకుంటనే వెళ్లిపోయింౘ్రు.

చాలా సేపటి తర్వాత ఒక జవాను గుర్రం మీద దారి వెంటవెళ్లాడు. నెత్తికి తెల్లరంగు రుమాలు ఉంది. భుజాన తుపాకి ఉంది. వెంటనే గుర్రాల డెక్కల చప్పుడు. నలుగురు జవాన్లు వెళ్లింౘ్రు. బొంగురాలు ఆడుతున్న వీళ్లను విచిత్రంగా చూస్తూ వెళ్లింౘ్రు. వెనుకనే మరో గుంపు వచ్చింది. గుర్రాల నడకను చూసి అతడే దొర అని దూరం నుంచే గుర్తుపట్టి, ఆట జోరును పెంచిండు ఎంకయ్య. భూమయ్య గూడా జోరుగా లేటి...లేటి అనుకుంట ఆడుతున్నడు.

దూరం నుంచే బొంగురాల ఆటను చూసిండు దొర. పక్కనే ఉన్న జవాన్లను "ఎవడురా... వాన కాలంల బొంగురాలు ఆడుతుంౘ్రు. గాడిది కొడుకులకు పనేంలేదా..." అని అడిగిండు కోపంగా.

ముందున్న జవాను చూసి "దొరా ఎంకడు. మోటబాయి ఎంకడు. వాని అల్లుడు తొక్క భూమడు" అన్నడు.

దొర బొంగురాలు ఆడే దగ్గెర గుర్రాన్ని ఆపి కిందికి దిగిండు. జవాన్లు భూమయ్యను ఎంకయ్యను పట్టుకచ్చింౘ్రు. ఎంకయ్య దొర కాళ్ల మీద వడ్డడు. భూమయ్య గొగ్గాళ్ల మీద కూసున్నడు.

"ఏంరా...ఎంకా...పనున్నదినం ఇక్కడ బొంగురాలు ఆడుతున్న వేందిరా.." అన్నడు. దొర.

"దొరా నీ బాంచెన్..కాళ్లు మొక్కుత.నాకు పనియాడిది. తోడుకున్న బాయిని మా అన్నదమ్ములు గుంజుకున్నరు" అంటూ ఏడ్సుకుంట జరిగినదంతా చెప్పిండు. దొర మౌనంగా గుర్రమెక్కిండు. మామా అల్లుండ్లు ఇంటికి పోయింద్రు.

దొర గడీలకు రాంగనే ఎంకయ్య అన్నదమ్ములిద్దరినీ పిలుచుకున్నడు. అంతవరుదాక దొర ఊర్లె పంచాది చెప్పింది లేదు. ఎవలూ దొర దగ్గరిదాకా పోలేదు. దొరను కలువాలంటే గూడా మాములు విషయంగాదు. దొర వచ్చిండంటే ఎవలనూ గడిపాటాకు దాటనియ్యరు.

తమ పంచాది దొర దగ్గరి దాకా పోయిందని ఎల్లయ్యకు, మల్లయ్యకు తెలువది. దొర రమ్మంటున్నడంటే ఎందుకో అనుకున్నరు.

ఎల్లయ్య, మల్లయ్యలిద్దరూ గడి దగ్గెరికి చేరుకున్నరు. గడి ముందటనే మస్కూరోడు ఎదురయ్యిండు. ఇద్దరికీ చెరోమోతుకాకు చెరోపొగాకు రెమ్మ ఇచ్చి "దొర తాగే పొగాకు పటేలా...ఇయ్యాల్ల అందరికీ పంచి పెడుతుండు" అన్నడు.

దొర తాగే పొగాకు అనంగనే ఆశపుట్టింది ఇద్దరికీ. చుట్ట తయారు చేసుకుని పొగాకును చుట్టలో పెట్టి రుమాలులో చెక్కుకుని గడిలోపలికి వచ్చింద్రు. మస్కూరి మల్లిగాడు ఇద్దరిమీదికి ఎగవడి చుట్టల్ని గుంజుకున్నడు. అన్నదమ్ములిద్దరికీ కోపం వచ్చింది.

మల్లయ్యనైతే మస్కూరోన్ని తన్నుదామనుకున్నడు. "అరేయ్..ఏందిరా..నిన్ను ఇయ్యిమన్నా మురా...ఇత్తవు. మీదవడి గుంజుకుంటవా...?" అన్నడు కోపాన్ని ఆపుకుంట.

ఎల్లయ్య "నోట్లెసుట్ట గుంజుకుంటావురా...ముందే ఇయ్యకపోతే అయిపోతుండె గదా..." అన్నడు కోపంగా.

అప్పుడే దొర బయటకు వచ్చిండు. మల్లెపువ్వులెక్క తెల్లగా ఉన్నడు. చెయ్యెత్తు మనిషి.

"వారీ...వట్టి సుట్టకే మీకు అంత కోపంవత్తే ఆరుగాలాలు కష్టపడి తవ్వుకున్నడు బాయి. వానికెంత కోపంరావాలెరా...వాని నోటి ముందు బుక్క గుంజుకుంటారురా..." దొర అన్నడు.

అన్నదమ్ములిద్దరూ ఉల్కిపడ్డరు. ఒకల మొఖం ఒకలు చూసుకున్నరు. గొంతు పెకుల లేదు. మాట లేదు ముచ్చటలేదు. సల్ల చెముటలు పుట్టినయి. కాళ్లు వణుకుతున్నయి. పంచితం రాలుతుంది.దొర గూడ కోపంతో లేడు.శాంతంగనే చెప్పిండు.

"వారీ...ఇప్పుడు మీరు ఎక్కడైతే దున్నుకుంటుండ్రో అక్కడనే దున్నుకొండ్రి. చెరో బాయి తవ్వండ్రి. అప్పుడు ముందటి లెక్క యాడాదికొక చేనుదున్నుకొండ్రి. అంతేగని వాని బాయిని మలుపుకోకుండ్రి..." అన్నడు దొర.

"అట్లనే దొరా...అట్లనే బాంచెను.." ఇద్దరూ పబ్బతులు వట్టి అన్నరు.





## 6

వాన మీద వాన. కాలం ముందటి వలేనే అయింది. వరుదలు పారుతున్నయి. మడికట్టు చేన్లల్ల కప్పలు గుడ్లువెడుతున్నయి. ఇన్ని నీళ్లుపారినా ఒక మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. ఎప్పడైతే మోట బాయిలు తవ్వుడు మొదలయిందో, యాతం పొక్కలు ఎత్తిపోయినయి. పొక్కలల్ల మడ్డి నీళ్లు బురద తప్ప ఊటలు లెవ్వు. మోటలు వచ్చినంక 'గూడలు' యాతాలు మూలకువడ్డయి. జనాలకు వాటి అవసరం కూడా లేకుంట పోయింది.

బాయి తన చేతికి వచ్చినంక ఎకురంపొలం వరి మొలుక చల్లిండు ఎంకయ్య. ఎకురం మక్క, ఎకురం జొన్న వెట్టిండు. బబ్బెర్లు, పెసార్లు, పల్లికాయ, ఆందెం మిగిలిన మడ్లల్ల చల్లిండు.పొతం చేసి దున్నిన మడ్లు, ఇత్తునం సల్లంగనే పచ్చగ మొలుకలు లేచినయి.

"ఈ యేడు మక్క కొయ్యంగనే మిరుపతోట పెడుదాం". ఎంకయ్య అన్నడు.

"పెడుతవు... పెడుతవు...ఏటిగడ్డ ఎవుసం. తెల్లారితే నమ్మికలేదు. పొద్దుగూకితె నమ్మికలేదు. వాగు వారితే తోట అటు నువ్వు ఇటు." ఎంకవ్వ అన్నది.

"వాగు యాడాది పారుతదా...ఏదో నెలనో వారమో పారుతది. ఆ నెలరోజులు ఎట్లనో ఎల్లదియ్యాలె" అన్నడు ఎంకయ్య.

మోటకు రెండు జతల ఎడ్లను మెతిపిండు ఎంకయ్య. పొద్దున ఒక జత ఎడ్లు. మాపున ఒక జత ఎడ్లు. రెండు పొంటెల మోట. వాన పడ్డా మోట తప్పుత లేదు. కూరుకు రాత్రినుంచి అంబటాల్ల దాక. నాలుగు జాముల నుండి పొద్దు గూకేదాక. బారి చుట్టూ నీడ కొరకు చెట్లను పెట్టిండు. పిల్లబోదర్ దగ్గర నీళ్లు పారి కాలువ కయ్యలు గొడుతుంటే ముల్లు కట్టెల చెట్టు పెట్టిండు. బోరు మీద యాపగింజలు చల్లి యాప మొలుకల్ని లేపిండు. అక్కడక్కడా మామిడి చెట్లను లేపిండు. పొలాన్ని అడివిలెక్క చేసిండు.

ఒడ్ల మీద ఇంతకు ముందే కానుగు చెట్లు ఉన్నయి. ఆకురాలి మొలుకలు లెవ్వయని చెట్టు కొమ్మల్ని ఎండ కాలమే కొట్టి మండె వెట్టిండు. రోజూ మబ్బుతోనే ఎడ్లను కొట్టుకుని వాగుదాటి రావాలె. మల్లీ మబ్బు పడ్డంక వాగుదాటి పోవాలె. వానలు పడడంతో నీళ్లు నిండుగాపారుతున్నయి. రోజూ బొచ్చె మునుగ వాగు.నాని నాని మొల్దారం చీకుటం పట్టింది. ఊర్లె ఎటుచూసినా బురుద....పారుతున్న నీళ్లే.

బాయి పంచాది తర్వాత అన్నదమ్ములకు మాటలు బందయినయి. వెంకయ్యనే మొండిగా మాట్లాడాలని చూసిండు. వాళ్లు మాట్లాడలేదు. చెడ్డ సోపతి పదిచ్చి ఇడిసి పెట్టాలనుకుని తనూ మానుకున్నడు. ముగ్గురు యారండ్లకు ఇంతకుముందె మాటల్లేవు. ఇప్పుడు మొఖాలు గూడా చూసుకుంట లేరు.

ఎంకవ్వకు దినవారాలు తెలువయి. ఏ రోజు వాకిలి సానుపు నిండుగా సల్లాలెనో...ఏరోజు నిండుగా సల్లగూడదో తెలువది. పెద్దయారాలు వాకిలి చూసి తను సల్లుతది. ఆమె ఇల్లు అలుకుతుంటే ఈమె అలుకుతది.

ఆ విషయం పెద్ద యారాలుకు తెలుసు. ఇప్పుడు నమ్మిచ్చి సానుపు సల్లుతుంది. నిండు వారంనాడు సగం వాకిలే సల్లుతుంది. అది చూసి ఎంకవ్వ గూడా సగం వాకిలి సల్లి ఇంట్లకు పోయినంక, సానుపు కుండ తెచ్చి మిగిలిన సగం సల్లిపోతుంది యారాలు. అప్పటికే ఎంకవ్వ సల్ల కవ్వం ముందట కూసుంటుంది కాబట్టి, మిగిలిన సగం సల్ల లేకపోతుంది. ఇరుగుపొరుగు అక్కలు నిండు వారంనాడు సగం సల్లుతవా అని ఎక్కిరిత్తండ్రు ఎంకవ్వను.

ఇంకో నాడు అలుకు కుండ పట్టుకుని ఇల్లు అలికినట్టు చేస్తుంది యారాలు. ఎంకవ్వకు వినిపించేతట్టు కోడలును పిలిచి 'ఇల్లు అలుకు, నిండువారం'అంటుంది. నిజమే అనుకుని ఎంకవ్వ ఇల్లు అలుకుతుంది. ఇరుగు పొరుగోళ్లు 'వారం దినం లేదా, అలుకుపూతకు' అని ఎక్కిరిత్తండ్రు.

యారాలు ఇకమాతులు ఎంకవ్వకు తెలువనియికాదు. ఇప్పడు ఇట్లగనీ ఏరువడక ముందు, ఏరువడ్డంక, ఒకటే ఇంట్ల ఉన్నప్పుడు ఎన్నో తిప్పల వెట్టేది. తనవంతు పనిని దబ దబ చేసుకుని వచ్చి అరుగుమీద కూసుండేది. బురుదల దున్ని కాళ్లు చెడ్డప్పుడు తనుకాళ్లకు పట్టిబొగ్గును దంచి నీళ్లల్ల కలుపుకుని పెట్టుకుని, చింత పండు పెట్టుకున్ననని అబద్ధమాడేది.

ఎంకవ్వ నిజమే అనుకుని చింతపండును కాళ్లకు పెట్టుకుంటే మంటలు పోట్లు. ఏరు వడ్డ కొత్తల్లోనైతే చిత్తుడు కొర్రాయి మంటవెట్టి నువ్వులు ఏంచుతున్ననంది. అప్పుడు ఒకటే ఇంట్ల తడుకలు గట్టుకుని ఉంటున్నరు. పక్క పక్కనే పొయ్యిలు, నడుమ తడుక ఒక్కటే అడ్డం. ఎంకవ్వ యారాలు పొయ్యిల చింత కట్టె వెట్టింది. అది చిటపట చిటపట మండుతుంది.

"అక్కా! ఏంటిది. చిటపట మంటుంది" అడిగింది ఎంకవ్వ.

"ఏంలేదే....నువ్వులు ఏంచుతున్న. బుక్కబుద్దయితుంది" అన్నది ఎంకవ్వ యారాలు.

"నువ్వులు ఎక్కడియక్కా..." అన్నది ఎంకవ్వ.

"పొత్తుల గుడ్డంల అలుకుదామని ఇత్తునానికి దాచి పెట్టలేదా...అవి ఏంచుతున్న''.

"అయ్యో...ఇత్తునాలు ఎట్లమరి....' అడిగింది ఎంకవ్వ.

'ఇత్తనాలు ఎందుకే...ఈసారి ఉలువ అలుకుదాం..' యారాలు అన్నది.

నిజమే అనుకుని ఎంకవ్వ ఇత్తనానికి దాచిపెట్టిన తవ్వెడు నువ్వులు మట్టి ముకుట్ల ఏంచుకుని బుక్కింది.

పొత్తుల గుడ్డం దున్నినంక నువ్వులు తీసుకరా అంటే నోరు తెరిచింది. యారాలు అంచెనిండా నువ్వుల్ని తెచ్చి భర్తకిచ్చింది. 'మన నువ్వులు ఎవ్వి' అని ఎంకయ్య





అడిగినప్పుడు ఎంకవ్వ గుండె దడ దడ కొట్టుకుంది.

ఎంకవ్వకు ఇదంతా ఇప్పుడు యాదికి రాకపోతుండె. బిడ్డ పెద్దమనిషి అయింది. ఏంజెయ్యాలెనో ఎట్ల జెయ్యాలెనో తెలువది. ఎవ్వలను అడుగాలెనో తెలువది. ఒకవేల అడిగినా ఏమంటరో అని భయం. ఏమన్నా అనని అనుకొని భయపడుకుంటనే కుమ్మరోల్ల పెద్దవ్వను అడిగింది ఎంకవ్వ.

పెద్దవ్వ మొఖం ముందటనే"పిల్లల గంటరు గనీ పోషకర్తన చెయ్యరాదు. గాడిది ఈన నేర్చిందిగనీ నాకనేర్వలేదు. ఏంలాభం. మీ ఇండ్లల్ల ఎట్లజేత్తరో నాకేంఎరుక" అన్నది.

ఎంకవ్వ గుండె జల్లుమంది. ఏమన్నా అననిగానీ యారాలునే అడుగాలని అనుకుంది ఎంకవ్వ. ఎందుకంటే యారాలు కోడలు ఎండకాలంలనే సముర్త ముట్లయింది. ఇట్ల అడుగుదామనుకున్నంక యారాలుతో ఈ పాత కతంతా యాదికచ్చింది. ఏదైతే అది అయిందిలే...అనుకుని యారాలు దగ్గెరికి వచ్చింది ఎంకవ్వ. తన బిడ్డకు అన్ని లాంచనాలు జరుగాలన్నదే ఆమె కోరిక.

యారాలు మాట్లాడది. తిట్టుకున్నదిగాదు కొట్టుకున్నదిగాదు. ఎవలంతల వాళ్లు మొఖం సాటేసుకున్నరు. చిన్నయారాలుతో నైతే మంచిగ మాట్లాడుతది. తనను చూసి ఇద్దరూ మూతులు తిప్పుతరు, గుసగుసలు పెడుతరు, నవ్వుతరు. అవన్నీ ఆలోచించి ఏదో తనకు తోచిందే చేసుకోవాలనుకుంది గానీ, 'ఒక్కపొల్ల మంచిదవు, చెడ్డదవు, పద్ధతి పకారం చెయ్యాలె. మాదాంట్ల మేము ఒకనాడు కాకున్నా ఒకనాడయినా కలుసుకునేటోళ్లం గదా' అనుకుంది ఎంకవ్వ.

'అక్కా...పొల్ల పెద్దమనిషయింది...నెత్తికి పొయ్యాలె' అన్నది ఎంకవ్వ. యారాలు "అయ్యో! అరుగుంచుకే నిలవడితివేమే...లోపలికిరా...ఎప్పుడు చూసినవే." చేతుల సల్ల ముంతను దించుతూ అడిగింది. ఆమె మాటల్లో ముందటి కరుకు దనం లేదు. ఆత్మీయత ఉంది. ఆమాటలకు కరిగిపోయింది ఎంకవ్వ.

"పొద్దుగల్లనే...ఎటూ మనుసున వడుతలేదు. పెరట్ల నిలవెట్టివచ్చిన" అన్నది ఎంకవ్వ.

"అయ్యో. పోరిని పెరట్ల ఎందుకు నిలవెట్టినవే...గాలో దూలో...తొక్కుడొ దొట్టనో వాలుతది. అట్ల అరుగుంచుకు నిలవెట్టు" అంటూ యారాలు ఇంట్లకు వచ్చింది.

"చిన్న దాన్ని గూడా పిలువుపో...ఒక్కరిద్దరు నెత్తికి పొయ్యద్దు" అన్నది పెద్దయారాలు. ఎంకవ్వ చిన్నయారాలును పిలుచుకచ్చి కుండెడు నీళ్లు మసులవెట్టింది. నీళ్లల్ల పసుపు యాపాకు కలిపింది.

ముగ్గురు కలిసి ఎల్లవ్వకు నెత్తికి పోసింద్రు. నిండుకాలం పెద్ద మనిషి

అయినందుకు ఎంకవ్వకు సంతోషంగా ఉంది. అంతకంటే ఎక్కువ ఇద్దరు యారాండ్లు కలిసినందుకు సంతోషంగా ఉంది. చిన్నయారాలు కుడుకలు దంచింది. పెద్దయారాలు మోడి దంచింది. చెప్పకుండానే ఇద్దరూ చెరో పని చేస్తున్నరు. 'మాకు ఒక బిడ్డ ఉంటే పెట్టుకోకపోదుమా' అంటున్నరు.

పిల్లకు ఏమేం పెట్టాలో...ఎట్ల పెట్టాలో ఏ నియమాలు పాటించాలో వివరంగా చెప్పింది పెద్దయారాలు. ఇద్దరు యారాండ్లు చెరో మానెడు బియ్యం ఇచ్చింర్రు. కూసుండె సదిరె అద్దంవక్క, చెక్కబొమ్మలు ఇచ్చింది పెద్దయారాలు.

ఎంకయ్యకు ఈ విషయం తెలువది. పొద్దున్నే భూమయ్యతో మోటకు పోయిండు. రాత్రి దొడ్డి కాడికి వచ్చినంక మల్లయ్యనే మాట్లాడిచ్చిండు.

"తమ్మీ...పుసపుస తొక్కుడు కాళ్లతో ఇంట్లకు పోకు. పొల్లగాన్ని దిడ్డి దర్వాజ నుంచి పొమ్మను" అన్నడు.

భూమయ్య వెంటనే ఉన్నడు. విషయమేమిటో అర్థంకాలేదు. ఎంకయ్యకు విషయం అర్థమయిందిగానీ, అన్న ఎందుకు మాట్లాడుతున్నడో అర్థం కాలేదు. ఏం మాట్లాడాలెనో తెలువక 'అట్లనా..' అన్నడు. ఇంటికి చేరుకున్నంక ఎల్లవ్వ కూసున్నదని గుసగుసగా చెప్పింది ఎంకవ్వ.

"సల్లగ బతుకని" అన్నడు ఎంకయ్య. యారాండ్లు ముగ్గురు కలుసుకున్న సంగతి ఎంకయ్యకు తెలువది. తను ఎంత కలిసిపోదామని మాట్లాడిచ్చినా మొఖం చాటేసిన అన్న తనకు తానే మాట్లాడియ్యడం అతడి మనసును తొలుస్తుంది.

భూమయ్యకు ఏం జరిగిందో తెలువక పోయినా, ఏదో జరిగిందని మాత్రం తెలుసు. ఇంటిలో ఏదో కొత్త కళ కనిపిస్తుంది. ఇదీ అని చెప్పలేని మార్పుకనిపిస్తుంది. ఇద్దరూ తిండిమీద కూర్చున్నరు. కంచుతలెకు బదులు మోతుకాకుల ఇస్తారి వేసింది ఎంకవ్వ.

వరి బువ్వను చూడంగనే మామకు అల్లునికి నోట్లెనీళ్లూరినయి. ఎగిరి గంతులు వెయ్యాలనిపించింది.

"పొల్ల పేరు మీద మనకు బువ్వదొరుకుతుంది" అన్నడు నవ్వుతూ. వట్టి చాపల కూర ఏసి అన్నం పెట్టింది ఎంకవ్వ. ఎందుకో భూమయ్యకు మరింత పెట్టాలని పించింది ఎంకవ్వకు. గంటేతో నాలుగు చాపవక్కలు ఏసింది. బువ్వ కుండను దగ్గెరికి జరిపి తెడ్డుతో ఇంకింత అన్నం పెట్టింది. భూమయ్య 'ఊ' లేదు 'ఆ' లేదు. తింటనే ఉన్నడు. పెట్టింది పెట్టినట్టు మాయం జేత్తున్నడు.

బయట వాన కొడుతుంది. లింగం వచ్చికూసున్నడు. పెడితే ఇద్దరికీ కుండ మొత్తం మాయమయ్యేదే! ఎంకవ్వనే కుండను తీసి ఉట్టిమీద పెట్టి శిబ్బి మూత పెట్టింది. ఎంకయ్య చెయ్యి కదుక్కుంటూ "ఈ సంగతి జూడు. నాడు లేదు నేడులేదు, నాగెల్లినాడు





డోలు గొట్టేనన్నట్టు ఎన్నడు లేనిది మా అన్న చూసినవా ఇయ్యాల్ల దొడ్డి కాడ మాట్లాడిండు" అన్నడు ఎంకవ్వతో.

ఎంటనే అందుకుంది ఎంకవ్వ. "చిన్నది, పెద్దామె ఇంతవరుదాకా ఇక్కడనే కూసున్నరు. ఆడివిల్లలు లేరుగదా. ఉన్నమ్మ కంటే లేనమ్మకు బమలు లావట. ఇయ్యల్ల పొద్దంతా మక్కల గడ్డిపీకుడు పనుండెనట. పని పొడగొట్టుకుని నిలవడ్డరు. పనులన్నీ వాళ్లే చేసింర్రు."

భూమయ్య చేతులు కడుక్కుని లింగం దగ్గెరికి వచ్చిండు. బనుకుల అంచుకు తడుక కట్టింర్రు. తడుక సాటుకు దీపం వెలుగుతుంది. ఎల్లవ్వ ఒక మూలకు ఒదిగి కూసున్నట్టు మసకమసకగా కనిపిస్తుంది. వాన ఎక్కువయింది. గూన ధార పెరిగింది. ముంత పొగ లేత్తుంది.

"వాగుకు గత్తర్రాను. అరే...వాగు వత్తదా ఏంది...? నేను ఎడ్లను అక్కడనే విడిచిపెడితి" అన్నడు ఎంకయ్య.

"యాడ తోలినవు పటేలా..." లింగం అడిగిండు.

"పొద్దున పొంటె మోటగట్టె ఎడ్లను అక్కడనే ఉంచినరా. మాపటి పొంటె గట్టె ఎడ్లను కొట్టుకచ్చిన. అక్కడనే గుడిసెల తలుగులతో కట్టేసిన" అన్నడు ఎంకయ్య.

"ఎట్లమరి...? వాగు ఎక్కువైతే రేపు దాటరాదు. ఎడ్లు కట్టు మీద ఉండె. ఆకలి దూపకు సత్తయి. ఈవాన చూస్తే బతుకమ్మ గుండు మునిగే వాగు వచ్చేతట్టుంది...అట్ల ఆస్తే గనుక వారందినాలు వాగుదాటం". లింగం అన్నడు.

ఎంకయ్యకు భయం మొదలయింది. ఎడ్లుకట్టు మీదున్నయి. ఎట్లా? అనుకుంటున్నడు. బయట చూస్తే చిమాన చీకటి. వాన చప్పుడు బొయ్యిమంటుంది. "వాగవుతల గూడా మోటలున్నయి. ఒక్క మనిషన్నా అవుతల మిగిలిపోతే అందరి బాయిలు తిరుగుతడు. ఎవలన్న ఉన్నరా..ఉంటే వారం దాకా ఏం తిని బతుకుతడు. కాయ, పండు కాలం కాదిది." అనుకుంటున్నడు ఎంకయ్య.

ఒకసారి ఇదే రాత్రి పోదామా అనిపించింది. 'చీకటిపూట వాగుముచ్చట. ఎటని ఈదస్తది అనుకున్నడు. ఏదైతే అది అయిందిలే. పొద్దు గల్ల సూద్దాం. దాటరాకుంట వాగు వత్తే కెంపుల నుంచి నడిచి పోదాం!' అనుకున్నడు.

"భూమయ్య పటేలా....దొడ్డి కాడికి పోవద్దా..." లింగం అడిగిండు.

పోదామని గొంగడి కొప్పెర పెట్టిండు భూమయ్య. " ఈ వానల ఎటుపోతరు వద్దు. ఇక్కన్నే పండుంర్రి" అని ఒక చింపుల బొంత ఇచ్చింది ఎంకవ్వ. ఎందుకో భూమయ్య వానల తడుత్తడంటే వద్దనిపించిది. ఇంతకు ముందయితే వాన, ఎండ, ఎటుపోతున్నడు, తిన్నడా లేదా ఏదీ చూసేది కాదు. ఇప్పుడు అన్నీ చూడాలనిపిస్తుంది. తనది తనకే అనిపించింది ఎంకవ్వకు."ఆడి పిల్లల తల్లి ఎన్ని దేవులాడుతది. ఎన్ని తొక్కిమూస్తది."అని.

భూమయ్య లింగంలు ఇద్దరూ మలుసుక పన్నరు. ఎంకవ్వ పొయ్యికప్పి కుంపటిని తెచ్చి బిడ్డ దగ్గెర పెట్టింది. ఎంకయ్య వానను చూస్తు కూర్చున్నడు. ఉరుములేదు మెరుపులేదు. పోసేది పోత్తంది.

గటుకమాల్లను సల్లవోసుకుని జుర్రి ఆఖరున పిడికెడు మెతుకులు ఏసుకుని తిని కుండలు కడగి బోర్లేసి వచ్చింది ఎంకవ్వ. లింగం భూమయ్య లిద్దరూ పండుకొన్న దగ్గెరికి వచ్చింది. 'అరేయ్ లింగా...సల్లు గొదుతుంది. గొడకు జరుగుండ్రిరా' అన్నది. ఇద్దరూ గోడకు జరిగి పన్నరు.

ఎంకయ్యకు ఏదో యాదికచ్చింది. సుట్టతీసి జకమక దూదిగొట్టి పెట్టుకుని గప్పగప్పతాగి "ఒరేయ్...లింగా....మల్ల గట్ల దారం గట్టుకున్నావురా. ఆనాడే సచ్చేటోనివి బతికినవు" అన్నడు.

తడుకసాటుకున్న ఎల్లవ్వ పక్కున నవ్వింది. ఎంకవ్వ గూడా నవ్వుతూనే బిడ్డను అదిలించింది. లింగం సిగ్గుతో గొంగడిని మరింత ముడుచుకున్నడు. భూమయ్య 'ఏంటిది..?ఏమైంది' అని ఆసక్తిగా లింగంను అడిగిండు. లింగం మరింతగా ముడుచుకున్నడు.

'ఇంకా చిన్న మొల్లిగాడా....ఇద్దరు పిల్లల తండ్రి..' అన్నది ఎంకవ్వ.

"ఎందరు పిల్లలైతే ఏంది..?పుర్రెగుణం పోతదా, చీకట్లపన్న శివుడిత్తెగన్న అంటరు. మొన్న సాకలి బాలుగాడు చూసినవా. కోడిని కోసుక రమ్మని కర్నం పంతులు చెప్పిండట. వాడు మైసమ్మ దగ్గెర కోడిని కోసుకచ్చిండట. పంతులు నవ్వుకుంట అరే..గాడిది. కోడికి రెండేకాళ్లున్నయి. ఇంకరెండు కాళ్లు ఎవ్విరా..తిన్నవా. అన్నడట. వాడు నిజమే అనుకుని మైసమ్మ దగ్గెర పొద్దంతా కాళ్ల కొరకు దేవులాడిండట" అన్నడు ఎంకయ్య.

ఎంకవ్వ నవ్వుకుంట "మొన్న కుమ్మరోల్ల పోరడు ఇట్లేనట. చిన్నప్పుడు వీని లెక్కనే రాత్రి బట్టలు తడుపుతుండెనట. గాండ్లోల్ల శాతల జీతమున్నడు గదా. ఏదో పనుండి లచ్చమ్మ ఇంట్ల పండుకోరా అని బొంత ఇచ్చిందట. బొంత తడిపితే లచ్చమ్మ కొడుతదని వాడు దారం గట్టుకున్నడట. ఏ రాత్రి పోసుకున్నడోగని నడిజాము వరకు బుగ్గలెక్క ఉబ్బి తడతడ మొదలయిందట. ఒక మొత్తుకునుడుగాదట" అన్నది.

భూమయ్యకు నవ్వు ఆగలేదు. పక్కర పక్కర నవ్విండు. భూమయ్య నవ్వుతుంటే ఎంకవ్వ నవ్వింది. ఎంకయ్య మాత్రం నవ్వలేదు. గూనదారనే చూస్తున్నడు. ఇంతకు ఇంత ఎక్కువైతున్న వాన నీళ్లను చూస్తున్నడు.

"ఏంగాదు తియ్యి. ఏంజేత్తవు. వాగు ఎక్కువైతే కెంపుల నుంచి నడిచి పోదువు. పొద్దు గూక చేరుదువు". అన్నది ఎంకవ్వ. అనుకుంటనే దీపం నింపి నడుం వాల్చింది. తడుక చాటుకు మాత్రం దీపం వెలుగుతుంది.





ఎంకయ్యకు చాలా సేపటి వరకు నిద్రపట్టలేదు. మేలుక వచ్చేసరికి ఇసుర్రాయిలు తిరుగుతున్న చప్పుడు. కోడికూతలు, తొవ్వపొంటి ఒడ్డె బండ్ల చప్పుడు. కట్టె ఇరుసు, కట్టెపయ్యలు, కిర్రు కిర్రుమంటున్నయి. ఊరునిండా రాగాలు పాడుతున్నట్టుంది. వాన వెలిసినా చినుకులు మాత్రం రాలుతున్నయి.

ఇన్ని చప్పుల్లనుంచి ఇంటి ముందు ఇంకొక చప్పుడు వినిపించింది. ఎన్నడూ వినని చప్పుడు, ఎప్పుడు తెలియని చప్పుడు. ఇసుకలో పాము పారుతున్నట్టు, గరగర చప్పుడు. తలుపు తెరిచి బజార్లకు చూసిండు ఎంకయ్య.

బజారు వెంట ఎడ్ల బండి పోతుంది. కట్టె పయ్యలకు ఇనుప పట్టాలు..ఇనుప ఇరుసు. పదహారు ఆకులు, రెండు కుయ్యలు. పార్లు నొగలు, కానీ, బండిగొలుసు, యాటతాడు, కానితాడు. బజారు వెంట పూలరథంలా పోతుంది. ఇవేవీ కనిపించ లేదు కానీ, బండి మాత్రం కనిపిస్తుంది. ఇసుకను చీల్చుకుంటూ ఇనుప పట్టాలు గర్రు గర్రు మంటున్నయి. బండినిండా టేకు కట్టేలతో అడివితల్లి కదిలి పోతున్నట్టుగా ఉంది.

"అరే ! భూమలింగమా..ఏందోయ్ కమ్మల బండికొన్నవా..?" నాలుగడుగులు ముందుకు వచ్చి తొవ్వల నిలబడి అడిగిండు వెంకయ్య.

ఊర్లె బండ్లున్నయిగనీ అన్ని సాయిరి గట్టె బండ్లె. కట్టె ఇరుసు, కట్టెపయ్యలు. ఎక్కడ ఇరుగతయో తెలువది. ఇరుగకున్నా ఎక్కువ బరువును ఎత్తరాదు. అందుకే బండి కట్టే బదులు నెత్తిమోత నయ మంటరు. ఎంకయ్య కమ్మల బండ్లను వేరే ఊర్లో చూసిండుగనీ ఈ ఊర్లె చూడలేదు.

"యాడిది బావా..కొనుడు..చిన్న ముండకు పెద్దసోకమన్నట్టు..ఇంక బండి గొంటాను. మా అల్లునిది. ఇల్లు గట్టుకుంటడట. టేకుదూలం కావాలన్నడు. నరికి పంపుతున్న". అన్నడు భూమలింగం.

'బండి పెండ్లాం ముండమొయ్య మంచిగుందోయ్. అడివిని మొత్తం జార గొడుతది. ఒక్క మనిషి రెండు ఎడ్లుంటేసాలు. ఎంత దూరమన్నా పోవచ్చు' అన్నడు ఎంకయ్య బండివైపు చూస్తూ.

"ఇంకేంది...నాలుగైదు దినాలైతే మీ ఇంటి ముంగటనే బండి ఉంటది. మీ అన్న కొంటున్నడుగదా. ఎక్కడికంటే అక్కడికి పోవచ్చు." బండి వెంటనడుస్తూ అన్నడు భూమలింగం.

అప్పటికే దూరం కావడంతో మాటలు సరిగ్గా వినిపించకపోయినా 'మాఅన్న బండి కొనుడేంది'..? అనుకున్నడు ఎంకయ్య. ఇంట్లకు వచ్చికూసున్నడు. ఎంకవ్వ లేచి పనిలో పడ్డది.

"లింగా...అరేయ్...లింగా..లెవ్వుండ్రి. ఇంకా తెల్లారలేదారా...లండుగాడిది. తెల్లారెదాకా పంటారురా.." అన్నడు లింగంను పిలుస్తూ.

"ఆ..ఎందుకు లేపుతున్నవు. పండనితియ్యి. మోట లేకనేపాయె. ఇంకా రెండు కూరుకుల పొద్దుంది.' భూమయ్య గురించి ఆలోచిస్తూ అన్నది ఎంకవ్వ. కానీ అప్పటికే లేచికూసున్నడు లింగం. భూమయ్య గూడా లేచి గొంగడిని ముడుచుకుని కూర్చున్నడు.

కుంపటి దగ్గరికి పోయి పిడుకను చిదవొడిచి అగ్గి రవ్వను చుట్టలపెట్టి అంటించుకున్నడు ఎంకయ్య. లింగంకూడా చుట్టను అంటు వెట్టుకుని కూసున్నడు. భూమయ్య మాత్రం ఉత్తగనే కూసున్నడు.

'సప్పుడులేదు...వాగు ఎమన్న ఎక్కువయిందో...' అన్నడు ఎంకయ్య.

"తెల్లందాక బొయ్యబొయ్య వోసింది. వాగురాదా...గుండుమునుగ వత్తది" లింగం అన్నడు.

"నీ...తాశిలపీసునెగొడుదు..ఏగిలేసి గుండుమునుగ వాగత్తదంటవు.."కోపంగా అన్నడు ఎంకయ్య.

సుట్ట తాగుకుంటనే.."సూడు పటేలా...నామాట అవద్దం గాదు.సప్పు డత్తలేదంటెనే రాళ్లు రప్పలన్నీ మునిగి పారుతుందన్నట్టు. నర్మాల కెంపు ఎప్పుడో నిండిందట. అలుగు దుంకిందంటే కతం." అన్నడు లింగం.

ఎంకయ్య గుండె దడుక్కు మంది. "అలుగు దుంకితే కెంపుల నుంచి గూడా దాటరాదుఎట్లా..?" అనుకున్నడు. లేచి గొంగడి బొంతకప్పుకుని వాగు దిక్కు నడిచిండు.

అప్పటికే వాగును చూసి వస్తూ ఒకలిద్దరు ఎదురయ్యిండ్రు. "ఆ గడ్డ ఈ గడ్డ పట్టుకపారుతుంది" అన్నరు. భయం భయంగా వాగుదిక్కు నడిచిండు ఎంకయ్య.

గెగ్గెరాళ్ల గుండు ఎప్పుడోమునిగింది. బతుకమ్మ గుండు సగంకంటే ఎక్కవనే మునిగింది. నీళ్ల అంచుకు కట్టెపుల్లను పాతి కూర్చున్నడు ఎంకయ్య. ఇంతకు ముందు వచ్చినోళ్లు పాతిన కట్టెపుల్లలు మునిగిపోయి అలలకు కదులుతున్నయి.

'వాగు ఎక్కువనే అయితుంది. బగవంతా...ఎట్లా...ఎడ్లుకట్టు మీద ఉండె. గోస తలిగేతట్టుంది'. అనుకుంట అంచునే రాయి మీద కూసున్నడు ఎంకయ్య.

పూర్తిగ తెల్లారింది. అందరూ వాగంచుకు చేరుకున్నరు. కొందరు చూసిపోతున్నరు. కొందరు అక్కడనే ఉన్నరు. ఎవలన్నా వాగవుతల ఉన్నరా అని అందరినీ తెలుసు కుంటున్నడు. మొగులు వాటం జూసి అందరూ రాత్రిపూటనే ఎడ్లను దాటేసి వచ్చినట్టు తెలిసింది ఎంకయ్యకు.

'కెంపుల నుంచయినా పోదాం. అక్కడ ఎట్లుందో...' అనుకుని కదులుతుంటే పైన ఉన్న గుంపుల నుంచి 'వద్దురో...వద్దురో' అన్నమాటలు వినబడ్డయి. ఎంకయ్య అటుదిక్కు చూస్తే నీళ్లల్ల ఎవరో ఈదుతూ కనిపించిండ్రు. సుడి తిరుగుతున్న నీళ్లల్ల చిక్కుకొని రెండు చుట్లు తిరిగి వాలునుంచి ఈదుతున్నడు.





"ఎవడ్రావాడు. నిండువాగుల దుంకిండు...పిచ్చోడారా..ఇంతవాగుల ఎవలన్నా ఇంత దాకా ఈదిండ్రా " అన్నడు ఎంకయ్య కోపంగా.

"ఇంకెవలూ...మీ భూమడే...వద్దువద్దురా అనంగ దుకిండు...ఎడ్లను ఇడుసుకత్తడట.." ఎవలో అన్నరు. వెంకయ్యకు పాణం జల్లుమంది. నీళ్లల్లకు పారజూసిండు. పల్లెదార, వాగుదార, ఒర్రెదార, మూడూ కలిసే చోట అది. నీళ్లు ఎగిరెగిరిపడుతున్నయి. నీళల్ల భూమయ్య కనిపించలేదు. చిన్నగ తలమాత్రం కనిపిస్తుంది. కిందికి కొట్టుక పోతున్నడు. అలలు భూమయ్యను కప్పేస్తున్నయి.

'అరే...పటేలా..వద్దు వద్దనంగ దుంకె. అంగి ఇడిసి నెత్తికి చుట్టుకుంటె ఎందుకో అనుకున్న. సూత్త సూత్తుండంగనే గోసి బలిచ్చి దుంకుడు దుంకె''. అన్నడు లింగం భయభపడుతూ.

ఎంకయ్య భూమయ్యనే చూస్తున్నడు. కొద్దిగా కనిపించిన తల మాయమయింది. నీళ్లతోపాటే కిందికి దిగి కనిపించకుంట పోయిండు. కాళ్లు చేతులు కడుపుల వడ్డయి. ఎంకయ్యకు వణుకు మొదలయింది. నీళ్లు పెరుగుతున్నట్టుగా ఒడ్డున తనుపాతిన కట్టెపుల్ల సగం మునిగింది.

"భూమయో...భూమయో...''అని నాలుగైదు కేకలేసిండ్రు. భూమయ్యలేడు రామయ్యలేడు. ఎంకయ్యను చూసి మిగిలిన వాళ్లు కూడా రెండు మూడు సార్లు కేకలేసిండ్రు. చప్పుడులేదు సలిలేదు.

"అగగొ..అక్కడ తేలిండని కొందరు." "ఏ..కాదు. అది తాటిమొద్దని" కొందరు. "అగో..సక్కగసూడుండ్రి సుడిగుండంల తిరుగుతున్నడని" ఒకలు. "కాదుకాదు అదితుంగ తెప్ప" అని కొందరు. మనిషికో తీరు అంటుండ్రు. ఎంకయ్య బీరిపోయి వాగునే చూస్తండు. గంగతల్లికి మొక్కుతండు. సల్లగ గడ్డ కెక్కనని వేడుకుంటండు.

వాగుల భూమయ్య పడ్డ విషయం ఊరంతా తెలిసింది. నీళ్లకే ఎదురీదుతున్నడట అని, కాదు కాదు కొట్టుకపోయిండట...కొట్టుకపోవుడుగాదట...నడుమల గుండు మీద కూసున్నడట అని, రకరకాల పుకార్లు పుట్టినయి. అందరూ వాగు దగ్గరికివత్తుండ్రు. ఈ ముచ్చట ఎంకవ్వకు తెలిసింది. ముట్టు బిడ్డ ఒక్కతున్నదని గూడా చూడకుంట మొత్తుకుంట వాగు దగ్గెరికి వచ్చింది.

అంతవరుదాకా గంభీరంగా ఉన్న వాగు అంచు, ఎంకవ్వ రాకతో ఏడ్పులు ఆర్పులతో దద్దరిల్లింది.ఎంకయ్య అన్నదమ్ములు, ఎంకవ్వయారండ్లు, కొడుకులు, కోడండ్లు బలుగమంతా చేరుకున్నరు. వాగును చూసినంక అందరూ ఆశవదులుకున్నరు. ఇంతవాగుల ఎక్కుడు కష్టమేనని అందరికి తెలిసినా పైకి మాత్రం నోరు ఎత్తుతలేరు.

అక్కడ గుంపు గూడిన అమ్మలక్కలు "పోరికి చిన్నతనంలనే ముండ తాపమచ్చె... కొందరు పెద్దమనుసులైతే ఐరాదు...ఇట్లనే శమ గండాలత్తయి" అనుకున్నరు గుసగుసగా.

ఎంకవ్వ గూడా మొక్కుతుంది. 'శమగండాలు పోని ఈరనుమండ్లూ...నీకు చంద్రం ఎక్కిత్త. గండ దీపం ఎలిగిత్త...' అని మొక్కుతుంది.

అంబటాల్లదాక అక్కడనే ఉన్నరు. భూమయ్య జాడలేదు పత్తలేదు. వాగు ఎక్కువయింది. దానికితోడు. మొగులు గుద్దుకమ్మి కుండపోతవాన. ఎక్కడోళ్లు అక్కడ ఉరుకు అందుకున్నరు. ఎంకయ్య, అన్నదమ్ములు, యారాండ్లు, ఎంకవ్వ అక్కడనే ఉన్నరు.

ఊర్లె భూమయ్య సచ్చిపోయిండనే పుకారే పుట్టింది. పాలియ్యాళ్లయింది. వాన గుంజినా వాగు పెరిగింది. బతుకమ్మ గుండు అద్దగజమే ఉంది. అది ఇప్పుడో అప్పుడోమునిగేతట్టుంది. ఎవలు నోట్లె మంచినీళ్లు పొయ్యలేదు. నిండనానింద్రు. గజగజ వణుకుతుంద్రు.

మల్లయ్యనే అందరికీ దైర్నం చెప్పి " ఆయిన ఎటూ పోలేదు. అవుతలిగడ్డకు ఎక్కిండు. కాకాపోతే బాగ కిందికి కొట్టుకపోయి ఎక్కిఉంటడు. బుక్కెడు సల్లవడి అట్ల కెంపుల నుంచి పోదాం" అని అందరినీ ఇంటికి మలిపిండు.

అతడికి గూడా ఆశలేదు "ఎక్కడ ఎక్కినా చింతకిందికి వచ్చి నిలవడి కేకఏత్తుండె. అసలు ఎక్కనేలేదు మామూలు వాగా..." అనుకుంటున్నడు.

ఎంకయ్య ముందు నడుత్తున్నడు. ఎంట వీళ్లున్నరు. చివర ఎంకవ్వ సొలుక్కుంట సొలుక్కుంట "ఎంత పనయిపాయె...గద్దతన్నుకపోయినట్టు మాయమైపాయె" అనుకుంట నడుత్తుంది.

ఎంకయ్య రంగయ్య సేటు వాకిలి మలిగిండు అంతే! గొంగడి కప్పుకొని ఇంట్ల నుంచి భూమయ్య ఎదురుగా వత్తండు. కొంతసేపు అందరూ కొయ్యవారిపోయి నిలవడ్డరు. వీళ్లను చూసి నవ్వుకుంట నిలవడ్డడు భూమయ్య.

ఎంకయ్యకు సంతోషం, దుఃఖం, అపనమ్మకం, అంతకుమించి కోపం ఒక్కటే సారి వచ్చినయి. 'ఏంటిది..? ఎటుపోయినవు, ఎప్పుడచ్చినవని' ఏదీ అడుగలేదు. పక్కకు తిరిగి చూసిండు. ఎవల చేతిలనో కట్టెకనిపించింది. అందుకుని భూమయ్య మీదికి ఇసురుడు ఇసిరిండు.

క్షణంలో భూమయ్య పక్కకు తప్పుకున్నడు. అప్పుడే రంగయ్య సేటు తానం జేసి మడి బట్టకట్టుకుని తడిదొతిని ఆరేద్దామని సూరు కిందికి వచ్చిండు. బలంగా ఇసిరిన కట్టె రంగయ్య సేటు కొంకిల తలిగింది.

"రంగీ...సత్తినే...ఎంకడు సంపెనే...' అని తుపుక్కున కూలవడ్డడు. రంగయ్య మడి బట్ట మొత్తం నానింది. అటు ఎంకయ్య ఇటు భూమయ్య చెరో దిక్కు పరుగందుకున్నరు. మల్లయ్యనే సేటును లేపి బతిలాడి ఇంట్లకు తోలిండు.

"ఆ...పొల్లగాడు కొంపల గుత్తోడున్నట్టుంది...అటుపోయింది చెప్పడు ఇటు అచ్చింది చెప్పడా...అవ్వో...బాగనే ఉంది పని వరుస" పెద్దయారాలు అన్నది ముక్కు





మీద ఏలేసుకుని.

"ఆ..గంత వాగుల ఎట్లదాటే. మల్ల ఎట్లచ్చే..." చిన్నయారాలు.

"ఏంజెయ్యాలక్కా...యాడుంటనో యాడవోతనోగని నన్ను మంది కండ్లల్ల ఏసుడు. ఊరు ఊరంత ఒక్కటాయె. ఏడ్పులు ఆర్పులు మనిషికోమాట. వచ్చినా, చేరినా అని చెప్పకపాయె. మూగదయ్యమోలె వచ్చి ఇంట్ల గూసుండె." అన్నది ఎంకవ్వ ఏడ్సుకుంట.

భూమయ్య పొద్దుగూకేదాక దొడ్డి కాడనే కూసున్నడు. కోపం తగ్గినంక ఎంకయ్యనే పోయి తోలుకచ్చిండు.

ఎట్లవాగు దాటింది...ఎడ్లకట్లను ఇడిసి మళ్లీ ఎట్ల ఈత వడ్డది,ఎక్కడ అవుతలి ఒడ్డుకు చేరింది,ఎట్ల ఇవుతలి ఒడ్డుకు చేరింది,ఎక్కడ ఎక్కింది, వివరంగా చెప్పిండు భూమయ్య. ఎంకవ్వ నోరు తెరిచి వింటుంది. భూమయ్య ఎట్ల ఈత కొట్టింది చెప్పుతుంటే ఎల్లవ్వకు గర్వంగా అనిపిస్తుంది. తడుక సాటు నుంచి వింటుంది.

"అయ్యో..ఎడ్లు ఎవల చేన్లనన్న వడి మేత్తయి గావచ్చు" చివరగా అన్నడు ఎంకయ్య.

"ఎట్లమరి...రేపు పొద్దున ఈతకు పొయి కట్టేసి రావన్నా..." భూమయ్య అడిగిండు.

ఎల్లవ్వ గుండె దడుగ్గుమంది.

ఎంకవ్వ భయం భయంగా..."ఆ..చిన్న మావుల గాదు. మల్లాపోతావు. మంచోనివే...మెయ్యని. మేత్తే ఏ మయితుంది. జురుమానతే కడుదాం" అన్నది.

వాగు వారం రోజులు పారింది. వారం తర్వాత తగ్గింది. మామ అల్లుండ్లిద్దరూ ఈతవడి వాగు దాటింద్రు. ఎడ్లు ఉన్న జాగలనే ఉన్నయి. ఎవల చేను మెయ్యలేదు. వాన నీళ్లకు మాత్రం పొలం ఒడ్లు ఇరిగి వరి మీద మన్ను పేరుకపొయింది. పొద్దంతా మట్టితీసి ఒడ్డు ఒరం సవరిచ్చి, పొద్దుగూకి ఈతపడి ఇంటికి వచ్చింద్రు.

ఎంకయ్యకు వాగు ఒక పెద్ద ఆలోచనను రేకెత్తించింది. 'అదృష్టం బాగుండి పొల్లగాడు దక్కిండుగనీ, ఏదన్నా సుడిగుండం రెండుసార్లు ముంచి లేపితే ఏమయితుండె', అనుకున్నడు. తన ఎరుకల నుంచి వాగుల ఎవలెవలు ఎట్ల కొట్టుక పోయింది గుర్తుకు తెచ్చుకున్నడు. ఏదో చెయ్యాలనిపించింది. ఎంత వాగచ్చినా భయం లేకుంట దాటుడుకు ఏదో ఒక ఆధారం చెయ్యాలనిపించింది.

ఆ గడ్డకు ఈ గడ్డకు ఎత్తు మీదున్నరెండు చింత చెట్లను చూసిండు. మాదిగోళ్లందరికీ చెప్పి దందెడ తాళ్లు అల్లుమన్నడు. అన్నిటినిముడేసి ఆ చెట్టుకు ఈ చెట్టుకు తాడుగట్టిండు. అందరూ విచిత్రంగా చూసింద్రు ఎంకయ్యను. ఈ తాడెందిరో అన్నరు.

సూడుసూడు మంట తాడు గట్టిన రెండు దినాలకే మల్లా వాగువచ్చింది.

తాడువట్టుకుని నీళ్లల్లో యాలాడుతూ వాగు దాటిండు ఎంకయ్య. అతడిని చూసి ఊరు ఊరంతా తాడుకు దారలు వద్దరు. తాడుకు సద్దులుగట్టి ఈ గడ్డ నుంచి ఆ గడ్డకు గుంజుకున్నరు.

అట్లా వాగు మీద వంతెనకు తొలిపునాది వడ్డది. తాడుకు ఎంకయ్య తాడని పేరు వడ్డది. చింతచెట్లకు ఎంకయ్య చెట్లని పేరచ్చింది. ఈదుతూ ఈదుతూ వాగు నడుమల ఉన్న ఒక గుండుకు గుద్దుకున్ననని భూమయ్య చెప్పిండు. ఆ గుండుకు భూమయ్య గుండు అని పేరు వడ్డది.

## 7

దసుర దాటింది. మూర్తాల దినం. ఊర్లె ఇండ్లకు ముగ్గులు పోసుకున్నరు. వానలు గుంజుకుంటయి గదా! అందుకని పని మంచిగ సాగుతది. పని అలుకగ సాగుతదని కమ్మల బండ్లను తెచ్చుకున్నరు. కొందరు కొనుక్కున్నరు. కొందరు చేయించుకున్నరు. కొందరు పట్టాలను అడుక్కచ్చుకున్నరు.

నెత్తిమోత కట్టెలున్నప్పుడు ఇండ్లు అంత పెద్దగ లెవ్వు. కమ్మల బండ్లు వచ్చినంక ఇప్పుడు ఇండ్లరూపే మారిపోయింది. బనుకులు ఎత్తుగలేపుతుండ్రు. అన్నీ తొంబైతొమ్మిది పథకాల పెద్ద ఇండ్లే. రెండు సంకలు, వండుకునిల్లు, మల్లెసల్ల, దేవుని ఇల్లు. అడివిల నుంచి పెద్దపెద్ద కట్టెలు నరికి తెస్తండ్రు.

ఊరు పక్కనే అడివి. కోరుకున్నట్టు టేకుకట్టె. బండికట్టుక పోవాలె. నరుక్క రావాలె. ఎందుకు నరికినవని అడిగేటోడు లేడు. చౌకిదారు ఉన్నడుగని కల్లం మీద అడ్డెడు వడ్లుపెడితే సరె. కట్టెల బండి కనబడితే పక్క నుంచి పోతడు. అట్లా ఇండ్లకు పొయ్యిల కట్టెలకు అడివి మీద బండ్లతో దాడి మొదలయింది.

ఒకనాడు దొడ్డికాడ మాటమీద మాట "తమ్మీ! నేను ఎల్లడు చెరోబండి చేయించు కుంటున్నం. నీకు గూడా చేయించు మంటవా.." అన్న అడిగిండు ఎంకయ్యను.

ఎంకయ్య వద్దన్నడు. ఎంకవ్వనే "వాళ్ల ముందట చిన్న తన మెందుకు..? వాళ్లకున్నప్పుడు మనకుగూడా ఒకటి ఉండని. బండి నడిచే ఎడ్లు ఉండనే ఉండె" అన్నది.

మాచారెడ్డి కాడ మూడు బండ్లు తయారయినయి. ఎడ్లను కొట్టుకపోయి కట్టుకచ్చిండ్రు. వరుసగ మూడు ఇండ్లు. మూడు వాకిల్లళ్ల వరుసగ మూడు బండ్లు. వాకిలి కలనే మారింది. కట్టెకు, పిడుకకు, ఎర్రమన్నుకు ఏది కావాలన్నా బండిగట్టుకుని పోయి, ఏసుకచ్చుడే. పొయ్యిల కట్టెలకైతే గాడిది మోత తప్పింది. కావలిసిన కట్టెలన్నీ నెత్తిమీద మోస్తుండే. బండ్లు వచ్చినంక రెండు రోజులల్ల వరుసగ నాలుగైదు బండ్లు నరుక్కచ్చి ఇల్లు నింపుడే.

అన్నదమ్ములిద్దరూ బాయి మూర్తాలు వట్టిండ్రు. బాయి పని ఎంకయ్యకు తెలుసు కాబట్టి ఎంకయ్య వెంట తిరుగుతున్నరు. ఎంకయ్య గూడా కువ్వారం పట్టలేదు. ఎప్పుడంటె





అప్పుడు, తమ్ముని కంటే తమ్మునికి, అన్నకంటె అన్నకు ఎక్కడి కంటే అక్కడికి పోతుండు.

అటు పెరుమండ్ల కాడ, ఇటు గుట్టకింద, వరుసగ ఈత చెట్లున్నయి. పట్నిపోల్ల మావులా, ఏరుకోలు కల్లు. ఏ ఈదుది కావాలంటే ఆ ఈదుది. అన్న దగ్గరికి పోయినా తమ్ముని దగ్గరికి వచ్చినా కడుపునిండ కల్లు దొరకుతుంది. ఎంకయ్యకు.

ఒకనాడు ముగ్గురూ కల్లు మీద కూసున్నరు. మోతుకాకులతో సాకలు వడుతున్నరు. 'తమ్మీ...పోరగండ్లు పెరుగవట్టిరి ఎట్లరా...ఇండ్లు లేకపాయె...' అన్నడు మల్లయ్య.

"అవునే...సూత్త సూత్తండె వరకు పెరిగిపోయిరి. మా పెద్దోనికి లగ్గంజెయ్యాలె" ఎల్లయ్య అన్నడు.

"తమ్ముడొకటి నువ్వొకటి ఇల్లుగట్టన్నే...పోరగండ్లకు చెరో ఇల్లు ఉండాలె గదా. నాకు ఒక్కపొల్ల. ఒక్క ఇల్లుసాలు". ఎంకయ్య అన్నడు. రెండు సాకలు తిరిగినయి. పొద్దటికల్లు తాగుత తాగుతనే నెత్తి కెక్కింది.

"అరేయ్...ఇలిటెపోనికి జుట్టు చేతుకిచ్చి గంతులెయ్యకు. ఎందుకురా! అన్ని పనులకు నువ్వే ముందుకు ఉరుకుతవు. పనికి ఎనుక పటువట్టి ముందట ఆయినను తోలాలె. జర తాకు తలుగాలె" మల్లయ్య అన్నడు.

"అవునే అన్నా...నీయవ్వ...పోరనికి అరుక బరువు తలుగనియ్యవు. ఎన్నొద్దులు మీద మీద తిరుగుతడు..." అంటూ ఎట్లా బరువెత్తాలో చెప్పిండు తమ్ముడు.

నాలుగో సాక తిరిగింది. అన్నదమ్ములిద్దరూ తన గురించి, తనబాగు గురించే మాట్లాడుతున్నట్టనిపించింది ఎంకయ్యకు. అల్లునికి బరువెత్తి పనిలో మెదిగియ్యాలను కున్నడు.

"అన్నా...నాకొక కొడుకుంటే నేను ఇల్లు కట్టపోదునా..మనపొత్తుల పెరడు ఉంది గదనే..ఆ పెరట్ల కట్టుకొండ్రి. కట్టె అంటరా...గుట్టకింద వాగవుతల ఉన్న యాపలన్నీ నరుక్కోండ్రి. ఇల్లు కట్టుకుంటనంటే కాదంటనాయే." ఎంకయ్య అన్నడు. ఐదుసాకలు తిరిగినయి.

"అవుననుకో...నీబిడ్డ మాబిడ్డకాదా...మాకొడుకులు నీకొడుకులుకాదా...మాకు ఆడివిల్లలే లేకపాయె. రేపు ఏ శుభకార్యమైనా మాకు ఎవలున్నరు తమ్మి. ఎల్లవ్వనే దిక్కయితది. ఆడివిల్ల ఆత్మదొరుకుతాదిరా...సచ్చిన్నాడు తలాపున కూసుండి ఏడిత్తే నలుగురు జమయితరు. ఆడివిల్ల తలుసుకుంట ఏడిత్తే నలుగురు పక్కన వలుగుతరు.." అన్నదమ్ము లిద్దరూ కండ్లకు నీళ్లు తీసుకున్నరు.

ఎంకయ్యకు గూడా కండ్లల్ల నీళ్లు తిరిగినయి. "నాకెవలున్నరే అన్నా...ఆపతికైనా సంపతికైనా మీకొడుకులే నా కొడుకులు. రేపు సచ్చిపోతే నన్ను ఎవడు మోత్తడు. ఎవడు సుట్టివడుతడు. మొగ పోరగండ్లు ఉంటే నలుగురు జమయితరు. ఎత్తుకపోయి పారేత్తరు."

అన్నడు ఏడ్సుకుంట.

ఆరో సాక తిరిగింది. ముగ్గురూ ఒగల మీద ఒగలు పడి ఏడ్చింద్రు.

తెల్లారే ఇద్దరు అన్నదమ్ములు పొత్తుల పెరట్ల ఇండ్లకు ముగ్గులు వోసింద్రు. ఇది చూసి ఎంకవ్వ భర్తను అడిగింది. మనపాలు మనకు ఉండాలన్నది.

"పోనితియ్యి...మనకు కొడుకులుంటే కట్టుకోకపోదుమా...? ఇండ్లు కట్టుకుంటరట." అన్నడు. ఎంకవ్వ కూడా నోరు తెరువలేదు. బిడ్డ ఒక్కతి. తోడపుట్టినోళ్లు లేరు. అందరు ఒక్క జాగల కలిసిమెలసి ఉంటే దిక్కు దీము ఉంటరనుకుంది. వాళ్లు కూడా ముగ్గు పోసేటప్పుడు,శుభకార్యాలకు నువ్వేముందట నడువాలని ఎల్లవ్వను నడిపిస్తంద్రు. ఎల్లవ్వ ఆడబిడ్డ ఎల్లవ్వయింది.

ఒకవైపు బాయి పనులు..ఇంకోవైపు ఇంటి పనులు క్షణం తీరిక లేకుంటా ఉంది ఎంకయ్య అన్నదమ్ములకు. ఎంకయ్యకు మాత్రం పొద్దుమాపు మోట. పొద్దటి మోటను భూమయ్యకు అప్పజెప్పిండు. మాపటి మోట తను గొడుతుండు. పొద్దుమాపు మోటను ఒక్కోసారి భూమయ్యనే గొడుతుండు.

వరి బిర్రు పొట్ట కచ్చింది. ఎప్పుడూ లేనిది మొగి రోగం వచ్చింది. పొట్ట దగ్గర కాటు పడి తెల్లవడుతుంది. వరికర్ర మదిరెలు మదిరెలుగా మాడిపోతుంది. పచ్చగ నడుమెత్తు పెరిగిన వరి నోరు తెరిచి తెల్ల వడుతుంది. వరి కర్రను తీసి చూస్తే పచ్చటి రెక్కల పురుగు ఎగిరిపోతుంది.

ఆ పురుగును, ఆ రోగాన్ని ఎప్పుడూ చూడలేదు ఎంకయ్య. అంత కష్టపడి వరి పెట్టుకుంటే పంట పండదేమోనని భయమయింది ఎంకయ్యకు. అన్ని దేవుండ్లకు మొక్కుకున్నడు. ఎంకయ్య చేన్ల రోగం అందరికీ తెలిసిపోయింది. పురుగు ఎట్లుందో చూసి వస్తున్నరు.

ఎవలను అడిగినా ఏమీ తెలువదంటున్నరు. ఏం చెయ్యాలెనో తోచలేదు ఎంకయ్యకు. పురుగును దొరుకవట్టి నీళ్లల్ల వేస్తే చచ్చిపోయింది. చేను మీద వాన చినుకులు పడ్డట్టు కడుముంతల నీళ్లు తీసుకుని చల్లుడు మొదలువెట్టిండు. ఎందుకైనా మంచిదని చల్లే నీళ్లల్ల యాపాకు పొడిని యాప కాయల పొడిని దంచి కలిపిండు.

ఎగిరిపోయే పురుగు ఎగిరిపోతుంది. చచ్చిపోయే పురుగు చచ్చిపోతుంది. రాయికి సున్నం పూసి కుంకుమ బొట్టును పెట్టి చిన్న పందిరేసి ఒడ్డు ఒడ్డుకు దేవున్ని నిలిపింది ఎంకవ్వ. దేవుండ్ల దగ్గెర దీపం పెట్టింది. ఒకటి రెండు పురుగులను దీపానికి కాల్చింది. ఎగురుతున్న పురుగులు దీపం దగ్గరికి వచ్చి చేరినయి.

రెండు రోజులల్ల ఒక్కపురుగు కనిపించలేదు. ఎండిపోయిన మొగి ఇగురువెట్టింది. చేను ఎప్పటి లెక్క పచ్చగ అయింది. ఎంకయ్య ఏదో మందు చల్లిండని అందరికీ తెలిసిపోయింది. మొగిపురుగు యాద కనబడ్డా జాజుపురుగు ఎక్కడ తలిగినా





ఎంకయ్య దగ్గెరికి పరుగెత్తుకత్తున్నరు ఊరి జనం. అందరికీ యాప పొడి ఇచ్చి నీళ్లల్ల కలిపి చల్లుమని చెప్పుతున్నడు ఎంకయ్య.

ఒకలిద్దరు చల్లినా పురుగు మల్లా అంటుకుంది. ఒడ్డు ఒడ్డుకు దేవున్ని నిలిపి దీపం పెడితెనే మందు పారుతుందని తెలుసుకున్న ఎంకయ్య, దీపం వెలిగించి దేవున్ని నిలిపితేనే మందు పారుతుందని చెప్పి మల్ల పొడి ఇచ్చిండు. కుండలల్ల నీళ్లు నింపుడు బోకెలతో ఇసిరి సల్లుడు. మొదట మొదట మందు చల్లే పనికి పునాది పడ్డది అప్పుడే!

ఎల్లయ్య,మల్లయ్య ఇండ్లకు పునాదులు పడుతున్నయి. నిలివెడు నిలివెడు పునాదులు తవ్వి బెండడి రాళ్లు నింపుతున్నరు. మన్నును దున్నపోతులతో తొక్కిచ్చి జిగికి చేస్తంద్రు. రోజుకు ఒక్క కచ్చు మాత్రమే లేత్తుంది. కచ్చు ఆరినంక కచ్చుమీద కచ్చు. రెండు ఇండ్లకు వడ్లోళ్లు ఒక్కటే దగ్గెర పని చేస్తున్నరు. దూలాలు వాసాలు చెక్కుతున్నరు.

ఒకదిక్కు బాయి పని. ఇంకోదిక్కు ఇంటిపని. ఎందరు మనుషులున్నా సాల్తలేరు..

"తమ్మి...ఒకనాడు ఎడ్లనియ్యవురా..." అంటున్నడు మల్లయ్య.

'అన్నా...ఒకనాడు బండి నియ్యవా..?' అంటున్నడు ఎల్లయ్య.

'చిన్నాయినా! ఒకనాడు రాయి జారగొట్టరావానే...' అన్నకొడుకులంటున్నరు.

'పెద్దనాయినా...బావను బాయి తవ్వతోలవాయే' అని తమ్ముని కొడుకులంటున్నరు.

"చెల్లే..మీరు బాయి తవ్విన గడ్డపారలుంటే ఇయ్యవా. మా గడ్డపారలు మొనలు దంగినయి' అని యారాలు.

'అక్కామన్ను కలుపరావా...ఇయ్యల్ల ఒక్కదాన్నే ఉన్న' అని చిన్నయారాలు.

ఎంకయ్య ఇంటి చుట్టూ అన్నదమ్ములు తిరుగుతున్నరు. తన కొడుకులకే ఇండ్లుకట్టినట్టుంది ఎంకయ్య. ఎంకవ్వ ముందు గులిగినా...రాను రాను అన్నీ మరిచిపోయింది. అడిగింది ఇత్తుంది. ఏ పనికైనా ఎదురువోతుంది. పాత ఇండ్లపక్కనే కొత్త ఇండ్లు. పొద్దుమాపు పని.

ఎంకయ్యనైతే ఏదైనా పని ఉంటే అడుగక ముందే బండి కడుతున్నడు. అందరికంటే ముందుంటున్నడు. యాపకట్టెలన్నీ నరుక్కచ్చి ఇంటిముందు వేసిండు. మొగురాలకు దూలాలకు తీరైన కట్టెపెడుతున్నరు. ఏమాత్రం కొద్దిగా వంగినా ఎంకయ్యనే వద్దని మంచి కట్టెను పెట్టిస్తున్నడు. పొద్దుమాపు వాళ్లపని మీదనే ఉంటున్నడు. ఏ కట్టె వంకరున్నా 'కట్టె కరువయినాదిరా...బండిగట్టుకుని నాలుగు అడుగులు పోతే తీరొక్క కట్టె దొరుకుతది' అంటున్నడు.

ఇందంతా చూస్తుంటే భూమయ్యకు మండుతుంది.కానీ ఏమనలేకపోతున్నడు. ముందుగా అత్త వద్దన్నా, తర్వాత ఎంకయ్య కంటే ముందే పోతుంటే భూమయ్యకు కోపం మరింత పెరుగుతుంది.

ఒకనాడు బొక్కెన బాయిల ఏత్తున్నడు. ఒకనాడు దందెడతాడు ఇప్పుతున్నడు. ఏదో రకంగా బాయి దగ్గరనే పని పుట్టిచ్చి మామను అక్కడే ఉంచుతున్నడు. అయినా ఒక్కొక్కనాడు మన పని ఉందన్నా రాకుంట ఇంటిపనికే పోతున్నడు ఎంకయ్య. ఇల్లు గట్టేపని ఉండుడు చేతనే అన్నదమ్ములు వెంట తిరుగుతున్నరని భూమయ్యకు తెలుసు.

భూమయ్యకు కోపమచ్చింది. "మామా...మనకే మస్తుపనుంది. తవ్వేడు వడ్లకు తంగేళ్లు వీకవోతే బుడ్డెడు వడ్లు దుడ్డె బుక్కిందట. నువ్వు అటుఇటుపోతే మన చేను ఎండిపోతది." అన్నడు.

"ఆ...పిల్ల వచ్చి గుడ్డును ఎక్కిరిచ్చిందట...మా చేను ఎండిపోయెది మాకు తెల్వదా.. మాకు నువ్వేం పనివర్స చెప్పద్దు. మాది మాకు తెలుసు." భూమయ్య మాటలు విని కోపంగా అన్నది ఎంకవ్వ.

ఎంకయ్యకు మాత్రం కోపం రాలేదు. " ఇది నీకోసమే బిడ్డా...రేపు మీరందరు మందిలకలిసి వుండాలనే చేత్తున్నం. పోలునాడు కిరికిరయితే కొనెల్లా కిరికిరన్నట్టు మొదలు మొదలు కంటు ఎందుకు కావాలని పోతున్నం...ఇంకో రెండు నెలలయితే అయిపాయె.వాళ్లంతల వాళ్లు మనంతల మనం" ఎంకయ్య అన్నడు.

భూమయ్యకు కోపం తగ్గలేదు. ఎప్పుడూ గటుక సల్లతాగి మోటకు పోయేటోడు. ఆనాడు పండ్లపులుకను ఏసుకుని వట్టిగనే పోయిండు. మోటగొట్టి ఎడ్లను సదిరి ఇంటికి చేరుకోనేలేదు. దొడ్డి దగ్గెరనే ఎదురు చూస్తూ కూసున్నడు పెద్దమామ కొడుకు.

"బావా..నీ కొరకే ఎదురు సూత్తున్న. కోపుల కట్టెలున్నయి. ఏసుకరావాలె. బండిగట్టు" అన్నడు.

జోళ్లు పగ్గాలు కొట్టం అర్రల దాచిపెట్టి ఇంటికి వచ్చి బండి కట్టిండు భూమయ్య. చిన్నమామ కొడుకుది ఒక బండి. పెద్దమామ కొడుకుది ఒకబండి. తనది ఒకబండి. వరుసగా మూడు బండ్లు కదిలినయి.

పొద్దు నెత్తిమీదికి వచ్చింది. భూమయ్యకు ఆకలయితుంది. ఇంట్లో అత్తమామలులేరు. ఎల్లవ్వ ఒక్కతే ఉంది. పొద్దున అలిగిపోవుడు చూసింది. ఇంట్లకు వస్తడని చూసింది. భూమయ్య ఇంట్లకు రాలేదు.

కోపులకు పోతే కట్టెలు ఏసుకుని వచ్చేసరికి పొద్దుగూకుతది. సల్లగటుక తాగిపోతే మంచిగుండు ననిపించింది. ఇంట్లకు పిలువాలంటే భయమయింది. అంతకు మించి సిగ్గయింది ఎల్లవ్వకు. ఇంతకు ముందు మాటకు మాట ఎదురు చెప్పేది. పేరు పెట్టి పిలిచేది. ఇప్పుడు ఎదురు పడితే సిగ్గయితుంది.

ఎల్లవ్వ దూపకు బుడ్డినిండా సల్ల కలిపి పెట్టింది. దరువాదలకు వచ్చి నిలబడ్డది. బండ్లను ఎడ్లను మనుషులను చూసింది. భూమయ్య వైపు నిస్సహాయంగా చూసింది. ఎందుకో తల్లిమీద తండ్రిమీద కోపమచ్చింది. బండ్లు సాగిపోయేముందు చిన్నన్న







కనిపించిండు ఎల్లవ్వకు.

'అన్నా బావను...గటుక తాగి పొమ్మనే...' అన్నది. గొంతు పెకులలేదు. అన్నకు వినిపించిందో వినిపించలేదో తెలువది. వినరానట్టుగానే పోయిండు.

బండ్లు వెళ్లిపోయినయి. మనుసంతా గిలకొట్టినట్టయింది ఎల్లవ్వకు. వీళ్లు అందరినీ ఎట్టి వడుతున్నరు. మా అవ్వకు నాయినకు బుద్దిలేదు అనుకుంది.

వాగుల బండ్లను ఆపి నాలుగు దోసిల్ల నీళ్లు ఎత్తుకుని తాగిండు భూమయ్య.

"ఏంది బావా...వాగుకు వాగును మర్రి గట్టేతట్టున్నవు." పెద్ద బామ్మర్ది పరాశికమాడిండు.

"బావ ఏందనుకున్నవు. గట్లున్నడుగనీ మస్తుపని జేత్తడు. మూడు బండ్ల కట్టెలు ఒక్కడే కొడుతడు" చిన్నబావమర్ది అన్నడు నవ్వుకుంట.

ముగ్గురు కోపులకు చేరుకున్నరు. ఎవల బండి వాళ్ళు నరుక్కొని నింపుకొని రావాలె. కోపు మొత్తం యుద్దం జరిగిన భూమి లెక్కనే ఉంది. ఎక్కడియక్కడ చెట్లు తెగి పడినయి. ఒక్క ఊరు గాదు. అడవిని ఆనుకుని ఉన్న అన్ని ఊర్లు అడివిమీద దాడి చేస్తున్నయి. దొరికిన కట్టెనల్లా నరుకుతున్నరు.

ఎడ్ల కొట్టాలు లంకలోలె ఇండ్లు...గుడిసెలు..పొయిల కట్టెలు. అడివి కరుగుతున్నది. ఊరు దిగితెనే తీరొక్క కట్టె దొరికేది. ఇప్పుడు కోపుల దాకా పోతేగాని కట్టె కనవడుతలేదు. ఊరు పెరిగి అడివి తరుగుతుంది.

ఎవలది వాళ్లు ఏరుకోలు చెట్లను నరుక్కున్నరు. అందరికంటే ముందే బండిని నింపుకున్నడు భూమయ్య. అటో రెండు ఇటో రెండు కట్టెలు నరికి పెట్టి ఇద్దరి బండ్లు నింపిండు.

పొద్దుగూకే జాముకు మూడు బండ్లు బయలుదేరినయి. వచ్చేటప్పుడు ఖాళీబండ్లు సరసరవచ్చినయి. పోయేటప్పుడు నిండు బండ్లు. ఆరాటానికి పెద్దపెద్ద వాసాలు నిండా మెలిగింద్రు.

బరువు బండ్లు కదులుతలెవ్వు. ఒర్రెలు ఎక్కిదిగుడు. రాళ్లురప్పలు. బండ్లు ముందుకు సాగుతలెవ్వు. 'జా పట్టు..సుక్కపుల్ల....బక్కా..' అని బొబ్బలు వెట్టుకుంట ఒక్కబండికి ముగ్గురు ఆసరవట్టుకుంట మెల్లెమెల్లగ కదిలించుకుంట వస్తంద్రు. రాత్రయితే అడవిజంతువుల భయం. అందుకని అలికిడి చేసుకుంట వస్తున్నరు.

భూమయ్యకు కడుపుల మండుతుంది. పాణం సొలుగుతుంది. దాపటిది ఎనుకపట్టు పడుతుంటె దాపటి పయ్యకు ఆసరవడుతుండు. కోపుదాటే వరకే మసుకువడ్డది. అడవికి పోయిన బండ్లు అటేపాయెనని మామలు ముగ్గురు వచ్చింద్రు ఎదురుగా.

ఎద్దుకు ఒకలు పయ్యను ఆసరపట్టుకుంట ముందుకు ఆదిలిస్తున్నరు. ఊరవుతల పెద్ద బుడుగు. ముందటి రెండు బండ్లు తండ్లాడుకుంట బయటవడ్డయిగనీ చివరి బండి

బుడుగుల దిగవడ్డది. ఇగ జరుగది. అగజరుగది. బురుదల నుంచి కదులది.

"మైసవ్వతల్లీ..నీబాంచెను కాళ్లు మొక్కుత. బండి మంచిగ ఇంటికి చేరితే కల్లు సాకవెట్టి కోడిపిల్లను కోత్త" పబ్బతులు వట్టి మొక్కుకున్నడు మల్లయ్య. బండిని మనిషికో దిక్కు ఆసరవట్టింౝ్రడు.

భూమయ్యకు కడుపుల పేగులు గుర్రుమంటున్నయి. కాళ్లు గుంజుతున్నయి. ఎప్పుడు ఇల్లు చేరుదామా అన్నట్టుంది. వలపట ఎద్దుతోక వట్టి ఇరుస్తూ 'జా' అన్నడు. ఒకలు పయ్య, ఒకలు నొగలు ఆసర వట్టింౝ్రడు. ఎడ్లు ఊలు మీద పైకి ఎక్కినయి.

చిమాన చీకటి. భూమయ్య కాళ్లు జారినయి. బండిపయ్యకింద బొక్క బోర్లవడ్డడు. మిగిలిన వాళ్లు ఇది చూడలేదు. బండిపైకి ఎక్కుతున్న ఊలుమీద ఉన్నరు. ఎనుకకువత్తే మల్లీ ఎక్కదని భయం.

"అడెడెడెడె....డెడెడె....పట్టురపట్టు....ఇంకజర్రా....ఎక్కనిఎక్కని....జా' అని ఆసరవట్టి ఎడ్లను దమాయించుతున్నరు.

బండి పయ్య భూమయ్య నడుం మీదికి ఎక్కిదిగింది. 'వావ్వా.. సత్తిసత్తి... సత్తిరో...నడుం ఇరిగెరో' అన్నడు కేకలేస్తూ.

అప్పుడు చూసింౝ్రడు అందరు. 'అరెరే...పొల్లగాడు సచ్చెరా...గుంజుంౝ్రడిరా... గుంజుంౝ్రడి.' అన్నడు ఎల్లయ్య. బండికింద బురుదల నుంచి లావట్టి కూసుండవెట్టింౝ్రడు భూమయ్యను. అప్పటికే తిండిలేదు. ఇప్పడు నిండుబండి మీదికి ఎక్కిదిగింది. నడుంవాలిపోయింది. భూమయ్య క్యాల్లి దప్పిండు.

కండ్లు తెరిచేసరికి వెలుగుతున్న దీపం కనిపించింది. ఇల్లునిండా మంది నిండింౝ్రడు. ఘాటైనా పులివాయిలి ఆకుల వాసన. నలిచిముక్కు దగ్గర పెట్టినట్టున్నరు. నడుం దగ్గర నొప్పిగా వుంది. అటునుంచి ఇటుతిరుగుతూ 'అవ్వా' అన్నడు భూమయ్య.

'అగో మెలుకచ్చింది...మెసులుతున్నడు' అత్త అన్నది.

ముగ్గురు మామలు దగ్గెరికచ్చింౝ్రడు. నలుగురు బామ్మర్దులు లావట్టింౝ్రడు. ఒక అత్త కోడిగుడ్డు బెల్లం, ఒక అత్త మంచినీళ్లు, ఒక అత్త సారబుడ్డి తెచ్చింది.

కోడిగుడ్డు కొట్టి నోట్లె పోసింౝ్రడు. బెల్లం నీళ్లను తాగిచ్చింౝ్రడు. రెండు బుక్కల సారగూడా తాగిచ్చింౝ్రడు.

"ఇగ ఏంగాదు. రేపు దెబ్బమందు పోత్త. క్యాలికి వత్తే అయిపాయె" మల్లయ్య అన్నడు. కొంత సేపటికి దెబ్బ మొత్తం దులిపిండు భూమయ్య. లేచి అటుఇటు తిరిగిండు. ఆకలయితుంది. అడుగాలంటే సిగ్గయితంది. ఆ మందు ఈ మందు అంటున్నరుగనీ సల్లగటుక తాగిద్దామంటలేరు ఎవలు.

మొండికి తనే '...ఆకలి...ఆకలయితుంది' అన్నడు.

ఎంటనే ఎంకవ్వ దూపకు బుడ్డెడు సల్లగటుక తేనె లెక్కన కలిపి తీసుకచ్చింది.





అంచుకు కాల్చిన పచ్చి మిరుపకాయలు ఉల్లిగడ్డ తెచ్చింది. నాలుగు బుక్కలల్ల బుడ్డిని ఖాళీ చేసిండు భూమయ్య.

బామ్మర్దులు, అత్తలు, మామలు ఇంట్లనే కూసున్నరు. ఆ బలుగాన్ని చూసినంక మామ పొద్దున చెప్పిమాట నిజమే అనిపించింది భూమయ్యకు. గోజకు తింటే సత్తువ. మనిషికి ఉంటే సత్తువ. ఆపదల సంపదల మనిషికి మనిషి తోడుంటె ఎంత బలం అనుకున్నడు.

అయినా వాళ్ల మీద నమ్మకంలేదు భూమయ్యకు. 'అబ్బో... పెడితె పెండ్లికోరుతరు. లేకుంటే సావు కోరుతరు. ఈ జాతిని నమ్మద్దు' అనుకున్నడు.

నిద్ర ముంచుకచ్చింది. గొంగడి బొంత ముడుసుకుని పండుకున్నడు. ఎక్కడోళ్లు అక్కడ అరుగంచుల దగ్గెర ముడిచింౝ్రడు. అందరికి నిద్రపట్టినా ఎంకయ్యకు మాత్రం నిద్ర పడుతలేదు. భయం భయంగనే ఉంది. ఇంకా నయం. పయ్య నడుము మీద ఎక్కింది కాబట్టి సరిపోయింది. అదే బొండిగ కాయ మీద ఎక్కితే ఎట్లుండు...?అనుకున్నడు.

తెల్లారే మూడు బండ్లను కట్టిచ్చిండు ఎంకయ్య. బండ్లమీద పొనికెలు పెట్టిచ్చిండు. బాయిగడ్డ మొరాన్ని పొద్దంత జారగొట్టి తొవ్వను ఎత్తులు వంపులు లేకుంట చేసిండు. బండి ఆగకుంట నడిచేతట్టు చేసిండు.

ఆ తొవ్వను చూసినంక అందరికీ ఆలోచన వచ్చింది. రాత్రనకా పగలనకా తిరుగుతం. రాట్నాలోలె బండ్లు నడుత్తయి. తొవ్వలు ఇట్లుంటే ఎడ్లకు గోస మనుషులకు గోస. పసిపోరన్ని బండి ఎక్కిచ్చినా ఇంటికి చేరేటట్టు తొవ్వలుండాలని ఎవల బండ్లు నడిచే తొవ్వను వాళ్లు మొరం మన్ను పోసి గుంతలు పూడ్చుకున్నరు. ఊర్లె మొదటి సారిగా తొవ్వ నిర్మాణపు పనులు మొదలయినయి.

మూడు రోజుల వరకూ ఇల్లు కదులలేదు భూమయ్య. ఎంకయ్య ఏవేవో చెట్ల మందులు దంచిపోసిండు. నడుము మీద పుండయింది. పుండు మానుడుకు గుంటగన్నేరాకు దంచిపెడుతుండు. కొద్ది కొద్దిగా నడుము నొప్పి తగ్గింది కానీ పుండు పెద్దదయింది. పక్కుగట్టి మానడానికి నెలరోజులు పట్టింది. ఈనెలలో బక్కగయిండు భూమయ్య.

"పోరడు నరిగెలెక్కున్నడు. అస్సలు పెకులుతలేడు. పోరి తెప్పమాకోలె అయింది. తోటకూరలెక్క పెరుగుతుంది." అంటున్నరు ఇరుగుపొరుగోళ్లు.

ఎంకవ్వకు రంది వట్టుకుంది."పొల్లగాడు ఎట్లపెకులాలె".అనుకుంది. రెండు తక్కల కుడుకలు, తంకమెత్తు మోడి, మినుములు, తక్కెడు బెల్లం, సోలెడు నువ్వులు దంచింది. ముద్దలు కట్టింది. పొద్దుమాపు తినవెట్టింది. తినేది తింటనే ఉన్నడు ఎండుకపోతుండు భూమయ్య. ఎదురు బొచ్చె తేలింది. ఎదురు తలిగిందని దించిపిచ్చిండు ఎంకయ్య.

ఎంకయ్యకు కాందారి రాజయ్య మీదనే అనుమానం. తనమీద పగతో అల్లునికి మంత్రం చేయించిండనుకుంటున్నడు. పీరీల బొట్టు.దించుడు, ఎత్తుడు, బందానం అన్నీ అయినియి. మొల్దారానికి తాయితులు కట్టిచ్చింద్రు భూమయ్యకు. శెమగండాలు పోతయని చెవ్వు గుట్టిచ్చి కాలుకు తిరుపతి బేడి ఏయించింద్రు.

భూమయ్య బాగలేడని తెలిసి పెద్దన్న చూసిపోను వచ్చిండు. ఒక పూట మాతో ఉంటడని తీసుకపోయిండు.

అక్కడ ఎవలేం చెప్పింద్రోగాని వచ్చినంక భూమయ్య చెప్పింది వినడం లేదు. చెయ్యికి దొరుకడంలేదు. ఒకటి చెయ్యిమంటే ఒకటి చేస్తున్నడు. మాటమాటకు మర్రవడుతున్నడు.

ఎల్లయ్య చిన్నకొడుకు కొద్దిగా బచ్చాక్యాల్లి మీదున్నడు. వానితో సోపతి చేసిండు భూమయ్య. మా ఇంట్లో కుడుకలు ఉన్నయని చెప్పిండు వాడు. వాన్ని బుదురకిచ్చి రోజుకు రెండు మూడు కుడుకలు తెమ్మన్నడు భూమయ్య. కుడుకల కుండ ఖాళీ అయింది. నువ్వులు నూకలు తెమ్మన్నడు. అవి సగం ఖాళీఅయినయి. ఒకనాడు వాళ్ల అవ్వ చూసింది. 'నీతలపండు వలుగ...నువ్వుల కుండ సగం బుక్కినవని చీపురు కట్ట అందుకుంది.

వాడు మొత్తుకుంట "వావ్వా ఒక్క నువ్వులకుండకాదే. నూకల కుండ సగమయింది. కుడుకల కుండ అయిపోయింది. బావ తెమ్మని బుదురకిత్తుండే" అన్నడు ఏడ్సుకుంట.

"ఆ...పిల్లగా..పోరన్నిజూసి అట్ల తెమ్మంటవా.." అని తల్లి కోప్పడితే "నేను తెమ్మనలేదత్తా ...వట్టిగ చెప్పుతుండు. నాపనిగాదు బతుకుగాదు. నేను తెమ్మంటనా..." అన్నడు భూమయ్య.

ఇంకొకనాడు ఆ మామకొడుకును ఈ మామ కొడుకును ఇద్దరిని కలుపుకున్నడు. మేర బుచ్చయ్య పొప్పెడి పండ్లకు షికారు పోయిండు.

బుచ్చయ్య ఇంటి వెనుకనే పొప్పెడి చెట్టు. చెట్టునిండా పండ్లున్నయి. చెట్టు కిందనే శాదబాయి వుంది. చెట్టునుండి పండ్లు కిందికి రాలితే బాయిలవడుతయి.

ఒకన్ని చెట్టు ఎక్కించిండు. ఒకన్ని బాయి గంగరాళ్ల మీదికి దించిండు. తనుగోడమీద నిలవడ్డడు. చెట్టుమీద ఎక్కినోడు పండ్లను తెంపి గోడమీదున్న భూమయ్యకు ఇసురాలె. భూమయ్య పండ్లను అందుకుని సంచిల ఏసుకోవాలె. వాటం తప్పిరాలిన పండ్లను బాయిల ఉన్నోడు అందుకోవాలె.

పట్టపగలు ఊర్లె ఎవలుంటరు..? పురుగులేదు. చెట్టుమీదున్నోడు నాలుగు పండ్లను తెంపిండు. వాటిని అందుకుని మూడింటిని సంచిల ఏసుకున్నడు భూమయ్య. ఒక పండును మాత్రం మేర బుచ్చయ్య గుడిసెలకు ఇసిరిండు. పడుడు పడుడే పండు బుచ్చయ్య తలుకాయ మీదపడి పక్కుమని పలిగింది.





"ఎవడ్రా...నీతల్లి...పొప్పెడి చెట్టుకింద ఎవడురా?" అని గుడిసెల నుంచి ఉరికచ్చిండు బుచ్చయ్య. చెట్టుమీదున్నోడు చెట్టుమీదనే నతికిండు. బాయిలున్నోడు బాయిలనే ఉన్నడు. మూడు పొప్పెడి పండ్లు పట్టుకొని గోడ మీదున్న భూమయ్య మాత్రం అవుతలికి దుంకి పోయిండు.

మేర బుచ్చయ్య చెట్టుమీదున్నోన్ని చూసిండు. పెద్దది గయికట్టె అందుకున్నడు. అప్పటికే గుండుమీద పొప్పడి పండు తలిగిన తిక్క మీదున్నడు. గయికట్టెతో కిందినుంచి పొడుచుకుంట 'దిగు బంచోత్...దిగు. దిగు బంచోత్ దిగు.' అనుకుంట పండ్లు కొరుకుతున్నడు.

గయికట్టె చివర మెనదేలిఉంది. ఎద్దును పొడిచినట్టు పొడుత్తుంటే అది తాకరాని జాగల తాకుతుంటే చెట్టుమీదున్నోడు. 'అబ్బపొడువకే...నేను ఒక్కన్నే కాదే..బాయిల ఇంకొకడున్నడే..' అన్నడు ఏడ్సుకుంట.

ఇద్దరినీ దొర్కవట్టి నాలుగు అందుకొని మల్లయ్య దగ్గరికి పట్టుకుని వచ్చిండు బుచ్చయ్య. వాళ్లు భూమయ్య పేరు చెప్పింద్రు. భూమయ్య మాత్రం 'ఓట్...నేను లేనేలేను. ఇంక లింగంను అడుగు. నేను గోజలను కాయబోయిన' అన్నడు. పొప్పెడి పండ్లను పంచుక తిన్న లింగం అవును పటేలా..మేమిద్దరం గోజలను మలుపుకుంటనే ఉన్నం' అన్నడు.

ఇవన్నీ ఎంకయ్యకు వినబడుతనే ఉన్నయి. ఏమన్నా అందామన్నా సందు దొరుకుతలేదు. ఎంకవ్వ గూడా మండి పడుతుంది. ఎప్పుడు గులుగుతనే ఉంది. ఎల్లవ్వ మాత్రం నవ్వుతుంది. 'బావనే బాయిలకు దించద్దానే' అని అన్నలను ఎక్కిరిత్తుంది.

వాగుకు అడ్డం కట్ట కట్టినంక చెరువులకు వచ్చే నీళ్లు పెరిగినయి.ఎప్పుడైతే నీళ్లు వచ్చుడు పెరిగిందో అప్పుడే ఆయకట్టు పెరుగుడు మొదలయింది.

చెట్లన్నీ కొట్టి గుడ్డాలను పొలాలుగా అచ్చుకడుతున్నరు. అన్నదమ్ములు ముగ్గురు కలిసి అప్పుడే మూడెకరాల గుడ్డం కొన్నరు. చిన్న చిన్న కొమ్మలన్నీ మొదటకొట్టింద్రు. అప్పటికి దూలాలు వాసాలు పడి ఇల్లుపై కప్పుదాకా వచ్చింది. దాలం చేయడానికి ఆకులు కొమ్మలు కావాలెనని, ఈ కొమ్మలనే ఎత్తుకుపోతమని మోపులు కట్టుకున్నరు.

రాత్రికి రాత్రే భూమయ్య మోపులు విప్పి పైకి కనబడకుంట కట్టలల్ల రాళ్లు కట్టిండు. తెల్లారి నలుగురు బావమరుదులు ముగ్గురు మామలు ముగ్గురు అత్తలు మోపులు ఎత్తుకపోయేతందుకు వచ్చింద్రు. అతికష్టంగా నెత్తిమీద ఎత్తుకున్నరుగనీ బరువుతో అడుగు ముందుకు పడుతలేదు.

ఒకలు ఒకలతో చెప్పుకుంటలేరు. నా ఒక్కనికే బరువు ఎక్కువయిందంటే నా ఒక్కనికే బరువు ఎక్కువయిందని ఎవలకు వాళ్లే అనుకుంట ముందుకు నడుత్తున్నరు.

బరువుకు ఓపక ఒక్కరు కిందపడేసినా మిగిలిన వాళ్లంతా కిందపడేసేటట్టున్నరు. కానీ ఎవలూ ఆ పని చెయ్యలేదు. ఎవలకు వాళ్లు కిందికి దించితే ఎవలేమంటరో అని భయంగా నడుస్తున్నరు.

ఇక్కడగాదు అక్కడ కాదు. ఆమెడ దూరం నడిచి ఇల్లు చేరాలె. అక్కడికి చేరేవరకు అందరికీ నడుములు వట్టుకున్నయి. నెత్తి మొద్దుబారింది. సల్ల చెముటలు పుట్టినియి. అక్కడ దించుకున్నంక అసలు విషయం తెలిసి మోపులు విప్పి చూస్తే పెద్ద పెద్ద కట్టు రాళ్లు బయటపడ్డయి. అవి ఎవరు కట్టింద్రో తెలువదిగనీ అందరికి భూమయ్య మీదనే అనుమానం.

'వట్టిగ రాళ్లు మోపిస్తివిగదనయ్యా...'అని భూమయ్యను అడిగితే 'అవ్వతోడు మామా.. నేను అటుపోనేలేదు. ఎవలు కట్టింద్రో తెలువది' అన్నడు.

భూమయ్య ఎటో మంకు మంకు చేస్తున్నడని తెలిసిపోయింది ఎంకవ్వకు. మంకుపోయి మంచిగ కావాలని బాలమ్మకు మొక్కింది ఎంకవ్వ. అల్లు వట్టిపిస్తే గూడా బాలమ్మ పట్టిందని దేవునికి చెయ్యపోతే ఇంకా ఆగం చేస్తడని వచ్చింది. ఎంకవ్వకు భయమేసి బాలమ్మకు ముడుపుఏసింది. గొర్రెపోతును తెచ్చి ముడుపు చెల్లించింది.

నడి ఇంట్ల గొయ్యి తవ్వి గొర్రెపోతును కోసి నెత్తురుతో నింపింద్రు. గోడకు గూడు తవ్వి చెక్క బొమ్మలను పెట్టి బాలమ్మను నిలిపింద్రు. అయినా భూమయ్య తొవ్వకు రాలేదు. అనుమండ్లకాడ మూడు నిద్రలు చేయించింది. అయినా గుణం మారలేదు. ముందటి లెక్క మాట్లాడుతలేడు. ముచ్చటాడుతలేడు. చెప్పినపని వింటలేడు. విన్నపని చేస్తలేడు. మంకు మంకు చేస్తుండు.

ఎడ్లకు నీళ్లు పెట్టుమంటే పెడుతలేడు. అవి నీళ్లకు ఒర్రి సత్తున్నయి. మోటకు పొమ్మంటే ఎడ్లను ఇడిచిపెట్టి ఎక్కడికో పోతున్నడు. ఎంకయ్యకు చెప్పి చెప్పి యాష్టకచ్చింది. ఎంకవ్వ శాపనార్థాలు పెట్టుకుంట ఏడుస్తుంది. తిండి లేకుంటె సక్కగైతడని సలిగటుక పెడుతుంది. అయినా భూమయ్య మారుతలేడు.

ఇండ్లు పూర్తయినయి. ఇక్కడ బాయిలు పూర్తయినయి. మూడెకురాల పొలం అచ్చుకట్టింద్రు. అచ్చుకట్టిన పొలంల భూమయ్య పల్లెత్తు పనిచెయ్యలేదు. ఊరు పెద్దదయింది. ఊర్లెకొత్త కొత్త ఇండ్లు కట్టింద్రు. ఊరుచుట్టూ భూములన్నీ పారుకం భూములయినయి. ఊరు చుట్టున్న చెట్లు బయిలు బయిలు అయినయి.

'దొర కడుపు సల్లగుండ. వాగును చెరువులకు మలిపి ఊరును పెద్దగ చేసిండు. పారుకం పెంచిండు.' అంటున్నరు ఊరంతా.

ముసలోల్లు మాత్రం 'చెలుకలన్నీ చేన్లయినయి. చెట్లన్నీ మాయమయినయి. పెరండ్లు ఇండ్లయినయి. పిట్ట గూసుండ తావులేదు. నీళ్లు లోతుల వడ్డయి. ఇదేందిరా...' అంటున్నరు.





తల్లితండ్రి బాధపడుతుంటే ఎల్లవ్వకు గూడా బాధగా అనిపించింది. ఒకనాడు భూమయ్యనే అడిగింది ఎల్లవ్వ ఏడ్సుకుంట. అప్పుడు ఇంట్ల ఎవలూ లేరు. ఇద్దరే వున్నరు.

భూమయ్య మారుమాట్లాడలేదు. ఎల్లవ్వను రమ్మని పిలిచి పెరట్లకు తీసుక పోయిండు. పెరట్లనే కొత్త ఇండ్లు. అప్పటికి ఇండ్లపని పూర్తయినా ఖాళీగానే ఉన్నయి. చిన్నత్త కొడుకులతోటి మాట్లాడుతున్నది.

ఎల్లవ్వను సూరుపక్కన నిలవెట్టి ఇంట్లకు వచ్చిండు భూమయ్య.

"అవ్వా..మనం బావతోని మాట్లాడద్దే...ఒక్కపని చేత్తలేడు" అంటున్నడు చిన్నన్న.

"ఇండ్లపని అయినంక సోపతి ఇడిచిపెడుదామంటివిగదనే..." ఇంకో అన్న అంటున్నడు.

ఎల్లవ్వకు తల తిరిగిపోయింది. ఇంట్లకు వచ్చి ఏడ్సుకుంట కూసుంది. తల్లికి తండ్రికి ఎవలకూ చెప్పలేదు.

అదేయేడు అందరి పెండ్లీలు అయినయి. ఇంటికిద్దరు కోడండ్లు వచ్చింద్రు. యారాండ్లకు పెత్తనమచ్చింది. ఎంకయ్య అన్నదమ్ములిద్దరూ ఎనుకపట్టు పట్టి కొడుకుల మీద పని భారం వేత్తున్నరు. ఇంటికి కల్లు వాడికలొట్టి పెట్టుకున్నరు. ఎప్పుడైతే ఇండ్ల పనులు పూర్తయినయో అప్పుడే మాటలు బందయినయి.

## 8

గడ్డకిందబాయి. కొత్తగా మోట పెట్టింద్రు. గంగ బాయి. మొదటిసారి ఆరు గజాలు దంగింది. ఒక్క పసలు పండి మడ్డి తేలింది. మళ్లీ ఆరుగజాలు తవ్వింద్రు. పొద్దంతా మోటగొట్టినా నీళ్లు అడుగుకూడా తగ్గకుంట అయింది.

ఆ బాయి రాగుల పోశయ్యది. పోశయ్య పటేండ్ల శాతల జీతమున్నడు. ఒక్కడే కొడుకు. ఇల్లులేకుండె. చిన్న గుడిసెనే వుండె. పూటకు గతిలేదని పోశయ్యకు ఎవలూ పిల్లను ఇయ్యలేదు. వచ్చినోళ్లు వచ్చినట్టు ఇల్లును చూసి, ఇల్లులేదు వాకిలిలేదు పిల్లనియ్యమని పోయింద్రు.

పోశయ్యకు పెండ్లీడు దాటుతుంది. ఎట్లా...? అని ఆలోచించిండు పోషయ్య తండ్రి. నాలుగు కొత్తయి గుమ్ములు కొనుక్కచ్చిండు. ఒక గుమ్మిల ఈత పండ్లు. ఇంకో గుమ్మిల పిడుకలు, ఇంకో గుమ్మిల తాటిపండ్లు,...ఇట్లా నాలుగు గుమ్ములు నింపిడు. పైన వరిగడ్డి పరిచి పెండతోని అలికి మెత్తిండు. గుమ్మిసుట్టూ పెండతో అలికిండు. పైనా కింద ఉనుకను చల్లిండు. ఉనుక వాసనకు గుమ్ములకు కొక్కుపురుగు తలిగింది.

పిల్లను ఇత్తామని వచ్చినోళ్లకు గుమ్ములను చూపిస్తున్నడు పోశయ్య తండ్రి. "అరె నాలుగు గుమ్మలనింద వడ్లున్నయి. పిల్లను ఇత్తే మంచిగ సాదుకుంటరు" అనుకుని చిప్పలపెల్లి నుంచి పిల్లను ఇచ్చి లగ్గం జేసింద్రు.

తర్వాత గుమ్ములు ఇప్పితే ఈతపండ్లు, తాటిపండ్లే. పోషయ్య భార్య ఏడ్సుకుంట

తల్లిగారి ఇంటికిపోయింది. "అట్లరావద్దు బిడ్డా..నీకు సావైనా బతుకైనా అక్కడనే" అని తండ్రి ఆ నాడే తోలుకచ్చి ఇల్లు నింపిపోయిండు.

పోశయ్యకు ఇది నామోషిగా అనిపించింది. ఎట్లయినా ఆ గుమ్ములను వడ్లతోని నింపాలనుకున్నడు. ఊర్లె మోటబాయిలు తవ్వుడు మొదలువెట్టినంక తానూ ఒకబాయి తవ్వుకోవాలనుకున్నడు. గంటెడు జాగలేదు. ఎట్లా...? అనుకున్నడు. ఎందుకూ పనికిరాని ఎర్రశెల్కను పటేండ్ల దగ్గెర రెండేండ్లు జీతముండి కొనుక్కున్నడు.

తల్లితండ్రి "మనకెందుకురా భూమి. ఏదుము పెట్టువడి తూమెడు జీతం. గట్టిగాసం వత్తుంది గదా. ఇంతకంటే ఎక్కువ పంటతీత్తవా...ఆ ఎర్రచెలుకల ఏం పండుతదిరా..!" అన్నరు.

పోశయ్య వినలేదు. బాయి మూర్తం పట్టిండు. రూపాయి వట్టం, పైసమిత్తి చొప్పున మూడు వందల రూపాయలు బాకీ తెచ్చిండు. బాయి తవ్విండు. ఎకురం ఎర్రచెలుకను అచ్చుకట్టిండు. మొదట ఎర్రచెలుకను కొన్నప్పుడు, బాయి పట్టినప్పుడు "పోషిగాడు పిచ్చోడేరా...ఎందుకు పనికిరాని ఎర్ర చెలుక కొన్నడు" అన్న వాళ్లే బాయిని చూసినంక 'మంచి ధైర్నం చేసిందురా' అన్నరు.

ఎర్రచెలుకను అమ్మిన పటేలుగూడా ఆ భూమి అట్లా అయితదనుకోలేదు. రెండేండ్లు ఎట్టిపని చేయించుకోవచ్చుగదా అని అడుగంగనే ఎకురం ఇచ్చిండట.

ఇప్పుడు ఎర్ర చెలుక బంగారు భూమి అయింది. పోషయ్య రెండు పంటలు తీత్తున్నడు. గుమ్ముల నిండా వడ్లు నింపుతున్నడు. గంట్లమనిషి, ఇకమాతులోడు. ములిక్కాయకు ముండ్లెన్ని అంటే కాకెరి కాయకు కండ్లెన్ని..? అంటడు. అంత నానినా నీ అరికాలి కింద నానలేదంటడు.

బాయిబాకీ తీరినంక చిన్న ఈరయ్య సావుకారి దగ్గర వంద, పెద్ద ఈరయ్య సావుకారి దగ్గర వంద రూపాయలు బాకితెచ్చిండు. పోషయ్యకు పంట పండుతదని తెలిసినంక ఇద్దరు సావుకార్లు మిత్తి పైసనే తీసుకున్న వట్టం రెండు రూపాయలన్నరు. తొంబయి ఎనిమిది రూపాయలిచ్చి వంద రూపాయలకు కాయిదం రాయించుకున్నరు.

"సావుకారీ...వట్టం రెండు రూపాయలు ఎక్కడన్నా ఉందా..? రూపాయి తీసుకొండ్రి. బండెడుకట్టెలు ఏత్త." అని బతిలాడిండు పోశయ్య. సావుకార్లు వినలేదు.

"అరే..పోశిగా...నీ బుద్ధుంటే తీసుకో, లేకుంటే లేదు. అంతేగని ఇక్కడున్నదా.... అక్కడున్నదా...అనకు. నీకు ఎవలన్నా ఇత్తే తీసుకో...." అన్నరు ఇద్దరు.

పోశయ్యకు లాగోడికి కావాలె. 'వీళ్లసంగతి చూత్తఉండు' అనుకున్నడు.

వరికొతకు వచ్చింది. నల్లవడ్లకల్లం. నల్లవడ్లకు కాటెడు ఈకలు ఉంటయి. నల్లవడ్లను ఎవలూ కొనరు. కొన్నా కట్టెతోని కొట్టి ఈకెలన్నీ ఇరిగినంకనే కొలిచి కొంటరు. లేకుంటే కుంచెడు వడ్లు బుడ్డెడు అయితయి. బుడ్డెడువడ్లు రెండు బుడ్లయితయి.







పోషయ్య నల్లవడ్లను కల్లంల రాశి చేసి ఇద్దరు సేట్లను పిలిచిండు. 'సావుకారీ... బాకీ కిందికి వడ్లు కొలుసుకొని పోండ్రి'. అన్నడు.

సావుకార్లు ఇద్దరూ కల్లంలకు వెళ్లి చూస్తే ఈకెలున్న నల్లవడ్లు. 'అమ్మో..పోశిగాడు ఈకలు ఇరుగ్గొట్టకనే వడ్లు రాశి చేసిండు. ఇట్లకొంటే మన కొంపలు మునుగుతయిరా' అనుకున్నరు. 'ఏదో ఒకటి చెయ్యాలె. ఎట్లా...?' అని ఆలోచించి కండ్లతోనే సైగ చేసుకున్నరు ఇద్దరు సావుకార్లు.

పెద్దీరయ్య "అరే చిన్న ఈరిగా...రాశి చూస్తే చిన్నగుంది. నా బాకీ కిందికి ఇద్దుము వడ్లు. నేను కొలుసుకుంట. తర్వాత మిగిలినయి నువ్వు కొలుసుకో" అన్నడు.

"ఓట్...నేనే ముందు కొలుసుకుంట, మిగిలినయి నువ్వు కొలుసుకో". చిన్నీరయ్య సావుకారి బుడ్డగోశి చెక్కుకుంట ముందుకు వచ్చిండు.

నేను ముందంటె నేను ముందని ఇద్దరూ కుస్తి వట్టింద్రు. ఇద్దరు వడ్లరాశి మీద ఎక్కింద్రు. కుస్తి వట్టి బంతి గట్టింద్రు. రాశిని తొక్కుడు తొక్కింద్రు. రాశి మీద కొట్లాడుకుంటనే దుంకుడు దుంకింద్రు.

"ఓ... సేటు....మీ దయనయా...రాశి తొక్కకుండ్రయా...ఎవలు ముందయితే ఏందయ్యా....ఇద్దరికి ఇద్దుము వస్తయయ్యా..." అంటున్నడు పోశయ్య. వాళ్లను విడిపించాలని అడ్డంబోయిండు. వాళ్లు ఒకలనొకలు ఇడువలేదు. పోశయ్యను పక్కకు జరిపి గల్లలు గల్లలు వట్టుకున్నరు. వాళ్లను ఆపుడుకు చుట్టూ కల్లాలల్ల ఉన్నోళ్లు వచ్చింద్రు. వాళ్లు తొక్కుడు, వీళ్లు తొక్కుడు ఈకలు మొత్తం ఇరిగినయి.

చివరికి ఇద్దరూ చెరి సగం తీసుకుందామని నిర్ణయించుకున్నరు. రాశిని ఎగనూకి ఎగవోస్తే సగానికి సగం తగ్గింది. చెరి తూమెడు వడ్లు కొలుచుకుని మిగిలిన తూమెడు యాసంగి మీద ఇయ్యాలని చెప్పి వచ్చింద్రు.

'అబ్బా కొమటోళ్లు చూసినావు? ఎంతపని చేసింద్రో. నాదినాకే చుట్టింద్రు.' అనుకున్నడు పోశయ్య. 'యాసంగి వీళ్ల సంగతి సూత్త. ఎవ్వనికి ఒక్క గింజ పొయ్యచూడు.' అని అనుకున్నడు.

యాసంగి కల్లం వచ్చింది. ఇద్దరు సావుకార్లు చెప్పకపోయినా సంచులు వట్టుకుని వచ్చింద్రు. పోశయ్యకు కోపం వచ్చింది. కట్టెను అందుకున్నడు. పెద్దీరయ్యను కట్టెతో రెండు గుంజిండు.

పెద్దీరయ్యను కట్టెతో కొడుతుంటే చిన్నీరయ్య కిసుక్కుమని నవ్విండు. పెద్దీరయ్యకు బాధగా అనిపించింది. ఈ విషయం చిన్నీరయ్య ఎక్కడైనా చెప్తుతడనుకున్నడు.

"అరేయ్...పోషిగా...నేను శాతగాని పెద్దమనిషి ననేగదరా....నన్ను కట్టెతోని గొట్టినవు. ఏది ఒక్కసారి చిన్నీరిగాన్ని కొట్టిచూడు. నీ సంగతి తెలుత్తది" అన్నడు పెద్దీరయ్య.

అప్పటికి చిన్నీరయ్య భయపడుతనే ఉన్నడు. పోశయ్యకు కోపమచ్చింది. "నీ చిన్నీరిగాని పెండ్లాం...చిన్నీరిగాడైతే నాకు భయమా" అనుకుంట కట్టెను అందుకొని చిన్నీరిగాన్నీ నాలుగు గుంజిండు.

మంటర మంట చిన్నీరిగాడు పెద్దీరిగాడు ఇంటి మొఖం పట్టింద్రు. తెల్లారి పంచాది పెడుతరనుకున్నడు పోశయ్య. పంచాది లేదు. కొట్లాటలేదు. వీడు కొట్టిండని చెప్పితే ఇంకొకలు కొడుతరు. బాకీలు ఇచ్చేటోడు ఇయ్యడు. అనుకుని బయటకు పొక్కనియ్యలేదు.

పోశయ్యకు ఎంకయ్యకు సోపతి. పోశయ్య జరిగినదంతా ఎంకయ్యకు చెప్పిండు. ఎంకయ్య కూడా ఇద్దరిదగ్గెర తూమెడు వడ్లు నాగులకు తెచ్చిండు. పసలు దాటింది. వాయిదా దాటితే పెచ్చులు. అంటే ఆరునెలలు దాటినంక ఇయ్యకపోతే నెలకు బుడ్డెడు వడ్లు ఎక్కువపొయ్యాలె. ఇవే పెచ్చులు.

ఎంకయ్యకు గూడా కోపంగా వుంది. నేను పెచ్చులు ఇయ్యనే ఇయ్యనని పెట్టుకున్నడు. "ఇయ్యకపోతే ఇయ్యకపోతివి..నీ మక్కపెరట్ల నాలుగు కంకులు తెచ్చుకుంటంరా..." అన్నరు ఇద్దరు సేట్లు.

నాలుగు కంకులే కదా! సరే అనుకున్నడు ఎంకయ్య. 'మంచెకాడ మా భూమయ్య ఉంటడు తెచ్చుకోంఢ్రి.' అన్నడు ఎంకయ్య.

ఇద్దరు సావు కార్లు పాత సంచులు చేతులవట్టుకున్నరు. మక్క పెరట్లకు పోయింద్రు. 'వీడు పెచ్చులు ఇయ్యడా. అంతకు రెండింతలు తీసుకుంటం చూడు' అనుకున్నరు.

"మీ మామ సంచినిండా కంకులు ఇరుసుకొమ్మన్నడని" భూమయ్యతో చెప్పి రెండు సంచులు పెద్ద పెద్ద కంకులు ఇరుసుకుని సంచులు నింపుకున్నరు. సావుకార్ల ఆరాటం చూసి వీళ్ల పని చెయ్యాలనుకున్నడు భూమయ్య.

భూమయ్యకు తెలుసు. వీళ్లు ఏదో మాయ చేస్తున్నరని. సంచులు నెత్తికెత్తుకుని నడువంగ భూమయ్య "అవ్వతోడు....ఎంత దొడ్డుంది సూడు..."అన్నడు భయంభయంగా గొంతును మార్చి.

ఎనుక నడుస్తున్న పెద్దీరయ్య "...ఎందిరో పామా...ఎక్కడ ఎక్కడ....?" అన్నడు.

భూమయ్య "వావ్వో..." అని ఒక్కటే ఉరుకందుకున్నడు. పామేకావచ్చుననుకుని సావుకార్లిద్దరూ సంచులు కిందేసి ఒక్కటే ఉరుకుడు. భూమయ్యకంటే ముందే మక్క చేనుదాటి బయటవడ్డరు.

ఒకరిని పట్టక ఒకరు, ఎడ్లు గోజలు రాకుంట నాటిన ఇరుకులో తట్టుకున్నరు. అటుమెసులా ఇటమెసులా ఇరుకు ఇరిగి ఇద్దరూ ముండ్ల కంపల పడ్డరు.

తెల్లారి పంచాది. ఎంకయ్య దగ్గెర జురుమాన తియ్యాలని చూసింద్రు సావుకార్లు.





కాందారి రాజయ్య పెద్దమనిషి "మీకెందుకు? జురుమాన తీస్తచూడు" అని సావుకార్ల దగ్గెర రెండు రూపాయలు తీసుకున్నడు.

"అబ్బా ఎంత దొడ్డుంది" అని ఎందుకన్నవురా అని భూమయ్యను అడిగిండు కాందారి.

"మక్కల నడుత్తుంటే పెద్ద కంకి కనవడ్డది. దాన్ని చూసి అన్న." భూమయ్య అన్నడు.

"కంకిని చూసి అన్నవుసరే...మరి ఎందుకు ఉరికినవురా...." ఒక పెద్దమనిషి అడిగిండు.

"ఈరయ్య సేటే పాము అన్నడు. నేను నిజమేఅనుకొని భయపడి ఉరికిన" అన్నడు. కాందారికి ఎక్కడ సందు దొరుకలేదు. దానికి తొడు ఎంకయ్య ముందటిలెక్కన భయపడుతలేడు. అది గూడా మనుసున వెట్టుకున్నడు కాందారి. ఈ పగ ఇంకెప్పుడైనా తీసుకోవాలనుకున్నడు. అప్పటికప్పుడు ఇద్దరికి ఏదో సర్ది చెప్పి పంపిండు.

"అరే..సావుకార్లను అస్సలు జేసినమురా...అంటే అస్సలు జేసినమురా..." అని ఎంకయ్య, పోశయ్య బదుకులున్నరు. అట్లా సావుకార్లతోని కంటు అయినంక పోశయ్య మోట బాయిల బొక్కెన వడ్డది. బొక్కెన దగ్గెర కుంచం తాళ్లు తెగినయి.

యాసంగి పంట. పొద్దుమాపుమోట. ఒక్కనాడు లేకపోయినా చేను ఎనుకకు వడుతది. ఒక్కసారి ఎనుకపట్టు పట్టిందంటే పారుడు కష్టం. అప్పటికి ముదురు కలుపు తీసింద్రు. ఎండలు ముదురుతున్నయి. వరి కరుకు నుంచి సూది పొట్ట కచ్చింది.

పోశయ్య బాయిల నాలుగు గజాల నీళ్లున్నయి. అద్ద గజమంత పూటిక ఉంది. బొక్కెనను తియ్యాలంటే పెద్దది పాతాలగరిగె కావాలె. అది చిన్నీరయ్య దగ్గెరనే వుంది.

ఇత్తడా..ఇయ్యడా అని అనుమానంతోనే పోయిండు పోశయ్య. అందరికైతే సోలెడు మక్కలు కిరాయి తీసుకుంటడు. పోశయ్యకు తవ్వెడు మక్కల కిరాయి అన్నడు. అవి మొదలె తీసుకురమ్మన్నడు. పంచెకొంగుల మక్కలు తీసుకపోయి పాతాలగరిగె తెచ్చుకున్నడు పోశయ్య.

'నీ పని చేత్తఉండు' అనుకుని ఇచ్చేటప్పుడు రింగుకు కట్టిన తాడును పురులు ఇప్పి ఇచ్చిండు సేటు. అది చూసుకోలేదు పోశయ్య. బాయిల బొక్కెన తియ్యాలంటే నలుగురు మనుషులు కావాలె. ముగ్గురు గడ్డకుండి పాతాలగరిగె ఏసి మూలమూలలు తిరుగాలె. బొక్కెన పైకి వచ్చినంక బాయిలున్న మనిషి నీళ్లల్ల ఈదుకుంట తాడుతో బొక్కెన దగ్గెరికి పోయి బొక్కెనను తాడుతో ముడెయ్యాలె. పైన ఉన్నోళ్లు గిరుక మీది నుండి బొక్కెనను మీదికి గుంజాలె.

పోశయ్య తాడును పట్టుకుని గిరుక దగ్గెరున్నడు. ఒక్కసారి గీరితెనే బొక్కెన తగిలింది. పోశయ్య బొక్కెనను మీదికి గుంజిండు. ఎంకయ్య బాయిల ఉన్నడు.

"ఎంకన్నా బొక్కెన వత్తుంది తాడుగట్టా" పోశయ్య కేకేసిండు.

ఎంకయ్య బాయిలకు ఈతవడ్డడు. బొక్కెన నీళ్లనుంచి కొద్దిగ మీదికి లేచిందో లేదో... రింగుకు కట్టిన తాడు తెగింది. బొక్కెన పాతాలగరిగె రెండూ నీళ్లల్ల మునిగినయి. ఉత్త తాడు మీదికి వచ్చింది.

"అరే.....ఎంతపనయిందే...రెండు జారిపాయే. సేటు ఏమంటండో..?" పోశయ్య అన్నడు భయంగా.

"అరే...ఎట్లా...బొక్కెన ఎట్ల తీద్దాం" గడ్డమీదున్న వాళ్లు అన్నరు.

"నీ బొక్కెన పీసునె గొడుదు...ఏందిరా...తాడుగట్టి పట్టుకోండ్రి. ఒక్క తన్నుకు పాతాలగరిగె బొక్కెన రెండు రావాలె" అని బొక్కెన జారినకాడ మునిగిండు ఎంకయ్య. ఒక్కటే మునుగుడుకు బొక్కెన అందింది. పట్టుకుని పైకి వచ్చి తాడును అందుకున్నడు. తాడును గట్టెముందు బొక్కెన మల్లా జారిపోయింది.

తాడును విడిచి మల్ల మునిగిండు ఎంకయ్య. ఈ సారి బొక్కెన పక్కమీద వడ్డది. సగందాక పూటిక మన్నులో దిగవడివుంది. కాలుతో తియ్యబోతె లెవ్వలేదు. చేయితో అందుకోబోతే కుంచం బద్దల నడుమ తలుకాయ ఇరికింది.

నిలువెడులోతు నీళ్లల్ల తన్నుకొని కొట్టుకున్నడు ఎంకయ్య ఈదాలని చూసిండు. చేతులు చాపి ఈతగొట్టిండు. దమ్ము ఎత్తేసుకచ్చింది. రెండు బుక్కల నీళ్లు మింగిండు.

ఎంకయ్య మునిగి చాలా సేపయింది. అందరిగుండెలు దడ దడ మంటున్నయి.

"పోశిగా దిగురా...నర్సిగా దిగురా...ఎంకన్న మునిగిండురా..." అని కీకెలు బొబ్బలు. అందరూ దిగుతుంటె ఎంకయ్య మీదికి వచ్చిండు. మోట బొక్కెననే కనిపించింది గనీ మనిషి కనిపించలేదు.

"అరే...వత్తుండురా...అందుకోండ్రి అందుకోండ్రి" అన్నరు.

బొక్కెన మల్ల మునిగింది. పైకి వస్తాడేమోనని చూసి అందరూ బాయిలకు దిగిండ్రు. గంటసేపు లెంకితే దొరికింది బొక్కెన. మీదికి తీసి చూస్తే కుంచం ముడుసులు మెడకు బలంగా తట్టుకున్నయి. తలుకాయ బద్దల్ల ఇరికింది. కడుపు ఉబ్బి ఉంది. కండ్లు తెరిచి ఉన్నయి. మెడ దగ్గెర తోలు తెగి రక్తం కారుతుంది.

శీలలు ఊడదీసి ముడుసు బద్దలు ఇప్పి ఎంకయ్యను తీసి గడ్లె వేసిండ్రు. ఎవలో ఇంటికిపోయి చెప్పితే కొట్టుకుంట మొత్తుకుంట ఎంకవ్వ, ఎల్లవ్వ ఉరికచ్చిండ్రు. ఈ వార్త తెలువంగనే ఊరు ఊరంతా బాయి దగ్గెరికి వచ్చింది. ఏడ్సి ఏడ్సి అవ్వ బిడ్డలిద్దరూ సొమ్మసిల్లిపోయిండ్రు.

అన్న మల్లయ్య తమ్ముడు ఎల్లయ్య ఇద్దరూ నిలవడి కార్యక్రమమంతా నడిపిచ్చిండ్రు. సుట్టాలకు పక్కోల్లందరికి చెప్పి పంపిండ్రు. అందరు వచ్చిండ్రు. పదకొండు రోజులు సుట్టి ముట్టుడు. పన్నెండో రోజు పెద్దకర్మ.





ఎంకవ్వ మాటలేదు. ముచ్చట లేదు. మూగవోయింది. ఎర్రిసూపులు సూత్తుంది. ఎల్లవ్వ నాయినను తలుసుకుంట గుండె అవిసి ఏడుత్తుంది. భూమయ్యకైతే పుట్టేడు దుఖముంది. గొడ గొడ ఏడుపత్తుంది. కిందికేసిన తల ఎత్తుతలేదు. కండ్లపొంట బొట బొట నీళ్లు గారుతున్నయి. మామ యాదికస్తే గుండె చెరువయితుంది. మోట మోటజాగలనే ఉంది. పొలం మొత్తం ఎండిపోయింది. అన్న ఒకనాడు తమ్ముడు ఒకనాడు రెండు మూడు పొంటెలు మోట గొట్టినా పొలం కలుపుకోలేదు. ఒకమూల నానితే ఒకమూల ఎండుతుంది.

ఇల్లు మొత్తం ఇచ్చుకపోయింది. అందరు ఆగమయిండ్రు. పుట్టెడు దుఃఖాన్ని మింగుకుని కొద్దికొద్దిగా కోలుకుంటున్నరు. ఎంకవ్వ మాత్రం మనిషి అయితలేదు.

పన్నెండో రోజునాడు దినకర్మ పెట్టిండ్రు. ఎంకవ్వ నెత్తినిండా పూలు వెట్టి పసుపు కుంకుమ పెట్టి చెయ్యినిండా గాజులువెట్టి వాగులకు తీసుకపోయిండ్రు.

ముండరాళ్లంత గూడి ముండరాలును చేసిండ్రు. పూలు తెంపేసి బొట్టు తుడిచేసి గాజులు పలుగ గొట్టిండ్రు. అయినా ఎంకవ్వలో చలనంలేదు. ఏడుస్తనే ఉంది. ఎవలు ఊకుంచినా ఊకుంటలేదు. చేనంటలేదు. బాయి అంటలేదు. భయం భయంగా తల్లిని పట్టుకునే కూర్చుంది ఎల్లవ్వ.

భూమయ్యనే మెల్లె మెల్లెగా మోట సాగించిండు. ఎటుపోయినా ఎంటున్నట్టే అని పిస్తుంది. సుట్ట గప్పగప్పతాగినట్టే అనిపిస్తుంది. అప్పటికే పొలం ఎండిపోయింది. మోట నీళ్లు అందుతలెవ్వు పొందుత లెవ్వు. రెండు పొంటెలు గొట్టినా బట్టెలుము తడుస్తలేదు. భూమయ్యకు పొలం పారుతలేదన్న రందిగాదు. అత్త కోలుకుంటలేదన్న రంది. అత్తకు ధైర్నం చెప్పాలనుకుంటున్నడు. ఏంచెప్పాలెనో తెల్తలేదు. భార్యతో ధైర్నం చెప్పాలను కుంటున్నడు. మాట్లాడాలంటే సిగ్గయితుంది. ఎప్పుడన్నా ఏదన్నా మాట్లాడాలంటే చుట్టూ ఎవలన్న ఉన్నరా అనిచూసి మాట్లాడుతున్నడు.

తల్లిని చూస్తుంటే ఎల్లవ్వ గుండె తరుక్కపోతుంది "పోయినోల్లు వస్తరా... అందరంపోయే టోళ్లమే...అవ్వా...మాకు దిక్కుదీము నువ్వే...నువ్వు నోరుదెరిత్తే మేము ఆగమైతము. మాకు ఎవలున్నరే...అవ్వా....మాట్లాడే..." అనుకుంట ఏడుత్తుంది ఎల్లవ్వ.

"అక్కా...సచ్చినోళ్లతోని సత్తమా...ఏంజేద్దాం.మందిని చూసిపోద్దువాడ గొట్టుకోవాలె. కాల్లజేతుల పొల్లఉండె.పొల్లను జూసుకుని బతుకాలే" చిన్న యారాలు అన్నది.

"చెల్లే..ఏందే ఇది. ఇట్ల గూసుంటే ఎట్ల చెప్పు. ఇల్లెట్ల గడువాలె పిల్లలెట్ల బతుకాలె. కిస్మత్‌లున్నట్టు జరుగుతది. ఎవల కిస్మత్ ఎట్లున్నదో కలగన్నమా..? లే....లెవ్వు లేచి బుక్కెడు తిను. ఇప్పటికే ఇల్లు గుడ్డి అంగడి అయింది. ఈంత నువ్వు నోరు తెరిచినవనుకో.. పిల్లలు చెట్టుగాని పచ్చులైతరు." పెద్దయారాలు ధైర్నం చెప్పింది.

ఎవలెన్ని చెప్పినా ఎంకవ్వకు మనుసు నిండుత లేదు. కండ్లు మూసి తెరిత్తే ఎంకయ్యనే కనవడుతుండు. కట్టెవట్టుకుని ఇంట్లకు వచ్చినట్టు, సుట్టను గప్పగప్ప తాగుతున్నట్టు, ఎనుకనే నిలవడ్డట్టు అనిపిస్తుంది. తింటె బుక్కెడు తింటుంది. లేకుంటె కొంగు పరుచుకుని పంటుంది. మాటలేదు ముచ్చటలేదు.

నెల తిరుగనేలేదు. సందెన బద్దయింది ఎంకవ్వ. మనిషితోని మాట్లాడది ముచ్చటాడది. ఎర్రి చూపులు చూత్తుంది. ఎల్లవ్వకు తండ్రిపోయిన బాధగాదు. ఇప్పుడు తల్లికోలుకోలేదన్న బాధ.

తావు తప్పదీస్తే నన్నా కోలుకుంటుందేమోనన్న ఆశ. కానీ ఎక్కడికి పోవాలెనో తోచడం లేదు. అవ్వక్కడి చుట్టాలు లేరు. అయ్యక్కడి చుట్టాలు లేరు. ఉన్న ఒకలిద్దరు ఎక్కడనో ఉన్నరు. తల్లిని ఎట్ల మందిల కలుపాలని ఆలోచిస్తుంది ఎల్లవ్వ.

పొలాలు కోతకచ్చినయి. భూమయ్య పొలంల రెండు ముల్లెల వడ్లు మాత్రమే పండినయి. మొత్తం ఎండిపోయింది. "అరే...ఇలిటపోని పంట చూదుండ్రిరా..ఎంకయ్య లేడేమో ఎవుసం ఎట్ల నడుత్తుంది సూడు" అంటున్నరు.

ముగ్గురిపొత్తుల చెరువు పారుకం చేను ఉంది. అది గూడా కోతకు వచ్చింది. కోత పడుదామనుకునే రోజే దూరపు చుట్టం ఒకలు వచ్చి నిద్ర చెయ్యడానికి రమ్మన్నరు. తను కోత పనికి పోతనని తల్లికూతుర్లిద్దరినీ పొమ్మన్నడు భూమయ్య.

"నీ కోత సల్లగుండ. కొండంత మనిషేపోయిండు కోతకు వచ్చినాది. వాళ్లులేరా..? వాళ్లే కోత్తరు దా...నిద్రకు ఎడబాపి తీసుకపోవద్దు. మొత్తం మంది రాండ్రి" అన్నడు చుట్టం.

ముగ్గురు వచ్చిన సుట్టంతోటి మబ్బులనే బయిలెల్లిండ్రు.ఎదురుగా వచ్చిన వాళ్లు ఎంకవ్వను చూసి తప్పుకుంటున్నరు. తలుపులు తెరిచిన వాళ్లు తలుపు మూసుకుంటున్నరు. ఎడ్ల బండ్ల వాళ్లు ఏదో గొనుక్కుంటున్నరు. నెత్తిమీదకొంగు కప్పుకుని అడుగులో అడుగు వేస్తుంది ఎంకవ్వ. ఎవరు ఏమంటున్నారన్న ద్యాసలేదు. ఎటుపోతున్నా మన్న ద్యాసలేదు. నిద్రలో నడుస్తున్నట్టుగా నడిచింది.

ఐదురోజుల్లో ఇల్లు చేరుకున్నరు. అప్పటికీ కోత్తపని అయిపోయింది. కల్లం లేచింది. వడ్లు ఇంట్లకు తెచ్చిండ్రు.

"భూమయ్యా! పొత్తుల వడ్లు ఉన్నయి తెచ్చుకో" అన్నడు పెద్ద మామ. గొంగడి తీసుకుని పెద్దమామ ఇంటికి పోయిండు భూమయ్య. మూలకు వడ్లరాశి ఉంది. అందులోసగం పొల్లు వడ్లే ఉన్నయి. రెండే రెండు ముల్లెలు అయినయి.తెచ్చిగుమ్మిల పోసిండు.

ఎంకవ్వ వడ్ల లెక్క చూస్తలేదు. ఎన్ని వచ్చినయంటలేదు. ఎట్లున్నయంట లేదు. అర్రల కూసుంది. బయటకు వస్తలేదు. ఎవలతో మాట్లాడుతలేదు. నాలుగు అడిగితే





ఒక్కటి చెప్పుతుంది. ఏది అడిగినా నాకు తెలువది అంటుంది.

భూమయ్యకు ఇంటిపెత్తనమచ్చింది. ఎల్లవ్వ ఇంటిపని చూస్తుంది. ఇద్దరికీ కొత్తకుండల ఈగె సొచ్చినట్టయితుంది. ఎటూపట్టు దొరుకుతలేదు.

గటుక ఎసరుపెడితే ఒకసారి ఎక్కువయితుంది. ఒకసారి తక్కువయితుంది. అడుగంటి మాడిపోతుంది. పొయ్యి కప్పితే ఒకసారి అంటుకుంట లేదు. ఒకసారి కాలిపోతుంది. గూనపెంకవట్టుకుని అగ్గికొరకు ఇల్లిల్లు తిరుగుడయితుంది. ఒక్కొక్కసారి చీకటిపూట ఎవలూ అగ్గి పెట్టకపోతే జకమొకదూదిని కొట్టి పిడుకకు అంటు వెట్టి,పిడుక అంటుకున్నంక పొయ్యి అంటువెట్టుడయితుంది.

ఎండకాల మచ్చింది. ఈసారి సగం మోట బాయిలు దెబ్బతిన్నయి.ఎన్నడూ లేనిది షాదబాయిలు కూడా బోర్లవడ్డయి. చుక్క నీళ్లు లెవ్వు. బాయిలు తవ్వుడు మొదలు పెట్టిండ్రు. మోటబాయిలు పూటిక తీసుడు మొదలు పెట్టిండ్రు. ఇంట్ల బాయి ఎండిపోతే ఇంటిముందు తొమ్మిది గజాల బాయి తవ్విండు భూమయ్య.

ఒడ్డుకిందనే ఊరిన నీళ్లు....గూడ వేసినా దంగని నీళ్లు...తొమ్మిదిగజాల లోతుల పడేసరికి భయం మొదలయింది. బాయిలు బోర్లవడుడు, మోటబాయిలల్ల నీళ్లులేకపోవుడు, ఏదో ఆపద వస్తుందనుకున్నరు.నిండు కరువుల గూడా ఎండిపోని బాయిలు ఎందుకు ఎండిపోయినయో జనంకు అర్థం గాలేదు.

ఎంకవ్వ కోలుకోలేదు. నవుసీ నవుసీ ఒకనాడు తెల్లారుజామున కండ్లు మూసింది. ఊరు ఊరంతా ఏడ్చిండ్రు.

కండ్లు మూస్తూ భూమయ్యను ఎల్లవ్వనూ దగ్గెరికి పిలుచుకుంది. భూమయ్య చేతుల ఎల్లవ్వ చేతులు పెట్టింది.

" అయ్యా ! నా ఇంట్ల దీపం పెట్టు. నా వంశం నిలవెట్టు. నా బిడ్డ పయిలం" అని కాళ్లమీద వడ్డది అంతే! మళ్లీ లెవ్వలేదు. సావు సందమయింది. దినాలు వారాలయి నయి.

అప్పుడే ఊరంతా పుకారు పుట్టింది. 'ఎంకయ్య బాయిల మునిగి సచ్చిండు. ఎంకవ్వ నీళ్ళకు శాపం పెట్టింది. అందుకే బాయిలు ఎండిపోయినయి.' అనుకున్నరందరు.

ఊర్లెబాయిలు, కరువుల ఎండిపోని మంచినీళ్లబాయిలు, శితపాతాలం లోతులున్న మోటాబాయిలు అడుగు తేలినయి. కప్ప చితుకుల నీళ్లు మిగిలినయి.

ఈ సంగతి దొరకు తెలిసింది. దొర ఊర్లెకు వచ్చిండు. శాత పెద్దమనుషులను పిలిపించుకున్నడు.

"అయ్యా... దొరా...ఊరికి అరిష్టమచ్చింది బాంచెను. ఒక్కబాయిల నీళ్లు లెవ్వు. ఎంకయ్య సచ్చిండంటే నీళ్ల కరువు వచ్చింది" అన్నరు. అందరినోట ఒక్కటే మాట. దొరకు నిజమే అనిపించింది.

"వారీ! ఎంకయ్య ఎంకవ్వ సచ్చింౘ్రు గదా...వాళ్లు ముసలయ్య ముసలవ్వ లయింౘ్రు. గుడిగట్టి దీపం పెట్టాలె. యాడాదికొకనాడు వంటలకు పొవాలె. బాయి బాయికి పచ్చటి పందిరెయ్యాలె. ఆయిటికి ముందు ముసలవ్వ ముసలయ్య పండుగ చెయ్యాలె. అట్లయితెనే బాయిలకు ఊటలు మ౯్రుతయి" అన్నడు.

అందరు తలూపింౘ్రు. 'బాయిల నీళ్లు పడితే తప్పక పండుగ జేత్తం' అని ముడుపులు వేసింౘ్రు. ఎంకవ్వకు, ఎంకయ్యకు మొక్కింౘ్రు. తట్ట, పార, గడ్డపార చేతవట్టి బాయిలకు దిగింౘ్రు. పూటికలు తీసింౘ్రు. బండలస్తే బర్మలు పెట్టింౘ్రు.

భూమి అదులుతున్నట్టు దెబ్బలు. గజాలకు గజాలు బాయిలోతును దంగ దీసింౘ్రు. ఒకలను చూసి ఒకలు లోతు తవ్వింౘ్రు. ఒక్కొక్కటి ఇరవై అయిదు గజాలబాయి.

ఎండకాలం ఎల్లింది. బాయిలల్ల గజం రెండు గజాల నీళ్లు నిలువకచ్చినయి. లోతు ఎక్కువ అయినంక శాదబాయిలకు కూడా నీళ్లు వచ్చినయి.

' ఎంకయ్య కరుణించిండురా...చల్లగ చూసిండు. అందుకనే బాయిలకు నీళ్లు వచ్చినయి. ఎప్పటికి ఇట్ల చల్లగ చూడుమని శాంతి పెట్టాలె' అనుకున్నరు పెద్దమనుషులు.

శాత పెద్దమనుషులను పిలిచి ఇంటికి ఆటాన పైసలు వసూలు చెయ్యిమన్నరు. అప్పుడే ఆయిటిమూనింది. వాన మీద వాన. రెండు వానలు కొట్టిగాలి సల్లవడ్డది. భూమి కాక తగ్గింది. పొలంపనులు మొదలు పెట్టే ముందు పండుగు మోగిచ్చింౘ్రు పెద్దమనుషులు.

వాగుగడ్డకు చింత చెట్టుకింద పది తట్టల దంగు సున్నం చేసి గుడి కట్టింౘ్రు. గుడిలో ముసలయ్య ముసలమ్మ బొమ్మలు పెట్టింౘ్రు. బొమ్మలకు ఎంకయ్య ఎంకవ్వ అని పేరు పెట్టింౘ్రు. గుడికి సున్నం వేసింౘ్రు. గుడిముందు పందిరి వేసింౘ్రు. మామిడాకుల దోర్నాలు గట్టింౘ్రు. దీపం ముట్టిచ్చి దండం పెట్టింౘ్రు.

శాతకొక్క యాట పిల్లను కోసింౘ్రు. ఇంటికొక పాలు ఏసింౘ్రు. ఊరు ఊరంతా తోట్లకు, బాయిల దగ్గెరికి, వంటలకు పోయింౘ్రు. కూర, కల్లు కుండలు తెచ్చుకున్నరు. పెద్ద సంసారమున్నోళ్లు ముసలయ్య, ముసలవ్వ గుడిముందు కోళ్లను కోసుకున్నరు.

ఊరు ఊరంతా కదిలినా ఒక ఇల్లు మాౘ్రం తలుపు మూసే వుంది. ఆ రోజు ఆ ఇంట్ల పొయ్యి వెలుగలేదు. అది ఎంకయ్య ఇల్లు. ఎల్లవ్వ, భూమయ్యలు మూలకొక్కలు ఏడుస్తూ కూర్చున్నరు. కన్నీళ్లతో ఎల్లవ్వకైతె పక్కతడిచింది. తల్లిని తండ్రిని యాది జేసుకుంట ఎక్కెక్కి పడి ఏడ్చింది.

యాడాది యాడాదికి ముసలవ్వ ముసలయ్య పండుగ అయితున్నది. గుడికి సున్నం పడుతున్నది. గుడి ముందు పచ్చటి పందిరి పడుతుంది. చేను చేనుకు పందిరి పడుతుంది.







చెట్టు మొదట్ల ఉన్న గుడి ముందు యాటలు తెగి రక్తం పారుతుంది. యాడాది కొక దినం యాకాశికి ముందు ఊరు ఊరంతా కదిలి వంటలకు పోతున్నరు. అప్పుడప్పుడూ బాయిలు ఎండుతనే ఉన్నయి. లోతు తవ్వుతనే ఉన్నరు. జనం భయపడుతనే ఉన్నరు. భూమయ్య నీళ్లు నీళ్లని వదురుతనే ఉన్నడు.

C C C C

ముందున్న పేజీలు పూర్తయినయి. బరువుగా నిట్టూర్చాడు రవికిరణ్. ఎందుకో గాని హృదయం బరువెక్కింది. అలసటగా టైమ్ చూసుకున్నాడు. సాయంత్రం ఐదు. పొద్దున్న టిఫిన్ చేసి తొమ్మిదింటికల్ల కూర్చున్నాడు.

కూర్చున్నప్పుడే తనను డిస్టర్బ్ చేయ్యద్దని ఐశ్వర్యకి చెప్పాడు. అందుకే ఆమె భోజనానికి కూడ పిలువలేదు. సెల్ ఆఫ్ చేసుకున్నాడు కిరణ్.

చదువుతుంటే సమయమే తెలియలేదు. తను చూసిన ఊరే! తండ్రితో అప్పుడప్పుడు తిరిగిన ఊరే! ఆడుకున్న ఊరే! పాత్రలన్నీ దగ్గరగానే... తను చూస్తున్నట్టుగానే అనిపిస్తున్నాయి. తనకు బాగా తెలిసిన వారే అనిపిస్తున్నారు.

గుండె కలిచివేసినట్టయింది. తరువాత భూమయ్య ఏమయ్యాడు...? ఎల్లవ్వ ఏమైయింది...? ఎంకయ్యది ఎంత దారుణమైన చావు...? వీళ్లంతా ఎక్కడున్నారు...? ఇలా రవికిరణ్‌లో అనేక ప్రశ్నలు. తలనొప్పి మొదలయింది. ఐశ్వర్యకు టీ చెప్పి సెల్ అందుకున్నాడు.

"హలో......రవి......ఎంత్రా చదివావా.....?" శివశంకర్.

"చదివానురా.....భూమయ్య ఏమయ్యాడు.....?" ఆత్రుతగా అడిగాడు.

"అంత సస్పెన్సుగా ఉందా.....? " ఆశ్చర్యంగా అడిగాడు శివ.

" సస్పెన్సా నా బొందా....! నీ పత్రికాబుద్ధి పోనిచ్చుకోలేదు. అది జీవితంరా బాబు. సస్పెన్స్ ఏముంటుంది? బాధ తప్ప! చెప్పానుగదా అది మావూరని" బాధగా అన్నాడు కిరణ్.

ఐశ్వర్య టీ తెచ్చింది. రోజులకు రోజులు వర్కు మీద అతడు సీరియస్‌గా కూర్చోవడం ఆమెకు అలవాటే! అయినా ఇంత సీరియస్‌గా అతడిని ఆమె ఎప్పుడూ చూడలేదు.

"ఓకే.... గ్రేట్ న్యూస్.... మేఘాలలోంచి నీళ్లను తెచ్చే ఒక మేధావిని కన్న ఊరు నీళ్లు లేక మేఘాల వైపు దీనంగా చూస్తుంది. ఇది డిఫరెంటు న్యూస్‌రా...రాసుకోవచ్చు" నవ్వుతూ అన్నాడు శివ.

టీ తాగుతూ "శివా! నేను సీరియస్‌గా అడుగుతున్నాను. భూమయ్య ఏమయ్యాడురా..." రవి నవ్వలేదు. సీరియస్‌గా అడిగాడు.

శివశంకర్ గూడా సీరియస్‌గా మారిపోయాడు. "ఏమయ్యాడురా..నాలుగైదేండ్లు ఊర్లోనే ఉన్నాడు. కొడుకు పుట్టాడు. ఎంకన్న అనిమామ పేరేపెట్టుకున్నాడు. భూమయ్య ఆస్తిని బావమరుదులు, మామలు కాజెయ్యాలని చూస్తున్నారు. దొంగతనంగా పంటను

ఎత్తుకొస్తున్నారు. వాకిట్లో మంగముండ్లు జల్లుతున్నారు. అయినా భూమయ్య పట్టించుకోలేదు. అతడి బాధ అతడికుంది.

"ఏం బాధరా" భయం భయంగా అడిగాడు రవికిరణ్.

"ఎల్లవ్వ ఆరోగ్యం బాగలేదురా....తల్లిని తండ్రిని తలుచుకునే ఏడుస్తుంది. ఏడాదికొకసారి పండుగ చేసిన నాడైతే భూమిపైనుంచి లేవడం లేదు. అత్తలాగా భార్యకూడా కన్నుమూస్తుందేమోనన్న భయం మొదలయింది. ఇంటికి తాళం వేసి ఆవులను లింగంకు, పొలాలను మామలకు అప్పగించి నెలలో వస్తావని అన్నల దగ్గరకు బయలు దేరాడు భూమయ్య."

"ఆ...తర్వాత ఏమైంది...." టీ కప్పును టేబుల్పై పెడుతూ అడిగాడు.

"ఎల్లవ్వ కోలుకోలేదు. రెండేళ్లుఅక్కడే ఉన్నాడు. ఎల్లవ్వ మామూలు మనిషి అయింది. అక్కడనే ఉంటే పాలు అడుగుతడని అన్నలు వదినలు భూమయ్యను కట్టుబట్టలతో ఊరు దాటించారు."

"మై గాడ్.... ఇట్స్ వేరి పిటీ!....." రవి కిరణ్ గొంతులో బాధ.

"ఏంట్రా ... అంతగాబాధపడుతున్నావు. మీ ఊరేనా...?"

"కాదురా.... స్పందించడానికి ఊరే కానవసరం లేదు. మనసుంటే చాలు. ఇన్నేండ్ల సంస్కరణలో మన పల్లెలకు మిగిలింది ఏమిటంటే పర్యావరణ దారిద్ర్యమే! అదే అన్ని దారిద్ర్యాలకు మూలం కదా! పరిరక్షణ మూలాలను మరిస్తే ఫలితం ఇలాగే ఉంటుంది. తర్వాత ఏమయిందిరా.... భూమయ్య ఊరిలోకి వచ్చాడా...?" అడిగాడు రవి.

"వచ్చాడు...మనం మాట్లాడుతున్నది సెల్ఫోన్లో అని మరువకు. ఆ కథంతా చెప్పడం కుదురదు. ప్రింటవుట్లున్నాయి పంపిస్తాను " అంటూ సెల్ ఆఫ్ చేసాడు.

తర్వాత వారం రోజులు ఇజ్రాయిల్ క్లౌడ్సీడింగ్ కొరకు వెళ్లివచ్చాడు రవికిరణ్. అక్కడి పల్లెలు చూస్తుంటే తన ఊరేగుర్తొచ్చింది.

ఇంటికి రాగానే టేబుల్ మీదున్న కవరు కనిపించింది. కనీసం ఫ్రెష్ అయినా విడువకుండా కవరు తెరిచి కాగితాలను అందుకున్నాడు రవికిరణ్.

## 9

చుట్టూ చీకటి. కాళ్లకింద ఇసుక కరకరమంటుంది. అప్పటికి భూమయ్య ఊర్లెకు అడుగు పెట్టక రెండేండ్లు దాటింది. ఊరు ఏదో కొత్తగా అనిపిస్తుంది. మొదటిసారి మామ వెంట పానాదులల్ల నడిచివచ్చిన రోజు యాదికచ్చింది భూమయ్యకు.

అప్పటి పానాదులు ఇప్పుడు పిల్లతొవ్వలైనయి. నీళ్ల ఊటలు బందనయినయి. కాలుకు బురద అంటుతలేదు. అప్పుడు ముందట మామ నడిచిండు. ఇప్పుడు తను నడ్తుస్నుడు. భుజం మీద ఐదేండ్ల కొడుకున్నడు. ఎంట ఎల్లవ్వ ఉంది.

కల్లం బండ మీదికి వచ్చేసరికి కూరుకు పొద్దుంది. వానకాలం దినం. వాన





అందుకుంది. చెరువుకట్ట చింతకింద కొంతసేపు నిలవడ్డరు. వాన తగ్గలేదు. చెరువు తడలు కొడుతుంది. అలుగు దుంకుతుంది.

వానలనే నడక. కట్టు బట్టలు తప్ప మీద ఏమీ లెవ్వు. నిండనానినంక చలి మొదలయింది. గజగజ వణుకు పుడుతుంది. కొన కొంగును వడివెట్టి పిండి నెత్తిమీద కప్పుకుంది ఎల్లవ్వ.

'నాయినా...సలివెదుతుందే' దవుడలు కొట్టుకుంటుంటే అన్నడు భుజం మీదున్న కొడుకు. భర్త భుజం మీది నుంచి కొడుకును తీసుకుని ఎత్తుకుంది ఎల్లవ్వ. నిండా కొంగు కప్పింది. అయినా సలి ఆగుత లేదు. గజగజ వణుకుతనే ఉన్నడు కొడుకు. వణుక్కుంట ఏడుపందుకున్నడు.

"ఎంకన్నా ఊకో బిడ్డా ...మన ఇల్లు వచ్చింది. ఇంట్ల తాతది గొంగడుంది. కప్పుత." కొడుకును బుదురకిచ్చింది ఎల్లవ్వ. కొడుకు ఏడుపు ఆపినా, చిన్నగా రాగం తీసుడు ఆపలేదు.

వాన ఎలువలేదు. ముసురు అందుకుంది. ఇంటికి చేరుకునే వరకు బలబల తెల్లారుతుంది. కోడికూతలు, ఇసుర్రాయిల చప్పుడు, వడ్ల దంపుకం చప్పుడు వినిపిస్తుంది. ముసురులోనే నెత్తికి గంగ్రపేగులు కట్టుకుని వాకిళ్లు ఊడుత్తున్నరు. రాట్నాల లెక్క బండ్లు తిరుగుతున్నయి. జనం చిక్కవడ్డరు.

ముగ్గురూ ఇంటికి చేరుకున్నరు. వాకిలి పడావువడ్డది. నిండా ఎన్నాద్రి, దుబ్బతుత్తరు, కటారు మొనలు, ములుపుచ్చ చెట్లు మొలిచినయి. వాకిలి అడివి లెక్కనే ఉంది. నడుమ మాత్రం చిన్న తొవ్వ ఉంది. అటు ఇటు వాకిళ్లు పచ్చగా ఉన్నయి. బర్రె పాక కూలిపోయింది.

వాకిలిని చూడంగనే ఎల్లవ్వకు ఏడువేదువున దుక్కమచ్చింది. బొడ్లెనుంచి తాళం చెయ్యితీసి భూమయ్యకు ఇస్తూ పక్కున పలిగింది.

"ఊ...తొలుత తొలుత తోలు గుద్దు వెట్టినట్టు...ఏడ్సుడెందుకు. ఇప్పటికే బతుకు ఏడ్సినట్టుంది." అనుకుంట తాళం చెయ్యిని అందుకున్నడు భూమయ్య.

ఏడ్పును ఆపుకుంట కొడుకును అరుగు మీద దించి కొన కొంగును పిండి కొడుకు మొఖంను నెత్తిని కొంగుతోటి తుడిచింది ఎల్లవ్వ.

కడపను కండ్లకద్దుకున్నడు భూమయ్య. తాళం చుట్టూ పట్టిన బల్లిపాతరను తుడిచి మలుసుట్టు తాళం తెరిచిండు. తాళం చిలుము పట్టింది. లోపల బల్లులు పురుగులు సొచ్చినయి. పొంటెజాము తండ్లాడినా తాళం తెరుచుకోలేదు. తాళం చేయితో తింపంగ తింపంగ తెరుచుకుంది. గొళ్ళెం మొలకు తలిగేసి తలుపులు తెరిచిండు.

కిర్రుమని తలుపులు తెరుసుకున్నయి. ఇల్లు నిండా బల్లి పాతర పట్టింది. గోడలు చెమ్మగిల్లినయి. నేల దుక్కిలయింది. చెమ్మవాసన గుప్పుమంది. ఎలుకలు

పందికొక్కులు పొక్కలు తవ్వినయి. ఇల్లు బొయ్యారమయింది. అలుకు పూతల్లేక అరుగంచులు కూలిపోయినయి.

పెరట్ల దర్వాద కూలిపోయింది. ఒక తలుపు చెక్క లేనేలేదు. సూరు కూలింది. మన్ను మీద చిగురంత మొలిచి పూత పూసింది. ఇంట్లకు వస్తూనే ఎల్లవ్వ కుండా, గుమ్మి కాగు చూసుకుంది. భూమయ్య దిడ్డి, దర్వాజ, తలుపు, గొళ్లెం చూసుకుంటున్నడు.

పెరట్ల తలుపు తప్ప వేసిన తలుపులు వేసినట్టే ఉన్నయి. కుండ బోడి మాయమయింది. గటుక పేర్పులేదు. సల్లకుండలేదు. కవ్వంలేదు. ఒత్తు పలిగిపోయింది. దాలిగుంట కూలిపోయింది. కలికుండ పచ్చెలు పచ్చెలయింది. పొయ్యి నేలమట్టమయింది. మాగిన సల్లబుడ్డి, దూపకు బుడ్డి మాయమయినయి.

ఎంకవ్వకు భయమయింది. యాడాది గడిచినా ఎక్కడ ఏకుండ పెట్టింది బాగా గుర్తుంది. పెట్టింది పెట్టిన జాగలలెవ్వు. కంకెడు కంకెడు గంగ కషికెలు నాలుగు దూలం మీద దాచిపెట్టింది. చూస్తే ఒక్క కషిక లేదు.

ఎల్లవ్వకు ఏడుపచ్చింది."వావ్వా...దొంగలు వద్దరేవావ్వ....వావ్వ ఎవలమీద మన్ను వడెనేవావ్వ...వావ్వా ఎవల బొందవెట్టిరే వావ్వా"..అనుకుంట గుమ్మిదగ్గెరికి పోయింది.

గుమ్మిల రెండు ముల్లెల వడ్లుపోసి మెత్తింది. ఒక్కగింజలేదు. మీద కప్పిన ద్యాగర లేదు. శిలుక్కొయ్యకున్న అడ్డలేదు. ఏడ్సుకుంట మల్లె సల్లకచ్చింది ఎల్లవ్వ. ఎలుకలు బలబలమన్నయి. పందికొక్కులు పొక్కలకు జారుకచ్చినయి. బల్లిపాతర మొఖానికి అంటింది. మల్లెసల్లల చీకటి చీకటుంది. కాగుమీది మూత తీసి కాగుల చెయ్యివెట్టి చూసింది. మూడడ్డల బియ్యముండాలె. ఒక్క గింజ లేదు. దొంతికుండలన్నీ బోర్లవడ్డయి. కుండల్ల దాచిన ఇత్తుఈదునం, ఇత్తునపు మక్కలు, బూడిది కలిపి పెట్టిన పెసార్లు, బబ్బార్లు, ఒక్కగింజలేదు. ఇల్లు ఇల్లంతా అంగడి అంగడయింది. పాత సందూకల దాచుకున్న చీరరైక, కొత్తదోతి, తువ్వాల, పక్కబట్టలు, గొంగడి ఏ వస్తువు లేదు. ఇల్లు ఇల్లంతా ఖాళీ అయిపోయింది.

ఏడ్సుకుంట నడీ ఇంట్లకచ్చి కూసుండి సోకం తీసింది ఎల్లవ్వ. అవ్వను చూసి కొడుకు కూడా ఏడుపందుకున్నడు. అవ్వకొడుకుల ఏడ్పు అలలు అలలుగా ఏడువాడలు వినిపిస్తున్నయి.

అవ్వను, అయ్యను తలుచుకుని ఏడుత్తోంది ఎల్లవ్వ. అప్పుడు పడింది ఇంటివైపు అందరి దృష్టి. అప్పటికి తెల్లారింది. ముసురు తగ్గింది. జనం ఇంటినిండా జమకూడింద్రు. పెద్దవ్వ, చిన్నవ్వ, నలుగురు వదినెలు పిల్లలు వచ్చింద్రు. మీదవడి ఏడ్చింద్రు. ఓదార్చింద్రు.

అంబటాల్లదాక వచ్చుడు పోవుడు ఏడ్పుడే అయింది. వచ్చినవాళ్లు మీద పడి ఏడ్చి ఏదో ధైర్నం చెప్పి పోయింద్రు. తెల్లారితే చేన్లల్లవాలే దినం. అంబటాల్ల దాటినంక మనిషిలేదు.





ఎంకన్న ఆకలైతుందని ఏడుత్తున్నడు. ఏకుండల చెయ్యివెట్టినా ఏమిలేదు. కొడుకును బుదురకిచ్చింది ఎల్లవ్వ. కుండెడు నీళ్లు తెచ్చింది. గురిగి నిండా నీళ్లు తాగిచ్చింది. సగం నీళ్లు తాగి సగం నీళ్లు కింద ఊంచి మళ్లీ రాగం అందుకున్నడు ఎంకన్న.

సాకలి లచ్చవ్వ ఇంటి సాకలిది. రాంగ పోంగ రోజూ ఇల్లును చూసుకుంటనే పోయేది. వాకిట్ల గడ్డి మొలిస్తే కలకలా అన్నది. 'నావ్వ ఎంకవ్వ. ఎంత సక్కని మనిషి... ఎప్పుడూ వాకిలి పచ్చగా ఉంచేది. ఏలోకం పాయెనో...ఆడిబిడ్డ ఎల్లవ్వ పత్తలేదు. జాడలేదు. ఇల్లుగాని పిల్లికూనోలె ఎటెటుతిరుగుతుందో' అనుకునేది.

లచ్చవ్వ ఆరోజు దొర్సాని ముట్టుడు బట్టలను పంగలకట్టెతో పట్టుకుని, మెడమీద ముల్లెతో నడుస్తూ రోజు లెక్కనే ఇంటి దిక్కు తిరిగి చూసింది. తలుపు తెరిచి ఉండుడు చూసి కాలు ఆగిపోయింది.

"ఇదేం చిత్రమవ్వో...ఎన్నడు లేనిది తలుపు తెరిచివుంది. అన్నలంత కలిసి ఇల్లును గూడా గుంజుకున్నరా ఏంది? ఇప్పటికే నలుగురు నాలుగు చేన్లు అలుముకున్నరు. పొల్లను పొక్కగాని పామును జేత్తరా ఏంది...? అనుకుంది లచ్చవ్వ.

లచ్చవ్వకు ఎందుకోగాని వెళ్లిపోదామంటే మనుసొప్పలేదు. 'అన్నలు, అయ్యలు కలిసి అంతపని చేసినా చేత్తరు. ఎవలున్నరో సూత్త...పనిపాడుగాను. ఎప్పుడూ ఉన్నదేనాయె. యాడికోతవు ఎంకటీ అంటే నీ ఎంబడుంట కుంపటీ అన్నట్టు, ఈ పని ఒకనాడు తీరుతాది' అనుకుంది. చేతుల ముల్లెను కింద పెట్టింది. భుజం మీది ముల్లెను కింద ఎత్తేసింది. ఇంట్లకు పోయింది లచ్చవ్వ.

కొడుకు ఏడుత్తుండు. ఎల్లవ్వ బుదురకిత్తంది. వాడు వినకుంట మంకు పెడుతుండు. అప్పుడే లచ్చవ్వ కడుప దాటింది. లచ్చవ్వను చూడంగనే ఎల్లవ్వకు తల్లినే చూసినట్టుగా అనిపించింది. ఇద్దరూ ఒకల మీద ఒకలు పడ్డరు. పొంటెజాము సోకం పెట్టింద్రు.

ఏడ్పు వినంగనే చుట్టుకునే జనం లేరిప్పుడు. అందరూ పనులల్లకు వెళ్లిపోయింద్రు. సంటి పిల్లలు....వాళ్లను పట్టుకునే ముసలవ్వలు..పచ్చిబాలింతలు మాత్రమే ఇండ్లల్ల వున్నరు. ఎల్లవ్వ ఏడ్పువిని బాధగా "పాపం పొల్ల. పొద్దుటినుంచి పత్తికాయలెక్క పలుగుతుంది. ఏనుగంత తండ్రిపోయినా ఏకులగుల్లంత తల్లి ఉండాలె. తల్లి బతికి ఉంటే పొల్ల బతుకు ఇట్లయితుండెనా....ఆ బిడ్డా...దేవుని గుల్లె మల్లెలు మొలువ. ఎంత పని చేసెనే. తల్లికోడిని తప్ప దీసి పిల్ల బతుకు ఆగం జేసె." అనుకుంటున్నరు.

సాకలి లచ్చవ్వ, ఎల్లవ్వ కడుపుల దుఃఖం కరిగిపోయేదాక ఏడ్చింద్రు. పండు ముసలోళ్లు కట్టె వట్టుకుని మెల్లె మెల్లెగా వచ్చి "ఎల్లా...ససూ...ఏడిత్తే ఏమచ్చే... అవ్వాడున్నది?... అయ్యాడున్నడు? ఆచ్చిపిట్ట ఎత్తుకపాయె. ఇచ్చినోడు వచ్చి తీసుకపాయె. గుండె పలుగుతే వత్తదా....?" అంటూ మందలిస్తున్నరు. చిన్నపిల్లలు ఇంటి చుట్టూ

ముట్టిచ్చుడు ఆడుతున్నరు.

పొంటె జాముకు ఏడ్పు సాలిచ్చుకున్నరు. కొంత సేపు ధైర్నం చెప్పి పిల్లలను అదిలిస్తూ ముసలవ్వలు వెళ్లిపోయింద్రు. లచ్చవ్వ అరుగంచుకు కూసుండి చాలా సేపు మాట్లాడింది. ఎంకన్నను దగ్గెరికి తీసుకుంది.

'అవ్వా...ఆకలే' అంటూ ఏడుపందుకున్నడు ఎంకన్న.

ఎల్లవ్వ ఏడుస్తూ ఇంట్ల కుండా బోడీ, ఇత్తు ఈదునం, బట్టబాతా ఏదిలేకుంట పోయిందని చెప్పింది. లచ్చవ్వ ఇంకా బాధపడింది. "బిడ్డా..ఇట్లంటవా అన్నా సరేగనీ..ఈ పని ఎవలో చెయ్యలేదు. మీ అయ్యలో అన్నలో చేసింద్రు. మా...పాపాత్ములుగాదు. నట్టనడుమల బొండిగె ఇరుత్తరు." అనుకుంట ఎంకన్నను దగ్గెరికి తీసుకుని పేరు అడిగింది.

'ఎంకన్న' అని చెప్పంగనే "నీ బాంచెను కాళ్లు మొక్కుత ఎంకయ్య పటేలా... నలుగురికి తిండి వెట్టినవు. నలుగురికి నీడనిచ్చినవు. ఊర్లె మోటబాయి తవ్వి తౌవ్వజూ పెట్టినవు. నీకు తిండి కరువా బాంచెను". అనుకుంట నడుముకు కట్టుకున్న ఒడి విప్పింది. కంకెడు కంకెడు గటుక పెల్లలు రెండు తీసి రెండు చేతులల్ల పెట్టింది.

ఎంకన్న దూరం జరిగి ఆవురావురుమని తింటున్నడు. చూస్తున్నంత సేపట్లో రెండు చేతులు ఖాళీ చేసిండు. "నీ బాంచెను బిడ్డా...ఎంత ఆకలిమీదున్నవో తిను". అంటూ ఒడిని విప్పి ముందట పెట్టింది. గటుక పెల్లల్ని, మాల్లను తింటున్నడు ఎంకన్న. లచ్చవ్వ ఎంకన్నను చూస్తూ ఎంకయ్యను యాది చేసుకుంటుంది.

"అయ్యో లచ్చవ్వా...వద్దే...వాడు గట్లనే అంటడు. వద్దు ఇంటికి తీసుకపో.... పొల్లగాండ్లుంటరు" ఎల్లవ్వ అన్నది బాధగా.

లచ్చవ్వ వినలేదు. గటుక పెల్లల్ని అందిస్తూనే...."ఆ పొల్లగాండ్లు లేరు. బొట్టగాండ్లు లేరు. ఎంకన్న కంటే ఎక్కువ పొల్లగాండ్లెవలున్నరు. పటేలు మాకు తిండి వెట్టిండు. నీడ ఇచ్చిండు. సాకరి బంద పాతి బతుకుదెరువు సూపిచ్చిండు. ఎట్ల మరుత్తము. నీ కాళ్లు మొక్కుత ఎల్లవ్వా..వద్దనకు". అనుకుంట బతిలాడుకుంట ఇంట్లకుపోయింది లచ్చవ్వ.

కంచుడు తెచ్చింది. ఒడిలోని గటుకను కంచుట్ల దులిపింది. "ఎల్లవ్వా నీబాంచెను బిడ్డా... నీతల్లి అసొంటిదాన్ని. ఊరు తిరిగే సాకలిదాన్ని. ఊరికి ఆడివిల్ల అసొంటిదాన్ని.. నీకు పెట్టేదాన్ని కాదు. ఆ దేవుడే నాకు తిండి పెట్టే భాగ్యమిచ్చిండు. నువ్వు గూడా తినుబిడ్డా" అంటూ గుసగుసగా చెప్పి వెళ్లిపోయింది.

గటుకను చూడంగనే ఆకలయింది ఎల్లవ్వకు. తినాలావద్దా అనుకోలేదు. నీళ్లు కలుపుకుని అదే కంచుడుతో జుర్రుడు జుర్రింది. కడుపు కొద్దిగా సల్లవడ్డట్టయింది. ఇల్లు సదురుడు మొదలువెట్టింది ఎల్లవ్వ.





ఇల్లు చేరినంక ఇంట్ల ఉండ బుద్దికాలేదు భూమయ్యకు. సక్కగ దొడ్డి దగ్గెరికి పోయిండు. ఎడ్ల కొట్టం కొట్టంలెక్క లేదు. నిండా గడ్డి మొలిచింది. పెంటల తట్టెడు పెండలేదు. పెంట కనవడకుంట నిండా ఎన్నాద్రి, చిగురంత మొలిచింది. పైన గూన పెంకలు పలిగి ఉరుపులు వెట్టి వాన నీరు కారి మడుగులు కట్టింది. లోపల పెండకడి లేదు. చాలా రోజుల నుంచి ఆవులు పన్న జాడలేదు.

అటుపక్క ఇటుపక్క చూసిండు భూమయ్య. అటు చిన్న మామ కొట్టం, ఇటు పెద్దమామ కొట్టం రెండు పెంటలు పెండకడిలతో ఉన్నాయి. వాళ్లది ఒక్కొక్క కొట్టం రెండు బాగాలయింది. కట్టెలు పాతి తటారం వేసి రెండు భాగాలు చేసింద్రు.

'తన కొట్టంల ఆవులు లేవంటే తన ఆవులు ఏమైనట్టు? ఆవులకాడి లింగం ఎటుపోయినట్టు...?' ఆలోచిస్తున్నడు భూమయ్య. ఎప్పుడూ శుభ్రంగా ఒక్క గడ్డిపోసలేకుండా ఉండే ఎడ్ల కొట్టం...నిండుగా ఉండే పెంట ఎట్లాపాడువడి పడావుపడ్డాయో తెలువ లేదు.

ఆలోచించుకుంట గడ్డివాము దగ్గెరికి పోయిండు భూమయ్య. తను పోయేటప్పుడు పెద్ద పెద్ద వాములు రెండు ఉండేవి. గడ్డి పోచలేదు. కాకరితీగ, బచ్చలి తీగ, నిండుగా పారినయి. చుట్టూ నాటిన నర్రెంగ చెట్టుపబ్బులు ఇప్పుడు పుల్లలేదు. అంతా బయిరంగమే ఉంది.

అంతా చూస్తుంటే ఏదో జరిగిందనే అనిపిస్తుంది భూమయ్యకు. ఏదో దిగులుగా భయం భయంగా కూడా ఉంది. చిన్నమామ పెద్దమామ గడ్డివాములల్ల కూడా రెండు బాగాలయినయి. రెండేసి గడ్డివాములు నిండుగా ఉన్నయి. మామకొడుకులు ఏరు వడ్డట్టున్నారనుకున్నడు.

రాంగ రాంగ కుంట చేన్లకుదిగిండు. నిలువెత్తుమక్క తలజుట్టువేసింది. పీసులు ఎల్లినయి. ఒక్కొక్కటి మూరెడు పీసు. కింద దోస తీగ పారింది. పెద్ద పెద్ద దోస కాయలు పచ్చగ మెరుస్తున్నయి. వానకు బురుద పట్టినయి. మూడు కాయలు తెంపి గోసిల ఏసుకుని ఇంటికి వచ్చింద్రు.

ఇల్లు పెంట లెక్కనే తయారయింది. ఎల్లవ్వ ఎత్తుతుంది. మెత్తుతుంది, సదురుతుంది, ఊడుత్తుంది, బల్లిపాతర తీత్తుంది, అలుకుతుంది. కొడుకును పిలిచి ఒకదోసకాయ ఇచ్చిండు భూమయ్య. తనొకటితిన్నడు. ఎల్లవ్వకు ఒకటిఇచ్చిండు.

లచ్చవ్వపెట్టిన గటుక కొంత కాపాడి ఉంచింది ఎల్లవ్వ. 'పెదుదునా వద్దా' అని ఆలోచిస్తుంది. 'పెడితే ఎక్కడిదంటడు పెట్టకపోతే పొద్దు ఎట్లగూకాలె...? మనిషి ఆకలికి ఓర్వడు. ఏమన్నా తిట్టని.' అనుకొని మట్టికంచుట్ల నీళ్లు గటుక కలిపి ఇచ్చింది.

గటుకను చూడంగనే పాణమచ్చింది భూమయ్యకు. ఎక్కడిది...?ఏంటిది? అని ఏదీ అడుగలేదు. గుట్ట గుట్ట మూడు బుక్కలు తాగిండు. మట్టి కంచుడు కింద

పెడుతూ మాత్రం "అరే..కంచుతలె ఏమైందే. సందమామ అరిగిపోయిందా..?"అన్నడు.

"కంచుతలె కొత్తదేనాయె...ఇప్పుడే సందమామ అరుగుతదా...వాళ్ల తలపండ్లు వలుగ. వాళ్లనాం నరుక. వాళ్ల దినాలకు పెట్టుకున్నరట. తినే తట్టి వండుకునే కుండలు గూడా ఎత్తుక పోయిండ్రు" అన్నది ఎల్లవ్వ.

తిందామంటే తిండిగింజలు లెవ్వు. వండుదామంటే కుండలులెవ్వు. కట్టుకోను బట్టలులెవ్వు. కప్పుకోను గొంగడి లేదు. ఇంటిని, బయట దొడ్డిని చూసినంక నడి బజార్ల ఉన్నట్టు అనిపించింది భూమయ్యకు.

'ఈ సంగతంతా లింగంకు తెలిసే ఉంటది. లింగంను అడిగితే వివరాలు చెప్తుతడని' లింగం ఇంటికి పోయిండు భూమయ్య. గుడిసెకు తాళమేసి ఉంది. సక్కగ దొడ్డి కాడికి వచ్చిండు.

దొడ్డిని మొత్తం పుల్లలేకుండా శుభ్రం చేసిండు. మొరం మన్నును ఎత్తి ఎత్తులు వంపులు లేకుండా చేసిండు. పెంట బొందలో గడ్డి పీకుతుంటే నాగుంబాము బుసలు కొట్టుకుంట లేచింది. తోక అందుకుని ఇసిరి గోడకు కొట్టిండు భూమయ్య. పెంటనంతా శుభ్రం చేసి, గడ్డి మురుగుతదని పెంటల వేసిండు.

ఇప్పుడు కొట్టం ఒకరూపుకు వచ్చింది. కొద్దిగా చూడబుద్దయితుంది. చుట్టూ కొట్టాలె. ఆ గడ్డనే దొడ్లగడ్డ. అది పట్టపగలు. ఎవలూలేరు. ఏచప్పుడూలేదు. పొద్దుమాపు ఎంత సందడిగా ఉంటుందో పగటిపూట అంత చప్పుడు లేకుంట ఉంటుంది.

భూమయ్యకు చుట్ట తాగాలని ఉంది. పొగాకు లేదు. జకమొక సంచిలేదు. ఆ ఆలోచనను చంపుకుని పనిచేస్తున్నడు. ముసురు పొద్దంతా లేకున్నా మబ్బులున్నయి. అప్పుడప్పుడు నాలుగుచుక్కలు రాలుతున్నయి. వానవచ్చినా రాకున్నా పని ఆపలేదు భూమయ్య. ఆకలయితుంటే నడుముకట్టు గట్టిగా కట్టుకున్నడు. పొద్దు గూకినంక ఇటు దొడ్డి అటు ఇల్లు రెండూ ఒక తొవ్వకు వచ్చినయి.

ఆవుల ఎడ్ల అరుపులు వినిపిస్తున్నయి. వచ్చి బయట కూర్చున్నడు భూమయ్య. ఒక్కొక్క మంద తరలివత్తంది. మందలు సగానికి సగం తగ్గినయి. సంటిల్యాగల సందడి మొదలయింది. తమ మంద వచ్చింది. మంద వెంట లింగం ఉన్నడు. కొట్టం దగ్గరికి వచ్చినంక మంద రెండు బాగాలయింది. రెండు బాగాలు నాలుగు బాగాలయినయి. ఏదొడ్లె మంద ఆదొడ్లె ఇమిడి పోయింది. మందల భూమయ్య కండ్లు ఆవుల చుట్టే తిరుగుతున్నయి.

ఎర్రావు...పుల్లావు...పయ్యది...సుక్కది...బొల్లిది...గొడ్డుది...గంగావు.. బర్రలది..ముసలిది.. కోడెలు..సగం వరకు గుర్తుపట్టిండు. ఇంకా సగం గుర్తుపట్టలేదు. మామల ఆవులు కూడా సగానికి సగం తగ్గినయి. ముగ్గురి మందలను ముగ్గురు మనుషులు కాసేవారు. ఇప్పుడు మూడు మందలను కలిపి లింగమే కాస్తున్నడు.





భూమయ్యను చూడంగనే లింగంకు కండ్లల్ల నీళ్లు తిరిగినయి. వచ్చి బిగ్గీత అలుముకున్నడు.

"పటేలా...ఏమయింది...? అటేపోతివి..జాడలేదు పత్తలేదు. ఎల్లవ్వ ఎట్లుంది..? ఎంకన్న బాగున్నడా...?" అంటూ పక్కున పలిగిండు లింగం.

పొద్దంతా ఒంటిగా బెంగటిల్లి ఉన్న భూమయ్యకు లింగంను చూడంగనే కండ్లళ్ల నీళ్లు తిరిగినయి.

"ఏం మంచిగరా..లింగం. బతికినమా అంటే బతికినం అన్నట్టుంది. తావులేని జాగల ఎన్నిరోజులుండత్తది. మన ఇంటికి మనం పోదామని వచ్చినం." అన్నడు భూమయ్య.

ఇద్దరూ అర్రగద్దెమీద కూసున్నరు. లింగం నాలుగుదొడ్ల పనుగళ్లు కట్టి వచ్చి కూర్చున్నడు. అప్పటికి దొడ్లగడ్డ సందడి మొదలయింది. ఎడ్లను, ఆవులను సదురుకోవడానికి ఒక్కొక్కలే వస్తున్నరు. అందరూ భూమయ్యను చూసి బాధగా ఆత్మీయతగా పలుకరిస్తున్నరు.

దొడ్ల వద్దకు మామలు రాలేదు. నలుగురు బావమరుదులు వచ్చింద్రు. పొద్దటి నుంచి వాళ్లు కనిపించలేదు. వస్తూనే బావను చూసి పలకరించింద్రు. దగ్గరికి వచ్చి బిగ్గీత అలుముకున్నరు. కంటతడి పెట్టుకున్నరు. ఎడ్లను దొడ్లను సర్దుకుని వెళ్లిపోయింద్రు.

కూరుకురాత్రి దాకా అక్కడే కూర్చున్నడు భూమయ్య. అతడి పక్కనే కూర్చున్నడు లింగం. ఎడ్లు, ఆవులు, ల్యాగలు అరుపులు ఆపి మేత మీద పడ్డయి.

ఖాళీగా ఉన్న తనకొట్టం దిక్కు నిండుగా ఉన్న మామల కొట్టాల దిక్కు మార్చి మార్చి చూస్తున్నడు. చూస్తూ చూస్తూ లింగం ఆవుల గురించి ఏదైనా చెబుతాడని చూస్తున్నడు భూమయ్య.

లింగల ఆవుల విషయమే చెప్తుతలేడు. భూమయ్యకు అడుగాలంటేనే భయమయితుంది. ఏ వార్త చెప్తుతడోనని దిగులుగా ఉంది. కొద్ది సేపు అట్లే కూసుండి లేస్తూ... "ఇంటికి వస్తావురా.. పండేతందుకురావా... పగటీలి మీ ఇంటికిపోయిన తాళమేసి ఉంది" అన్నడు భూమయ్య.

"ఏ...వత్తా.. మాట్లాడుకుంట పండుకుందాం" అన్నడు లింగం గొంగడిని భుజాన వేసుకుంటూ.

భూమయ్య ఇంటి దిక్కు నడిచిండు. ఏవిషయమైనా లింగం నోట్లె నానదని తెలుసు. అటువంటిది ఆవుల విషయం ఎందుకు చెప్తుతలేడో అర్థం కాలేదు. ఇంటికి వచ్చినంక అడుగాలనుకున్నడు.

ఇంటికి చేరుకునేసరికి ఇల్లురూపమే మారిపోయింది. అడివిలెక్క ఉన్న వాకిలి దురస్తయింది. ఇల్లు అలుకుపూతయింది. బల్లిపాతర లేకుంటయింది. లచ్చవ్వ పాతబట్టలు

ముల్లెగట్టుకుని వచ్చింది. ముల్లె ఎల్లవ్వకిచ్చి ఊరుతిరుగ వోయింది. ఒడినిండా గటుకతో వచ్చింది. ఎల్లవ్వను పిలిచి మట్టిబోకెల గటుకను దులిపింది. మానెడు పొడిగటుకను ముల్లెగట్టి ఇచ్చింది.

"బాంచెను కాళ్ళుమొక్కుత.. రేపుగొంత ఆందెం తెత్త తీసుకో.. ఇంతదానం నాకు ఎన్నడన్న చేత్తవు" అంటూ గుసగుసగా అన్నది లచ్చవ్వ.

ఎల్లవ్వకు కండ్లల్ల నీళ్ళుతిరిగినయి. చెయ్యెత్తి దానం చేసిందిగానీ చెయ్యిచాపి అడుగలేదు. 'ఇయ్యల్ల అయ్యోడు కాలేదు, అవ్వోడుకాలేదు, కులాన తక్కువది సాకలిది నా కడుపుకు దేవులాడుతుంది. అది ఎవలు...? నేను ఎవలు...? ఎంత గతికచ్చే' అనుకుంది.

ఆమె మనసును చదివినట్టుగానే "అవ్వా... చీకటి కొన్నిరోజులు, ఎన్నీలకొన్ని రోజులు. రాజాక రాజులకే తప్పలేదు కట్టాలు. దేవతల వంతునే ఉన్నయి. మనమెంత. వసతి తప్పితె వసుదేవుడు పోయి గాడిది కాళ్లుపట్టుకోలేదా.. ఎప్పటికి చీకటుండది" అంటూ వెళ్ళిపోయింది.

పొద్దున ఒకసారి వంతుకు వచ్చిపోయిన వదినెలు, చిన్నవ్వ ఇంటిదిక్కు మల్ల రాలేదు. ఏంతిన్నవు.. ఏం ఉన్నదని అడుగలేదు. పెద్దవ్వ మాత్రం పొద్దుగూకినంక "ఎల్లా.. గొంత అందెం తీసుకపో అన్నది". అప్పటికే ఎల్లవ్వ కుమ్మరి మల్లమ్మ దగ్గెర కుండలు, గురిగెడంత అందెం బదలు తెచ్చింది.

"వద్దు పెద్దవ్వా... ఉన్నది. అయిపోతె తీసుకుంట" అన్నది ఎల్లవ్వ.

'పొయ్యకపోని పెట్టకపోని ఏంతిన్నవు..? ఏంజేత్తన్నవని ఒక్కలన్నా మర్రిసూడ లేదని' పుట్టెడు బాధ ఉంది ఎల్లవ్వకు. పరాయి ఇంట్లపుట్టి వచ్చింద్రు కోడండ్లు. వాళ్ళు రాలేదు సరే. అయ్యతోడ పుట్టినందుకు చిన్నాయిన పెద్దనాయిన, కూడి ఆడుకున్నందుకు అన్నలు రాకపోవడం మరింత బాధగా అనిపించింది.

లచ్చవ్వ తెచ్చిన గటుకనే తిండి అయింది. పాత బట్టలే పక్కబట్టలయినయి. తింటుండగా వచ్చిండు లింగం. వెంట పొగాకు చుట్టలు రెండు తెచ్చి ఇచ్చిండు. పొద్దటి నుంచి సుట్ట మీద కుతిగా ఉంది. తిని లేచి సుట్ట అంటించిండు భూమయ్య. గపగపా నాలుగు దమ్ములు గుంజితేగానీ కుతి సల్లారలేదు.

లింగం ఎల్లవ్వతోటి మాట్లాడి గొంగడి పరుచుకున్నడు.

"ఔ...గనీ మన ఆవులు ఎట్లున్నయిరా... ఏమన్నా ఎచ్చినయా.. వాళ్లు జీతం పోత్తున్నరా..." అడిగింది ఎల్లవ్వ. భూమయ్య నోట్లె సుట్టను ఆపి లింగం వైపే చూస్తున్నడు.

"ఆవులా... ఎక్కడియవ్వా.." నడుం వాల్చబోతున్నవాడు లేచి కూర్చుంటూ అడిగిండు లింగం.





భూమయ్యకు గుండె దడుక్కుమంది. వెంటనే అందుకున్నడు. "ఎక్కడియా..? ఎందిరో. నేను పోయెటప్పుడు దొడ్డెదుగోజల్ని అప్పజెప్పిన. నమ్మితిరా సిద్దా అంటే ఏమో చేసినట్టు ఆవులు ఎక్కడియి అంటవు" అన్నడు.

లింగం కొద్దిసేపు మాట్లాడలేదు. అతడు మౌనంగా ఉండడాన్ని బట్టి ఏదో ఆలోచనలో పడ్డాడనుకున్నారిద్దరు. లింగం తనలో తాను తొక్కుకుని "పటేలా.. నువ్వుపోయిన పసలే పెద్దీరయ్య సావుకారి దగ్గర బాకీ తెచ్చిన పైసలకిందికి, ఆవులను అమ్మికట్టుమని పెద్ద పటేలుకు చెప్పినవటగదా!. చిన్న పటేలు కొన్ని, పెద్దపటేలు కొన్ని మలుపుకుని బాకి కట్టింద్రు." అన్నడు.

ఎల్లవ్వ భర్తవైపు ఆయోమయంగా చూసింది. ఆమెకు తెలియని బాకి ఏదీలేదు. అసలు బాకేలేదు. 'సచ్చిసర్గానపోయింద్రుగనీ తల్లిదండ్రులు చేతుల నాలుగు పైసలు ఉంచేపోయిద్రు. ఈ కొత్త బాకీ ఎక్కడిది' అనుకుంది.

భూమయ్య పరిస్థితి కూడా అలాగే ఉంది. భార్యవైపు చూసి "ఎక్కడి బాకీ... ఎక్కడి అమ్ముడు.. నేనెందుకు చెప్పిన.." అన్నడు.

వాన మొదలయింది. ముంతపొగలవాన. గచ్చుల గూన దార బొయ్యిమంటుంది. ఎక్కడనో... టపటపమని ఉరుపు మొదలయింది. ఉరిసిన చోట చిప్పకంచుల్లను పెట్టివచ్చింది ఎల్లవ్వ. గూనదార గచ్చుల పడుతుంటే నీళ్లు అరుగు అంచులను తడుపుతున్నయి. గొంగడిని పైకి జరుపుకుని ముడుచుకుని కూర్చుంటూ చెప్పిండు లింగం.

"పటేలా. పెద్దీరయ్య బాకికట్టాలని ఆవులన్నీ మలుపుకున్నరు. నేనెట్ల పటేలా అంటే రెండు మందలు నాకే అప్పజెప్పింద్రు. నేనుగూడా నిజమేఅనుకున్న. నిన్ను మోసం జెసింద్రు పటేలా. నిన్ను నమ్మిచ్చి బొండిగెపిసికింద్రు. నీ ఆవులు నువ్వ మలుపుకో.. రేపు నువ్వు దొడ్డికాడ నిలవడు అంతే... నేనే మలుపుత".

ఎల్లవ్వకు కోపం ఆగలేదు. కోపంతో పాటు దుఖం కూడా వచ్చింది. గొంతు బొంగురుపోయింది. 'ఇటు ఇల్లును దోసుకున్నరు. అటుదొడ్డిని మలుపుకున్నరు. అయ్యవ్వ పోయినట్టు మేముగూడా సచ్చిపోతే వాళ్లకండ్లు సల్లవడుతుండె' దుక్కం గొంతును మింగింది. ఎల్లవ్వ కండ్లల్ల నీళ్లు తిరిగినయి.

ఆరాత్రి ఎవరికీ నిద్రలేదు. కూరుకు రాత్రే లేచి లింగం దొడ్డికాడికి పోయిండు. భూమయ్యలేచి బర్రెపాకను సర్దుతున్నడు. ఎల్లవ్వ గటుకను తడిపి ఎసరుపెట్టి పాశిపనిలో పడింది. ఎవలు ఏ పని చేసినా మనుసులో ఈ విషయమే మెదులుతుంది.

మబ్బుతోనే పెద్ద ఈరయ్య సావుకారి దగ్గరికిపోయిండు భూమయ్య. సావుకారి చెరువుకట్టకు పోతే వచ్చేదాక కూసున్నడు. సావుకారమ్మ గొడ్డలిచ్చి "నాలుగు కట్టెలు కొట్టియ్యిరా" అన్నది. ఆమె సంగతి తెలుసు భూమయ్యకు. పిట్ట గనవడితే పిట్టకు పనిచెప్పుతది. గొడ్డలి అందుకుని కట్టెలు కొడుతుంటె వచ్చిండు సావుకారి.

భూమయ్యను చూసి "ఏంరా ఇలిటపోడా.. ఎప్పుడచ్చినవురా..పత్తలేకుంట పోయినవేందిరా...పుట్టంగనే అయ్యవ్వను మింగితివి. ఇక్కడ ఇంట్ల అడుగుపెట్టంగనే అత్తమామను మింగితివి. మూలనచ్చత్రాన పుట్టినావురా.." అన్నడు.

భూమయ్య గుండె కలుక్కుమంది. మారుమాట్లాడలేదు. వచ్చి బనుకుల నిలవడ్డడు. సావుకారి ఇంట్లకుపోయి తానం జపం చేసుకుని వచ్చేదాక అట్లనే నిలవడ్డడు.

'ఏందిరా..ఏమన్నా బాకి గావాలెనా..' అడిగిండు సావుకారి.

"లేదు.. సావుకారి.. నేను మీకు ఏదో బాకిఉన్ననని మా మామలు ఆవులు మలుపుకున్నరు" చెప్పుతుంటె అందుకున్నడు ఈరయ్య. ఎన్నడో ఒకనాడు భూమయ్య ఇట్లవచ్చి అడుగుతాడని తెలుసు. అందుకే కాయిదాలు రాసి పెట్టుకున్నడు.

"అవునురా.. మీమామ ఇన్నూరు రూపాయలిచ్చేది. వాడు ఇయ్యకనే సచ్చె. అడుగుదామంటే మీ అత్త బాగలేకుండె. ఆపదల అడిగితే నలుగురేమంటరు. నాది నేను ఒత్తుక సచ్చిన. అటీటన అది పుటుక్కుమనె. ఇగ నిన్ను అడుగు దామనుకున్న. నువ్వు రాత్రో రాత్రి దేశాలు వట్టి పత్తలేకపోతివి జాడలేక పోతివి." అనుకుంట పాత సందూకల నుంచి వెతికి వెతికి ఒక కాయిదం తెచ్చి ఇచ్చిండు.

ఎక్కడ ఏం మాట్లాడుదామన్నా సందులేదు. ఇప్పుడు ఏమన్నా కొట్లాట తప్ప లాభం లేదనుకున్నడు భూమయ్య. మారుమాట్లాడకుండా ఎనక్కి తిరిగిండు.

ఇంటికి వస్తుంటే మధ్యలో కలిసిండు కాందారి రాజయ్య. భూమయ్యను కండ్లు చిట్లిచ్చి చూసిండు. కాలు ఆపి పిలిచిండు "ఏంరా ఇలిటపోడా.. మల్లచ్చి నవేందిరా.. నీ దరిద్రపు....." బూతుమాట అంటూ తుపుక్కున ఊంచిండు.

భూమయ్య మనుసు కుత కుత ఉడికింది. 'సూత్తబిడ్డా...సూత్త. పండుటాకులెక్క నువ్వు రాలిపోకపోతవా... పచ్చటాకులెక్క నేను పకపక నవ్వకపోతనా'. అనుకున్నడు. మనుసు చిన్నబుచ్చుకుని ఇంటికి వచ్చిండు.

వారం రోజులు దాటింది. ఈ వారంల పొద్దునో మాపునో సోకం పెట్టుకుని ఏడుత్తుంది ఎల్లవ్వ. అవ్వనో నాయిన్నో తలుచుకుంటుంది. భూమయ్య దొడ్డి దగ్గరికో పొలం దగ్గరికో పోతున్నడు. నాలుగు పొలాలు తిరుగుతున్నడు.

బావమరుదులు నలుగురు ఏరువడ్డరని నాలుగు చోట్ల నలుగురు యాడాదికి ఒక పొలం చొప్పున దున్నుకుంటున్నరని తెలిసింది.

అప్పటికి ఇప్పటికే ఊరు మారిపోయింది. నీటివాడకం పంటలకు ఎక్కువయింది. పునాస పంటలు సగానికి సగం తగ్గినయి.

అప్పటికి చేన్లు కలుపుకు వచ్చినయి. మోటపొలం ఇత్తారి దున్నుకుంటున్నడు. ఇత్తారి మల్లయ్య పెద్దకొడుకు. మోటకు నాలుగుమడ్లు నాటువేసి మిగిలినయి జొన్న పంట పెట్టిండు. గుట్టకింద ఇత్తారి తమ్ముడు మాంకాలి దున్నుకుంటున్నడు.





ఏరువడేతందుకు మాంకాలే కారణం. పెండ్లాన్ని చేతవట్టినంక ఒక్కనాడు సక్కగ పనిచెయ్యలేదు. పెండ్లాం సత్తవ్వ ఒక్కనాడు సక్కగ పని చెయ్యలేదు. ఎప్పటికి అవ్వగారింటికే దెంకపోతుండె. ఒకసారైతే వాగుల సంచి నిండా ఉసికె ముల్లెగట్టి ఎత్తి ఇంటిదాకా కొట్టుకుంట వచ్చింద్రు. ఉసికెను కడుపల్ల పోసి ఏడుగురు తొక్కింద్రు. అప్పటినుంచి సక్కగ సంసారం చేసింది.

మాంకాలి గూడా మోటకు నాలుగుమడ్లు నాటేసి మిగిలింది బబ్బెర పెసర అలికిండు. చెరువు పారుకం ఎల్లయ్య పెద్దకొడుకు కొండయ్య దున్నుకుంటున్నడు. చెరువు పారుకం కాబట్టి మొత్తం వరిపంటనే ఏసిండు. పునాస పంట లేనే లేదు. కొండయ్య తమ్ముడు బాలయ్య పూలదొయ్యలు దున్నుకున్నడు. అక్కడ గూడ మోటనడిచే మందం రెండుదొయ్యలు అలుక్కుని మిగిలింది పునాస అలుక్కున్నడు.

కొండయ్య తలతిక్క మనిషి. ఒకసారి తండ్రి మీదికి మర్రవడ్డడు. తల్లినికొట్టిండు. ఇంట్ల చిచ్చుపుట్టింది. ఏరుపడేదాక వచ్చింది. వాళ్లు ఏరుపడేనాటికి నాలుగు పొలాలున్నయి. నలుగురు మనుషులున్నరు. ఒక్కొక్కలు ఒక్కొక్క పొలం దున్నుకుంటున్నరు.

తనపొలం తనకు ఇస్తదేమోనని చూసిండు భూమయ్య. ఆ విషయం ఎవలు మాట్లాడలేదు. కొత్తగ ఒకటి రెండు రోజులు మాట్లాడి మాటలు మానేసింద్రు. బావమరుదులు తప్పుకున్నరు. మామలు మొఖం చాటేసింద్రు.

ఏంచెయ్యాలో తోచలేదు భూమయ్యకు. ఆవులను మలుపుకోవాలంటే ధైర్యం సాల్త లేదు. నా పొలం నాకియ్యింద్రి అని అడుగాలంటే బయమయితుంది. దొరికిననాడు కైకిలి..దొరుకని నాడు ఇంట్లనే ఉంటున్నడు. వాళ్లను వీళ్లను బదలు అడుక్కచ్చి గటుక వండుతుంది ఎల్లవ్వ. ఒక్కొక్కనాడు ఉపాసమే ఉంటున్నరు.

నడీవానకాలం కైకిలు కూడా సక్కగ దొరుకుతలేదు. రెండు రోజులు పనికి పోతే మూడు రోజులు పండుడయితుంది. తూమెడు మక్కలు మాత్రం నాగులకు తెచ్చి ఇంట్లపోసిండు. ఎల్లవ్వకు ఇదంతా చూస్తుంటే ఎట్ల బతుకాలన్న భయం పట్టుకుంది.

పెద్దవ్వ మాట్లాడుతలేదు. చిన్నవ్వ కండ్లకిందినుంచి చూస్తంది. వదినెలు వాసనకే వస్తలేరు. అన్నలు, అయ్యలు మొఖమే చూస్తలేరు. తనది తాను అడుక్కుంటే తప్ప వాళ్లకు వాళ్లు ఇయ్యరని తెలిసిపోయింది ఎల్లవ్వకు.

ఒకనాడు పెద్దనాయిన ఇంటికిపోయింది ఎల్లవ్వ. ఇంట్ల ఉన్నప్పుడే పోయింది. ఉండి కూడా లేడనిపించుకున్నడు మల్లయ్య. ఇంకోనాడు వాకిట్లనుంచి నడిచిపోతుంటే వెంటనే పోయింది. ఏమిటి, ఎందుకని ఎవలూ అడుగలేదు.

తనే 'నాయినా..నాకు చేనుగావాలె. నా చేను నాకు చూపించుండ్రి. ఏం పని లేకపాయె. ఎన్నొద్దులు తినుకుంట తిరుగుతడు." అన్నది ఎల్లవ్వ.

చాలా సేపటిదాకా నోరు ఎత్తలేదు మల్లయ్య. పొంటెజాముకు “ఇప్పుడు ఎవలనేం అనరాదు. లాగోడిపెట్టి కష్టపడి దున్నుకునిరి. వరి కలుపుకువచ్చె. మక్కలు పీసులకచ్చె. ఎవలను ఇయ్యిమంటే ఎవలిత్తరు. నువ్వు అటుగాకుండా ఇటుగాకుండా నడుమవత్తివి. యాసంగి మీద గట్ట సూద్దాం.” అన్నడు.

ఎల్లవ్వకు కూడా నిజమే అనిపించింది. కష్టపడి దున్నుకున్నరు. సగం కాలం వచ్చె. ‘కుప్పమీదికి వచ్చెరా లప్పగాడన్నట్టు’ ఇప్పుడు ఇయ్యిమంటే ఎవలు ఇత్తరు. ఎవలైనా మనుషులేగదా. ఆశకే దున్నుకునిరి. నేనువత్తనని కలగన్నరా’ అనుకుంది. అట్లనే తనకుతాను చెప్పుకుని భర్తకు చెప్పింది.

ఇంకోనాడు ఆవుల విషయం అడిగింది ఎల్లవ్వ. “ఏం చెయ్యిమంటవు. షావుకారి మందకు అడ్డంతిరిగిండు. బాకికడుతరా..లేదా అని ఇజ్జత్ తీసిండు. సచ్చినోడు సచ్చె. మీ కన్నాబుద్ధి లేదురా అని బజార్లకు గుంజిండు. నేనుకొన్ని చిన్నాయిన కొన్ని జమ చేసి కట్టినం. ఆవులను కొన్ని అమ్మినం. ఏం అమ్మితే ఏ మస్తయి...? చెరియాభై చెయ్యి నుంచి తలిగినయి. తమ్ముడు నాతమ్ముడే గదా అని కడుపుల దాసుకున్న” అన్నడు మల్లయ్య.

ఎల్లవ్వ మారు చెప్పలేదు. ‘అయ్యలేడు అవ్వలేదు. ఎవలూ పట్టిన సనువుకాదు. అందరితో మంచిగ కలిసి ఉండాలె. వీళ్లే అయ్యవ్వ అనుకుంది. అటోఇటో నెలరెండు నెలలు గడిస్తే చాలు. ఏదో ఒక బాయి నాకు ఇచ్చి మిగిలినది వాళ్లు దున్నుకుంటరు.’ అనుకుంది.

భూమయ్యకు మాత్రం ఆ నమ్మకంలేదు. “లేని బాకి ఉన్నదని ఆవులనే మలుపుకున్నోళ్లు..నాకుపాలు ఎట్ల ఇస్తరు. ఇప్పుడు తెగినపాలయింది. నలుగురికి నాలుగు చేన్లయినయి. యాడాదికో చేను తిరుగుతరు. నాకు ఒక చేను ఇస్తే వాళ్లకు పాళ్లు తెగయి.” అనుకుంటున్నడు.

ఒకవేళ పాలు లేదంటే ఏం జెయ్యాలె అని ఆలోచిస్తున్నడు. అప్పటికే ఇద్దరు ముగ్గురు శాతపెద్ద మనుషులకు చెప్పుకున్నడు. “నీకెవడురా పాలు లేదనేది... నీ మామది నువ్వుదున్నుకుంటవు” అంటున్నరు.

చూస్తుండంగనే కోతల పూర్తయినయి. మాగికాలం మొదలయింది. ఈ రెండు నెలలు పొద్దుదప్పితే మాపు, మాపు తప్పతే పొద్దు ఉపాసమే ఉంటున్నరు భూమయ్య ఎల్లవ్వలు. కొడుకుకు మాత్రం పిట్టమ్యాతను తడుపుతున్నరు.

10

లొటపెట పెదువులకు నక్క ఆసపడ్డట్టు పొలం ఇస్తరని ఆశపడుతుంది ఎల్లవ్వ. కోతలయినయి. మోతలయినయి. మోటమందం మళ్ళీ మొలుకపోసింద్రు. మంచుకు పండుతదని ఉలువను అలుకుతున్నరు. ఎవలూ పంచుడు మాట ఎత్తుతలేరు.





ఎల్లవ్వనే పెద్దనాయినను కలిసింది. అంతకు ముందురోజే అన్నదమ్ములు ఇద్దరూ కలుసుకున్నరు.

“అన్నా పోరగండ్లు నలుగురు నాలుగు జాగల దున్నుకుంటున్నరు. ఇప్పుడు ఐదవ పాలంటే కష్టమే” ఎల్లయ్య అన్నడు.

“ఇలిటపోనికేందిరా ఇచ్చేది. అది ఆడిపిల్ల. దానికి పాలుంటదా..? సుట్టమోలె రావాలె పోవాలె. వండక వడివెడితే ఉండక వాడే పోతడు. పాలులేదు ఏం లేదని చెప్పుదాం” మల్లయ్య అన్నడు

“వాన్ని నెగుల నియ్యద్దు. పోరగాండ్లకు ఇసం పెట్టినట్టు. ఒక్కన్నీ నెగుల నియ్యడు” అన్నడు ఎల్లయ్య భయంగా.

ఎవలను అడిగినా అదే ముచ్చట చెప్పాలని నిర్ణయంచుకున్నరు. నలుగురు కొడుకులను ఎగేసింద్రు. ఎట్లా వీలైతే అట్లా ఇద్దరినీ భయపెట్టాలని చెప్పింద్రు. కోడండ్లకు బోద పోసింద్రు.

ఇద్దరు యారండ్లు మాత్రం ఒప్పుకోలేదు. ఎల్లవ్వను ఏడిపించడం వాళ్లకు ఇష్టంలేదు.

“ఏ.. ఏంది తియ్యి. దిక్కులేని పోరి. ఆడివిల్ల కలకలానద్దు. కలకలాంటే కన్నీల్లే సాలు. ఊకుంటే ఉసురేసాలు. మంచిదగు చెడ్డదగు. నలుగురు నాలుగు మాటలంటరు. ఆ పిల్లది ఆపిల్లకు ఇచ్చేద్దాం” అన్నది పెద్దవ్వ గాలవ్వ.

“అంతగాకున్నా. ఎంతో కొంత ఇద్దాం. మనకు ఆడివిల్లలు లేరుగదా. రేపు ఇరుగవడితే ఆడి సోపతికి ఆడిసోపతి. అవ్వా అని దగ్గెరికత్తది. సుట్టిముట్టుడత్తే అందరికి వండిపారేత్తది.” చిన్నవ్వ సక్కవ్వ అంది.

అన్నదమ్ములిద్దరూ నాగంబాముల్లెక్కన లేచింద్రు. కోపంతో కండ్లెర్రజేసింద్రు. మండి పడ్డరు.

“ఆడిబుద్ధి అలుకబుద్ధి. ఆడిదాని మాట వింటే సంసారం అడుగు వడుతది. మొగోని మాటవింటే మొగులు ముడుతది. మీరు నోరు మూసుకోండ్రి. నోరుదెరిత్తే బొండిగెపిసుకుతం” అన్నరు.

యారాండ్లు ఇద్దరూ నోరుతెరువలేదు. లోపల లోపల మసులుకున్నరు. భయపడ్డరు. కొడుకులకు చెప్పాలని చూసింద్రు. వాళ్లు తండ్రులకంటే ఎక్కువ ఎగిరి దుంకి దూలాలందుకున్నరు. చేసేదేంలేక ఇద్దరు యారాండ్లు ఊకున్నరు.

ఇదంతా లోలోపలనే జరిగింది. ఇదంతా జరిగినట్లు ఎల్లవ్వకు తెలువది.

“పెద్దనాయినా.. ఎట్లనే చేతులు ముంగట పెట్టుకుని కూసుండుడుగావట్టె. ఇప్పుడన్నా నాదినాకు చూపిస్తే దున్నుక బతుకుత. పొట్టతిప్పలు గావట్టె” అన్నది.

మల్లయ్య ఇంట్ల పీటమీద కూసున్నడు. ఒకసారి చిన్నగానవ్వి "యాడిదేనీది. నాది నాదంటున్నవు. పాలులేదు ఏంలేదు. ఆడివిల్లవు. ఒగింటి కోడలువు. నీ ఇల్లు ఇదిగాదు, అత్తగారిల్లు. అక్కడ ఏమన్న ఉన్నదేమో పంచుకపో..ఇంకోసారి నా పాలు నా పాలని అడుగకు" అన్నడు కోపంగా.

ఎల్లవ్వకు కోపం దుఃఖం వచ్చింది. రెండు మూడు మాటలని ఇంటికిపోయి సోకం వెట్టుకుని ఏడ్చింది. భూమయ్య రాంగనే ఏడ్చుకుంట విషయమంతా చెప్పింది.

భూమయ్య మొదటినుంచీ ఊహిస్తున్నదే ఇది. తనకు ఎన్నడూ వాళ్లంతల వాళ్లు పొలం ఇయ్యరని తెలుసు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా విన్నట్టుగ లేదు అతనికి. అందుకే ఎల్లవ్వకు ధైర్యం చెప్పి అన్నడు.

"ఇగో..తెగిన బొక్కెన బాయిల దాక. ఎవలేం జేత్తరోసూత్తాం.. బంచోత్.. మోటబాయి పొలం మనది. మనపొలంల మనం నాగలి గడుదాం... ఎవలడ్డమత్తరో సూత్తాం". అన్నడు.

"ఎడ్లులేకపాయె..ఎట్లదున్నుదాం.." ఎల్లవ్వ అడిగింది.

"నీఎడ్ల పీసునెగొడుదు ఎడ్లెందుకే...నేనుగుంజుత.నువ్వు పాలెవట్టుకొని ఎనుక నడువుగంతే! పొద్దుగూకే వరకు నాలుగు మడ్లు తిరుగుత" అన్నడు.

కమ్మకత్తిని మెత్తగా నూరి ఎల్లవ్వకు ఇచ్చిండు భూమయ్య. ముందు నువ్వు నడువు. ఎనుక నేనుంట అన్నడు. కొడుకును ఎత్తుకుని కమ్మ కత్తివట్టుకుని ఎల్లవ్వ ముందునడిచింది. నాగలెత్తుకుని భూమయ్య ఎంట నడిచిండు.

భూమయ్య ఏం చేస్తడో ముందే తెలుసుకున్నరు అన్నదమ్ములు. మొదలు మొదలు మోట బాయి దగ్గరికే వస్తాడని తెలుసు. అందుకని నలుగురు కోడండ్లు నలుగురు కొడుకులు ఇద్దరు తండ్రులు పొలంలనే ఉన్నరు. ఆరు నాగండ్లు గట్టి దున్నుతున్నరు. ముందటి నాగలి మల్లయ్య వట్టిండు.

ఎల్లవ్వ నాగండ్ల దగ్గెరికి నడిచింది. కోడండ్లు నలుగురు అడ్డుకున్నరు. అందరినీ చెలుపుకుని నాగండ్ల దగ్గెరికి పోయింది. ఒడ్డు మీద నిలవడి కమ్మకత్తితో ఎడ్లమెడలకున్న జోళ్లను తెంపింది. కమ్మకత్తితోనే ఎడ్లను అదిలించింది. ఎడ్లు తలోదిక్కు పరుగు అందుకున్నయి.నాగండ్లను ఎత్తుకచ్చి బాయిదగ్గరున్న బండమీద ఎత్తేసిండు భూమయ్య. దెబ్బకు పాలెనో, నొగనో, దుంపనో పుటుక్కున ఇరుగుతుంది. ఇట్ల ఆరునాగండ్లను ఇరగ్గొట్టిండు భూమయ్య.

తండ్రులిద్దరూ నలుగురు కొడుకులను ఎగేసింద్రు. కొడుకులు భూమయ్య మీదికి కలెవడ్డరు. ముల్లుగట్టెలతో దాడి చేసింద్రు. భూమయ్యకు పెయ్యన్నివాతలే!. ఇది చూసి ఎల్లవ్వ లబలబ మొత్తుకుంది. సుట్టుపక్కల మోటకాడ ఉన్నోళ్లు విడిపించింద్రు. నలుగురు వాళ్లు, ఒక్కడు భూమయ్య, దెబ్బలు బాగాతాకినయి. నొప్పులు పుట్టినయి.





నాగండ్లు ఇరిగినయి. ఎడ్లు చెట్టుకొక్కటి గుట్టకొక్కటి అయినయి. ఆడోళ్లు ఎడ్లను మలుపుకుని వస్తుంటే మొగోళ్లు నాగండ్లు తేవడానికి దొడ్డికాడికి పోయింద్రు.

అప్పటికే దొడ్డికాడి నాగండ్లను మాయం చేసిండు భూమయ్య. వీళ్లు ఆరు నాగండ్లను వడ్ల దాతి దగ్గెరికి తీసుకపోయి చెక్కుకుని వచ్చేసరికి పొద్దు తల్లికడుపుల వడ్డది.

ఇక్కడ భూమయ్య వీపు దెబ్బలకు వాత తేలింది. ఎల్లవ్వ ఏడుత్తుంటే "ఓత్.. లౌడ వుట్టిన్నుంచి లాగులు ఎన్ని చినుగలేదు. ఈ దెబ్బలోకలెక్కనా..పటూ" అంటూ నాగలి పట్టిగుంజిండు.

ఉలువలు అలుకడానికి పూనాస దున్నుకం అది. ఎల్లవ్వ కొద్దిగా పాలెను వంచి సాలును మిట్టకుపట్టింది. బుసబుస నాగలి దూసుక పోయింది. ఒడ్డుమీద ఎంకన్న ఆడుకుంటుంటే పొద్దుగూకే వరకు రెండు నాగండ్ల దున్నుకం దున్నింది ఎల్లవ్వ.

రాత్రిపూట ఉడుకునీళ్లు సన్నీళ్ళతో ఈపును కాపింది ఎల్లవ్వ. కమిలిపోయిన దెబ్బల మీద ఆందెం రాసింది. జీడిగింజలు బెల్లం ఆందెంతోటి కలిపి నొప్పులు తగ్గడానికి నవనీతం గోళీలను తయారు చేసింది. కొట్టినందుకు సట్టి సాపెన వెట్టింది. ఏడుదోసిల్ల మన్ను ఎత్తిపోసింది.

తెల్లారింది. మళ్లా కమ్మకత్తి చేతవట్టింది ఎల్లవ్వ. భూమయ్య నాగలి, గుతుపకట్టెను చేతవట్టిండు. కొడుకును ఎత్తుకుని పొలం దగ్గెరికి నడిచింద్రు. అప్పటికే నాగండ్లు నడుత్తున్నయి.

ఎల్లవ్వ చుట్టూ చుట్టుకున్నరు కోడండ్లు. భూమయ్య ఎంకన్న చేతికి వాయిలి బరిగె ఇచ్చిండు.

"అరే.. ఎంకన్నా.ఉతుకురా" అన్నడు.

ఎంకన్న వాయిలి బరిగెతోని మనిషి కొక్కటి దిద్దిండు. పెద్ద కోడలు ఎంకన్న చేతిల నుంచి బరిగె అందుకుని ఇసిరి కొట్టింది. మిగిలిన ముగ్గురు ఎల్లవ్వను బూరెంటికలు అందుకున్నరు. వంగవెట్టి గిప్పగిప్ప గుద్దుతుంద్రు. ఎల్లవ్వ "వావ్వో..వాయ్యో.." అని మొత్తుకుంటుంది.

నాగండ్లు దున్నే మొగోళ్లు నాగండ్లు ఆపి "తలుగని..గుద్దుంద్రి. ముండను ఈసారి రాకుంట చెయ్యింద్రి. లెవ్వకుంట గుద్దుంద్రి". అంటున్నరు.

మొగోళ్ల మాటలు విన్నంక ఆడోళ్లకు మరింత బలమచ్చింది. ఒకటికి రెండు వంగవెట్టి తింపుకుంట కొడుతున్నరు. ఎల్లవ్వ మొత్తుకుంటుంది ఏడుత్తుంది.

భూమయ్య పక్కనే ఉన్నడు. ఆడోళ్ల మీదికి తను చెయ్యి ఎత్తరాదనుకున్నడు. 'ఎంకన్నా..సూత్తవేందిరా ఉతుకు..' అని కొడుక్కు గుతుప కట్టె చేతికిచ్చిండు.

ఎంకన్న గుతుప అందుకున్నడు. పెట్టుడు పెట్టుడే పెద్ద కోడలు మెడ శింపుల

మీద పెట్టిండు. దెబ్బకు ఇరుసుక పడ్డది. ఇంకో దెబ్బ ఇంకో కోడలు కొంకుల మీద పెట్టిండు. ఇద్దరికి పట్టు తప్పింది. ఎల్లవ్వ కొద్దిగా తేరుకుని చిన్నదాని శికె వట్టి, ఎనుకకుగుంజి, ఎదురుబొచ్చె మీద మోచేతితో ఒత్తుడు ఒత్తింది. దెబ్బకు కీసుమంది చిన్నవదినె. ఎంకన్న చేతుల కట్టె ఆడుతనే ఉంది. ఇంకో దెబ్బ ఇంకో కోడలు మోకాలి చిప్పల మీద అందుకున్నడు. చిప్పలు పుట్టుక్కుమన్నయి. పై పాణాలు పైనే పోయినయి.

పెద్దకోడలు "తేరుకొని ముండకొడుక.... ఎవనికి పుట్టినవురా.." అనుకుంట ఎంకన్న దిక్కువచ్చింది. కొడుకును అందుకుని ఎత్తుకున్నడు భూమయ్య.

"ముండా నువ్వావనికి పుట్టినవే" అనురా అని చెప్పిండు ఎంకన్నకు భూమయ్య. ఎంకన్న అట్లే అన్నడు. కొద్దిగా పట్టు దొరికి ఎల్లవ్వ కమ్మకత్తి అందుకుని మనిషికొకటి దిద్దింది.

నాగండ్ల మీద నుంచి మొగోళ్లు ఉరికచ్చింద్రు. గుతుపకట్టెతో అందరినీ అదిలించి ఆపిండు భూమయ్య. కాళ్ల సందుల నుంచే తప్పుకున్నడు ఎంకన్న. తల్లి చేతుల నుంచి కమ్మకత్తి అందుకుని నాగండ్ల దగ్గెరికి పోయిండు. ఎడ్లను కత్తితో గీరిండు. అవి మంటర మంట నాగండ్లు ఎత్తుకుని ఉరుకదలిగినయి. ఇత్తారి ఎంకన్న మీదికి కొట్టబోతే తండ్రి దగ్గెరికి వచ్చి దాక్కున్నడు ఎంకన్న.

నలుగురు కొడుకులు భూమయ్య మీదికి కలెవడ్డరు. ఒక్కొక్కన్ని దొరికిచ్చుకుని అనుకజబ్బల గుద్దుతున్నడు భూమయ్య. దెబ్బపడ్డోడు కింద పడి లేత్తలేడు. నిన్న అందరితో దెబ్బలు తిన్నంక ఎట్ల కొట్టాలెనో తెలిసింది.

ఇది చూసి మల్లయ్యకు కోపమచ్చింది. ముల్లుగట్టెతోని భూమయ్య నెత్తిమీద బలంగా కొట్టిండు. భూమయ్య నెత్తి పక్కన పలిగింది. రడా మండల రక్తం గారుతుంది. దెబ్బకు కండ్లు చీకట్లు కమ్మినయి. కొద్దిగా నిలదొక్కుకున్నడు. ఎడమ చేత్తో మల్లయ్యను అందుకున్నడు. రెండు కాళ్ల సందున బుడ్డగోశి మీద మోకాలు వంచి గుద్దుడు గుద్దిండు.

ఆ దెబ్బకు ఎనుకకు ఇరుసుకపడ్డడు మల్లయ్య. రెండు చేతులతో బుడ్డ గోశిని అనుగవట్టుకుని ఒక్కటే మొత్తుకునుడు.

భూమయ్యకు మొఖం నిండారక్తం. పెయ్యి నిండారక్తం. అయినా బెదురలేదు. "అరేయ్! మీరు ఆరుగున్నరు నేను ఒక్కన్నే వున్న. అయితే మీ తలుకాయలన్నా తెగాలె. లేదంటే నా తలుకాయనన్నా తెగాలె..బంచోత్..ఒక్కొక్కొన్ని నరుకుడు నరుకుత." అంటూ కట్టెను తింపిండు భూమయ్య. ఆ స్థితిలో భూమయ్యను చూస్తే అందరికీ భయం పుట్టింది.

ఎవలంతల వాళ్లు గుంజుకున్నరు. మల్లయ్య మాత్రం కొట్టుకుంటుండు. మల్లయ్య కొడుకులిద్దరూ తండ్రిని కూసుండవెడుతున్నరు. భూమయ్య రక్తం చూడంగనే ఎల్లవ్వకు దడుగు పుచ్చుకుంది. కొనకొంగును చింపి నెత్తికి కట్టింది. తల్లి ఏడ్వడం చూసి ఎంకన్న గూడా ఏడుపు అందుకున్నడు.





మల్లయ్యకు నడువత్తలేదు. కాళ్లు కూలవడుతున్నయి. ఎడ్లు నాగండ్లను గుంజుక పోతున్నయి. ఏర్లకు తట్టువెట్టినయి. రెండు నాగండ్లు ఇరిగినయి. కొందరు నాగండ్ల దిక్కుపరుగు తీస్తే, కొందరు మల్లయ్యను ఇంటికి పట్టుకుని పోయింద్రు. భూమయ్య ఎల్లవ్వ ఎంకన్న ముగ్గురే మిగిలింద్రు.

పెయ్యిమీది రక్తాన్నంతా కడుక్కున్నడు భూమయ్య. రక్తం గడ్డకట్టి నల్లగా మారింది. నల్లాలం దంచి రసం పిండిపోసింది ఎల్లవ్వ. గాయానికి ర్యాగడి బురుద పూసిండు భూమయ్య.

"నీ చేన్ల మన్నువడ.. చేనద్దు మన్నద్దు. ఇంటి మొకాన పోదాంపా.." అన్నది ఎల్లవ్వ ఏడుస్తూ.

"ఇంటికిపోయి ఏంజేత్తం. కట్టం చేసుకుని బతికేటోళ్లం. ఇంత భూమి ఉండాలె. సావో బతుకో ఇక్కడనే చూసుకుందాం. ఇప్పుడు భయపడితే నిలువనీడ ఉండది" అన్నడు భూమయ్య.

రెండు రోజుల వరకూ ఎవలూ రాలేదు. పొలం దున్ని, తవ్వి ఉలువ అలికిండు భూమయ్య. ఇత్తునపు వడ్లు నాగులకు తెచ్చి బురుద మడ్లకు అలికిండు. ఈ పనంతా అయ్యేవరకు ఎవలూరాలేదు. మొలుకలు మొలిచేయాల్లకు ఆరు నాగండ్లు కట్టి నమ్మించి పొట్టుపొట్టుదున్ని మొలుకలు లెవ్వకుంట చేసింద్రు అన్నలు.

భూమయ్యకు కోపమచ్చింది. తోడెంగ ఇంత్తులను జమచేసి వాళ్ల పొలాలల్ల చల్లివచ్చిండు. అసలు పంటకంటే ఎక్కువ తోడెంగ గడ్డి లేచింది. వాళ్ల పంటంతా గడ్డిలనే పోయింది.

నాగులకు తెచ్చిన ఇత్తునాలు భూమిలపోసినట్టయింది. మాల్లా నాగులకు తెచ్చి అలుక్కున్నడు భూమయ్య.

యాసంగి ఎవుసమంటే కట్టెగాదపుదినం. కొమ్మలను కొట్టి బురుద పొలమైతే తొక్కుతరు. పునాస పొలమైతే ఆకులు రాలుస్తరు. భూమయ్య తన బండిని సైరకు చేసుకున్నడు. పొద్దున్నే కట్టెతెచ్చుకోవాలనుకున్నడు. తెల్లారేసరికి యాటతాడు, బండి శీలలు, కాని మాయ మయినయి.

ఎట్లా అనుకుని అటు ఇటు సదిరి బండి గట్టుకునిపోయే సరికి, తానుకొట్టిపెట్టిన కట్టెజూల్లు మాయం చేసింద్రు.

ఎట్లనో భయపెట్టి ఊర్లె లేకుంట చెయ్యాలని వాళ్లు. భూమయ్య మాత్రం ఎంత చేస్తే అంత మొండివారి పోతున్నడు. రెండు రోజులు బదలు వస్తనని ఒక్కరోజు ఎడ్లను అడుక్కని దున్నుకుంటున్నడు. భూమయ్యకు ఎడ్లను ఎవలూ ఇయ్యద్దని మామలిద్దరూ బెదిరిత్తంద్రు. ఇత్తునాలు అప్పుసప్పు ఇయ్యద్దని అందరినీ భయపెడుతున్నరు.

నోరు మంచిదైతే ఊరుమంచిదన్నట్టు ఎవలనో బతిమాలుతుండు. ఎవలనో

అడుక్కత్తుండు భూమయ్య. మామలిద్దరూ పగబట్టింద్రని తెలిసినంక ఊరు ఊరంతా భూమయ్యను పాపమంటున్నరు. అందరూ భూమయ్యకు దగ్గెరై పోయింద్రు. భూమయ్య కూడా ఎవలు ఏది చెప్పినా కాదనకుంట చేసిపెడుతున్నడు.

ఎవల ఇంట్ల ఏదైనా కార్యం బడితే పిలిచినా పిలువకపోయినా వెళ్లి నిలబడుతుండు. కట్టె పిడుకలు జారేత్తుండు. సావయితే సందమయ్యేదాక నిలవడుతుండు. పీనుగును మోత్తుండు. కొద్దికొద్దిగా చెట్ల మందుల గురించి తెలుసు భూమయ్యకు. వైద్యునిగా కొత్త అవతారమెత్తిండు. తెలిసినచెట్లతోటి గోజలకు మనుషులకు మందులు పోస్తూ అందరికీ దగ్గెరి వాడైపోయిండు. గడ్డివాము అడుగుకు పొగాకుపెట్టి ఎండబెట్టిండు. పొగాకు చేసుడు మామ తోనే నేర్చుకున్నడు.

అడిగినవాళ్లకు లేదనకుంట పొగాకు ఇస్తున్నడు. కాళ్లు ఇరిగితే కట్లు కడుతున్నడు. కైకిలిగంబడి చేసి కొంత అప్పుజేసి రెండు ఎడ్లను కొనుక్కున్నడు.

చేతుల బండి, ఎడ్లు. ఎటుపోయినా బండిగట్టుకుని ఎల్లవ్వను కూసోబెట్టుకుని పోతున్నడు. బావమరుదులు ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ అడ్డుకుంటనే ఉన్నరు. ఏపని చేసినా తెల్లారే సరికి అది ఉంటదన్న నమ్మకం పోయింది భూమయ్యకు.

ఏదో బెదిరిస్తే వెళ్లిపోతాడనుకుంటే ఇంకా మొండిగా ఉండుడుతో వాళ్లకు కూడా పట్టుదల పెరిగింది. ఇంతకింతకు ఎక్కువనే చేస్తున్నరు. ఎట్ల దొరికితే అట్ల దెబ్బతీస్తున్నరు.

వరి కరుకుకు వచ్చింది. ఉలువ పూతకు వచ్చింది. రాత్రోరాత్రి నాలుగు దొడ్ల గోజలను తీసుకపోయి నిలబడి తొక్కిచ్చింద్రు మామలు. ఇది తెలువక తెల్లారి పోయేసరికి ఏముంది. ఆరుగాలం కష్టపడి చేసింది అడుగంటి పోయింది. మొలుకలను మొదటికే కొరికినయి గోజలు. తుక్కుతుక్కు తొక్కినయి.

ఎల్లవ్వ భూమయ్య పొలాన్ని చూసి ఏడ్వనిదేగాదు. 'ఎట్లా...ముండకొడుకులు నెగులనియ్యరు. నోట్లెకచ్చింది పాడుజేసిరి. ఇప్పుడేం చేద్దాం' అనుకున్నరిద్దరు. చేసేదేంలేక తొక్కిన మొక్కలను లేవట్టి ఆవుల అడుగు అచ్చులను కూడుపుకుని మొండి మొలుకలనే పోదన చేసుకున్నరు.

అటో ఇటో పంట సగానికి సగం తగ్గినా వచ్చిన పంటనే అమృత్తమనుకొని కోతకోసి కుప్పపెడితే, రాత్రికిరాత్రే కుప్పను అంటువెట్టింద్రు. వడ్లకట్టల కుప్ప, ఉలువకాయలకుప్ప, తెల్లారేసరికి బగ్గున మండి బూడిదయింది. చేతికందిన పంటగూడా ఇంటికిరాలేదు. ఎల్లవ్వ సోకం పెట్టుకుని ఏడ్చింది.

'ఎట్లా..ఏంజెద్దాం..ఆరుగాలాలు చేసింది అగ్గిపాలయింది గదా.. ఏం తిందాం' అన్నది ఎల్లవ్వ ఏడుస్తూ.

'ఏం తింటం..మనది వాళ్లు కాలవెట్టింద్రు..వాళ్లది మనం తెచ్చుకుందాం'. అని రాత్రికి రాత్రి లింగంను ఎంటవెట్టుకుని నాలుగు ముల్లెల కంకులు తెచ్చిండు







భూమయ్య. ఇంకోనాడు నాలుగు ముల్లెల వరిగొలుకను కోసుకొని వచ్చిండు. వాళ్ల చేన్లల్ల ఏపంట ఉంటే ఆ పంట తెల్లారేసరికి ఇంట్లకు మోత్తుండు భూమయ్య.

ఎండకాల మచ్చింది. పొయ్యిల కట్టెల దినం. నలుగురు బామ్మరుదులు ఇద్దరు మామలు భూమయ్య కావలే కాత్తున్నరు. ఎక్కడ కట్టెలు కొడితే అక్కడ మాయం జేత్తంద్రు. ముందటి లెక్కన కట్టెలు దొరుకుత లెవ్వు ఇప్పుడు. పొయ్యిలకు కట్టెలు కరువయినయి.

ఒకనాడు రెండుబండ్ల పొయ్యిలకట్టెలు కొట్టి జూడు వేసిండు భూమయ్య. తెల్లారేసరికి ఒక్కకట్టె లేదు. ఇంకోనాడు మల్ల రెండు బండ్ల కట్టెలు కొట్టిజూడు వేసిండు భూమయ్య. రాత్రిపూట ఒక బోకె, బోకె నింద బొగ్గులు తీసుకుని కట్టెలకుప్ప దగ్గెరికి పోయిండు. జకమొక దూదికొట్టి బోకె బొగ్గులల్ల పెట్టి ఇసురుకుంట కూసున్నడు భూమయ్య.

నడిజామురాత్రి దాటింది. కరకరమని బండ్ల చప్పుడు వినిపించింది. చీకట్ల కనిపించలేదు గానీ చప్పుడునుపట్టిరెండు బండ్లని గ్రహించిండు భూమయ్య. అప్పటికి బోకెల అగ్గి రగరగమంటుంది.

బండ్లు కట్టెల జూడు దగ్గరికి వచ్చి ఆగినయి. జూడు నడుమల దాక్కున్నడు భూమయ్య.

"ఇలిటపోడు జూసినావురా..నిన్న మనమే ఎత్తుకపోయినమని తెలువది. మల్లా ఇక్కడనేజూడు వెట్టిండు" అన్నడు ఇత్తారి.

"ఒక్కటేనాడు రెండుబండ్లు కొట్టిండు. మనం ఇద్దరంకొట్టినా బండెడు కొట్టకపోతిమి." కొండయ్య అన్నడు. మాటల్ని బట్టి ఇద్దరు మామల పెద్ద కొడుకులు వచ్చింద్రని గ్రహించిండు భూమయ్య. బండ్లను ఇడిసి చెట్టుకు ఎడ్లనుకట్టేసి ఇద్దరూ కట్టె జూడు దగ్గరికి వచ్చింద్రు.

ఇద్దరూ కట్టె ఎత్తేటప్పుడు జూడు నడుమల నుంచి లేచి కట్టెలపైకి ఎక్కి ఇద్దరూ పట్టుకుని ఎత్తుతున్న మొద్దు మీద దుంకిండు భూమయ్య.

'ఎ...య్...మింగుతా..' అన్నడు భూమయ్య అరుస్తూ.

ఇద్దరూ గజ్జుమన్నరు. చిమాన చీకటి. నిండా తెల్లటి దోతి కప్పుకున్నడు భూమయ్య. చేతుల అగ్గి బోకె ఉంది. అటూ ఇటూ తిప్పుతున్నడు.

'వావ్వా.. దయ్యంరా..సత్తిమిరా' అన్నడు ఇత్తారి మొద్దును కింద పడేసి. కొండయ్య గూడా కీకపెట్టి మొద్దునుకింద ఎత్తేసిండు. ఇద్దరూ పరుగందుకున్నరు. బోకెలున్న అగ్గిని వాని మీద కొంత వీనిమీద కొంత కుమ్మరిచ్చిండు భూమయ్య.

ఇద్దరికీ అగ్గినిపుకలు మీదవడి పెయ్యికాలింది. ఆ భయంలో ఏదీ తెలువలేదు. అక్కడ పరుగు అందుకున్నరంటే ఇంటికి వచ్చేదాక ఎనుకకు మర్రిసూడలేదు. ఇంటికి వచ్చినంక చూస్తే పెయ్యినిండా పొక్కులు పొడిచినయి. వాళ్లకు బుగులు జరం అందుకుంది. వారం దాకా మంచంల నుంచి లెవ్వలేదు. నిద్రల భయంతో కేకలేసుడు, లేచిలేచి ఉరుకుడు

వెట్టిండ్రు. చీకటి పడితే చాలు భయం భయం అంటున్నరు.

ల్యాతకోపుల దయ్యముందని అందరికీ తెలిసిపోయింది. అది దయ్యంగాదు భూమని పనే అని మామలకు తెలుసు. తెలిసినా నోరు ఎత్తుతలేరు. 'ఒప్పక ఒకన్ని కొడితే తప్పక తనకే తలుగుతది.' అని మొఖం సాటుకు అనుకుంటున్నరు.

వారం పదిరోజులకు వాళ్లిద్దరు లేచినా బెదిరి బెదిరి చూస్తండ్రు. చీకటిపూట బయటకు రావాలంటెనే భయపడుతున్నరు. తొండ బల బలాంటే సాలు. ఉరుక తలుగుతున్నరు.

ఈ నడుమ భూమయ్య ఒక బర్రెను కొన్నడు. బర్రెపాలు ఒక్కనాడు పిండింది లేదు. పొద్దున తప్పితే రాత్రి, రాత్రి తప్పితే పొద్దున ఎప్పుడో ఒకప్పుడు బర్రెను విడిచి పెడుతున్నరు మామలు. బర్రెను చేతికి దొరుకనిస్తలేరు.

మొదట ఇది ఆటలెక్క ఉన్నా రానురాను భూమయ్యకు ప్రాణ సంకటమయింది. వాళ్లు ఆరుగురు అయిండ్రు. తాను ఒక్కడయిండు. ఎప్పుడేమయితుందో తెలుస్తలేదు. బండి కట్టిన్నాడైతే ఇంటికి చేరేదాకా భయమే ఉంది. ఏతాడు తీసిండ్రో, ఏశీల తీసిండ్రో తెలుస్తలేదు. ఒకసారైతే నొగలశీల ఊడవీకిండ్రు. నిండుబండి దిగుజాలకు కిందవడ్డది. కొద్దిల సావుతప్పింది.

ఆయిటి మూనింది. మల్లాకొట్లాట మొదలయింది. ఈసారి ఆరుగురు భూమయ్య మీద కట్టెలతో రాళ్లతో దాడి చేసింధ్రు. దూరం నుంచే రాళ్లతో ఇసిరిసిరి కొట్టిండ్రు. తల్లి ముగ్గురికి దెబ్బలు తలిగినయి. రక్తాలు కారినయి. ఏడ్సుకుంట ఇంటికి పోయిండ్రు.

ఆ ఇంటి మీద కూడా రాళ్లతో దాడి చేసింధ్రు. గూన పెంకలు తుక్కు తుక్కు పలిగినయి. వాన నీళ్లు మొత్తం ఇల్లు నిండినయి. ఇల్లు జల్లెడ అయింది.

ఎల్లవ్వ భూమయ్యలిద్దరూ భయంలో పడ్డరు.

'ఎట్లా.....ఏంజెద్దాం. మనను బతుకనిచ్చేతట్టులేరు. పోరన్నిబాయిలేసి నేను బాయిలవడుత.' అంటూ ఏడుపందుకుంది ఎల్లవ్వ.

భూమయ్యకు గూడా ఎటూ తోచలేదు.పెద్ద మనుసులందరికీ చెప్పుకున్నడు. మల్లయ్య కాందారి రాజయ్య మనిషి అని ఎవలూ ముందుకు రాలేదు.

కాందారినే కలిసి బతిలాడుదామని భూమయ్య, ఎల్లవ్వ, ఇద్దరూ కాందారి రాజయ్య దగ్గెరికి పోయిండ్రు. "నువ్వు ఆడివిల్లవు. నీకు పాలు లేనేలేదు. ఎక్కడిది పాలు....ఇంకోసారి పాలు కావాలని కొట్లాడితే లాత్ఖనికి కట్టేసితంత" అన్నడు భయపెడుతూ.

కాందారి రాజయ్య ఈ విషయం అన్నట్టు అన్నదమ్ములకు తెలిసిపోయింది. వాళ్లకు ఏనుగంత బలమచ్చింది. దాడి ఎక్కువ చేసింధ్రు. ఇంటి మీదికి వచ్చి ఇవుతలికి గుంజి కొట్టిండ్రు. నలుగురు కోడండ్లు వచ్చి వాకిలి ఊడ్చి సానుపు సల్లిండ్రు. ఇల్లు





మాదేనని ఇంట్లో కూసున్నరు. పొలం దిక్కు కాదుగదా....ఇల్లు దాటనిస్తలేరు.

అందరు కలిసి ఒకనాడు కుండ బోకె బట్టలు తీసి బయటవేసింధ్రు. అందరు కలిసి ఇల్లుకు తాళం వేసింధ్రు. ఎల్లవ్వకు నిలువ నీడలేకుండ అయింది. బర్రెపాకల కూసుండి పొంటెజాము సోకం బెట్టింది.

మా ఇంటిముందు సోకం పెడుతవని తిడుతూ ఎల్లవ్వను బజార్లకు గుంజుకచ్చిండ్రు. భూమయ్య బీరిపోయిండు. కుండ, బోడి, గంపల సదిరిండు. ఎల్లవ్వ నెత్తి మీద ఎత్తిండు. కొడుకును ఎత్తుకున్నడు. సక్కగ తొవ్వ వట్టిండు. మోటబాయి గుంజుకున్నప్పుడు మామ పట్టిన తొవ్వ యాదికచ్చింది భూమయ్యకు.

'అబ్బా....ఇప్పుడు కదిలిందురా....పీడవోయింది' పెద్దమామ అన్నడు.

"ఇక్కడ అయ్యవ్వ సంపాయించిండని వచ్చిండు.....అబ్బితె దొబ్బుదా మనుకున్నడు. కానీ మనం అబ్బనియ్యలేదు". చిన్నమామ అన్నడు.

"మల్లత్తే పొలిమెరలనే పాతర వెడుత" పెద్ద బావమరిది అన్నడు.

ఈ మాటలను వినుకుంటనే కదిలిండు భూమయ్య. ఆడిబిడ్డ ఎల్లవ్వ ఏడుసుకుంట గంప నెత్తిమీద పెట్టుకుని నడుత్తుంటే ఊరు ఊరంతా బాధపడ్డరు.

"అయ్యో బిడ్డా........నిలువ నీడలేకుంట జేసిరా" అంటున్నరు.

"అయ్యో....అన్నదమ్ములు నెగులనిత్తలేరట. పాలు ఇయ్యిమంటే ఇయ్యక సామాన్లు నెత్తిమీద వెట్టి ఎల్లగొడుతున్నరట" అన్నరు.

భూమయ్య ఊరు దాటిండు. పగటి యాల్లవరకు లింగన్నపేటకు చేరిండు. సక్కగ దొరవారి గడీలకు పోయిండు. గడీల ఒక మూలకు పొయ్యి పెట్టిండు.

గడీల దొర వచ్చేవరకు వారం దాటింది. ఈవారం రోజులు గడిని ఊడ్సుకుంట సల్లుకుంట ఉంది ఎల్లవ్వ. భూమయ్య పెరడంతా తవ్విండు.

వారం దాటినంక దొరవచ్చిండు. భూమయ్యను చూసిండు.

"ఎవడురా వాడు" అని జవాన్లను అడిగిండు.

"మల్లెడప్యాటోడు దొరా...అన్నదమ్ములు నెగులనియ్యలేదట. ఇలిటమచ్చిండట." అన్నరు జవాన్లు.

"అరే....ఎంకని అల్లుడు గదారా.....తొక్క భూమడు. వాన్ని ఇటు రమ్మను" అన్నడు దొర.

భూమయ్య వచ్చి దొర కాళ్ల మీద వడ్డడు. కతంతా చెప్పుకున్నడు. ఎల్లవ్వ కొడుకును దొరకాళ్ల మీద వేసి తనూ మొక్కింది. "అయ్యా బాంచెను.....నన్ను బతుకనియ్యరు. మీ వాకిలి ఊడ్సుకుంట ఇక్కడనే బతుకుత బాంచెను. నన్ను బొండిగె పిసికి బాయిలేత్తనన్నరు" అన్నది ఎల్లవ్వ ఏడుస్తూ.

"బాంచెను దొరా...నా పుర్రె పలుగ్గొట్టిండ్రు. రాళ్లతోని గొట్టిండ్రు. సంటిపోరన్ని

సూదకుంట కట్టెలతోని కొట్టింద్రు" అన్నడు భూమయ్య. నెత్తిమీద బర్రను ఈపుల వాతలను సూపిచ్చిండు. వెంటనే దొర ఇద్దరు జవాన్లను తోలిండు. జవాన్లు గుర్రాల మీద పోయింద్రు.

"అబ్బ...ఇలిటపోని పీడవోయిందిరా" అనుకుని ఎవల చేను వాళ్లు దున్నుకుని ఎవల ఇత్తునం వాళ్లు ఏసుకుంటుంద్రు అన్నదమ్ముల కొడుకులు. జవాన్లు తుపాకులేసుకుని పొలం దగ్గెరికి పోయింద్రు.

దొర జవాన్లు వచ్చింద్రనంగనే ఎల్లయ్యకు, మల్లయ్యకు నవనాడులు సల్లవడ్డయి. జవాన్లకు కనవడకుంట తప్పించుకుని కాందారి జాడల పోయింద్రు. అన్నదమ్ములిద్దరికి భయపడవద్దని చెప్పి జవాన్లకంటే ముందుగనే గడీలకు తోలుకపోయిండు కాందారి రాజయ్య.

ముగ్గురూ దొరముందు చేతులు గట్టుకుని నిలవడ్డరు.

"ఏంరా....మల్లిగా.....ఎందుకచ్చినవురా....."అన్నడు దొర

"దొరా......మీరే రమ్మన్నరట........"నసుగుతూ అన్నడు మల్లయ్య.

భూమయ్య, ఎల్లవ్వ, కొడుకు ఎంకన్న దూరంగా నిలబడి చూస్తున్నరు.

కాందారి రాజయ్యనే కలుగజేసుకుని "దొరా......మోటబాయి ఎంకడు లేకుండెనా..... వాడు అల్లున్ని ఇలిటం తెచ్చుకున్నడు. వాడు వీళ్లను నెగుల నిత్తలేడు. అన్నదమ్ముల మీద అగ్గినిపుకలు పోసిండు....." అంటూ సదిరి చెప్పబోయిండు. దొరపక్కనే హంటర్ వుంది. హంటర్ అందుకున్నడు దొర. కొంకుల మీది నుంచి రెండు గుంజిండు.

'అవ్వా...'అన్నడు కాందారి రాజయ్య. కండ్లపొంట టపటప నీళ్లురాలినయి.

'తేరి అర్రాం మారో.....ఊర్లెఉండి ఇదే పని జేత్తున్నవురా.....' అన్నడు దొర కోపంగా.

ఎప్పుడైతే దొర చేతిల హంటర్ లేచిందో అప్పుడే అన్నదమ్మలిద్దరూ సల్లవడ్డరు. ఎల్లయ్యకు కొంకులపొంట పంచితం రాలింది. మల్లయ్యకు వణుకు మొదలయింది.

దూరంగా ఉన్న భూమయ్యకు నవ్వు ఆగుతలేదు. ఎల్లవ్వకైతే పాణం ఆయిమంటుంది.

"మల్లిగా....ఎంకడు ఏమైతడురా........" దొర అడిగిండు.

'తమ్ముడు దొరా.....' మల్లయ్య వణుక్కుంట చెప్పిండు.

"వానికి పాలు లేదారా....."

"ఉంది దొరా......"

భూమయ్యను పిలిచి "వీడెవడురా...." అడిగిండు దొర.

"అల్లుడు దొరా......."

"మరి వీనికి పాలు లేదన్నరటగదరా...."

"అనలేదు దొరా.....ఆయిననే మా మీదికి మర్రవడ్డడు"





"ఎందుకు మర్రవడ్డదురా...."

ఇద్దరి దగ్గెర సమాధానం లేదు. 'కాందారి...నువ్వు చెప్పురా' అన్నడు రాజయ్యతో దొర.

"నాకు తెలువది దొరా.....వాళ్లువాళ్లు ఏమనుకున్నరో...." అన్నడు రాజయ్య.

"ఒరే భూమా.....ఇటు రారా" దొరపిలించిండు.

భూమయ్య దగ్గెరికి వచ్చిండు. చేతులు కట్టుకుని వంగి వంగి నిలవడ్డడు.

"మల్లిగాన్ని జాడిచ్చి తన్నురా....." అన్నడు దొర.

"దొరా...నన్ను ఉంచదుదొరా.....సంపుతడు" భయాన్ని నటిస్తూ అన్నడు భూమయ్య.

"నిన్ను ఎవలు ఏమనకుంట నా జిమ్మదారు.....గట్టిగ తన్ను" అన్నడు దొర.

భూమయ్య అనుమానంగా చూస్తుంటే "నువ్వు వాన్ని తంతవా....నేను నిన్ను తన్నాలెనా" అన్నడు కాలు లేపుతూ దొర.

"తంత బాంచెను తంతా...." అని గోశిని ఎగజెక్కి జాడిచ్చి తన్నిండు భూమయ్య.

మల్లయ్య ముక్కు మూడ్సుకపడ్డడు. 'అదే కాలుతో వీన్ని తన్ను రా' అన్నాడు దొర ఎల్లయ్యను చూపిస్తూ. అదే ఊపుతో తన్నుడు తన్నిండు భూమయ్య. మల్లయ్య లేసిండో లెవ్వలేదో ఎల్లయ్య మల్లయ్య మీద పడ్డడు.

ఎల్లవ్వ నవ్వును ఆపుకుంటుంది. ఎంకన్న మాత్రం పక్కర పక్కర నవ్వుతుంటే ఎల్లవ్వనే దగ్గెరికి తీసుకుని నోరుమూసింది. హంటర్ అందుకున్నడు దొర. అన్నదమ్ములిద్దరిని రెండు గుంజిండు. ఇద్దరు కీసుమన్నరు.

"అరేయ్....నీ బిడ్డయినా బిడ్డనే......అన్న బిడ్డయినా బిడ్డనే.....అల్లుడురా వాడు. అల్లున్ని కొడుతారురా.....కాల్లు మొక్కుంద్రి గాడిది......." అన్నడు దొర.

ఇద్దరూ భూమయ్య కాళ్లమీద పడ్డరు.

దొర కాందారి దిక్కు చూసిండు. కాందారి సర్దుకుని నిలబడ్డడు. "అరే...భూమా .... కాందారిగాడు ఏమన్నడురా...." అని అడిగిండు దొర.

"అయ్యా.....ఇలిటపోనికి పాలులేదు పోరా అన్నడు దొరా"......భూమయ్య అన్నడు.

"అవురా కాందారి.....నాకు గూడా ఒక్కతే బిడ్డ. ఇలిటం తెచ్చుకున్న. నా అల్లున్ని గూడా ఎల్లగొడుతవారా......." అన్నడు.

కాందారికి భయమయింది. "ఆ....దొరో.....మీకాలు చెప్పసొంటోన్ని. నేను అంటనా దొరా...." అన్నడు.

"వీళ్లకు ఏ లొల్లి కొట్లాట లేకుండా పంచోటికం చెయ్యి. భూమనికి గుంటెడు తక్కువ ఇచ్చినా సరే. లొల్లి కొట్లాట చెయ్యకుంట సూడు. వాళ్లకు వీనికి పొత్తువెట్టకు....." కాందారితో అన్నడు దొర.

"సరే దొరా....పంచోటకం చేస్త". కాందారి అన్నడు దొరతో.

వెంట ఇద్దరు జవాన్లను పంపిండు దొర. జవాన్లు ఇద్దరినీ సోపతి చేసుకున్నడు భూమయ్య. ఊర్లెకు రాంగనే పెద్దీరయ్య దుకాణం దగ్గెర ఆగి 'అయ్యా........ఈ సావుకారే.......నా ఆవులను మలుపుకున్నడు' అని చెప్పిండు వాళ్లతో.

జవాన్లు ఇద్దరూ తుపాకులతోని పెద్దీరయ్య ఇంట్లకుపోయి ఈరయ్యను గుంజుకచ్చింండ్రు. నాలుగు తన్నింండ్రు. తుపాకులు, జవాన్లను చూసేసరికి ఈరయ్య గొసిబట్ట నానింది.

"అయ్యా బాంచెను కాళ్లు మొక్కుత. మీకు కుడుకమోడి పెడుత. బెల్లం ముద్దలిత్త. నన్ను కొట్టకుండ్రి" అని కాళ్లమీద పడ్డాడు.

"అరేయ్ ఆవులను ఎందుకు మలుపుకున్నవురా....." జవాన్ అడిగిండు.

"అయ్యా బాంచెను. వీళ్ల మామలే చెప్పింండ్రు. వాళ్లే ఏలుముద్రలేసింండ్రు" ఉన్న విషయం చెప్పిండు సావుకారి.

సావుకారిని బెదిరిచ్చి కుడుకలు, బెల్లం, పుట్నాలు మోడి తిన్నరు జవాన్లు. ఇంకోసారి ఇటువంటి పని చెయ్యనని ముక్కును నాలెకు రాపిచ్చి ఇడిసి పెట్టింండ్రు. అసలే కోమటి. అందునా పుట్టెడు పిరికి. పసురం వణికినట్టు వనికిండు సావుకారి.

భూమయ్య తనకు ఎవలెవలు పగ ఉన్నరో వాళ్లందరి పేర్లు చెప్పిండు. జవాన్లు ఇల్లిల్లు తిరిగి జోపుడు జోపింండ్రు. బామ్మరుదులు నలుగురు ముందే తప్పిచ్చుకున్నరు. అత్తగారి ఇండ్లకు పారిపోయింండ్రు.

భూమయ్యతో మాట్లాడని వాళ్లు మాట్లాడుతున్నరు. దూరమున్న వాళ్లంతా ఎక్కడ మాపేరు చెప్పుతడని దగ్గెరవుతున్నరు.

తెల్లారే భూముల పంచోటుకం జరిగింది. మనిషికి ఇద్దరు చొప్పున ఆరుగురు పంజులను కోరుకున్నరు. భూమయ్య దొర మనిషి అని తెలిసినంక సాదకబాదకాలు భూమయ్య చెప్పుకోకపోయినా పంజులే ఆలోచిస్తున్నరు. వాళ్లు కోరుకున్న పంజులైనా భూమయ్య దిక్కే మాట్లాడుతున్నరు.

వాళ్లు అయ్యలతోని ఆరుగున్నరు. వీడు ఒంటిగాడు. ఎవుసం ఎల్లదని భూమయ్యకు మోటపొలం ఇయ్యాలనుకున్నరు. పసలు పసలుకు ఎటూ తిరుగుడు లేదు. ఎవనిది వాడు దున్నుకోవాలన్నరు.

మల్లయ్య ఇద్దరు కొడుకులకు గుట్టకింద చెరిసగం పంచింండ్రు. బాయిల గూడ సగానికి గోడ వెట్టుకుని రెండు మోటలు పెట్టుకొమ్మన్నరు. ఎల్లయ్య కొడుకులకు పూలదొయ్యలు రెండు పాల్లు చేసింండ్రు. చెరువు పారుకం మాత్రం పొత్తుల దున్నుకోవాలన్నరు.





"అయ్యా....నాకు పొత్తు పెట్టకుండ్రి. నన్ను యాడనో బురుదల తొక్కి సంపుతరు." అన్నడు భూమయ్య.

మూడెకరాల పొలంల పాళ్లుపెట్టరాదని, ఎల్లయ్య కొడుకులు ఒక యాడాది, మల్లయ్య కొడుకులు ఒకయాడాది, భూమయ్య ఒక యాడాది దున్నుకోవాలని చెప్పింండ్రు. ముందుగా పసలుకు ఒక్కలె దున్నుకోవాలనుకున్నరుగనీ కట్టె, పెండ వేసుకుంటరుగదా అని యాడాదికొకలు దున్నుకోవాలన్నరు. చెరువు పారుకంకు కాలువ వుంది. మొత్తం నీరావ పంట వరే పండుతుంది.

పంచోటుకం కుదిరింది. పంజులు,మల్లయ్య, ఎల్లయ్య మందల నుంచి భూమయ్య ఆవులను మలిపింండ్రు. ఆ రోజు ఇల్లునంత శుద్ధిచేసుకుని, అలుకుపూత చేసుకుని దొరపేరు చెప్పుకుని దీపం పెట్టి మొక్కుకుంది ఎల్లవ్వ.

దొడ్డి నిండా ఉండే గోజలు సగమయినయి. అయినా తనయి తనకు దొరికినందుకు సంతోషంగా ఉంది భూమయ్యకు. అందులో నాలుగైదు ఆవులు నోగులు వడ్డయి. రెండు ఈడ్సుకపోయినయి. కోడెలకు దొక్కలు తేలినయి. ఈడ్సుకపోయిన ఆవులకు మినుములు బెల్లం,తౌడు, ఉప్పు, నొగులు వడ్డ ఆవులకు మంగచెక్క మంచినూనె దంచి ముద్దలు గట్టి గొట్టంతో కడుపులకు పోసిండు. తన అన్నల దగ్గెరికి పోయి రెండు బండ్ల మక్కసొప్ప వరిగడ్డి తెచ్చుకున్నడు భూమయ్య.

నెల్లాల్లు తిరక్కుంటనే ఎడ్లులెంకలు గొట్టినయి. ఆవులు ఎదునకచ్చినయి. కొల్యాగ దూడలు మారేత్తున్నయి. రోజు నాలుగు మోపుల పచ్చిగడ్డి కోసి ఆవులకు, ఎడ్లకు ఏత్తుండు భూమయ్య. దొడ్డికాడనే పొద్దుగూకుతుంది, తెల్లారుతుంది.

భూమయ్య గోజలను చూసి మామలు కొడుకులను తిడుతున్నరు. కొడుకులు తెలిసికొంత, తెలువక కొంత ఏదేదో చెక్కమందులు దంచుతున్నరు, పెడుతున్నరు. ఆ మందులు తిని గోజలు మరింత నొగులుపడి దొక్కలు తేలుతున్నయి.

ఎటుపోయినా ఎక్కడ దున్నినా అన్నదమ్ములు నలుగురు కలిపి దున్నుకుంటున్నరు. కలిసిపోతున్నరు. యారాండ్లు నలుగురు కలిసి పనిచేసుకుంటున్నరు.

అదే ఏడు ఊర్లెకు బట్టుపంతులు వచ్చిండు. ఇంట్లసోపాల వెట్టిండు. సదువు చెప్పుతుండు. భూమయ్య ఎంకన్నను బట్టుపంతులుకు పట్టిచ్చిండు. పెద్దది చెక్క పలుక చేయించిండు. పలుకను మొయ్యలేక తాడు గట్టి బజారుపొంట గుంజుక పోతుండు ఎంకన్న. పలుకకు ఆకుపసరు పూసుకుంటున్నడు. బొగ్గులతోని పలుక మీద రాత్తండు. నెలకు సోలెడు బియ్యం ఏకానపైసలు.

ఇత్తారి కొడుకును ముందుగనే పంపిండు మల్లయ్య. పెద్దమామను చూసి వాళ్ల మనుమలు చదువుకుంటరు. నా కొడుకు ఎందుకు సదువుకోవద్దని పట్టుదలగా పంపిస్తున్నడు భూమయ్య.

'సదువెందుకు. సదువుకడుపులకు పెడుతదా....ఎంబడ తోలుకపో.....ఎడ్లకో నాగలికో అందుతడు' అంటుంది ఎల్లవ్వ. భూమయ్య మాత్రం ఎల్లవ్వ మాటలను పట్టించుకుంట లేడు.

బట్టుపంతులుకు కట్టెలు, పిడుకలు, కూరగాయలు, అడివిల ఏ కాయ కనవడితే ఆ కాయను ఇస్తున్నడు భూమయ్య. పంతులుకు ఎంకన్న మీద అభిమానం పెరిగింది.

ఎల్లయ్య కూడా ఒక మనుమన్ని బట్టుపంతులకు పట్టిచ్చిండు. ఇద్దరన్నదమ్ములు ఊర్లె పెద్దమనుసులయింద్రు. బట్టు పంతులును బెదిరించి తమ మనుమలకు మంచిగ చదువు చెప్పమంటున్నరు. భూమయ్య మాత్రం పంతులు కడుపును జూత్తుండు. యాడాదిలో ఎంకన్న అందిరికంటే ముందున్నడు.

మోటబాయికాడ తీరొక్కపంట తీత్తండు భూమయ్య. మూడేండ్లకు చెరువు పారుకం చేతికి వచ్చింది. దున్ని నాలికరాములు వడ్లను అలికిండు. వరి కలుపుకు వచ్చింది. కలుపు తీసుడుకు కైకిలోల్లను పిలిచింది ఎల్లవ్వ. కలుపు తీస్తుంటే చేతులకు తాటిపేళ్లు గుచ్చుతున్నయి. ఒక్క మునుము కలుపు తీసేసరికి చేతులకు రక్తాలుకారినయి. తాటిపేళ్లు సూదుల లెక్కనే ఉన్నయి.

"చెడగొట్టు ముండ కొడుకులు తాటిపేళ్లు చల్లింద్రు. అప్పుడు యాసంగి పంటమీదనే సల్లినట్టున్నరు. మొత్తం షాగవారినయి....కుక్కతోక సక్కగైతదా అన్నట్టు వీళ్ల గుణం మారుతదా....కులం కొత్తగ వత్తదిగనీ గుణం కొత్తగ వత్తదా...." అని తిడుతుంది ఎల్లవ్వ.

కైకిలోళ్లు మాత్రం ఒడ్డుమీదికి ఎక్కింద్రు. "అవ్వా....నీ చేనువద్దు కైకిలి వద్దు. పెరుగు పెరుగోలె బురద ఉన్నది. మెత్తగ కదులుతుందని చెయ్యి ఆడిత్తే పేళ్లు ఏల్లకు గుచ్చుతున్నయి. పొద్దంతా ఈ బురుదలనే కలుపుతీత్తే మాచేతులు పుండయేది ఖాయం. రేపటి నుంచి కైకిలు పోకుంటయితది." అంటూ సదిరి చెప్పినా వినకుంట చేతులు ఊదుకుంట వెళ్లిపోయింద్రు.

ఎల్లవ్వ భూమయ్యలిద్దరే మిగిలింద్రు. ఎక్కడ ఏ తాటిపేడు గుచ్చుతదోనన్న భయం. మెల్లెమెల్లెగా బురద నీళ్లను గెలుకుతూ కలుపుతీస్తున్నరు. ఎంత మెల్లెగ తీసినా పేళ్లు చిగుర్లల్ల గుచ్చుతున్నయి. పాలియాళ్ల వరకు నిజంగనే చేతులు పుండ్లయినయి. మళ్లీ కలుపుకు దిగలేదు.

భూమయ్యకు కోపం వచ్చింది. రాత్రిపూట పిడికెడు పుట్నాలను నలుగురి ఇండ్లమీద చల్లిండు. పుట్నాల కొరకు కోతుల దండు మొదలయింది. పైకప్పుగూనలన్నీ పెకిలించినయి. పుట్నాలను ఏరినయి. వానగొడితే ఇల్లు మొత్తం అలుకుడు కుండలయినయి.







పొత్తుల చేనుకు యాసంగి నాటువేసే ముందు బురదల జువ్విమొద్దులను నాటిండు భూమయ్య. అవి బిర్రబిగుసుకున్నయి. మళ్లీ వంతు వచ్చేది పెద్దబావమరిదికి. వాళ్లు కలిపే దున్నుకుంటరు. సాలు పెట్టేటప్పుడు సాలుకు అడ్డంపడిన జువ్వి మొద్దులకు నాగండ్లు మొత్తం ఇరిగినయి. అడుగడుగునా మొద్దులే. 'దెబ్బకు దెబ్బతీసిండురా' అనుకున్నరు. ఎవ్వలతో ఇట్లా అని చెప్పుకోలేదు.

'అబ్బో....ఇలిటపోనితో పెట్టుకోవద్దురో దెబ్బకు దెబ్బ తీస్తడు' అనుకున్నరు నలుగురు.

వాళ్లు బండ్లతో ఎరువును జారబోత్తే భూమయ్య ఒక్కడే గుమ్మితో ఎరువును మోత్తుండె. నలుగురు లేవట్టినా లెవ్వని గుమ్మిని ఒక్కడే నింపుకుని ఎత్తుకుంటుండె. వాళ్లు బండ్లతో గొట్టిన ఎరువుకు సమానంగ ఎరువును మోత్తుండె.

వడ్లు జారేసేటప్పుడు కూడా అంతే. వాళ్లు ఎడ్లుసదిరి, బండ్లు సదిరి ముల్లెలు గట్టి పెట్టేసరికి భూమయ్య సగం వడ్లు మోత్తుండె.

వాళ్లు వీళ్లు 'తోటోడు జూడు మీరుజూడు. మీరు మూట ముల్లెలు సదిరేవరకే వాడుసగం మోసిండు.' అని మొఖం ముందే అంటున్నరు. బండికి ఇద్దరు. రెండు బండ్లకు నలుగురు. పట్టురో....పట్టురో అనేసరికి ఎడ్లకు సగం పాణం సత్తుండె. అయితే అనుకనైనా వేత్తుండె. లేకుంటే పండనైనా పంటుండె. ఏదీ లేకుంటే బండిపారో నొగలో ఇరుగుతుండె. యాటతాడో, కాని తాడో, తెగుతుండె. ఎవలో ఒకలకు దెబ్బలు తాకుతుండె.

ఎడ్లబండి కట్టింద్రంటేసాలు. ఇంట్ల ఆడోళ్లకు భయం పుడుతుండె. మైసవ్వతల్లీ, ఈరనుమండ్లు.....బాంచెను కాళ్లుమొక్కుత. బండి సల్లగ ఇల్లుచేరనీ' అని పబ్బతివట్టి మొక్కుదురు. ఇంటికి చేరే వరకు గజగజవణుకుదురు.

ఎల్లవ్వ నీళ్లువోసుకుంది. ఒక్కనాడు పని రికీం లేదు. కుండోలెకడుపు వెట్టుకుని నిలివెడు నిలివెడు లోతు వాగుదాటి బబ్బెర పెసర ఏరవోతుండె.

ఒకనాడు పెసర ఏరుతుంది. పట్టపగలు, పురుగులేరు. పగటియాల్లనే నొప్పులు మొదలైనయి. భూమయ్యకు చెప్పాలంటే సిగ్గయింది. పరుగు పరుగున ఇంటి మొఖం పట్టింది. వాగుదాటంగనే నొప్పులు ఇంకా ఎక్కువైనయి. ఊరు ఇంకా కోసు దూరముంది.

పక్కనే కత్తెర పొదలకు వెళ్లింది. సుట్టతాగినంతసేపట్ల కాళ్లసందుల ఆడిపిల్ల క్యావ్‌క్యావ్ మన్నది. రాయితో బొడ్డు తెగగొట్టుకుని బిగ్గెరగా గోసివెట్టుకుని బిడ్డను తట్టలేసుకుని ఇంటికి పోయింది ఎల్లవ్వ.

అయ్య వట్టిన సనువుగాదు. అవ్వవట్టిన సనువుగాదు. మూడొద్దులపురిటి ముట్టుడు తీరంగనే ఇల్లు వాకిలి అన్ని పనులు చేసుకున్నది. నెలగుడ్డును కొడుకు మీద ఇడిసిపెట్టి పనికిపోయింది. ఆరునెలలదాకా రెండుసార్లు పాలియ్యడానికి వచ్చింది.

ఇక్కడగాదు అక్కడగాదు. వాగవుతల మోటపొలంల నుంచి నాలుగుసార్లు తిరిగేసరికి నానులు అదులుతుండె.

ఎల్లవ్వకు అట్లా ఆరుగురు కానుపయింద్రు. పుట్ట పెట్ట ఎంకన్న ఒక్కడే మిగిలిండు. ఒక్కసారైతే ఇద్దరూ అముడాలపుడితే రామలచ్చుమనులని పేరుపెట్టుకుంది. నెలలగుడ్లే కన్నుమూసింద్రు.

ఇద్దరు ఎదురు కాళ్లపుట్టింద్రు. ఎదురు కాళ్లపుడితే మీద పిడుగుల పడుతయని ఇద్దరి కాళ్లకు వెండి బేడీలు వేయించింది. వాళ్లు గూడా ఏడాదిలనే కండ్లు మూసింద్రు.

ఒక కన్ను కన్నుగాదు. ఒక కొడుకు కొడుకుగాదని ఏడుస్తుంది ఎల్లవ్వ. భూమయ్య మాత్రం 'ఎందరైతే ఏందిలే.....ఒక్కడు సాలదా.....పేరుకస్తేసాలు' అంటున్నడు.

ఎప్పుడైతే ఒక్క బాయిల రెండు గెట్లయినయో అప్పుడే నీళ్ల వాడుకం ఎక్కువయింది. నీళ్లు తగ్గినయి. ఒకలు లోతు తవ్వితే, ఇంకొకకల బాయి ఎత్తిపోతుంది. అట్లా నీళ్లు మరింత లోతులవడ్డయి. పన్నెండు గజాల బాయిలు ఇప్పుడు పద్దెనిమిది గజాలు తెగినయి. ఒకలబాయిలోతుకైతే చుట్టూ ఉన్న బాయిలు ఎత్తిపోయి అందరూ లోతు పెంచుతున్నరు. ఎండకాలం వస్తే చాలు. బాయిల నిండా బర్మదెబ్బలే. ఊరినిండా సుత్తిదెబ్బల చప్పుడే.

చెరువులకు ఎప్పుడూ వాగుకాలువ వచ్చి చేరడంతో ఊర్లె ఆయకట్టు పెరిగింది. దానికితోడు ఒక ఇల్లు నాలుగైదు ఇండ్లయితున్నయి. కొడుకులు, కోడండ్లు, మనుమలు మనుమరాండ్లు దండ పెరుగుతున్నది. పెరిగిన వాళ్లు పెరిగినట్టే వ్యవసాయం పనే చూసుకోవడంతో సాగుభూమి ఎక్కువ కావలసివచ్చింది. ఊరిచుట్టూ అడివంతా ఖాళీ అయింది. గుడ్డాలన్నీ పొలాలయినయి. ఆవులమంద తిరుగుదామన్నా జాగలేకుంటయింది.

అడివివంతా ఇండ్లకు, పొయిల కట్టెలకు ఖాళీ అవుతున్నది. ఊరంచు గుడ్డాలు, గడ్డిమొలిచే కంచెలు నీరావభూములయినయి. గోజలకు నిలువ నీడలేకుంట అయినది. గడ్డి దొరుకని గోజలు వాగు వెంటనే తిరుగుతున్నయి. ఒకటి రాళ్లు తట్టి, ఒకటి ఏర్లు తట్టి, కొన్నింటికి మేత దొరుకక ఆవుల మందలు ఒకటొకటి సన్నబడుతున్నయి.

ఎంకన్న పెద్ద బాల శిక్ష పూర్తయింది. అప్పుడే ఊర్లె బడి, పోస్టాపీసు, పంచాయితి ఆఫీసు, ఆఫీసుకొకమైకు వచ్చింది. బడికి మౌలిసాబ్, చప్రాసి ఇద్దరు వచ్చింద్రు.

మౌలిసాబ్‌కు గడ్డం పెద్దగుంది. అందరూ గడ్డం సారంటున్నరు. చప్రాసి ఊరంతా తిరిగి పిల్లలను పట్టుకత్తున్నడు. చప్రాసి కనబడిండంటే సాలు. పిల్లలు పరుగుతీత్తున్నరు. ఎంకన్న బట్టుబడి నుంచి మోలిసాబ్‌బడికి వచ్చిండు.

'అరే.......భూమా......ఎంకడు బోత్ ఉషార్‌హైరే..........ఏ నవాబ్ బన్‌తేరే' అంటున్నడు ఎంకన్నను చూసి మౌలిసాబ్.





మౌలిసాబ్‌కు పాలు, పెరుగు, ఉప్పు, పప్పు, కూరగాయలు పంపుతున్నడు భూమయ్య. ఎంకన్న చదువులనే కాదు, ఆటలల్ల గూడ ముందున్నడు. చెట్టీర్క ఆడుతుంటే చెట్టు కొనగొమ్మలకు ఎక్కికూసుంటున్నడు. రేస్ ఆడితే ఎవలకూ దొరుకుతలేడు. గోటీలు ఆడితే అందరి గోటీలను దొబ్బుతున్నడు. పెద్దపెద్ద మోటబాయిలల్ల బోదర్‌మీది నుంచి దుంకి ఈతగొడుతున్నడు.

బడిలో పిల్లలను ఏడిపిత్తున్నడు. ముందట కూసున్నోళ్ల జుట్లను ముడి వేత్తున్నడు. ఎనుకనుండి అంగీలకు లాగులకు కాంటలు పెడుతున్నడు.

రంగయ్య సేటు ఇంటిముంగట తడుక కట్టుకుని గోలెం పెట్టుకున్నడు. గోలెం దగ్గెర బండ ఏసుకున్నడు. రోజు అక్కడనే తానం జేత్తున్నడు. ఒకనాడుబెల్లం అడిగితే పెట్టలేదనే కోపంతో తడుకకు, మాంకాలి మామ బర్రెకు కూరుకురాత్రేలేచి తాడు కట్టిండు ఎంకన్న.

మాంకాలి రోజూ లేచినట్టే లేచి బర్రెపాలు పిండుకుని కుడిదిపోసుకున్నడు. బర్రెకాలుకున్న పగ్గాన్ని చూడలేదు. రంగయ్య సేటు గూడా ఎప్పుడు లేచినట్టే లేచి కాలువకు పోయివచ్చి, బొగ్గుతో పండ్లుతోముకుని, బనీను దోతి ఇడిచి తానం జేత్తున్నడు. తానం చేసెటప్పుడు పెయ్యిమీద బట్టలుండయిసేటుకు. తడుకకుకట్టిన పగ్గాన్ని సేటు చూడలేదు.

ఎప్పుడైతే మాంకాలి బర్రెను ఇడిసి మందలకు గెదిమిండో, అప్పుడే తడుక బలబలమన్నది. సేటు మట్టిముంతతోని నాలుగుముంతలు మీదపోసుకున్నడు అంతే! తడుక బర్రె బజార్లవడ్డయి. బర్రెకాలును అదిలించుకుంట నడిత్తే తడుక గొరగొర ఎంబడి పోతుంది.

వాకిళ్లు ఊడ్చి సానుపు సల్లేటోళ్లు సేటును చూసి నవ్వుకుంట ఇంట్లకు పోయింద్రు. సేటు 'మాంకాలిగో....తడుకరో.....తడుకరో' అంటున్నడు.

"నేనేం జెయ్యాలె.....ఎవడో బర్రెకాలుకు గట్టిండు" అంటూ బర్రెను ఆపబోతుంటే బర్రె బెదిరి ఉరుకతలిగింది. మిగిలిన బర్లు ఆ బర్రె వెంటవడ్డయి. తొక్కుడు తొక్కితే తడుక తుక్కు తుక్కయింది.

సేటు ఇంట్లకు ఉరికితే సేటమ్మ జడుసుకుని బయపడిందట.

ఎంకన్న పెరుగుతుంటే ఇల్లు పెరుగుతుందని మురుత్తున్నడు భూమయ్య. కానీ దొడ్డి మాత్రం ఖాళీ అయితుంది. తన ఒక్కడిదే కాదు. అందరి దొడ్లు, అందరి మందలు ఖాళీ అయితున్నయి. ఆవుల దొక్కలు ఈడ్సుకపోతున్నయి.

అసలు కారణం ఎవలకూ తెలువది. పెద్ద మనుషులంతా కూసుండి మాట్లాడుకుని కాట్రేవుల దేవున్ని నిలపాలనుకున్నరు. దేవునికి ముడుపు కట్టింద్రు. ఇంటికి సోలెడు బియ్యం దొవ్వాన పైసలు వసూలు చేసింద్రు. వాగు ఒడ్డునే కాట్రేవుల గుడి కట్టింద్రు.

గుడికి సున్నం జాజుతో పూదిచ్చి ఆవు పెండతో అలికిండ్రు. పచ్చటి పందిరేసి పచ్చముగ్గు పట్టు పరిచిండ్రు.

ఊరిమందలన్నీ ఏకం జేసి ఆవుల కొమ్ములకు జాజు పూసిండ్రు. గండదీపం ఎలిగిచ్చి అన్నం ఆరం బోసిండ్రు. అన్నం పొలావు మందమీద చల్లి గుమ్మడికాయ ఆరంగొట్టి దీపం వెట్టిండ్రు. రెండు మ్యాక పిల్లలను మందచుట్టూ తింపి గుడి ముందు కోసిండ్రు. శాతల మీద పాళ్లు వేసి పెద్దమనుషులకు పంచిండ్రు.

మంద గాసేటోళ్లంతా పెండ్లాం పిల్లలతో గుడి దగ్గెరనే వంటలు వండుకున్నరు. కల్లుకుండలు దిగినయి. దేవునికి నైవేద్యం పెట్టి మందలు మంచిగుండాలని మందలు హెచ్చితే మల్లాయాడాదికి ఇంతకంటే మంచిగ పది దప్పులతో ఐదు బోనాలతో పండుగ జేత్తమని మొక్కుకున్నరు.

కారణం అందరికీ స్పష్టంగా తెలిసిపోతుంది. ఆవులు తిరుగుడుకు జాగలేక మేత దొరుకకనే మందలు తగ్గిపోతున్నయని అర్థమయితుంది. మందలను ఎక్కడ తింపాలె, ఎటు దిక్కు మేపాలన్నది మాట్లాడుకున్నరు. మందలే లేకపోతే మన బతుకు ఎట్లా......? అన్న భయం మొదలయింది అందరికి.

భూమయ్యకు అప్పుడప్పుడూ ఆలోచన వస్తుంది. ఎక్కడున్న నీళ్లు ఎక్కడికి దిగినయి? ఎట్లున్న భూములు ఎట్లయినయి? మక్కలు,జొన్నలు పండే భూములన్నీ ఇప్పుడు వరిపంటలు పండుతున్నయి. ఇట్లా...ఇట్లా నీళ్లు ఎంత లోతుల పడుతయి అని! అప్పుడప్పుడూ వాళ్లతోని వీళ్లతోని ఈ మాటలే అంటున్నడు.

ఇప్పుడు ఇంటింటికి వడ్లు పండుతున్నయి. కొద్దో గొప్పో భూమి వుంది. ఒకనాడు మోటకడుదామని పోతే బాయిల నీళ్లు అద్ద గజం కిందికి దిగినయి. భూమయ్య గుండె జల్లుమన్నది.

'నీళ్లురో...నీళ్లు.... అడుగుకువడుతున్నయి. ఎట్లనో ఏమో' అనుకున్నడు.

C C C C

అనంతయ్య పంతులంటే సుట్టు పదూర్లపెట్టు పెట్టింది పేరు. పంతులు దండి మంత్రకాడు. పారేనీళ్లను కడుతడని అందరూ అంటరు. మంత్రం చేస్తే తింపుతడట. ఇండ్లకు బందానం చేస్తడట.

పంతులు తండ్రి దినాలు. శాలకులం. తినితాగే జాతి. శింగారం తాళ్లల్ల మంచి కల్లు దొరుకుతది. పంతులుది ముచ్చర్ల. చుట్టాలు పక్కాలు వస్తరని శింగారం నుంచి మంచికల్లు తెప్పించాలనుకున్నడు. అనుకున్నట్టే దినాల నాడు పదిమందిని ఎంటబెట్టుకుని సింగారం పోయిండు.

పొద్దుపొడవక ముందే సింగారంల ఉన్నడు పంతులు. తాగినంత కల్లు తాగి, మోసిన వాళ్లకు తాగించి, మనిషికొక కల్లుకుండను నెత్తిన ఎత్తి తొవ్వ పట్టించిండు.







కొన్ని విషయాలలో మందలించినా, కాందారి రాజయ్య దొరకు నమ్మిన బంటు. ఊర్లె కాందారి పలుకుబడి రోజురోజుకూ పెరుగుతుంది. ఊర్లె దొర తరువాత దొరయ్యిండు. సంటిపిల్ల తల్లులు పగటి యాల్లన పాలియ్యరావడానికి భయపడుతున్నరు. ఏ ఆడిదన్నా ఒంటిగా కంట్లె పడితే కతం. ఆరోజు మానమో, పాణమో పోవలిసిందె.

ఇజ్జత్ దార్లు కొందరు లోలోపలనే కుమిలి చస్తున్నరు. కొందరు ధైర్యంగా ఎదురు తిరిగి పారిపోతున్నరు. కొందరైతే మనసు చెదిరి బాయిల దుంకి సచ్చిపోతున్నరు. మొత్తం మీద వయసుమీదున్న ఆడిది కాందారి కంట్లె పడడానికి భయపడుతుంది.

'పాపపు ముండకొడుకు ఎన్నడు సత్తడో....ఎట్లసత్తడో'నని ఊరంతా సాపెన్లు పెడుతున్నరు. అనంతయ్య పంతులు కల్లుకొరకు వస్తున్నట్టు ముందుగానే తెలుసుకున్నడు భూమయ్య. దొరవారి మక్క పెరట్లనుంచే తొవ్వ. పంతులు, పంతులెంట పదిమంది మక్కల నుంచి సింగారం పోయేదాక చూసి, తొవ్వల ఉన్న మక్కను కదదు కదదు తొక్కిండు భూమయ్య. కాందారిని దెబ్బగొట్టె అవకాశం ఇప్పుడు దొరికింది భూమయ్యకు.

తర్వాత దొరవారి పాలేరు దగ్గెరికి వెళ్లి 'ఎవలో కల్లు తాగబోతు మక్కను తొక్కిండ్రని' చెప్పిండు. దొరవారితో హంటర్ దెబ్బలు తిన్నంక, భూమయ్య కాందారి ఒకరి మొఖం ఒకలు చూసుకోలేదు. కాందారి పగను మరిచిపోతలేడు. అప్పుడప్పుడు మామలను, బావమరుదులను ఎగేత్తనే ఉన్నడు. వాళ్లు ఎగురుతనే ఉన్నరు. ఏండ్లు గడిచినా పగ పగలెక్కనే ఉంది.

మక్క తొక్కిన విషయం రాజయ్య దాక పోయింది. రాజయ్య నా మక్క తొక్కే మొనగాడు ఎవడని కట్టెవట్టుకుని కావలున్నడు. అంబటాల్లకు కల్లుకుండలతో వాళ్లు తిరిగి వచ్చిండ్రు. పంతులు ముందట ఉంటే ఏం మాట్లాడుతుండెనోగనీ.... ఎనుకున్నడు. రాజయ్య ముందు వచ్చిన వాళ్లను అందుకున్నడు.

"అరే పటేలా....మేము తొక్కలేదు. మీ మక్కను ముట్టలేదు. మా తొవ్వన మేముపోతున్నం" అన్నరు వాళ్లు.

రాజయ్య వినలేదు. కల్లుకుండలను దించి మంచె కింద పెట్టిచ్చిండు. ఎంత చెప్పినా వినకపోయేసరికి మోతకాళ్లకు కోపం వచ్చింది.

"ఇది ఎవలకు తీసుకపోతున్నమో తెలుసా....? అనంతయ్య పంతులుకు. ఆయిన రాకముందే ఇడిసిపెట్టు. లేకుంటే పాణాన బతుకవు" అన్నరు బెదిరిస్తూ.

రాజయ్యకు కోపం ఎక్కువయింది "నీ పంతులు పీసునెగొడుదు. నా బొచ్చుల పంతులు. ఎవడ్రా పంతులు." అని కట్టె అందుకుని నాలుగు కుండలను పలుగగొట్టిండు. మోతకాళ్లు వెనక్కి తిరిగి పంతులుకు ఎదురుగా పోయి జరిగిన సంగతి చెప్పిండ్రు.

పంతులు ఒకే ఒక్కమాట "నాపేరు చెప్పినా విడిచిపెట్టలేదా" అని అడిగిండు.

"విడిచిపెట్టలేదు పంతులు.....మీద రెండు తిట్టిండు పంతులూ" అని రాజయ్యా మీది కోపంతో ఒకటికి రెండు చెప్పిండ్రు. పంతులు కండ్లు ఎర్రబడ్డయి.

అందరినీ వెళ్లిపొమ్మని చెప్పి వాగులకు వచ్చి బతుకమ్మ గుండుమీద కూసున్నడు. పంతులునే కావలిగాత్తున్న భూమయ్య గుండు దగ్గరికి వచ్చి "పంతులూ...దండాలు.... ఈ గుండుమీద కూసున్నవేంది....?" అని అడిగిండు.

"భూమా....మా నాయిన తద్దినమని కల్లు కొండబోతే కాందారి రాజిగాడు అడ్డుకున్నడట. వాని కాదు పొగజూసేదాక ఇక్కడి నుంచి కదిలేది లేదు" అన్నడు పంతులు.

"అబ్బా.....పీడవోయిందిరా" అనుకున్నడు భూమయ్య.

గుండు మీద కూసుండి పంతులు ఏవో లెక్కలు కడుతున్నడు. ఏవో మంత్రాలు చదువుతున్నడు. ఏవో చెట్లను వడి తిప్పుతున్నడు.

కాందారి ఇంటికిపోయి తానం జేసి అన్నం తిని పండుకున్నడట. మళ్లీ లెవ్వలేదట. ఈ విషయం తెలిసి ఊరంతా ఊపిరిపీల్సుకున్నరు. పట్టుండ్రి పట్టుండ్రి అని మనిషికో దిక్కు మోసి కాదు అంటు వెట్టిండ్రు.

పొద్దుగూకే జాముల దాకా పంతులు బండమీది నుంచి లెవ్వలేదు. నీళ్లల్ల మునిగి ఇంటికి పోతున్న భూమయ్య గుండు దగ్గర ఆగి "పంతులూ....కాందారి రాజయ్య సచ్చిపోయిండు. కాదు కాలుతుంది" అన్నడు.

"భూమా ఈ ముచ్చట ఎవలకూ చెప్పకు".... అంటూ అనంతయ్య పంతులు గుండు దిగి ఊరికి వెళ్లి పోయిండు.

## 11

ఎన్నీల ఎప్పుడో గూకింది. చిమాన చీకటి. భూమయ్యకు ఎప్పుడో మేలుకయింది. లేచి గచ్చులకు వచ్చి ఆకాశం దిక్కు చూసిండు. మూల సుక్క పొడిచింది. పందిరి మంచం నెత్తిమీదికి వచ్చి గోకురు గొయ్యలు కొద్దిగా వంగినయి.

'తెల్లారుతుంది' అనుకుంట జేబును తడుముకున్నడు భూమయ్య. జకమొక సంచి తలిగింది. రుమాలులో చెక్కుకున్న చుట్టను బయటకు తీసిండు భూమయ్య. అప్పుడు యాదికచ్చింది. సంచిల దూదిలేదని. చుట్టనోట్లె పెట్టుకుని తడుముకుంట తడుముకుంట కుంపటివద్దకు నడిచిండు.

కుంపటి వెచ్చగా తలిగింది. పైన్న ఉన్న బూడిదను పక్కకు జరిపి లోపలి పిడుకను పైకి తీసిండు. అప్పుడప్పుడే అంటుకున్నట్టుంది. పూర్తిగా కాలింది పిడుక. అంచును చిదబొడిసి ఒక రవ్వను సుట్టలో వేసుకుని పిడుకపైన బూడిదను జాగ్రత్తగా కప్పిండు.

అలికిడికి మెలుకువయింది ఎల్లవ్వకు. పక్కబట్టలు సల్లగా ఉన్నయి. ఎంకన్నను కొద్దిగ దూరం జరుపుతూ "పోరడు చిన్న మొల్లిగాడైతండు. సగమీదు దాటినంక





సముద్రముట్లని పెండ్లాం పక్కల గూడా పోసేతట్టున్నడు. అంత మొత్తు మొత్తు వాసన" అంటూ దూరం జరిగింది.

"పిడుక మీద పిడికెడు ఉనుకవొయ్యి. లేకుంటే పిడుక దురగాలిపోతది. తెల్లారినంక అగ్గికొరకు నేను నాలుగు ఇండ్లు తిరుగాలె. జేబుల జకమొక సంచి పారేసుకో... రాత్రనకా పగలనకా....ఎప్పుడు వడితే అప్పుడు కుంపటిని పలుగజీరుతవు. నండింట్ల కుంపటిని పలుగజీరద్దు" అన్నది భూమయ్యతోటి.

భూమయ్య నోరు మెదుపలేదు. సుట్టను గప్పుగప్పు తాగుతూ సరాయించుకుంట వచ్చి తలుపుతీసిండు. ఎప్పుడూ జకమొక సంచినిండా దూది ఉండేది. పలుగురాయి, ఇనుపతునుక ఎప్పుడూ మోపు మీదనే ఉండేది. ఎంతవానలైనా చిటుక్కున ఒక్కసారి కొడితే అగ్గిరవ్వలు పుట్టేవి.

ఇప్పుడు దూదిని చేసుకోవాలంటే పని తీరిక లేదు. తుంగనుంచి దూది కండెలు తీసి బొగ్గు పట్టించాలె. ఎండ బెట్టాలె. వారం రోజులు సంటిపిల్లను పోదన జేసినట్టు చేస్తేనే అది దూది. అంత తీరికెక్కడిది. పొద్దున మాపున మోటగొట్టుడేనాయె. మూడు పొంటెల మోట. రెండెడ్లజోడి.

సక్కగ ఎడ్ల కొట్టం దగ్గెరికి నడిచిండు భూమయ్య. రాత్రిపూటనే పచ్చిగడ్డివేసిండు. ఎడ్లు కడుపునిండ మేసి కాళ్లు మడిచి తలను మోకాళ్ల సందుల ఉంచి పండుకున్నయి. అడుగుల చప్పుడుకు తలెత్తి చూసి చెవులతో దోమలను విసురుకుంటున్నయి. గడ్డివాములు నుంచి గడ్డిని తెచ్చి ఎడ్ల ముందు వేసిండు భూమయ్య. ఎడ్ల దొక్కలను తడిమి చూసిండు.

ఈమధ్య పచ్చిగడ్డి కొరకు దొంగలు మొదలయిండ్రు. ఎవలోకాదు బావమరుదులే. తను ఎడ్లముందు వేసి ఇంటికి పోతున్నాడో లేదో ఎడ్ల ముందున్న పచ్చిగడ్డి మాయమయితుంది. ఒక్క పచ్చిగడ్డేకాదు. ఎండుగడ్డి, జోళ్లు, కాని, తాళ్లు, దొడ్లె ఏదిపెట్టినా మాయమవుతుంది.

పొత్తుల బాయితో కొట్లాటలు మొదలయినయి. ఒక్కబాయిల ఇద్దరు పాళ్లు పెట్టుకుని గోడ కట్టుకుని మోటలు కొట్టడంతో కొట్లాటలు మొదలయినయి. ఎవలన్నా ముందుగా వచ్చి మోట కడితే ఇంకొకడి దిక్కు బాయిల నీళ్లు ఉంటలెవ్వు. దొంగతనంగా గోడకు బుంగలు కొడుతున్నరు. నలుగురు నలుగురితో మాట్లాడుకోకపోయినా నలుగురి కన్ను భూమయ్య మీదనే ఉంది. ఇరుగుపొరుగు ఏ కొట్లాటలేక ఒంటిగా మంచిగా ఉన్నడని తమకు ఎటూ అందుతలేదు పొందుతలేదని బాధపడుతున్నరు.

ఎప్పుడు అవకాశం దొరికితే అప్పుడు ఏదో ఒకటి మాయం చేస్తున్నరు. ఎదుటపడి ముందుకు రాకపోయినా సాటు దెబ్బ తీస్తున్నరు. ఈ నడుమ భూమయ్య చెరువు పారుకం ఎకురం తీసుకున్నడు. అప్పటి నుంచి బావమరుదులకు ఓర్వలేని తనం ఎక్కువయింది.

ఎడ్లు గడ్డిని చూడంగనే లేచి నిలబడ్డయి. నాలుగుకాళ్లు నిర్రదొక్కి నడుంవిరిచి, ముందటి కాళ్లతో నేలను తవ్వి పెండపెట్టినయి. ఆప్యాయతగా వాటి దొక్కల్ని తడిమిండు భూమయ్య. గడ్డిదొక్క నిండుగా ఉంది. నీళ్ల దొక్కనే పీక్కుపోయింది. ఎడ్లు వరిగడ్డి మేత మీద పడ్డయి.

గొంగడి పరుచుకుని అక్కడనే నడుంవాల్చిండు భూమయ్య. చుట్టమాత్రం నోట్లేనె ఉంది. అగ్గి చల్లారిపోకుంట మెల్లెమెల్లెగ తాగుతున్నడు.

కోడికూత వినిపించింది. అప్పటికి ఎడ్లు గడ్డిని మేసినయి. మరోసారి దొక్కలను తడిమి మొదటిపొంటె ఎడ్లను విడిచిండు భూమయ్య. చిలుక్కొయ్యకున్న జోళ్లు, పైతాళ్లు, పగ్గాలు, తొండంతాడు, ముల్లు కట్టెని అందుకున్నడు. అవి సరిగ్గా ఉన్నాయోలేదో చూసుకున్నడు. మిగిలి రెండు ఎడ్ల ముందు గడ్డిని వేసి వీటిని అదిలించిండు.

ఎడ్లు నడువలేదు. 'జా' అంటూ వెన్ను తడిమి తోకను విరిచిండు. ఎడ్లు చెంగలిచ్చి ముందుకు దుంకినయి గనీ పనుగడి దాటలేదు. దొడ్లెనే చుట్టూ తిరుగుతున్నయి. పగ్గాలను జోల్లను ముల్లు గట్టెకు తొడిగి గొంగడి కొప్పెర వేసుకుని ముల్లు కట్టెను భుజం మీద పెట్టుకున్నడు భూమయ్య.

"అరే...బగ్గ మేసి బలిసినట్టున్నయి. మోటకు నడువుమంటే దొడ్లెనే పంటయట. ఉడము బలిసి పోతలింగని మీద ఎక్కినట్టుంది". అంటూ మల్ల అదిలించిండు. ఎడ్లు దొడ్లెనే తిరుగుతున్నయిగనీ పనుగడి దాటుతలెవ్వు బయటకు పోతలెవ్వు.

"అరే.....నీగత్తర్రాను. రోజూ ఇడువంగనే ఉరుకుతుండె. ఇయ్యాల్ల ఏం బుట్టింది...దొడ్లెనే పతుకులాడుతున్నయి." అంటూ కట్టె అందుకుని రెండు ఎడ్లను రెండు గుంజిండు. ఎడ్లు దాటలేక దాటుతున్నట్టు పనుగడి దాటినయి. వాగవుతల తొవ్వకు నడువాల్సినయి ఒర్రెతొవ్వకు పట్టినయి.

"ఆ...రే...ఏం బుట్టిందిరో ఇయ్యాల్ల.....ఏమో కొత్తగ నడుత్తున్నట్టు చేత్తున్నయి...

...అడే....సుక్క సుక్క" అంటూ ఎడ్లను మలిపి రెండు గుంజిండు. ఎడ్లు వాగవుతల తొవ్వవట్టినయి.

అప్పటికే ఊరంచున ఉన్న మోటబాయిలకాడ పాటలు వినిపిస్తున్నయి. గిరుకల చప్పుడు, కిచకిచమని బిల్ల దూలం సప్పుడు. ఎక్కడనో కట్టె ఇరుసుబండి కిర్రు కిర్రుమంటుంది. మోట నడువని ఎడ్లను ఎవలో రైతు కోపంగా అదిలిస్తున్నడు. మందలో కాటగలిసిన లేగదూడ కోసం ఆవు "అంబా" అంటూ వెదుకుతుంది. దొంగతనం అలవాటయిన కోడెదూడలు ఎక్కడనో పనుగడి దూకుతున్న చప్పుడు. రాత్రి తప్పిపోయిన గోజలు దొడ్డి దగ్గెరికి చేరి పనుగడిని దాటుతున్న చప్పుడు.

మసక చీకటి గుండెను తట్టి లేపుతున్నట్టు రాత్రంతా అలికిడే!.

ఎడ్లు నడుస్తున్నయి. దారి పట్టినంక ఆగుతలెవ్వు. ఒక చేత చుట్ట మరో చేత







పగ్గాలు జోళ్ల కట్టెతో ఎడ్ల వెంట నడుస్తున్నడు భూమయ్య. కాళ్లకు కొత్త చెప్పులున్నయి. నడక వేగంగా సాగుతలేదు. చెప్పులు మెదుగాలని తొక్కుతున్నడు. పెద్ద బక్కది సచ్చిపోతే షాత మాదిగోడుచేసి ఇచ్చినయి. రెండురోజులు ఆందెంలో నానవెడితె బిరుసు తగ్గి మెత్తగా ఉన్నయి.

బక్కది ఎంతకష్టం చేసింది. తను ఊర్లెకు వచ్చినప్పుడు చిన్నల్యాగ. తల్లీ పిల్ల వాగువెంట తిరుగుతుండంగ జారిపడ్డయి. తల్లిది కాలు చింత చెట్టు వేర్లల్ల ఇరికి సచ్చిపోయింది. పిల్ల మాత్రం కొరిపాణంతో బయటపడ్డది. తనే బర్రెపాలు పోసి సాదిండు. బతుకనే బతుకదనుకుంటే ఏడేండ్లు కష్టం చేసింది. సచ్చిన్నాడు నిజంగనే ఏడ్చిండు భూమయ్య. దీని అన్న బర్రలుగాడు సచ్చిపోయినప్పుడు మామ ఏడ్చింది యాది కచ్చింది.

ఎడ్లు వాగులకు దిగినయి. చీకటి అలవాటయి చుట్టూ వెలుతురు లెక్కనే ఉంది. ఎడ్లు నీళ్లు తాగి గడ్డకు ఎక్కి తొవ్వపట్టినయి. ముందట నడుస్తున్న పయ్యది టక్కున ఆగిపోయింది. కాళ్లు నిర్ర దొక్కింది. బలబల చప్పుడు. వెన్ను తడుముతూ.... చ్చొ.....చ్చొ.....చ్చొ.....అన్నడు భూమయ్య.

"దీని తల్లి ఇంతే ఉచ్చత్తే ఆగిపోత్తుండె. బర్రలుగాడు ఇంతే. ఇదీ ఇంతే. బరువు మీదున్న బండిగాని, ఆగి పోత్తది. ఎంత దమాయించినా నడువది. ఒక్కొక్కసారైతే మోటబొక్కెన సగానికి వచ్చినంక ఆగి పోత్తది. దీనిని చూసి పుల్లది గూడా అలువాటయింది." అనుకున్నడు భూమయ్య.

పయ్యది, పుల్లది రెండు తనమందల పెరిగినవే. రెండేండ్లకిందనే శేరేసిండు. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా నడుస్తున్నయిగనీ ఉరుకులాట తగ్గలేదు. ఇంతకు ముందయితే మోట దగ్గరికి వచ్చినంక రెండూ దొరుకకుంట పరుగు అందుకుంటుండె.

ఎడ్లు రెండూ కదిలినయి. మోటబాయి కాడికి చేరుకునే సరికి మూలసుక్క వంగింది. పొద్దుమాపు నడిచే మోటనే. అన్నీ మోపుమీదనే ఉన్నయి. బోదర్ల నాన బెట్టిన తొండం నానిందో లేదో చూసి, బార్లెకు ఎడ్లను తోలిండు భూమయ్య. ఎన్నడూ లేనిది ఎడ్లు మూలమూలలు ఈగుతున్నయి.

"అరే....ఏమయిందిరో ఇయ్యాల్ల" అనుకుంట కట్టెతో రెండు కొట్టిండు. ఎడ్లు కాని ముందుకువెళ్లి నిలబడ్డయి. జామ చెట్టు మీద పెద్ద పిట్ట "గుగ్గూగుప్" అంటుంది. పిట్టను అదిలిస్తూ ఎడ్ల మెడల మీద కానిపెట్టి జోళ్లు కట్టిండు. ఎడ్ల ముక్కుతాడును పనవార్లకు ముడేసి తొండం తాడును కట్టి మోటబొక్కెన శీలలు సరిగ్గా ఉన్నయో, లేదో చేత్తో తడిమి చూసుకున్నడు.

ఒకసారి దందెడను తడిమి చూసుకుని మోటబొక్కెనను బాయిలకు దించిండు భూమయ్య. గిరుక మీద రాత్రే కందెనవేసి కొత్త కట్టెను పెట్టిండు. అది మెత్తగా తిరుగుతుంది. పిల్లదూలమే కిర్రు కిర్రుమంటుంది.

కాలు కింద ఏదో మెత్తగ తలిగి గుర్తుకు వచ్చింది. ఎడ్లను ఆపి చీకట్లకు పట్టి పట్టి చూస్తూ జామ పండ్లను ఏరి కుప్పపోసిండు. తెల్లారగానే జామ పండ్లకోసం ఎంకన్న వస్తడని తెలుసు. సుట్టను చివరగా రెండు బుక్కలు గపగపతాగి పిడుకలో పెట్టి పక్కన పెట్టిండు. దాని పక్కనే ఇంకో పిడుక. ఇట్లా పిడుక పక్క ఇంకో పిడుక ఐదు పిడుకల్ని ఉంచిండు. జాముకొక్క పిడుకచొప్పున పొద్దుగూకే వరకు ఐదు అంటుకుంటయి. అగ్గికొరకు ఎటూ తిరుగాల్సిన పనిలేదు.

ఎడ్లను అదిలిస్తుంటే పై తాళ్లు గుర్తుకచ్చినయి భూమయ్యకు. 'ఎద్దు మెడమీద జోడు కనుక తెగితే, కాని ఎదురు బొచ్చెకు తాకుతది!' అనుకుంట ముందుకెళ్లి ఎడ్ల మెడలకు కానికి పై తాళ్లు కట్టిండు. వారం రోజుల కింద మొగురం ఎల్లయ్య కాలు, జోడు తెగడం వల్లనే ఇరిగింది. తనే పెద్దమాను చెక్క దంచి కట్టు కట్టిండు. అప్పటినుంచి పై తాళ్లు కట్టుకోవాలని తనే అందరితో చెప్పిండు.

సల్లటి ఈదర. బారిచుట్టూ చెట్లు. నీడ కొరకు తనే పెంచిండు. చెప్పులను గొంగడిని చెట్టు మొదట్ల వెట్టి కుడిచేత్తో పగ్గాలను వెనుకకు గుంజుకుంట "దా.....చెర్రి" అన్నడు భూమయ్య.

ఎడ్లు వెనక్కి అడుగులు వేస్తున్నయి. కాళ్లకింద మెత్తటి బూడిద. మొరం రాళ్లు ఒత్తుకపోయి డెక్కల సందున ఇరికి ఎడ్లు మెత్తవడుతాయని బారిలో మెత్తటి బూడిదను చల్లిండు భూమయ్య. ముందుగా అందరూ విచిత్రంగా చూసినా తర్వాత ఇదే బాగుందన్నరు.

ఎడ్లు బొదర్ దగ్గెరికి వెళ్లి ఆగినయి. తొండం తాడును పైకి గుంజి వదిలిపెట్టిండు. భూమయ్య. బొక్కెన మునిగినట్లు బుడుగ్గుమని చప్పుడు. గిరుక దగ్గర కటుక్కుమంది.

"జా...." అనుకుంట ఎడ్లను అదిలించిండు భూమయ్య. ఎడ్లు ముందుకు కదిలినయి.

దండెడను ఆసరా పట్టుకొని ముందుకు నడిచిండు. కానికి కట్టిన తొండం తాడు, ఎడ్లు ముందుకు కదులుతుంటే పైకి లేత్తుంది. బొక్కెన మూతికంటే పైకిలేచి నీళ్లను ఆపుతుంది.

చిల్లులు పడిన మోట బొక్కెనల నుంచి నీళ్లు బాయిలకు జారిన చప్పుడు. ఎడ్లు కొనబారిలకు చేరంగనే తొండం బొక్కెన తన పని తాను చేసుకుంటున్నయి. కదురుదాకా సాగిన తొండంల నీళ్లు బోదర్‌ల పడుతున్నయి. మోట పట్టు దొరికిపోయింది భూమయ్యకు. ఎక్కడ మోట ఇరిగినా భూమయ్య పోవలసిందే.

"దా....చెర్రి" అన్నడు భూమయ్య.

మోటసాగుతుంది. పాటను అందుకున్నడు భూమయ్య.

తెట్టంగ తెల్లవారె.... తెలకోళ్లు గుయనారే..... బలబలా తెల్లారె బ్రహ్మ నాథులుగూసె....





లేవరా....కృష్ణా......లేవలేవలేవరా.....

పాటను.....పాటతో పగ్గాలను అందుకున్నడు భూమయ్య. పిల్ల కదురు కుయ్యి కుయ్యిమని సంగీతం పాడుతుంది. మోట బొక్కెన దడదడమని దరువేత్తుంది. బొక్కెనల నుంచి చిమ్మిన నీళ్లు కొత్త సంగీతాన్ని అందిస్తుంటే, ముందుకు ఎనుకకు నడుస్తున్న ఎడ్లకాళ్లు నాట్యం చేస్తున్నయి.

నీపాటి మొగవాళ్లు మోటాల కెళ్లీరీ.....లేవరా.....కృష్ణా

లేవలేవలేవరా......

నాకట్టు కొంగునీ పక్కలా ఉన్నది...లేవరా....కృష్ణా

లేవ లేవ లేవరా....

అలుపెరుగని పాట. అలలు అలలుగా గాలిని చుట్టి విస్తరిస్తుంది.

ఎవ్వరింటి కోడలావే పల్లే ఇంతీ....నామల్లే బంతీ....

రింగు రింగు ఎంటికేల చిన్నదాన....నావన్నే దానా..

రంగు రంగయిన బొంగురాలు రైకేల దాచుకునుడెందుకే

ఇవ్వునాకూ.....దవ్వూబోకూ....

బంగరయ్యా బొంగురాలుగావు బంగారు సను బంతులీవెగనుమా...

అప్పుడప్పుడు మలెగొని నడువనని మొరాయిస్తున్న ఎడ్లను తీపి పగ్గంతో గుంజి సరిచేస్తూ 'జా' ..........అంటున్నడు. నిండు బొక్కెన పైకి వచ్చేటప్పుడు దండెడను గుంజి ఎడ్లకు ఆసర వడుతున్నడు.

రోజూ నడిచేమోట. రాపిడికి అరిగి నీటిలో నాని చీకుటం పట్టిన తాళ్లు. తాళ్లపురి ఇచ్చుక పోతున్నా కనిపించని చీకటి. ఎక్కడ ఏతాడు తెగినా ఎదురు దెబ్బరైతుకే!.

బలబల తెల్లారుతుంది. దండెడను కానికి ముడివేసే తాడు తెగుతుంది. బొక్కెనను గుంజుతున్న కొద్దీ తాడు పురులు పురులు తెగిపోతుంది. చివరికి కొనపురి మీద ఆగింది. అప్పటికి మొదటి మడికి నీళ్లు తిరిగినయి.

బొక్కెన మునిగింది. "జా" అంటూ ఎడ్లను దమాయించి దండెడను బలంగా పట్టుకుని ఆసరపడుతూ ముందుకు కదులుతున్నడు భూమయ్య. ఎడ్లు కొనబారిలకు చేరినయి. అంతే! దండెడ పుటుక్కుమని తెగింది.

బలంగా ముందుకు వెళ్తున్న ఎడ్లు ముందటి కాళ్ళు మర్రవడి కూలవడ్డయి. ఆధారం తెగిపోంగనే బొక్కెన వేగంగా బాయిలకు దూసుకపోతుంది. దండెడను బలంగా పట్టుకున్న భూమయ్య ఏం జరిగిందో తెలుసుకునే లోపలనే వెనుకకు ఇరుసుక పడ్డడు. దండెడతోపాటు బాయి దిక్కు దూసుకుపోతున్నడు.

C C C C

"ఎంకన్నా.......లెవ్వు బిడ్డా....కాకులు పొడుగాను. ఏం బుట్టిందో ఇంటిమీదనే కొట్లాడుతున్నయి. నాయిన గా రాత్రివాయె. తెల్లారంగనే ఇంత తైదంబలి కడుపుల వడితే ఆసరుంటది." అనుకుంట కూరుకు రాత్రే లేచి కూసుంది ఎల్లవ్వ. కొడుకు పక్కలున్న కట్టుకొంగును లాక్కుని భుజం మీద సదురుకుంది.

నెత్తి దులుపుకుని శికె ముడేసుకుని నోట్లే నీళ్లు పోసుకుని పుక్కిలిచ్చి ఊంచి చీపురు కట్టను అందుకుంది ఎల్లవ్వ. పాత గంగ్ర పేగును మెడకు చుట్టుకొని పొయ్యి దగ్గెరికి నడిచింది.

పిడుక దురగాలినట్టుంది. అగ్గిలేదు. బూడిద ఎత్తి పెంటలపోసి పొయ్యిమీద ఊడ్చి ఎర్రమన్ను కుండలపోసి అలికి ముగ్గువేసింది. కుంపట్ల పిడుకను తీసి పొయ్యిల వేసి చిదపొడిచింది. రెండు పిడుకలను కొట్టి అగ్గిమీద వేసింది. కలికుండల ఎసరు కలికిచ్చి పొయ్యిరాజేసి ఎసరు పెట్టింది ఎల్లవ్వ. కంచుట్ల గటుక తడిపి నానబెట్టింది. కశికతో గటుక కుండలు గీకి తలెముంతలను బూడిదితో తోమి కడిగింది.

ఇంటిమీద కాకులు ఎగవడుతున్నయి. కాకులను తిట్టుకుంట వాకిట్లకు వచ్చింది ఎల్లవ్వ. బర్రెను ఇడిసి పాలు పిండింది. కుడిదిపోసి వాకిలి ఊడ్చింది. కడుపల్ల పిడుస ఏసి అలికింది.

ఎంకన్న లేసి తట్ట అందుకుని బర్ల మంద వెంటపోయిండు. నాలుగు తట్టలు నింపి పెంటలో వేయందే రాడు ఎంకన్న. కొట్లాడి కొట్లాడి తట్టలను నింపుతడు. ఇంటి బర్రె పెండ పది బండ్లయితే ఎంకన్న పెండ ఇరువైబండ్లు కావలిసిందే. ఎంకన్న గౌగోడిగా తిరుగడని పనిలో, సదువులో ఉషారున్నడని అందరూ అంటున్నరు. తన కొడుకు మీదనే ఊరందరికి కన్ను ఉన్నదని మంత్రం వేసి సంపుతరని ఎల్లవ్వకు భయం. అందుకనే అప్పుడప్పుడు బజార్లకు వచ్చి కావాలనే నోరు చేసుకుంటది.

"ఎంకా...యాడికి పొయినవురా....? తెల్లారితే చేతికి దొరుకవు. పొద్దుపొడిచింది. సద్ది తీసుకపోరా...అక్కడ అయ్య పొద్దు పొడువ నియ్యడు." బయటకు వచ్చి యాష్టపడుతూ అన్నది ఎల్లవ్వ.

బర్లవెంట పోతున్న ఎంకన్న ఉలిక్కిపడి వెనుకకు తిరిగిండు. పెండను పెంటల వేసి తట్టనుగుడిసె కొమ్ముకు వేసి చేతులు కడుక్కున్నడు. బొగ్గు ముక్కను నోట్లె వేసుకుని కసబిస నమిలి చూపుడు వేలును కొద్దిసేపు పండ్లపై ఆడిచ్చి వాక్‌వాక్‌మని కక్కి మొఖం మీద నీళ్లు చల్లుకున్నడు.

రోజూ సద్ది పని తనదే. వచ్చేటప్పుడు లాగు కీసలు, అంగికీసల నిండా జామపండ్లు, రేనిపండ్లు నింపుకస్తడు. వద్దన్నా వినకుంట గంగ్రపేగును నెత్తికి చుట్టి సద్దిగుల్ల నెత్తిమీద పెట్టింది ఎల్లవ్వ.గుల్లల దూపకు బుడ్డి పెట్టి మీద ఉప్పుపోసింది. గుల్లను నెత్తిమీద పెట్టుకుని ఎదురుగా వత్తున్న ఆవుల మందను తప్పించుకుంటూ





పానాదితొవ్వ పట్టిండు ఎంకన్న.

జారిపోతున్న లాగును ఒక చేత తట్టగుల్లను ఒక చేత పట్టుకుని నడుస్తున్నడు ఎంకన్న. చల్లటి ఈదరకు దవుడలు వణుకుతున్నయి. దూరం నుంచే పసిగట్టిండు ఎంకన్న. కదురు చప్పుడు లేదు. బోదర్ చప్పుడు లేదు. పాట వినిపిస్తుండేది. ఆ పాట చప్పుడు లేదు. తండ్రి 'మోట కట్టిండా లేదా' అన్న అనుమానమచ్చింది.

'మోట కట్టకపోతే ఎందుకు సద్ది పంపుతుంది'? అనుకున్నడు. నడకవేగం పెంచిండు. బారిలో ఉండాల్సిన ఎడ్లు గడ్డమీదున్నయి. మెడ మీద కాని మెడమీదనే ఉన్నది. కానికి మూరెడు తాడు యాలాడుతున్నది. ఎడ్లు గడ్డమీద గరుకను మేస్తున్నయి.

ఎంకన్నకు భయము, కాళ్లల్ల వణుకు మొదలయింది. ఏదో జరిగిందని తెలిసిపోయింది. "నాయినా" అని బిగ్గరగా అరుస్తూ బారిదిక్కు ఉరికిండు.

పిల్ల కదురు దగ్గెర పడివున్నడు భూమయ్య. నెత్తికి దెబ్బతగిలింది. మోకాళ్లు మోచేతులు రక్తంగారుతున్నయి. కారిన రక్తం బోదర్‌నీళ్లల్ల కలిసి ఆగిఉన్న నీళ్లు ఎర్రగా మారినయి. ఒక కాలు మడిచి మరోకాలు చాచి ఉన్నది. బారి మధ్య నుంచి గుంజుకొచ్చినట్టు గీత. తల పిల్లకదురుకు గుద్దుకున్నది. కదురంతా రక్తం.

నెత్తి మీది గుల్లను కిందపడేసి ఊరివైపు పరుగందుకున్నడు ఎంకన్న. నెత్తినోరు మొత్తుకొని ఎల్లవ్వ పరుగెత్తు కచ్చింది. ఎడ్లబండిని సిద్దంచేసింగ్రు. భర్తతలను ఒడిలకు తీసుకుంది ఎల్లవ్వ. గడ్డకట్టిన రక్తాన్ని తుడిచింది. చుట్టూ మోటబాయిలకాడ ఉన్నవాళ్లు గిరుకకు తాడువేసి వచ్చింగ్రు. దందెడ ఎక్కడ తెగింది...? ఎట్ల తెగింది....? చూస్తున్నరు. ఒకలు ఎడ్ల మెడల మీది కాని విడిచి ఊరిదిక్కు మలిపింగ్రు.

ఎడ్ల బండ్లె వరిగడ్డివేసి భూమయ్యను ఎక్కిచింగ్రు.ఇంటికి చేర్చింగ్రు. ఎల్లవ్వ కొట్టుకుంటుంది. మొత్తుకుంటుంది. ఏడుత్తుంది. ఊరూరంతా తటారుగట్టింగ్రు. మందులు దంచి పోత్తుంగ్రు. పగటియాల్లకు గానీ కండ్లు తెరువలేదు భూమయ్య. కోలు కోవడానికి మూడు రోజులు పట్టింది.

ఈ మూడు రోజులు మోటలేదు. ఈ మూడు రోజులల్ల ఇంకో రెండు మోటల జోళ్లు తెగినయి. ఇద్దరి కాళ్లు ఇరిగినయి. బాయిలోతు పెరిగి నీళ్లు లోతున పడి, జడుపు పెరిగి, తాళ్లు తెగుతున్నయంటున్నరు అందరు. అది నిజమే అనిపిస్తుంది. ఆరుగజాల బాయిలు పన్నెండు గజాలయినయి. ఇప్పుడు పద్దెనిమిది గజాలుదంగినయి. పద్దెనిమిది గజాల బాయిల నుంచి బొక్కెన గుంజుతుంటే దందెడ, జోళ్లు తెగుతున్నయి.

నాలుగవనాడు జోళ్లు పట్టుకొని మోటకాడికి పోతుంటే అడ్డుకుంది ఎల్లవ్వ.

"ఆ మోట వద్దు మన్ను వద్దు. బతికుంటే బలుసాకు తినచ్చు. ఎప్పుడేమైతదో తెలువ కుంట ఉంది. కిస్మత్ మంచిగుండి బాయిలపడలేదు. బాయిలపడితే నోట్లెమన్ను వడుతుండె. ఎంత ఖర్చన్నగానీ రాటు తెచ్చుకుందాం" అన్నది ఎల్లవ్వ ఏడుస్తూ.

సర్ది చెప్పాలని చూసిండు భూమయ్య. ఎల్లవ్వవినలేదు. "రాటుతెచ్చుడు తెచ్చుడే" అంటుంది. మెడల గుండ్లు చెవులకమ్మలు దూసి చేతులపోసి అమ్ముకరమ్మన్నది.

రాటు వచ్చింది. కొండపారం నుంచి బండి కట్టుకుని తెచ్చిండు భూమయ్య. అరువై డబ్బలరాటు. బాయికి నలుపై డబ్బలే సరిపోయినయి. మోటబారిని కూడ్చి రాటుబారి పోసుడుకు రెండురోజులు పట్టింది. రాటును అమిరిచ్చుడురెండు రోజులు. నాలుగవనాడు దోణిముందు కోడిపిల్లను కోసి రక్తం వడిపి రాటుతిప్పింద్రు.

'గూడ' పోసిన్నాడు పొద్దంతా పని. ఒక్క మడే పారింది. నీళ్లు కిందికి దిగినయి. యాతం అందుకున్ననాడు 'గూడ' కంటే తేలికగా అనిపించింది. రెండు మడ్లు పారినయి. నీళ్లు కిందికి దిగి యాతం ఎత్తిపోయింది. మోట వచ్చినంక యాతం కంటే తేలికగా అనిపించింది. నాలుగుమడ్లు పారినయి. ఇప్పుడు రాటు వచ్చినంక అన్నింటికంటే అలుకగా అనిపిస్తుంది. రెండు మోటల నీళ్లు పారుతున్నయి. ఎనిమిది మడ్లు పారుకం అయితున్నయి. అప్పటికంటే పారుకం పెరిగింది.

రాటు ఎంకన్న కొట్టచ్చు. ఎల్లవ్వ కొట్టచ్చు. తెగుతదన్న భయంలేదు. ఇరుగుతదన్న బాధలేదు. ఏది ఇరిగినా కొక్కెం ఆపుతది. మబ్బుతో కట్టాలన్న తొందరలేదు. తెల్లారినంక కట్టినా గంటలో నీళ్లన్నీ పొలం మొత్తం తిరుగుతయి. రెండు పొంటెలు కట్టే అవుసరంగూడా లేదు. ఎడ్లకు గూడా పెద్దగా బరువేంలేదు. చుట్టూ తిరిగితేసాలు.

మోటపొలం రెండెకురాలు అలుకుడే చేసిండు భూమయ్య. రాటుతో రెండు ఎకురాలు పారుతున్నది. డబ్బాలు మునిగేదగ్గెర లోతుగా తీసిండు. రాటు నీళ్లను ఎత్తిపోత్తుంది. ఊరంతా భూమయ్య రాటును చూసి పోతున్నరు. రెండు మోటల నీళ్లు ఎత్తిపోత్తుంటె మడ్లన్నీ గలగల మంటున్నయి.

'అరే.....ఎప్పుడోతెచ్చేదుండెరా రాటు.....'అనుకున్నడు భూమయ్య.

ఎప్పుడైతే భూమయ్య రాటు తెచ్చిండో అప్పుడే సుట్టుపక్కల ఉన్న మోటబాయిల ఊటలు ఎండినయి. పొద్దున పూట బాయినిండా నీళ్లు ఉన్నట్లె కనబడుతున్నయి. ఎట్లెట్ల రాటు నడుత్తందో అట్లట్ల నీళ్లు తగ్గుతున్నయి. నాలుగు మడ్లు తడిపే బాయిలు రెండు మడ్లే తడుపుతున్నయి. భూమయ్యకు పారుకం పెరిగింది. అందరికీ పారుకం తగ్గింది.

భూమయ్య రెండెకురాల పొలం చేసినంక అందరికీ గుండె చెరువయితుంది. మరుసటి సాలుకే రెండు మూడు రాట్లయినయి. రాట్లు ఎట్లెట్ల పెరుగుతుంటే అట్లట్ల బాయిలు ఎండుతున్నయి. మూడేండ్లు తిరిగేలోపల ఊర్లె మరిన్ని రాట్లయినయి. నీళ్లు అందక మోటలు మాయమయినయి.

ఒర్రెలకు వాగులకు పెట్టిన రాట్ల దగ్గరనైతే లచ్చిమి తారంగమాడుతుంది. ఒక్కొక్క జాగల మూడెకురాల చేను పారుతుంది.

రాటును మొదట తెచ్చింది భూమయ్యనే! భూమయ్య పేరు ఇప్పుడు రాటు





భూమయ్య అయింది. భూమయ్యకు అప్పుడప్పుడు నీళ్లగురించి భయం పుడతనే ఉంది. అందరినీ హెచ్చరిస్తనే ఉన్నడు. అందరూ నవ్వుతున్నరు.

రాటుతో వ్యవసాయం ఐదేండ్లు నడిచింది. ఈ ఐదేండ్లలో ఎంకన్న సదువయింది. పెద్ద సదువులకొరకు తాలూకా పోతనన్నడు. ఎల్లవ్వ వద్దన్నది. కొడుకు ముచ్చట కాదనలేక సరేనన్నడు భూమయ్య. ఎంకన్న సదువు తాలూకాలో జరుగుతుంది.

ఆబితాబి రెండు పంటలతో ఇల్లు తెల్లగయింది. ఇప్పుడు మూడు పూటలా వరి అన్నమే వండుతుంది ఎల్లవ్వ. చేతుల నాలుగుపైసలు ఆడుతున్నయి భూమయ్యకు. కొడుక్కు కొనికెపోగు ఎండిమొలతాడు, తను చేతులకు దండెకడాలు సొలంకడియాలు, కత్తెర వైనీలు చేయించుకుంది ఎల్లవ్వ.

అప్పుడప్పుడూ తల్లి గుర్తుకువచ్చినప్పుడు 'అవ్వ ఏలోకాన పాయెనో....ఉండిలేని సంసారం ఎల్లదీసింది. కాళ్లు కడుపు గట్టుకున్నది. ఇంటినిండా పంట చూసుకునే యాల్లకు కండ్లుమూసే' అని కంటతడి పెట్టుకుంటుంది ఎల్లవ్వ.

బావమరుదులు గూడా గట్టిగయింద్రు. పంటలు మంచిగనే పండుతున్నయి. అప్పుడే పెద్దమామ మల్లయ్యను ఎద్దుపొడిచింది. ఎవలదో ఎద్దుకు నాలిక శేర్లచ్చినయంటే తియ్యడానికి మల్లయ్యను తోలుకపోయింద్రు. ముల్లుతో నోట్లె నరాలను గెలిగిత్తున్నప్పుడు కొమ్ములు పట్టుకున్న వ్యక్తి, కొమ్ములు ఇడిసి పెట్టిండు. ఎద్దు తలుకాయతో కుమ్మిడు కుమ్మింది. ఆ ఊపుకు తాళ్లతో కాళ్లు పట్టుకున్న వాళ్ల పట్టు సడలిపోయింది. ఎద్దుకు పట్టు దొరుకంగనే రెండుకాళ్లు జాడిచ్చిలేచి మల్లయ్యను కొమ్ములతో ఎత్తి కిందపడేసి ఉరుకతలిగింది.

అప్పుడు కింద వడ్డడంటే మళ్లా లెవ్వలేదు మల్లయ్య. నవుసీ నవుసీ నెలరోజులకు కన్నుమూసిండు. అది నడీవానకాలం. ఎండుకట్టెలు ఎక్కడ లేవు. అందరికీ సుట్టిముట్టు దచ్చింది. భూమయ్య తన గుడిసెను ఇప్పి బండెడుకట్టెలు ఇచ్చిండు. ఎల్లవ్వ తొమ్మిది రోజులు అన్నలకు వదినెలకు పిల్లలకు వండిపెట్టింది. చావులో అందరూ కలుసుకున్నరు.

కొండయ్యకు ఒక బిడ్డ ఉంది. ఎంకన్నకు ఇయ్యాలన్న ఆలోచన ఉంది. ఎంకన్న బుద్ధిమంతుడని ఎట్లయినా కొడుకు బిడ్డను ఇయ్యాలని చిన్నమామ ఎల్లయ్యకు మొదటిసారిగా ఆలోచన కలిగింది. ఆ విషయాన్ని కొండయ్యకు చెప్పిండు. ఎప్పుడైతే సావుకు అందరు కలిసింద్రో అప్పటినుంచే ఎల్లయ్య "బిడ్డా.....అల్లుడా" అని వెంట తిరుగుతున్నడు.

ఎల్లవ్వ గూడా అన్ని మరిచిపోయింది. "చిన్నాయినా, చిన్నాయినా" అని ఎప్పుడు ఏదో ఒకటి చేతులేత్తుంది. పండుగులకు పబ్బాలకు పిలుసుకచ్చిబువ్వ పెడుతుంది.

భూమయ్య మాత్రం మాట్లాడుతలేదు. 'పాపపు ముండకొడుకు. కరిస్తేకాదు.

నాకితేనే ఇసమెక్కుతది' అంటున్నడు. ఎల్లయ్య ఇంట్లకు వస్తే బుసబుస పొంగుతున్నడు. తుప్పు తుప్పు ఊంచుతున్నడు.

'లంగముండ......దొంగముండ వాని కెందుకు పెడుతున్నవని' తిడుతున్నడు.

"ఎవని పాపాన వాడే పోతడు" అంటుంది ఎల్లవ్వ.

కొండయ్య మీద గూడా భూమయ్యకు మంచి అభిప్రాయం లేదు. "వాడా....పిల్లికి పిడుసెయ్యడు" అంటున్నడు. అన్నట్టుగనే కొండయ్య గుణం మంచిదికాదు.

కల్లం దగ్గెరికి ఎవలన్నా బిచ్చగాళ్లు వస్తేచాలు. ఏదో ముదిరిచ్చి భార్యను కుక్కలు గుర్రాలు తిడుతడు. చాట అందుకుని కొట్టకొట్టవోతడు. కల్లంలనుంచి అలిగలిగిపోతడు. వాళ్లే కొట్లాడుకుంటున్నరని బిచ్చానికి వచ్చినోడు వెళ్లిపోతడు.

వడ్ల కట్టలకు పనిపాటలోళ్లు, వడ్లకమ్మరోళ్లు వత్తే చిన్న చిన్న కట్టలు ఏరి పక్కకు పెడుతడు. ఎవలన్న పండుగో పబ్బమో అయితే భోజనానికి పిలువపాపము. అందరి కంటే ముందే వెళ్లి కూసుంటడు. సియ్య కూరెయ్యిమని నోరు ఇడిసి అడుగుతడు.

ఎంట కొడుకును గూడా తోలుకపోతడు. భోజనానికి కూసుండే ముందు కొడుకుతోటి "ఏడ్వకు బిడ్డా.......మనకు వక్కలే ఏత్తరు.....నేను చెప్పుతతియ్యి" అంటడు.

ఎవలన్నా పక్క నుండి 'ఏందే కొండన్నా.....'అని అడిగితే "పొల్లగాడయ్యా..... చారువద్దు మెత్త మెత్తవక్కలు గావాలని ఏడుత్తుండు" అంటడు.

కొండయ్య గుణం తెలుసుకాబట్టి అయ్యకు కొడుక్కు రెండు గంటెల వక్కలేసిపోదురు. కొండయ్యకు పూట గడిచిందే లెక్క. అది సహించకపోతుండె భూమయ్య. "కదుపుగుత్తోడు వత్తండు. పూటకుల్లోడు వత్తండు" అని మొఖం ముందటనే అంటుండె.

ఎప్పుడన్నా చాపల కూరనో, కోడో వండుకుంటే వాసన పట్టుకుని ఇంట్లకు వత్తుండె. ఇయ్యాల్ల నీసుకూర ఉన్నట్టుంది. అని నవ్వుకుంట అడుగుతుండె. ఎల్లవ్వ సత్తుగిన్నెల కూర ఏసిత్తే పంచెసాటుకు దాచుకుని తీసుకుపోతుండె.

ఎంకన్న సదువయింది. తొమ్మిదోది చదివిండు. ఊర్లె అంత సదువు సదివినోళ్లు నలుగురు ఐదుగురే ఉన్నరు. పెండ్లి చెయ్యాలని ఎల్లవ్వ తొందర పెడుతుంది. "అయ్యవ్వలేని దాన్ని. తోడ పుట్టినోళ్లు లేనిదాన్ని. ఇన్ని రోజులు మందికి దూరంగా ఉన్న. ఇప్పుడన్నా మందిల కలువనియ్యి" అని భర్త కాళ్లు మొక్కి ఏడ్చింది ఎల్లవ్వ. కొండయ్య గూడ బావ కాళ్లు మొక్కిండు. ఎల్లయ్యనైతే భూమయ్య వెంటనే ఉంటున్నడు. బతిమాలుతున్నడు.

భూమయ్య ఎవరి మాటా వినలేదు. ఎంకన్నను పిలుచుకుని "నీకు ఇష్టమేనా" అని అడిగిండు. ఎంకన్న ఇష్టమే అన్నడు. నీ ఇష్టమే నా ఇష్టమన్నడు భూమయ్య.

ఆలస్యమైతే ఎవల మనసు మారుతదో అనుకుని అదే ఎండకాలం లగ్గం మోగిచ్చిండు ఎల్లయ్య. ఎంకన్నకు లచ్చిమికి అదే ఎండకాలంల లగ్గమయింది. ఎంకన్నతో చదివిన వాళ్లకు, ఎంకన్నకు అదే యేడు సర్కారి కొలువులు వచ్చినయి. అందరూ కొలువు





మీదికి వెళ్లిపోయింద్రు. ఎంకన్న ఒక్కడే మిగిలిపోయిండు.

ఎంకన్నను భూమయ్యనే వద్దన్నడు. "వాళ్లకు భూములు లెవ్వు. జాగలు లెవ్వు. బతుకుదెరువుకొరకు పోతున్నరు. నీకేం తక్కువరా జాయిజాతులేదా, జమీను లేదా...నువ్వే నలుగురిని సాదుతవు. ఒకనికి పెట్టాలెగనీ ఒకని దగ్గర జీతముంటరా" అన్నడు.

ఎంకన్నకు నిజమే అనిపించింది. వ్యవసాయానికి మర్రి రెండునాగండ్ల ఎవుసం పెట్టిండు. ఎంకన్న ఎవుసాయానికి మర్రిన సాలునే రాటుబాయి ఎండిపోయింది. ఉన్న చెరువు పారుకమే చేసుకుందామన్నడు భూమయ్య.

ఏగిలంత పొలం ఇడిచిపెట్టి ఏం దున్నుకుంటం....ఏం ఎవుసం చేస్తమని బాయిని రెండు గజాలు తవ్విండు ఎంకన్న. దరులు కూలకుండా రాతి కట్టుకం కట్టించిండు.

రెండు గజాలు లోతు తవ్వినంక నీళ్లు పుష్కాలమైనయి. కాని రాటు దబ్బలకు అందుతలెవ్వు. ఒకవేళ దబ్బల సంఖ్యను పెంచినా జడుపు ఎక్కువై ఇరుసు వంగుతుంది. చెర్రాలు దంగుతున్నయి. బాగా ఆలోచించి డిజిల్ ఇంజన్ కొనుక్కచ్చిండు ఎంకన్న. ఎప్పుడైతే నీళ్లు రాటుకు అందలేదో అప్పుడే భూమయ్యకు భయం మరింత ఎక్కువయింది.

రెండురోజులల్ల పైపులు ఇంజన్ కూసుండ వెట్టిండు ఎంకన్న. రాటుకు ఎడ్లు మనిషి పొద్దంతా తిరగాల్సి ఉండె. ఇప్పుడైతే ఇంజన్ చాల్‌జేసి కూసుంటే పారేదాక పురస్తు. స్టార్ట్ చేసేటప్పుడు మాత్రం హాండిల్‌తో నాలుగు చుట్లు తిప్పి హాండిల్‌ను ఒడుపుగా తియ్యాలి అంతే!

ఇంజను పొగను, చప్పుడును చూసి ఊరంతా భయపడ్డరు. పొగను పీల్చద్దని కొందరు, చప్పుడు వినద్దని కొందరు, రకరకాల పుకార్లు పుట్టినయి. ఎంకన్న వేటిని లెక్కచెయ్యలేదు. ఇంజన్ నడిపిస్తనే ఉన్నడు. తాలూకానుంచి డీజిల్ ఆయిల్ బారిల్‌ను ఎడ్ల బండి మీద పెట్టుకొచ్చిండు.

ఇంజన్ డబ్ డబ్ డబ్ అంటూ నీళ్లను ఎత్తిపోత్తుంది. రెండు రాట్ల నీళ్లు పోత్తుంది. కాస్తు రెండెకురాల నుంచి మూడెకురాలకు పెరిగింది. పొద్దున గంట, మాపున గంట నడుత్తుంది ఇంజన్. ఎక్కువ సేపు నడిస్తే గరమైతుందని గంటనే నడుపుతున్నడు ఎంకన్న.

వరి అలుకుడు మానేసి నాటు పెట్టిండు ఎంకన్న. తండ్రి పొలమంతా మొలుక అలికి రెండురోజులు ఆరగడుతుండె. ఎంకన్న నారుమడిపోసి నాటు పెట్టుతున్నడు. మొదట అందరూ విచిత్రపడ్డరు.

ఒక్కసారిగా ఊరు ఊరేమారిపోయింది. అందరూ నాట్లు పెట్టడమే చేసింద్రు.

ఎంకన్న ఇంజన్ నీళ్లను ఎత్తెత్తిపోత్తుంది. ఎంకన్న పేరు ఇంజనెంకన్నయింది. చెరువు నిండినా ఎండినా పనిలేకుండా మూడెకురాలు పంట పండుతుంది. కొమ్మల్ని

కొట్టి పొలంలో తొక్కి పెండను పోసి పంట తీస్తున్నడు ఎంకన్న. మొదటిసారిగా నల్లారి వడ్ల పంట గుమ్ములల్ల పట్టకపోతే గరిశె కట్టిండు ఎంకన్న.

వాగులల్ల ఒర్రెలల్ల పుష్కాల్లం నీళ్లు పారుతున్నయి. ఒడ్డున ఉన్న భూములు మొదట ఎడ్ల కంచెలుండె. తర్వాత పునాసపంట భూములయినయి. వాగుకు, ఒర్రెకు మోట పెట్టరాక, రాటు పెట్టరాక, పునాస భూములు పునాసభూములుగానె ఉండి పోయినయి.

ఇప్పుడు ఎంకన్న ఇంజన్ చూడంగనే వాగుగడ్డకు భూములున్న తురుక దొరలకు పటేండ్లకు, ఇంజన్‌మీద యావపుట్టింది. ఇంజన్ సంగతి ఎంకన్నకు తెలుసుగదా! అని ఎంకన్ననే తోలుక పోయి ఇంజన్‌లు తెచ్చుకున్నరు. గుట్టమీదికి నీళ్లు ఎక్కించిండ్రు.

ఒక్క దెబ్బకే వాగు దారనే తగ్గింది.

పునాస భూములల్ల పునాసపంటలు పండంగనే, ఆరునెలల పొద్దు ఆవులను తింపుదురు. నీరావపంటలయినంక, పిట్ట వాలుదామన్నా తావులేకుంటయింది. ఆవుల మందలు పూర్తిగా దగ్గరికచ్చినయి. కొన్నిటిని అమ్ముకున్నరు. కొన్ని మ్యాతదొరుకక ఈడ్సుక పోయినయి. దొడ్లల్ల ఐదు ఆరుకంటే ఎక్కువ లేకుంటయినయి ఆవులు.

ఇప్పుడు ఊర్లె రాట్లు లెవ్వు. రాటుబాయిలు నాలుగైదు గజాల లోతు తెగి ఇంజన్ బాయిలైనయి. చెరువుపారుకం ఉన్నోళ్లకు చెరువు నీళ్లే పారుతున్నయి. చెరువు పారుకం లేనోళ్లకు ఇంజన్‌బాయిలే ఆధారమయినయి. ఆనీళ్లను, పారుకంను, పంటను చూసినంక 'అప్పయితేకానీ.....ఒక్క రెండు పంటల మీద తేర్పుతం' అని తెగారం జేసి ఇంజన్‌ను కొనుక్కస్తున్నరు.

భూమయ్య "నీళ్లురో.... నీళ్లురో" అని మొత్తుకుంటనే ఉన్నడు.

ఏ ఇంజన్ తెచ్చినా, ఎక్కడ ఇంజన్‌పాతినా ఇంజనెంకన్న ఉండాల్సిందే. మొదట మొదట హండిల్ గొట్టి చాల్ జెయ్యాల్సిందే! హాండిల్ ఎట్లా కొట్టాలో, ఎట్లా ఊడ బీకాలో నేర్పాల్సిందే!

ఇంజన్ వచ్చినంక సాగుపద్దతిలో మార్పే వచ్చింది. ఒకవైపు చెరువు పారుకం మరోవైపు ఇంజన్ పారుకం, ఆయకట్టు పెరిగినంక ఆవులు తగ్గినంక పెండ ఎరువు సరిపోత లేదు. నీరావకు కొమ్మలు తొక్కుతున్నరుగనీ పునాసకైతే పెండ ఎటూ సరిపోతలేదు. ఎరువుల అవుసరం ఏర్పడింది. అవసరాన్ని గుర్తించిన సావుకార్లు ఎరువు సంచులను అమ్ముతున్నరు.

మొదటిసారిగా ఎరువు వేసింది ఎంకన్ననే. మక్క కర్రలకు వేసిండు. కశికతో కొలుచుకుంట కొలుచుకుంట వేసిండు. మందు వేసిన కంకులని ఆయేడు ఎవలూ ఒక్కకంకి తినలేదు. పనిపాటలోళ్లు గూడా ఎంకన్నను బుచ్చం అడుగలేదు. మక్కలన్నీ తక్కువ ధరకే అమ్మిండు ఎంకన్న. కట్టె, పెండలేక కొన్ని భూములు వట్టిపోయినంక





తప్పని పరిస్థితిలో ఎరువులు వాడుతున్నారు రైతులు.

ఎరువు చల్లేటప్పుడు ముక్కుకు మొఖానికి చేతులకు బట్టలు కట్టుకుంటున్నరు. తక్కువలో తక్కువ మడికి దోసెడో, పురిసెడో, ఇసుకలనో, మన్నులనో పెండ ఎరువులనో కలిపి చల్లుతున్నరు. మందు చల్లిన పంటను తిండికి ఉంచుకుంటలేరు. సావుకారికే అమ్ముతున్నరు.

సాగు, నీరావ ఎక్కువ కావడంతో వరి తిండికి అలవాటు పడ్డంక కూరుకురాత్రే లేచి కుందెన కుదురులు పెట్టి వడ్ల దంపుకం చేసేవారు. మొగవాళ్లు మోటకు పోతే ఆడవాళ్లు వడ్లను దంచేవారు. మోట తప్పి మొగవాళ్లకు, దంపుకం తప్పి ఆడవాళ్లకు పొద్దున లేచే పని తప్పింది. పొద్దుపొడుపు ఎండ మీద చీపురు దుమ్ము పారితే పాపమని ఆడవాళ్లు మాత్రం పాచిపనికి పొద్దున్నే లేస్తున్నరు.

గండీగలుమను చేను చెలుక బుంగ బుట్ట చూసుకుని మడ్లల్ల నీళ్లు నిలువ ఉన్నయో లేదా చూసుకోవడానికి మబ్బుతో లేచి పొలం ఒడ్ల వెంట తిరుగుతున్నారు ముసలివాళ్లు.

ఎల్లవ్వకు కూరుకు రాత్రే లేచే అలవాటు. లేచి ఇల్లు వాకిలి పాచిపని చేస్తంది. భూమయ్యకు కూరుకురాత్రే లేచే అలవాటు. లేచి పొలంగట్లు తిరుగుతున్నడు. లచ్చిమికి, ఎంకన్నకు పొద్దున లేవాలనిపించడం లేదు. ఇద్దరూ భయానికి లేత్తున్నరు.

ఒకనాడు కుంపటి దురగాలిపోయినా కలుపు కలువ రాకపోయినా నాటు వెయ్యరాకపోయినా మొఖం ముందే తిడుతుండు భూమయ్య లచ్చిమిని. ఉప్పు పప్పులు మల్లె సల్ల వెట్టి తాళమేసుకుంటుంది ఎల్లవ్వ. అడుగడుగునా అరికెలు పడుతుంది. లచ్చిమికి సలి గటుక పెడుతుంది. ఒక నాడు సలిగటుక పెట్టిందని తల్లికి చెప్పినందుకు రెండిండ్లకు కొట్లాటయింది.

నాయింట్లకు ఎందుకు ఇచ్చినవని భూమయ్య ఈరుమారు తిట్టిండు. ఆనాటి నుండి లచ్చిమికి కాల్పులు ఎక్కువయినయి. అయినా ఒక్కనాడు ఒక్కలతోని ఏ ముచ్చటా చెప్పలేదు. ఒకనాడైతే తూమెడు వడ్ల ముల్లె ఎత్తిండ్రు. ఎన్నడూ బరువు మొయ్యలేదు. కండ్లపొంటి పటపట నీళ్లు వడుత్తున్నయి. ఎంకన్న ఎదురచ్చి ముల్లెను అందుకుంటెనే ఏమంటరోనని పాణం గజగజ వణికింది లచ్చిమికి.

## 12

దన దన దన దన దప్పు సప్పుడు. మాదిగ మైసడు జాటిత్తుండు.

"కరెంటు తంబాలు నాటాలె. పొక్కలు తవ్వాలె.....వైర్లు గుంజాలె...ఇంటికొక్క మనిషి రావలె. రానోల్లకు రూపాయి పావుల జురుమానా" అని వాడ వాడలా జాటిత్తండు.

ఊరు ఉలిక్కి పడ్డది. కరంటు పేరు విననివాళ్లు చాలమందే ఉన్నరు. చూడని వాళ్లు ఎక్కువనే ఉన్నరు. అప్పటికే పొయ్యి మారింది. దీపం మారింది. దీపొంతలల్ల

ఆందెమే దొరుకకుంటయింది. నీరావ పంటలైనంక ఆందెం పంటనే తగ్గింది. ఇంటింటికి దీసోడల మీద ఎక్కలు, కందిల్లు వచ్చినయి. కోమట్లు రెడ్ల చేతుల్లనైతే టార్చి లైట్లుంటున్నయి. గ్యాసునూనెను అమ్ముతున్నరు.

"ఎంకన్నా.....కరెంటు ఏందిరా.......పొక్కలెందుకురా"....అర్థం కాక అడిగిండు భూమయ్య. కరెంటు గురించి వివరంగా చెప్పిండు వెంకన్న.

"ఊర్లె అట్ల అనుకుంటలేరు బిడ్డా........" అన్నడు భూమయ్య.

"ఏమనుకుంటుండ్రే.......''ఎంకన్న అడిగిండు.

"తీగలతోని ఉరివెట్టి సంపుతరట బిడ్డా....తీగల కింద నిలవడితే సగం బలం పోతదట. తీగలను అంటుకుంటే ఇడువదట. రక్తాన్ని పీల్చుకుని రామగుండంల పోత్తదట" అన్నడు భూమయ్య.

ఎంకన్నకు నవ్వు వచ్చింది. "అట్లగాదు నాయినా.....కరెంటు మన మంచికే... ఇంట్ల దీపాలు వెలుగుతయి. బజార్ల లైట్లు ఎలుగుతయి. కరెంటుకు ఇంజన్లు నడుత్తయి నాయినా....ఇప్పుడు ఇంజన్ హండిల్ గొట్టుడు డీజిల్ పోసుడు కష్టమయితుంది గదా! కరంటు మోటర్లు వచ్చినంక స్విచ్‌వేస్తేనే నడుత్తయి. మోటర్ గరమైతదన్న భయంలేదు. ఎంత సేపంటే అంతసేపు పారుతది. ఇప్పుడు మూడెకురాలు పారుతుందా. అప్పుడు ఐదెకురాలు పారుతది" అన్నడు.

ఎంకన్న వైపు నమ్మలేనట్టుగా చూసిండు భూమయ్య. ఇప్పుడు ముందటి లెక్కన చాతనైత లేదు భూమయ్యకు. ఎల్లవ్వకు కూడా చాతనైతలేదు. పిల్లలను పట్టుకుని ఇంటిపట్టునే ఉంటుంది. ఎంకన్నకు ఇద్దరు బిడ్డలు ఒక్క కొడుకు. కొడుకు పెద్దోడు. బట్టుబడికి పోతున్నడు. చిన్నబిడ్డ పాలు మరువని పిల్ల. పెద్దది అప్పుడప్పుడే ఈడేరి ఆట మీద పడ్డది.

ఎంకన్న తట్టపార పట్టుకుని తన వంతుకు స్థంభం పొక్క తియ్యడానికి పోయిండు. గుట్ట మీద రెండు నిలువుల పొక్క తవ్వివచ్చిండు. అందరు ఒక్కరోజు రారని ఎవల పొక్కను వాళ్లకు పంచిండ్రు పెద్దమనుషులు. ఎవల వాటమున్నప్పుడు వాళ్లు వెళ్లి తవ్వి వస్తున్నరు.

తనకు ఒక్కడే కొడుకంటే తన కొడుక్కు కూడా ఒక్కడే కొడుకని ఎల్లవ్వకు మనసు నిండుతలేదు. ఎప్పుడూ అదేమాటను కలువరిత్తంది.

"ఒక్కడే కొడుకని ఉద్దరిచ్చినవు తియ్యి....అప్పుడు కొలువు మీద తోలితే ఎంత మంచిగుండు. కొలువుల మీద పోయినోళ్లు ఎంత సుఖంగున్నరు. మేమెట్ల ఉన్నము..." యాష్టగా అంటుంది లచ్చిమి.

"ఏందే......ఏం కొలువే......బాయిల నీళ్లు బజార్ల బియ్యం. కాయ, పండు, ఉప్పు పప్పు పండిచ్చుకుని తిన్నంత అంగాముంటాదే.....నాలుగు కాలాలు ఎండలల్ల





వానలల్ల తిరిగిన మనుసులు జూడు. నీడపట్టుకున్న మనుషులు జూడు." అంటుంది ఎల్లవ్వ.

ఎల్లవ్వ అన్నల కొడుకులందరూ ఏరువడ్డరు. మొదట ఉన్న మూడు ఇండ్లు ఇప్పుడు పన్నెండు ఇండ్లయినయి. ఎల్లయ్య పాము కరిచి చచ్చిపోయిండు. ఇంటికి రెండు మూడు బర్లున్నయి. నీళ్ల పట్టు ఉంటేసాలు తుంగ దుట్ట నమిలి నీళ్లల్లనే బొర్రుతయి బర్లు. అటు చెరువు, ఇటు వాగు కావలసినంత నీళ్లు. నీళ్లల్ల పన్నదంటే బర్రె పొద్దుగూకేదాకా లెవ్వది. ఇట్లా బర్ల సంతతి పెరిగింది. తిరిగే మైదానంలేక ఆవుల సంతతి తగ్గింది.

ఎంకన్న దొడ్లె ఒక్కటే ఒక్కటి తెల్లావు ఉన్నది. అదిగూడా ముసలిదయింది. దొడ్లె నుంచి కదులుతలేదు. భూమయ్యనే పచ్చిగడ్డి, నీళ్లు తెచ్చిపోస్తున్నడు. ఆవులు లేక దొడ్లు బోసిపోతున్నయి. ఎడ్లకు బదులుగా పోతులు నాగలి దున్నుతున్నయి. ఎడ్లు పోతులు కలిసి దొడ్లెనే ఉంటున్నయి. నాగలి ఇడువంగనే ఎడ్లను మలుపు కస్తున్నడు భూమయ్య. ఇంజన్‌లు వచ్చినంక భూమయ్యకు మరింత కలవరం పెరిగింది.

అటు కరంటు స్థంబాలు పాతంగనే, పెద్ద పెద్ద వైరు తీగలు లారీల మీద దిగినయి.

పట్టుర పట్టు ఐసో.... పట్టే పట్టు ఐసో.....పట్టీనోనికి ఐసో....పప్పుచారు .....ఐసో .....పట్టానోనికి ఐసో.......లంజేసాడు....ఐసో అంటూ వాడవాడలా పాటల మోతలు, బొబ్బలు కేకలు. ఇండ్లల్ల జనం భయపడ్డరు. పెండారి దండోళ్లు వచ్చిండ్రని ఊరంతా పుకారు.

పిల్లలంతా ఇండ్లల్ల జొరబడి తలుపులేసుకున్నరు. పొద్దంతా ఊర్లె ఉండెది ముసలోళ్లు పిల్లలే. ముసలోళ్లు గూడా భయపడ్డరు. పాలియ్యడానికి వచ్చే తల్లులకు ఏ ఇల్లు చూసినా మూసే కనబడేది.

లారీలల్ల వచ్చిన మనుషులు వైరు చుట్టలను దొర్లించుకుంటూ వాడ వాడ తిరిగి స్థంబాలకు వైర్లు చుడుతున్నారు. దూపపుట్టి నీల్లు తాగుదామన్నా ఎవలూ తలుపు తీస్తలేరు. ఆ నెలా రెండు నెలలు ఊర్లె చిన్నపిల్లలకు తల్లులు కరెంటోల్లకు పట్టిస్తనని భయం చెప్పుకున్నరు.

రెండు నెలలకు బజారు లైట్లు ఎలిగినయి. కోమట్లు ఇద్దరు ముగ్గురు, పటేండ్లు, పట్వారీ, పోలీసు పటేలు దొరవారి గడికి మీటరు కొనుక్కుని ఇంట్లకు కరెంటు తీసుకున్నరు.

కరెంటు ఎలుగు చూస్తే కండ్లు పోతాయని పొద్దు గూకితే చాలు భూమయ్య చీకటి అర్రల కూసుంటున్నడు. ఇంట్లకు కరంటు తెచ్చుకుంటే ఎప్పుడో ఒకప్పుడు ఇల్లు బగ్గున మండుతదని ఎల్లవ్వ భయం. అందుకని కరంటు ఉన్న కోమటి బుచ్చమ్మ ఇంటికి పోతనేలేదు.

తల్లికి తండ్రికి సర్ది చెప్పిండు ఎంకన్న. ఒకనాడు బలవంతంగా తండ్రిని తెచ్చి

వీధిలైటు కింద కూర్చోబెట్టిండు ఎంకన్న. తోడుగా మనుమడు మల్లేశం కూసున్నడు.

తాత భయం చూసి మల్లేశం నవ్వుతున్నడు. ఎప్పుడన్నా అడిగింది ఇయ్యకపోతే కరెంటు వైరు ఇంట్లకు తెత్తనని తాతను అమ్మను భయపెడుతున్నడు.

చుట్టూ ఇంజన్‌లు ఎత్తిపోత్తుంటే పదేండ్ల పొద్దు ఆపిన బాయిలు, మెల్ల మెల్లగా బోర్లవడ్డయి. ఏటేటా పూటిక తీసి జానెడో మూరెడో తవ్వితే ఊరే ఊటలు ఇప్పుడు ఊరుతలెవ్వు. ఏకంగా నాలుగు గజాల బాయి దంచిండు ఎంకన్న. ఊటలు మళ్లినా నీళ్లు లోతులో పడటంతో ఇంజన్ నీళ్లను ఎత్తుకుంటలేదు. ఇంజనును నడిబాయిలకు దించితే నీళ్లను ఎత్తుకుంటుంది. నడీబాయిల గడ్డను తవ్విపెడితే ఆయిల్ పోయడానికి హాండిల్ కొట్టడానికి ఎక్కడం దిగడం కష్టమయితుంది. ఒకసారి హాండిల్ కొట్టబోతూ బాయిలో పడ్డాడు ఎంకన్న. కొద్దిలో పాణం దక్కింది.

అందుకని కరెంట్ మోటర్ పెట్టాలనుకున్నడు ఎంకన్న. కరెంటు మోటరైతే ఎక్కడపెట్టినా ఎక్కుడు దిగుడు ఉండదు. స్విచ్చు గడ్డమీదనే ఉంటది. ఎప్పుడు నొక్కితే అప్పుడు నడుస్తది. కరెంటు మోటరు తెస్తానంటే ముందుగా వద్దన్నడు భూమయ్య. ఎల్లవ్వ కూడా భయపడింది.

ఎవల మాట వినకుండ మోటర్ తెచ్చిండు ఎంకన్న. మోటర్ నీళ్లు పోసిన్నాడు తల్లిదండ్రులు పిల్లలతో అక్కడికే పోయిండు ఎంకన్న. బావమరుదులను పిలుచుకున్నడు. మేకను కోసిండు. మోటర్ నీళ్లు ఎత్తిపోస్తుంటే విచిత్రంగా చూస్తున్నడు భూమయ్య. ఇంజన్ కంటే ఎక్కువ నీళ్లనే ఎత్తిపోత్తుంది. అంతచప్పుడు కూడా లేదు.

ఎంకన్న మోట పొలం మొత్తం అచ్చుకట్టిండు. ఐదెకురాల పొలం. గడ్డమీది చెట్లను, తండ్రి పెట్టిన మామిడి చెట్లను, నీడన్నది లేకుంట నరికి మొత్తం అచ్చుకట్టిండు. ఐదెకురాల పొలం ఇప్పుడు రెండు పంటలు పండుతుంది.

జనం ముందటిలా లేరు. ఎంకయ్య యాతం పెట్టినప్పుడు మోట గొట్టినప్పుడు, భూమయ్య రాటు తెచ్చినప్పుడు, ఎంకన్న ఇంజన్ తెచ్చినప్పుడు జాతర సాగుదురు. అదేంది ఇదేంటిదని అడుగుదురు. ఇప్పుడు ఎవలంతలవాళ్లే సదురుకుంటున్నరు. సైకిండ్ల మీద తిరుగుతున్నరు. ఊరు అంచునుంచి పొద్దున ఒకటి మాపున ఒకటి బస్సుపోతుంది. ఎములాడ దేవునికి మొక్కుకుంటున్నరు. ఆమెడ దూరం నడిచి బస్సెక్కి మొక్కును చెల్లించుకుని వస్తున్నరు.

భూమయ్య ఎన్నడూ అనుకోలేదు. ఇక్కడున్న ఐదెకురాలు సాగయితదని. చిన్ననాడు యాతం బొక్కెన ఎత్తుకచ్చి యాతం బోసి అలికిన ఒక్కమడి, బువ్వ తినాలనే ఆరాటంతో చేసినా, అది రోజరోజుకు పెరుగుతుందని ఎన్నడూ ఊహించలేదు.

అదొక్కటే కాదు. ఊరు మొత్తం పంట చేన్లతో నిండిపోతుందని కూడా అనుకోలేదు. నాలుగు అడుగులు కిందికి దిగితే ఈతవనం. జేబుల నిండా ఈతపండ్లు.





మామిడివనం, చింతవనం, చిప్పలివనం. తీరొక్కపండు, కాయ. వాటిని తిని కడుపు నింపుకునే జనం.

ఇప్పుడు చెట్టులేదు. చేమలేదు. అన్నీ పొలాలె. ఎప్పుడైతే కరెంటు తీగలు వచ్చినయో, కరంటు మోటర్లు పెరిగినయి. చెరువు పారుకాలకు గూడా అందని జాగల బాయిలు తవ్వి మోటర్లు పెడుతున్నరు. వాగు పొంట, మడుగులల్ల, ఒర్రెలల్ల ఎక్కడ నీటి మడుగులుంటే అక్కడ మోటర్లు వెట్టి బీడు గుడ్డాలన్నీ సాగుచేస్తున్నరు.

ఊరు బంగారమయింది. ఊర్లె బంగారు వాసనత్తుంది. పైసలు ఎక్కువయినంక అవసరాలు పెరిగినయి. మడిగెలు దుకాండ్లయినయి. సావుకార్లు సేట్లయిండ్రు. కొత్త విత్తనాలచ్చినయి. కొత్త ఎరువులచ్చినయి. పంటలు ఉసికెపాతరలయినయి. భూమయ్యకు మాత్రం నీళ్లరంది పట్టుకుంది. తండ్రిని చూసి ఎంకన్న నవ్వుతున్నడు.

రైతులు పైసలు సంపాయించుకున్నరు. రైతులతో ఉన్న కూలీలకు పొట్ట గడుత్తుంది. పనిపాటలోల్లకు ఆదాయం వస్తుంది. చేతినిండా పని ఉంది. చేతులల్ల పైసలు ఆడుతున్నయి. ఖర్చులు పెరుగుతున్నయి. ఆడంబరాలు పెరుగుతున్నయి. కొందరైతే కరెంటు మోటర్ల దగ్గెరనే ఇండ్లు కట్టుకుంటున్నరు.

" ఎంకన్నా... ఒంటిగానివైనవు బిడ్డా... మల్లేశన్ని ఎవుసముకు తియ్యి. ఎనుకుంటే ముందులేరు. ముందుంటే ఎనుకలేరు. ఎంబడ సద్ది పట్టుకుని వత్తడు." భూమయ్య కొడుకుతో అన్నడు.

"నాయినా... నా జీవితమే పాడయింది. వీన్ని సదువుల నుంచి తియ్య. పెద్ద ఆఫీసరు కొలువుజేపిస్త..." భూమయ్యతో అన్నడు ఎంకన్న.

కొడుకును చూస్తుంటే భూమయ్యకు బాధగా అనిపిస్తుంది. ఆయకట్టు పెరిగినంక పని పెరిగింది. ఒక్కటే నాగలితో మొత్తం దున్నుకం దున్నుతున్నడు. బామమరుదుల కొడుకులకు, కొడుకులు చేతికి అందిండ్రు. నాగలి దగ్గెరికి సద్ది తీసుకపోతున్నరు. నాగలి ఇడువంగనే ఎడ్లను కాస్తున్నరు. చేతికింద నాలుగు పనులు చేస్తున్నరు. కరెంటు పెడుతున్నరు.

ఎంకన్న ఒంటిగాడయిండు. పగటియాల్లదాక నాగలిదున్ని ఎడ్లను కాయాలె. అటు ఎడ్లను కాసుకుంటనే ఇటు ఒడ్లు పెట్టాలె. ఎడ్లు ఎటో పోతయి. ఎడ్ల కొరకు తిరిగితే, ఒడ్లు ఇక్కడనే మిగిలిపోతయి. గుత్త వట్టుకున్నోల్లు మెడమీద కూసుంటరు. వీళ్లకు నారు పంచిపెడితే దున్నుకానికి ఎవలు లేరు. దున్నుతుంటే నారు పంచుడుకు ఎవలూలేరు.

లచ్చవ్వ రోగాల కుప్ప. లచ్చవ్వనే అంటే అంతకంటే రోగాలు పిల్లలకు, పొద్దున వచ్చేటప్పుడు మంచిగనే ఉందురు. ఇంటికి పోయేసరికి కక్కుడో, బైలో, జ్వరమో వస్తుండె. ఈ మధ్యనే తల్లి బాగలేదు. మంజేరి జరమచ్చింది. భూమయ్య చాతనైనన్ని రోజులు ఎడ్లను మలిపిండు. చేనుకు, చెలుకకు ఆసరయిండు. ఇప్పుడు నడువ చాతనైతలేదు.

కట్టెపట్టుకుని నడుత్తుండు. కొడుకు గోసను చూడలేక ఎడ్లను మలుపుతున్నడు గానీ, ఎక్కడన్నా పడిపోతడని ఎంకన్ననే వద్దంటుండు.

మల్లేశం ఊర్లె ఐదోది పూర్తికాంగనే లింగన్నపేట్ల చదువుతున్నడు. ఏరు ఏరోలె మనిషి సుడిగాలి వస్తే సుట్టుకపోయేతట్టున్నడు. రోజూ ఐదామెడ నడుక. ఆనడుకను చూసే చదువద్దంటుంది లచ్చవ్వ.

"అయ్యా....ఏంగోసిది. పొల్లగాడుంటే కాలుకో చేతుకో ఆసరుంటడు. సదివిన కాడికి సాలు తియ్యి. వాడు ఏరుఏరోలె ఉన్నడు. వానకో ఎండకో కిందవడితే నోట్లె మన్నువడుతది" అంటుంది లచ్చవ్వ.

భూమయ్య గూడా చెబుతున్నడు. ఎవల మాట వింటలేడు ఎంకన్న. "మల్లేశంను చదివించుడు చదివించుడే. ఎవుసం ఎల్లకుంటే భూమిని అమ్ముతగనీ చదువు ఆపుడులేదు". అంటున్నడు.

అదే ఏడు తల్లి చనిపోయింది. తల్లి ఉన్నంత సేపు ఇంట్లో దిక్కు దీము ఉంటుండె ఎంకన్నకు. లచ్చవ్వకైతే సగం ఆసర ఉంటుండె. వచ్చేసరికి ఎసరువెట్టి బువ్వండుతుండె. ఇల్లు వాకిలి ఊడుత్తుండె. పిల్లలను పట్టుకుంటుండె. బర్లను కట్టేసి కుడిదిపోస్తుండె. ఎల్లవ్వ చనిపోతే రెండు మూడు నెలలు మనిషి కాలేదు ఎంకన్న.

ఇప్పుడు చేను చెలుక తిరిగి వచ్చేసరికి మసుకువడుతుంది. ఇంటికచ్చి ఇవన్నీ సదురాలంటే యాష్టకత్తుంది. మెల్లగ కొడుకును బుదురకిచ్చింది లచ్చవ్వ. పైసిత్త చెక్కరి గోళీ కొనిత్తనని ఆశపెట్టింది. మల్లేశం బడి నుంచి రాంగనే ఇల్లు ఊడ్చి ఎసరు వెట్టి బువ్వ వండుతున్నడు. చెల్లెండ్లను బుదురకిచ్చి పని చేయిస్తున్నడు. నీళ్లకు ఇంటి ముంగట బోడబాయి ఉంది. చెల్లెండ్లను బాయి దగ్గరికి మాత్రం పోనిస్తలేడు. నీళ్లు మాత్రం తనే చేదుతున్నడు.

తల్లివచ్చేసరికి గంగాలం, గోళం నీళ్లతో నింపి పెడుతున్నడు. పువ్వులు పువ్వులోలె కుండనిండా బువ్వ వండుతున్నడు. ఇల్లును అద్దం అద్దమోలె ఊడుత్తున్నడు. బర్లను కట్టేతున్నడు. కుడిది కుండలు లెవ్వయని పోస్తలేడు. తల్లి వచ్చేసరికి దీపం ముందు కూర్చొని రాసుకుంటున్నడు.

ఇంత పని చేసినా భూమయ్య మనుమన్ని తిడుతనే ఉన్నడు. "నీరాతకునా.... వెడుదు. ఏంరాత్తన్నవు. గుడ్డి కొమటోడు గద కంట్లె కన్ను వెట్టుకుని రాత్తున్నటు దీపం ముంగట వెట్టుకుని రాత్తున్నవు. గా దొడ్డి మొకాన పో....." అంటున్నడు.

"దొడ్లేముందినా.....డ్డుందా.......ముసలోనికి రేగిందిరా.....ఎక్కతక్క నీలిగితే.... కరెంటు తీగ వెడుత" గడుసుగా అంటున్నాడు మల్లేశం.

తాత మనుమలిద్దరికీ గడియ పడుతలేదు. ఎప్పుడు ఏదో ఒకటి తిట్టుకుంటనే ఉన్నరు. ఇద్దరు బిడ్డలు బీడీలు నేర్చుకుంటున్నరు.





గుట్టకింద చేను యాతం పొలంగా, యాతం పొలం మోటపొలంగా...... మోటపొలం రాటు పొలంగా, రాటుపొలం ఇంజన్‌కాడగా....ఇప్పుడు కరెంటు పొలంగా మారింది. ఎప్పుడన్నా కరెంటు కాడికి బాయి దగ్గరికి పోతున్నడు మల్లేశం. బాయి దగ్గర ఒకటి రెండు కానుగు చెట్లున్నయి. చెట్ల మొదలు మీద మొలతో పేరు రాసుకుంటున్నడు. మల్లేశం. కరెంటు లేనప్పుడు బాయిల ఈత గొడుతున్నడు.

ఎండాకాలమైతే వాగుపొంట మడుగులల్ల చాపలు వడుతున్నడు. ఈతలు కొడుతున్నడు. నువ్వు ఉన్నదే ఏరులెక్క ఉన్నవు. ఏమడుగులనన్నా దమ్ము ఎల్లక సత్తవని లచ్చవ్వ కొడుకును తిడుతుంది. మల్లేశం మాత్రం దొంగతనంగా వాగులు మడుగులు తిరుగుతనే ఉన్నడు.

ఎనుకటనైతే వాన వచ్చుడు పానం పోవుడు ఎవలకూ తెలువదు అందురు. కరెంటు మోటర్లు ఎక్కువై మీటర్లు ఎక్కువయినంక, కరెంటు వాడుకం పెరిగినంక, "కరెంటు వచ్చుడు పాణం పోవుడూ ఎవలకూ తెలువదు". అంటున్నడు ఎంకన్న.

కరెంటు వచ్చినప్పుడు స్విచ్చు ఒత్తాలె. స్విచ్చు ఒత్తి ఇంటికి వస్తుండో లేదో కరంటు పోతుంది. మళ్లీ వచ్చినప్పుడు స్విచ్చు ఒత్తితెనే నడుస్తది. మంటర మంటబాయి దగ్గెరికి పోయి మళ్లా స్విచ్చు ఒత్తాలె. కొద్దిసేపుండి ఇంటికి వచ్చినంక కరెంటుపోతేసున్నా. మళ్లీ ఉరుకుడే.

చేసేదేం లేకపోయినా మోటరు వెయ్యడానికే నాలుగైదు చుట్లు తిరుగుతున్నడు ఎంకన్న. ఒక్కొక్కసారి రాత్రిపూట కూడా. లేదంటే పొలం ఎండుడే. యాసంగి పంటకైతే నిద్ర ఉంటలేదు ఎంకన్నకు.

బాగా ఆలోచించి ఆటోమెటిక్ షాటర్ తెచ్చిండు ఎంకన్న. కరంటు స్విచ్చు వెయ్యాల్సిన పనిలేకుండా మోటర్ దానంతట అదే నడుస్తుంది.

రావడం పోవడం మోటర్ పెట్టడం పని తప్పింది ఎంకన్నకు.

దున్నుకాల మీద పదిరోజులు కోతల మీద పదిరోజుల పని అంతే! మిగిలిన రోజులు పనేలేదు. ఐదెకురాలకు ఐదెకురాలు వరిపంటనే కాస్తు చేసినంక పునాస పంటకు తావులేకుంట పోయింది.

"ఎట్ల....వడ్లొక్కటి పండవట్టెగనీ...పప్పులు పండకపాయె. నూనెలు పండకపాయె" బాధపడింది లచ్చిమి.

"ఏ నియ్యవ్వ.....ఏదో ఒకటి పండుతుంది తియ్యి. దీన్ని అమ్మి దాన్ని కొనరాదా" అన్నడు ఎంకన్న. లచ్చిమికి కూడా నిజమే అనిపించింది.

"అట్లయితే అయెగనీ ఈ పొదువు వరి పెట్టద్దు మనం. ఏం వరి పాడైంది. దిక్కుమల్లెవరి. నడుముమంటి పెరుగుతుంది. మా అన్నలు చిన్నవరి తెచ్చింద్రు. మోకాలు ఎత్తే వుంటుంది. జానెడు జానెడు గొలుక వెడుతుంది." అన్నది లచ్చిమి.

"జానెడు గొలుక వెడుతుంది. నువ్వు బతుకుతవు సరే! గోజలకు గడ్డి సరిపోవద్దానే...అవ్వెట్ల బతుకాలె. గడ్డి ఎల్లద్దా" ఎంకన్న అన్నడు.

భూమయ్య పక్కనే కూసుండి కొడుకు మాటలనే వింటున్నడు. తరానికి తరానికి మధ్య మారిన ఆలోచనా ధోరణిని గమనిస్తున్నడు.

"ఆ....నీకున్నయి దొడ్డెడు గోజలని గడ్డిసాలదట గడ్డి. ఇంటి ముంగట ఒక్క బర్రె. దొడ్లెరెండు ఎడ్లు. ఈ మూడు తోకలకు ఐదెకురాల గడ్డిసాలదా" చిర్రెత్తుకచ్చి అడిగింది లచ్చిమి.

ఎంకన్నకు నిజమే అనిపించింది. నిజమేనే అంటే భార్య నెత్తిమీదెక్కి కూసుంటది. అందుకని మౌనంగా ఉండిపోయిండు. భార్యనే విషయాన్ని మళ్లీసాగదీసింది.

"పొట్టి వరి మూడు నెలలకే పండుతుందట. పంట బరుకతి ఉంటదట. పని తొందరగా దుగుతదట. కోతయినా మోతయినా పని అలుకగ ఉంటదట. యాసంగి అదే పెడుదాం" లచ్చిమి అన్నది.

"అట్లనే తియ్యి" అన్నడు ఎంకన్న.

అటో ఇటో వాన కాలం కోతలయినయి. యాసంగికి పనెక్కువ. పెండ జారగొట్టాలె. చెట్లన్నీ కొట్టి పొలమంతా సాపుచేసినంక యాప, కానుగ, చిప్పలి, జువ్వి చెట్లు లేకుండయినయి. కొట్టేటప్పుడు భూమయ్య చెప్పుతనే ఉన్నడు. ఎంకన్ననే "కాదునాయినా నీడుంటే పంట ఎట్ల పండుతది చెప్పు. వరి గండెక్కదా...." అని అన్నీ నరికివేసిండు.

"ఎంకన్నా....ఎట్లరా.....భూమికి ఆకుపెండనే బలం. కొమ్మలేకుండయిపాయె. ఏం తొక్కుతవు. ఏం పంట తీత్తవు. పెండ గూడా సరిపోయినంతలేదు. రెండెడ్ల పెండ ఏంసాలుతది" భూమయ్య అన్నడు.

ఎంకన్న నవ్వి "నాయినా...అందరు కట్టెపెండనే పోత్తున్నరా....అవి ఎవలకు దొరుకుతలెవ్వు. యూరియానే ఇంకో నాలుగు పిడికిళ్లు ఎక్కువసల్లితే సరి" అనుకుంటూ పొట్టి వడ్ల సంచుల్ని కొనుక్కచ్చిండు.

కొనుక్కచ్చిన విత్తనాల్ని చూడంగనే భూమయ్యకు భయమయింది. "వారీ ఎంకన్నా.... మనం కాపుదనపోల్లం బిడ్డా....కరిద్దోల్లం కాదు. అట్ల ఇత్తునాలు కొనుక్కత్తే బతుకుతమా... అది ఎవలు గట్టినయో ఏం కలిపినయో.." అన్నడు భూమయ్య.

ఎంకన్న మారు చెప్పలేదు. నవ్వి ఊకున్నడు. మొలుక మండె కట్టి దున్నుకం మొదలు వెట్టిండు. దుక్కి మీద పలుచగా దుక్కి మందు, నాటు మీద పలుచుగా యూరియా చల్లిండు. కట్టె పెండ నిండుగా తొక్కిన్నాడు గూడా వరి అంత పసందుగా లెవ్వలేదు. ఒక్కొక్కటి కంకెడు గంట. పచ్చగ లేచినయి. ఎంకన్న గానీ భూమయ్యగాని ఇంత వరకూ అంత బలంగా కర్రలను చూడలేదు.





కలుపు కలిచేయాల్లకు మెగిరోగం తలిగింది. పచ్చటి వరి మదిరెలు మదిరెలు ఎండిపోతుంది. ఏపుగా పెరిగినవరి ఎండుకపోతుంటే బాధగా అనిపించింది ఎంకన్నకు.

"అరే....ఎంకన్నా.....నీళ్లు చల్లాలెరా నీళ్లు....యాపాకు పొడి కలిపి చల్లి దీపం పెట్టి మొక్కాలెరా" అన్నడు భూమయ్య.

రెండుసార్లు అట్లనే చేసి చూసిండు ఎంకన్న. పురుగు చావలేదు. మరింత ఎగిరి మరిన్ని కర్రలకు పట్టుకుని పాడు చేసింది.

పంటపాడైపోయెనని తొక్కులాడుతుంది లచ్చిమి. వాళ్లను వీళ్లను అడుగుతుంది. ఎవల నేంది అడిగేదని ఎంకన్న తిడుతుంటే 'ధనముంటే దాసుకోవాలె. రోగమత్తే చెప్పుకోవాలె' అంటుంది.

వాళ్లకు చెప్పి వీళ్లకు చెప్పి ఎక్కడనో ఎండ్రీన్ డబ్బాను జాడ తెచ్చింది. కుండెడు నీళ్లల్ల కశికెడంత కలిపి సల్లితే పురుగు మొత్తం సచ్చిపోయింది. కలుపు తీసి మళ్ళీ పలుసగా యూరియా సల్లిండు ఎంకన్న.

వరి హంసాట ఆడింది. మోకాలెత్తు కర్రనేగనీ బలువుగా జానెడు గొలుక ఇడిసింది. పంటను చూస్తే కండ్లు తిరిగినయి. కల్లం వేసి కుప్పకొట్టి వడ్ల రాశిని చేసి తండ్రిని పొలం దగ్గెరికి తీసుకుపోయిండు ఎంకన్న.

వడ్ల రాశిని చూసి ఎంకన్న బొచ్చె సరుసుకున్నడు. భూమయ్యకు మాత్రం భయం పుట్టుకచ్చింది.

ఇన్ని వడ్లు ఇంట్ల దాయరాదు. ఇక్కడిదిక్కడ కల్లం మీదనే అమ్ముదాం. తిండిమందం తీసుకపోదాం అన్నది లచ్చిమి. ఎంకన్నకు నిజమే అనిపించింది. బుడ్డికొలుతకు సావుకారికి అమ్మి, తిండికి, పనిపాటల పెట్టుపోతల మందం బండి మీద తీసుకుపోయిండ్రు.

భూమయ్య చుట్ట అంటువెట్టుకుని చాలాసేపు రాశి ముందటనే కూర్చున్నడు. పొలాన్నంతా కలిజూసుకున్నడు. తాను తవ్విన యాతం పొక్క ఎంత పెద్ద బాయిగా మారిందో చూసుకున్నడు. వరిబువ్వ తినాలనే కోరికతో సాగుచేసిన రెండ్లు మడ్లు ఇయ్యాల ఎన్ని మడ్లయినయో చూసుకున్నడు.

బాయి దగ్గరికి వచ్చి నిలవడ్డడు. లోతును చూస్తే కండ్లు తిరుగుతున్నయి. హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది భూమయ్యకు. తన ఆలోచనకు తనకే భయం పుట్టింది. ఎందుకోగానీ చిన్నప్పుడు దొరవారి గడీల అన్నమాటలు గుర్తుకచ్చినయి. అప్పుడు తనుకూడా నవ్విండుగానీ చూస్తుంటే అదే నిజమయితుందేమోనన్న భయం కలిగింది. ముందు ముందు మంచి నీళ్లు దొరుకయన్నది నిజమే అనిపిస్తున్నది.

"ఒరే......ఎంకన్నా" కొడుకును పిలిచిండు భూమయ్య.

"ఏంది నాయినా" పంట పండిన సంబూరంలో ఉన్నడు ఎంకన్న. లచ్చవ్వ, పిల్లలు బాయిగడ్డమీద మంచెలో ఉన్నరు. చెట్లు కొట్టుకున్నంక నీడ కొరకు మంచెవేసుకున్నరు.

బాయి గడ్డమీదనే కూర్చున్నడు భూమయ్య. ఎంకన్న వచ్చి తండ్రి పక్కనే కూర్చున్నడు. నేను చిన్న గుండంగ ఈ మడ్లల్ల నీల్లు ఊరుతుండెనట. తర్వాత యాతం పొక్కలు ఎండి మోటబాయిలల్లనే ఊరినయి. ఇప్పుడు కరంటు బాయిలల్లనే ఊరుతున్నయి. అద్ద గజం పొక్క తవ్వితే ఊరే నీళ్లు ఇరువై ముప్పయి గజాలకు దిగినయి గదా.....రేపు నీ కొడుకు తరం ఎవుసం ఎట్ల జేస్తరురా....." అన్నడు భూమయ్య.

ఎంకన్న ఆనందంగా ఉన్నడు. ఆ విచారాన్ని చేదు నిజాన్ని నెత్తికెక్కించుకునే స్థితిలో లేడు. "ఆ......వాడు ఎవుసం ఎందుకుజేస్తడు. నౌకరి జేస్తడు" అన్నడు.

భూమయ్యకు కోపమచ్చింది. "నీ నౌకరి పాడుగాను. చేత్తే చెయ్యనిగనీ ఎవుసం చేసోటోనికత ఎట్ల. తాగుడుకు కూడా నీళ్లు దొరకయని బమ్మంగారు రాసుకున్నరట. అట్లనే ఐతదాఏంది.....?" అన్నడు భూమయ్య భయంగా.

ఎంకన్న చిన్నగా నవ్విండు. నవ్వి "నాయినా.....నువ్వు ఈ నడుమ కశీరుకాడికి పోయినవా......" అని అడిగిండు.

"పోయిన ఎందుకురా...?" అన్నడు భూమయ్య.

"అక్కడ మొన్న కొత్తగ బోరింగు ఏసింద్రు. తోకను కిందికి మీదికి కొడితే మూతిలనుంచి నీళ్లు వడుతయి. దానికి మోటర్‌ఫిట్ జేత్తే పాతాళం నుంచి నీళ్లను తోడుకత్తదట. భూమిల నీళ్లు కరువుపోయినయా నాయినా.....నువ్వు 'గూడ' వేసిన్నాడు పైస ఖర్చులేకుండె. గూడ తట్ట అల్లుకున్నవు. యాతం పెట్టిన్నాడు 'గూడ' కంటే శ్రమ తగ్గింది కానీ బొక్కెనకొనే ఖర్చు పెరిగింది. మోటనాటికి......మోట నుంచి రాటునాటికి.......రాటు నుంచి ఇంజన్....ఇంజన్ నుంచి మోటర్....మోటర్ నుంచి....ఆటోమాటిక్‌షాటర్ నాటికి శ్రమ తగ్గుతూ ఖర్చు పెరుగుతూ వచ్చింది. ఖర్చుతోపాటూ పంట ఆదాయం పెరిగింది. పైసలుంటే ఏదైనా చెయ్యచ్చు నాయినా....." ఎంకన్న అన్నడు.

ఎంకన్న విశ్లేషణ అర్థమైనా....అతనికి దూరదృష్టి లేదని తెలిసిపోయింది భూమయ్యకు.

"ఖర్చు పంట కాదురా....నాతరంలో తవ్విన సర్కారు బాయితో షాదబాయిలు ఎండిపోయినయి. నీతరంలో తవ్విన బోరింగుతో సర్కారు బాయి ఎండిపోయింది. రేపు ఈ బోరింగ్‌బోర్లవడితే ఊరిగతి ఎట్లా.......?అని" బాధగా అన్నడు భూమయ్య.

తండ్రి ఆవేదన ఏంటిదో అర్థంగాలేదు ఎంకన్నకు. చెరువు నిండా నీళ్లున్నయి.





వాగుపారుతుంది. ఊర్లె బాయిలల్ల నీళ్లున్నయి. బయట ఊరిమోటర్ బాయిలల్ల నీళ్లున్నయి. నీళ్లగురించి తండ్రికి బెంగ ఎందుకో అర్థం కాలేదు. అదే విషయాన్ని తండ్రితోని అడిగిండు ఎంకన్న.

భూమయ్య విచారంగా "దోసెడు మన్ను దీత్తె దోసెడు నీళ్లు ఊరిన కాలాన్ని చూసినోన్ని. ఇంటి దగ్గర బయిలెల్లితే మోటబాయి దగ్గరికి పోయేసరికి నాలుగు దల్లుల వానను చూసినోన్ని. పొద్దున దాటేటప్పుడు మోకాల్లలోతు ఉండి, మాపున వచ్చేసరికి బొండిగె మునుగ వాగులు దాటినోన్ని. అట్లయాడుంది బిడ్డా. వానలు గుంజినయి. వాగులు గుంజినయి. వాన కొడుతుందా అంటే కొడుతుంది. వాగు పారుతుతందా అంటే పారుతుంది. అడివి చూసినవా...ఊరు దాటితే భయమయితుండె. ఇప్పుడు పిట్టవాలు దామంటే జాగలేదు." ఆగి మళ్ళీ మొదలువెట్టిండు భూమయ్య.

"మీ మామల ఇండ్లు కట్టెటప్పుడు తీరొక్క కట్టె నరుక్కచ్చిన. ఇప్పుడు సూడు కట్టెలు లేక బాలయ్య సావుకారి ఇటికె సిమింటుతోని ఇల్లు గడుతున్నడు. పొయ్యిల కట్టెలు లేక గాంచునూనెతోని వండుకుంటున్నరట. ఇప్పుడు కాపోడు కరిద్దోడు సబ్బండ వర్ణాలు భూమిని దున్నుక బతుకుతున్నరు. చేతుల పనికంటే వాళ్లకు ఎద్దు ఎవుసమే తిండి పెడుతుంది......" అంటూ కొడుకు మొకంలకు పరిశీలనగా చూసిండు భూమయ్య.

ఎంకన్న మొకంలో ఏదో మార్పు. కొద్దిసేపు ఆందోళన కనిపించినా మామూలుగా మారిపోయిండు. భూమయ్య మాత్రం "ఎంకన్నా..... దాడి జరుగుతుందిరా.....దాడి. ఇది అన్నిదిక్కుల దాడి........భూమి మీద నీళ్ల మీద...... మనిషి మీద దాడిరా....' అన్నడు.

ఎంకన్న ఏదో చెప్పేవాడే. అప్పుడే మల్లేశం వచ్చిండు. 'బాపూ.....అమ్మ రమ్మంటుందే' అన్నడు.

పిలిచే పిలుపు....మాట్లాడే మాట.... ఏదీ వినడం లేదు భూమయ్య. మౌనంగా గుడిసెవైపు నడిచిండు.

రాశి ముందు కోడిని కోసింది లచ్చిమి. అది గుడిసెలనే వండింది. అందరికీ ఇస్తార్లల్ల భోజనం పెట్టింది. వడ్లు బాగా పండినయన్న సంతోషంలనే ఉన్నది లచ్చిమి. అన్నం తింటూ 'ఈ యేడు ఈ వడ్లనే ఇత్తునంగట్టురా' అన్నడు భూమయ్య.
ఎంకన్న చెప్పేలోపే మల్లేశం అందుకుని 'సాల్లే.....మా చెప్పినువు తియ్యి....ఇది నీ కాలం కాదు. ఈ వడ్లు ఇత్తునంగడితే ఒక్క గింజ పండది' అన్నడు.
'అవుగనీ...ఈ యేడు ఏం తిందాం... ఈ ఎండ్రీన్ కొట్టిన వడ్లేనా...' అన్నడు భూమయ్య.

'ఏం సావవు తియ్యి... సచ్చిపోతనని ముసలోనికి ఎంత భయం' పెద్ద మనుమరాలు అన్నది. అందరూ నవ్విండ్రు. భూమయ్య గూడా నవ్విండు. ఎంకన్న మాత్రం కోపంగా "ఆ...ఏం మాటలు పెద్దలేదు....చిన్నలేదా" అన్నడు.

## 13

మల్లేశంకు చదువు అబ్బలేదు. హైస్కూల్ వరకు బాగానే చదివిండు. తర్వాత చదువు అబ్బలేదు. చెడ్డ సోపతులయినయి. ఒకసారైతే పంట అమ్మిన పైసల నుంచి రెండువెయిలు ఎత్తుకుని పట్నంబోయిండు. వెదుకడానికే వెయ్యి ఖర్చయినయి. ఇంటర్‌లో ఫేలయి ఇంటి దగ్గెరనే వున్నడు.

ఎంకన్న ఎన్నో విధాల చెప్పి చూసిండు. మల్లేశం వినలేదు. చిల్లరదోస్తులు చిల్లర తిరుగుడు ఎక్కువైంది. చెప్పితే మీదికే మఱ్రవడుతున్నడు.

ఎంకన్న ఇద్దరు పిల్లల పెండ్లి చేసిండు. చేతికి దొరుకుతలేదని కొడుకు పెండ్లి కూడా చేయ్యాలనుకున్నడు. అదేం చిత్రమోగాని యాడాది రెండేళ్లకొకసారి కరువు పడుతుంది. ఎంత కరువు పడినా చెరువు పారుకాలు బీడు వుంటున్నయిగానీ కరంటు బాయిల మాత్రం నీళ్లు ఊరుతనే ఉన్నయి.

కాకపోతే కరువుల రెండెకురాలే పారుతుంది. కాలంల ఐదెకురాలు పారుతుంది. భూమయ్య అప్పుడప్పుడూ మెల్లెగా కరంటు పొలందాకా వచ్చి చూసిపోతున్నడు. ఇద్దరు ఆడపిల్లల పెండ్లి చేయడంతో ఎంకన్న దివాలా తీసిండు. పైగా ఖర్చులు పెరిగినయి. పెట్టుబడులు కూడా పెరిగినయి. ఖర్చులకు తోడు కరువులు, వర్షాలు యాళ్లకు పడతలెవ్వు.

కరువులు ఇప్పటియి కాదురా...కరువులు ఎప్పటినుంచో వుంటున్నయి. కాకాపోతే ఆ కరువులకు ఈ కరువులకు చాలా తేడా ఉందిరా ఎంకన్న.... ఆ కరువులో తిండి దొరుకలేదు. నీళ్లు తాగి బతికింద్రు. ఈకరువుల్లో నీళ్లు దొరుకుతలెవ్వు. తిండి తిని ఎట్లా బతికేది" కరువు పడ్డప్పుడల్లా అంటున్నడు భూమయ్య. కొడుకు లగ్గం జేస్తేనన్న చేతికి వస్తడని మల్లేశం లగ్గం జేసి వ్యవసాయం చేతికిచ్చిండు ఎంకన్న. రెండు ఎడ్లను కొనుక్కచ్చి ఇచ్చిండు.

మల్లేశం ఎవుసం చేసిన ఏడే సగం పొలం ఎండిపోయింది. దున్నేటప్పుడు బాగానే ఉన్నయి నీళ్లు. కలుపులు కలిచినంక ఎనుక పట్టుపట్టింది. కరంటు వున్నప్పుడు నీళ్లులేక, నీళ్లు వున్నప్పుడు కరంటు లేక ఎంత వరుసతడి తిప్పినా ఐదెకురాలలో రెండెకురాలపైననే ఎండిపోయింది.

మొదటిసారిగా కరంటు బాయి అడుగు తేలింది.

"ఈ దరిద్రపోడు పాలెవడితే సగం చేను ఎండింది" లచ్చిమి కొడుకును కోపంగా అన్నది.

కొడుకు నోరు తెరువలేదు. కోడలే రేషానికచ్చింది. నిలబడి కయ్యం జేసింది. "ఊరంతా ఎండినయా మనదొక్కలదే ఎండిందా....ఏం మాట్లాడుతున్నవు? కాలం కాకపోతే ఎవలేం చేస్తరు? మనపంట ఈ మాత్రం పండింది. చెరువు కింద సూడుపో...ఒక్క గింజ చేతుకు రాలేదట. గొడ గొడ ఏడుత్తుంద్రు" భర్తను ఎనుకేసుకచ్చింది దేవవ్వ.





"ఆ... ఇదేం చిత్రమే...నిన్న మొన్న లగ్గమయిందో లేదో... ఇయ్యల్లనే మొగడయిండా... ఏందే....మొగన్ని మొగులు మీదినుంచి తెచ్చినవా..." అన్నది లచ్చవ్వ కోపంగా.

దేవవ్వ అలిగింది. మొగనికి ఏం చెప్పిందోగాని మల్లేశం బుసబుసమని పొంగిండు. ఎప్పుడు చూసినా మొగడు పెండ్లాలు గుసగుసలు...కిసకిసలు వెడుతుంటే మాటమాటకు మఱ్రవడుతంటే లచ్చవ్వకు తన బతుకు యాదికచ్చింది. చిన్నప్పుడు గటుక పెట్టిందని తండ్రితో చెప్పినందుకే అత్తమామ తనను బెదిరించిన రోజులు యాదికచ్చినయి. తను ఎట్ల భయపడ్డది. మొగనితో ఎట్ల మెదిలింది యాదికచ్చింది. ముగ్గురు పిల్లల తల్లి. అయినా ఇంతదాక మామకు ఎదురుపడి మాట్లాడలేదు. ఇప్పుడు దేవవ్వ మామ ముందట పీట మీద కాలుమీద కాలేసుకుని కూసుంటుంది. 'అందరికి భయపడి అనిగి మనిగి తిరిగి నేనేం చెడిపోయిన? ఎవ్వలను లెక్క చెయ్యక అదేం సంపాయించుకుంటది? నియ్యతెంతో బరుకతి అంత. ఎవల నియ్యతు వాళ్లది' అనుకుంది లచ్చిమి.

రెండు పసల్లు గడిచింది. ఈ రెండు పసల్లు వానలు లెవ్వు. కరువే. కరువుల రెండెకురాలు పారిచ్చే కరంటుబాయి ఎకురం గూడా పారిత్తలేదు.

వాగుపొంట, మడుగుల పొంట, పేనెం మడుగుల వాగు పుట్టింది మొదలుకొని ఊరూరా అడుగుకొక మోటరు నీళ్లను ఎత్తి పోత్తుంటే కరువులో వాగు ఎండిపోయింది. ఎండిపోయిన వాగుల భూమయ్య బండ పక్కగా ఎంకయ్య చింతలకు సక్కగా మొరం రోడు పోసి రాకడ పోకడ తొవ్వ చేసింద్రు.

మల్లేశంకు అప్పుడు తెలిసివచ్చింది. "అయ్యో ఎందుకు సదువుకోకపోతిని" అనుకున్నడు. పొక్కగాని పాములెక్క పతుకులాడుతున్నడు. ఎడ్లు కొన్నప్పుడు, లాగోడులకు, వచ్చెటోల్లు పోయేటోల్లకు తిండి ఖర్చులకు కొంత బాకీ అయింది. బాయి నిండుతదన్న ఆశలేదు మల్లేశంకు. 'బాపూ అందరు బోరువేసుకుంటంద్రు. మనం గూడా ఏత్తాం' అన్నడు మల్లేశం తండ్రితో. పక్కన భూమయ్య గూడా వున్నడు.

'ఎంకన్నా...చూసినావురా..నేను అన్నట్టే అయింది. వాగంటివి, చెరువంటివి, చెరువెండే, వాగుఎండే...మనబాయి ఎండే...తాగుడుకు నీళ్లు దొరుకయి బిడ్డా...' అన్నడు భూమయ్య.

'ఏం జేద్దాం నాయినా... ఎట్లయేదుంటే అట్లయితది. మనం ఒక్కలమేనా...మన ఒక్కల చేనేనా...పీడీలనుంచి పారుతున్న వాగే ఎండింది...నువ్వు చిన్నగున్నప్పుడు ఎండిన చెరువే ఎండింది....' ఎంకన్న నిస్పృహగా అన్నడు.

మల్లేశం మాత్రం నవ్వుతూ...'నీ ముసలి పీసునెగొడుదు...నీళ్లు కరువు వోయినయా... గుంటూరోళ్ల పత్తి దగ్గెర చూడుపో. నాలుగించుల బోరు వోత్తుంది. పది

ఎకురాల పత్తి వెట్టింద్రట' అన్నడు.

'అరే...గుంటూరోళ్లు వాగుకు పెట్టిరిగదరా మోటార్లు...'భూమయ్య అన్నడు.

'వాగుల ఏముందని పెడుతరు...వాగు ఎన్నడో ఎండిపాయె...అందరు బోర్లు దిగేత్తుంద్రు. మనం గూడా బోరు ఏద్దాం...ఈ ముసలోడు కానియ్యడు...పోనియ్యడు...' అన్నడు మల్లేశం.

మనుమడి మాటలకు మనసు చిన్నబుచ్చుకున్నడు భూమయ్య. తండ్రి మనసు నొచ్చుకున్నడని గుర్తించిండు ఎంకన్న. కొడుకును ఏమీ అనలేక తండ్రి మనసు నింపాలని 'నాయినా నువ్వన్నట్లు నీళ్లు దొరికేటట్టు లెవ్వే... ఊర్లే అందరికి నీళ్లు అందుతలెవ్వని నీళ్ల టాంకు కడుతరట...ఇండ్లల్లకు నల్లాలు పెడుతరట. ఇయ్యల్ల బోరు బండి తెచ్చి బోరు ఏత్తరట' అన్నడు.

భూమయ్య నిస్సహాయంగా తలూపి 'రెండు మూడు వాడలున్న ఊరు. రెండామెడ పెరిగె. ఏ నీళ్లు సాలుతయి...? ఏం తిండి సాలుతది? రోజు రోజుకు పెరుగనే వట్టె. కూసుండి తింటే గుట్టలాగయట' అన్నడు.

ఎంకన్న పదివెయిలు అప్పుదెచ్చి కొడుక్కు ఇచ్చిండు. మల్లేశం బోరుపాయింటు చూపించి బోరు మోటర్ తెచ్చి వేయించిండు. వంద ఫీట్ల దాకా దుమ్మే లేచింది. వంద నుంచి వంద యాభైలోపు మూడు గ్యాబులచ్చి నీళ్లను ఎత్తిపోసింది. వంద యాభై ఫీట్లకు సాలిచ్చి సబ్‌మెర్సిబుల్ మోటర్‌ను ఫిట్ చేయించిండు మల్లేశం. ఐదెకురాల పొలానికి ముందటి కలవచ్చింది. నీళ్లు ఎత్తెత్తి పోతున్నయి. తండ్రి కొడుకులిద్దరూ పొలాన్ని దున్ని పొతం చేసింద్రు.

పొలాన్ని నీళ్లను చూద్దామని మెల్లెమెల్లగా నడుచుకుంట పోయిండు భూమయ్య. ఇప్పుడు కరంటు బాయి పేరు మాసిపోయింది బోరు దగ్గర అంటున్నరు.

ఒకనాడు బోరు దగ్గెరికి పోయి నిలవడ్డడు భూమయ్య. మూరెడు ఎత్తున్న వంకవైపు...నీళ్లు కనవడుతున్నయి. పక్కనే గుడిసె. గుడిసెలో లచ్చిమి, కోడలు, కొడుకు వున్నరు. ఎంకన్న ఒడ్లు తిరుగుతూ బుంగలు మెత్తుతున్నడు.

గుడిసెవైపు నడుస్తూ "అరే మల్లేశా...దీని మోటరేది...పొక్క ఏదీ...నీళ్లే కనవడుతున్నయిరా' అని మనవడిని అడిగిండు భూమయ్య.

మోటరు.....నా...మొ...లుంది" నవ్వుతూనే మోటుమాటన్నాడు మల్లేశం.

లచ్చిమి మాట కల్పించుకొని "ఆ....వీడు మోటుగాడున్నడు...సాకలిదానితోని సరుసమాడితే బట్టలుతుకుతవా బావా అన్నదట.....అట్లనేనా అనేది" అన్నది.

"మోటరు గాదు....కరెంటును గూడా పెట్టుకో..." భూమయ్య అన్నడు నవ్వుతూనే. దేవవ్వ నవ్వుతూ.."మోటరు లోపలనే ఉంటది తాతా...లోపలనే తిరుగుతది... నీళ్లల్ల మోటరు....నీల్లే కనవడుతయి. ఏవీకనవడయి" అన్నది.





'నీ లెక్క నేను అన్నీ ఇవుతల పెడుతననుకున్నవా'....మల్లేశం అన్నడు.

"తాతను తక్కువనుకోకు. చెరువులకు వాగును మర్రగట్టిండట..." దేవవ్వ అన్నది.

'మా మామ మోటవెట్టిండు. నేను రాటువెట్టిన. మీమామ మోటర్ వెట్టిండు...ఇప్పుడు నీ మొగడు బాయిని ఎండవెట్టిండు" భూమయ్య దేవవ్వతో నవ్వుతూ అన్నడు.

దేవవ్వ మూతిని తిప్పి "ఆ...ఎందుకు ఎండవెట్టినం. బోరు ఎయ్యలేదా...." అన్నది నవ్వుతూ.

భూమయ్య బాయి దగ్గరికి వెళ్లి చూసిండు. బాయిల గడ్డి మొలిచింది. యాతం పోసినప్పుడు ఎట్లుండె. మోట గొట్టినప్పుడు ఎట్లుండె....ఇంజన్ వెట్టినప్పుడు ఎట్లుండె అనుకున్నడు. బాయి రూపురేఖలు మారి వెలిగి వెలిగి ఆరిపోయిన దీపంలాగుంది. ఏవిధంగానూ పోల్చుకోలేనట్టుగా ఉంది.

"నాయినా....బాయి కూడుపుదామే.....రెండు గుంటల జాగయితది. ఏం లేదన్నా ఏదుము వడ్లు ఎల్లు తయి" ఎనుకనుంచి వస్తూ అన్నడు ఎంకన్న.

అదే ముచ్చట మల్లేశం అంటే నీదేం నొచ్చిందని అంటూ ఏదో మందలించేవాడు. కొడుకే ఆ మాట అనడంతో బరువుగా చూస్తూ "కూడుపు ఏంజెద్దాం. ఉన్నా లాభంలేదు గదా" అన్నడు.

పైస ఎత్తుకచ్చి కజ్జం తినుకుంట నీళ్లు గుంజిన జాగ.....అన్నవచ్చి మోట అమిర్చిన జాగ...... మామతో కలిసి మోటగొట్టిన జాగ......దండెడ ముడి తెగి పుర్రె పలిగిన జాగ.....రక్తమూ చెమటకారి నేలలో ఇంకిన జాగ......గంగతల్లి ఉప్పొంగి బలబల ఊటలు కారిన జాగా.....బాయి చుట్టూ తిరిగి జాగలన్నీ గుర్తుచేసుకుంటూ అడుగులో అడుగేసి తొక్కి కొడుకుతో "ఏంకన్నా....బాయిల నీళ్లు లెవ్వని బోరు ఏసినవు. బోరు ఎత్తిపోతే ఏంజేత్తవురా...." అన్నడు.

అప్పుడు ఇద్దరూ బాయి గడ్డమీదున్నరు. "నాయినా....ఇటు చూడు......" అంటూ వేలితో చుట్టూ చూపించిండు ఎంకన్న

ఒకప్పటి అడివి, ఒర్రె, గుట్ట, తోట.....అన్నీ మాయం. కనుచూపుమేరకు అన్నీ పొలాలే....ఎక్కడా బాయిలేదు. అంతటా బోర్లే.....ఎత్తిపోత్తున్నయి. పొలాల్లో నాగండ్లు తిరగుతున్నయి. అక్కడక్కడా.....ట్రాక్టర్లు తిరగుతున్నయి.

"బోర్లు ఎత్తిపోతే వీళ్లంతా ఎంజేస్తరునాయినా....ఏదో ఒక మార్గం చూస్తరు. మోట ఎత్తిపోతే ఎట్లా అని నువ్వనుకోలేదా....ఇంజన్ ఎత్తిపోతే ఎట్ల అని నేననుకున్న.... మార్పులు సహజం నాయినా.....అవసరాలకు తగినట్టు వస్తువులు పుట్టుకొస్తయి." అన్నడు నవ్వుతూ.

కొడుకు సమాధానం తండ్రిని తృప్తి పరుచలేదు. బరువుగా బాయి దగ్గెర నుంచి

కదిలిందు భూమయ్య. తండ్రి వెంటనే కదిలిందు ఎంకన్న.

పైకి అలా అన్నడుగనీ ఎంకన్నకు గూడా భయంగానే వుంది. అన్నింటికంటే భయపెట్టిన విషయం ఊర్లె షాదబాయిలు ఎండిపోవడం పేరు జెప్పిన బాయిలు ఎండిపోయినయి. నీళ్లకేం ఇబ్బంది లేకపోయినా ఏదో ప్రమాదానికి నాంది పలుకుతున్నట్టుగా అనిపించింది.

భూమయ్య కట్టె ఆసరతో మెల్లెమెల్లెగా ఇంటి వైపు నడుస్తున్నడు. ఈమధ్య ఆ తొవ్వనరాక చాలా రోజులయింది. చెరువు ఎండిపోయినా.....ఎండిపోయినట్టు లేదు. కరువయినా కరువు లెక్కలేదు. చుట్టూ బోర్లు......మోటర్లు.....దున్నుకాలు నిండుకాలంలో గూడా అంతసాగువాటులేదు. చెరువు నిండలేదని, కాలం కాలేదని ఎవరికీ బాధలేదు. భయంలేదు. ఆ ద్యాసనేలేదు.

ఊర్లెకు వచ్చి చూస్తే నడి ఊర్లె బోరు బండి దడదడమంటుంది. దుమ్ము లేత్తంది. 'అడివిల ఎంతమంది ఉన్నరో ఊర్లెగూడా అంతేమంది ఉన్నరు. గుంపులు గుంపులున్నరు. ఇంతమంది ఎక్కడపుట్టిరి ఎక్కడి నుండి వచ్చిరి' అనుకుంటున్నడు భూమయ్య.

"మీకు నాషినగాల్లం పుట్టిందిరా....యాడవడితే ఆడ పొక్కలు పొడుత్తున్నరు....." భూమయ్య నిలబడి అన్నడు. ఆ చప్పుట్లో ఆ మాటలు వినిపించలేదుగానీ వెనుకనుంచి జీబుహారన్ వినిపించింది.

"ఓ ముసలోడా.....పక్కకు జరుగు తొవ్వల నిలవడ్డవు" ఎవలో అన్నరు కోపంగా. గులుక్కుంటూ పక్కకు జరిగిందు భూమయ్య.

C C C C

రాత్రి పన్నెండయింది. ఐశ్వర్య నిద్రపోతుంది. ఏసి ఆన్‌లోనే ఉంది. వాతావరణం చల్లగా ఉంది. అయినా చమట పట్టింది. తుడుచుకుంటూ భార్యవైపు చూసాడు రవికిరణ్. ఏబాధలేకుండా హాయిగా నిద్రపోతుంది ఐశ్వర్య

అదృష్టవంతురాలు అనుకున్నాడు రవికిరణ్. సెల్ అందుకుని తండ్రికి ఫోన్ చేసాడు. అక్కడ తండ్రి గాఢ నిద్రలో ఉంటాడన్న విషయం కూడా గుర్తులేదు. చాలాసేపు రింగయింది.

"హలో......" విసుగ్గా తల్లి కంఠం.

ఆమె కంఠంలోని విసుగును గుర్తించకుండా "అమ్మా నాన్నను పిలువు" అన్నాడు రవికిరణ్.

"నిద్రలో ఉన్నాడురా....." అన్నది తల్లి.

గంట అటూ......ఇటూ....అక్కడ గూడా రాత్రేనని అప్పుడు తెలిసింది. అయినా పట్టువదలగా "నిద్ర లేపు" అన్నాడు.

చాలా సేపటి తర్వాత 'హలో' తండ్రి కంఠం.





ఎలాంటి సమాచారం లేకుండానే "నాన్నా...మన ఊర్లో భూమయ్య ......ఎల్లవ్వ... ఎంకన్న......లచ్చిమి.....ఈ వ్యక్తులున్నారా....?"అడిగాడు.

తండ్రి కొంత సేపు ఆలోచించి "గుర్తుకురావడం లేదురా.... చాలారోజులయిందిగదా చూసి....ఇంతకీ ఎందుకురా?" అన్నాడు. నిద్రమత్తులోనే ఉన్నట్టున్నాడు. గొంతుముద్ద ముద్దగా ఉంది.

"గుర్తు తెచ్చుకో నాన్నా......భూమయ్య ఎంకయ్య ఇంటికి ఇల్లరికం వచ్చాడు. భూమయ్య కొడుకు ఎంకన్న....ఎంకన్న కొడుకు మల్లేశం...." సమాధానం చెప్పకుండానే అన్నాడు రవికిరణ్.

"ఆ గుర్తుకొచ్చిందిరా....ఎంకన్న అని మా క్లాస్‌మేట్....ఉండేవాడు. మాతోనే ఉద్యోగం వచ్చింది. వాళ్ల తండ్రి భూమయ్య పంపించలేదు....."

తండ్రి సమాధానం పూర్తికాకముందే ఆతృతగా అడిగాడు రవికిరణ్.

"నాన్నా.....భూమయ్య ఇప్పుడు ఎక్కడున్నాడు నాన్నా.....ఊర్లోనేనా......ఊరు ఎలా ఉంది....?"

అర్ధరాత్రి నిద్రలేపడమే కాదు. అనవసరమైన విషయాలు మాట్లాడుతుంటే కోపం వచ్చింది తండ్రికి. విసుగ్గా......"తెలియదన్నానా.....చాలరోజులయింది ఊళ్లోకి వెళ్లి. ఎప్పుడైనా ఊళ్లోకి వెళ్తే మాత్రం 'నీళ్లు......నీళ్లు పోతున్నాయి. లోతుల పడుతున్నాయి తాగుడుకు నీళ్లు దొరుకయి" అని కనిపించిన వారందరితో వదిరేవాడు" అన్నాడు.

తండ్రి గొంతులోని విసుగును గుర్తించకుండానే "అవును మరి వదరక ఏం చేస్తాడు. తెలిసిన వాళ్లంతా దేశాలు పట్టుకుని తిరిగితే తెలువని ముసలోడు ఏం చేస్తాడు......"తండ్రి ఏదో అంటున్నా వినకుండా ఫోన్ పెట్టేసి పడుకున్నాడు రవికిరణ్.

నిద్ర రావడం లేదు. శివశంకర్ మాటలు గుర్తుకొచ్చాయి. 'నిజంగా ఇది విచిత్ర పరిస్థితే! మేఘమథనానికి ఒక స్కాలర్ నిచ్చిన ఊరికి నీళ్లు లేవు. గల్ఫ్ దేశాల పరిస్థితి వేరు సహజ వర్షాలుండవు. భూగర్భ జలాలుండవు. ఇన్నేండ్లు నిండా వర్షం పడిన భూములు అడుగంటిన భూగర్భ జలాలతో ఎందుకు వట్టిపోయాయి. కనీసం తాగు నీళ్లకు కూడా ఎందుకు దూరమయింది.' అనుకున్నాడు.

ఈ ఆలోచనలతో రాత్రంతా నిద్ర పట్టలేదు. లేస్తూనే శివశంకర్‌కి ఫోన్ చేసాడు. అతడిని అడిగిన మొదటి ప్రశ్న "అక్కడ క్లౌడ్ సీడింగ్ సక్సెస్ అయిందా......? అని.

"లేదు..ఏవో సాంకేతిక కారణాలంట. మనంరెంటికి చెడ్డ రేవలం గదా.... ఉన్న నీటిని సంరక్షించుకోలేదు. కనీసం క్లౌడ్‌సీడింగ్ పరిజ్ఞానం కూడా సంపాదించుకోలేదు. అమెరికా నుంచి రావాలె. ఇక్కడ పని జరుగాలె....అన్నట్లు ఈ వారం మ్యాగ్జైన్ చూసావా......?" అడిగాడు శివ.

"లేదు. ఎందుకు....? పూర్తి చేసావా.....? ప్రకాశ్ కలిసాడా......?"ప్రశ్నల వర్షం.

"లేదు. ప్రకాశ్ కనిపించినా ఇకరాయడు. రాసేందుకు ఏం మిగిలిందని చేజేతులా చేతులు కాల్చుకుని ఆకుల కొరకు వెదక్కుంటే ఏం లాభం.....ఒకసారి మ్యాగ్జిన్ చూడు." ఫోన్ కట్టయింది.

బ్రష్ చేసుకుని కాఫీ అందుకుంటూ "రేపు ఇండియా వెళ్తున్నాను......" అన్నాడు రవికిరణ్  ఐశ్వర్యతో.

"మెయిల్ చూసుకున్నారా.....ఈ మధ్య సెల్ స్విచాఫ్ చేస్తున్నారు. అర్జంటుగా రమ్మని మెసేజులున్నాయి " అన్నది ఐశ్వర్య

"లేదు ఇండియా వెళ్లాల్సిందే! ఇది లక్షల డబ్బులతో కూడిందయితే అది లక్షల జనం బతుకులతో ముడిపడింది." అంటూ కాఫీ తాగుతూ కంప్యూటర్ ముందు కూర్చున్నాడు రవికిరణ్.

ఆతృతగా ఇంటర్‌నెట్ మ్యాగ్జెయిన్ తెరిచాడు.

సీరియల్ భాగం లేదు. నాలుగే నాలుగు మాటలున్నాయి. అక్షరాల వెంట రవికిరణ్ చూపులు పరిగెత్తాయి.

దేశంలో ......కాదు......కాదు.....ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా నీళ్లు దొరుకక ఒక ఊరు ఖాళీ అయింది.

పాలకులరా.......!

ప్రజలారా.........!

మేధావుల్లారా......!

మనుషుల్లారా........!

భూమినిండా తల్లడిచ్చిన నీళ్లు ఏమైనట్టు...?

వాగులు,వంకలు,బాయిలు,చెరువులు ఏమైనట్టు...?

ఎలా........?

రేపటి తరాలు ఏమి తాగి బతుకుతాయి?

?

?? ............................. ●





# పెద్దింటి అశోక్ కుమార్ రచనలు

1. ఊటబాయి (కథల సంపుటి) (2002)
2. వలస బతుకులు (కథల సంపుటి) (2004)
3. మా వూరి బాగోతం కథలు (2005)
4. మాయిముంత (కథల సంపుటి) (2007)

DAADI *NOVEL*

by Peddinti Ashok Kumar



పాలకులరా.......!

ప్రజలారా.........!

మేధావుల్లారా......!

రేపు యుద్ధాలంటు జరిగితే అవి నీళ్ల కొరకే !

వాగులు వంకలు బాయిలు చెరువులు ఏమైనట్టు?

ఎలా.........?

రేపటి తరాలు ఏమి తాగి బతుకుతాయి?